# తెలంగాణలో

## కొత్త చారిత్రక స్థలాలు

డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ



తెలంగాణ రిసోర్స్ సెంటర్
హైదరాబాద్

# తెలంగాణలో
## కొత్త చారిత్రక స్థలాలు

డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ

TELANGANA
RESOURCE CENTRE
**DECCAN ACADEMY, "Chandram"** 490, St.No. 11,
Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com website : www.trchyd.com

**తెలంగాణలో కొత్త చారిత్రక స్థలాలు**

**New Historical Places in Telangana**

*by **Dr. Dyaavanapalli Satyanarayana***

*First Edition : 2015 July 14 (Beginning Day of Godavari Pushkaras)*

*Copies : 500*

*© Dyaavanapalli Sumedha*

*Price :* **Rs. 150/-**

*Published by :*
***M. Vedakumar**, Chairman*
*Telangana Resource Centre, Hyderabad.*

*For Copies :*
**Telangana Resource Centre**
*Deccan Academy*
*"Chandram" 490, Street No. 11,*
*Himayatnagar, Hyderabad-500029.*
email: trchyd@gmail.com
*Mobile : 9030626288*
***website : www.trchyd.org***

Sahachara Book Mark ● Navodaya Book House ● Nava Telangana ● Nava Chetana

*Photos :* Dr. Dyaavanapalli Satyanarayana

*Book & Cover Design : M. Vedakumar*

*Layout :* **Charita Impressions**, Azamabad Industrial Area, Hyderabad - 500 020.

*Printed at :*
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph. +91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# తెలంగాణ చరిత్ర పేగుబంధానికి అక్షరరూపం

ప్రకృతితో జీవజాలానికి, తల్లితో బిడ్డకు గల అనుబంధం లాంటిదే మనకు, మన వారసత్వానికి గల సంబంధం. ఈ పేగు బంధం... కృత్రిమంగా ఏర్పరచలేని అనుబంధం. లక్షల కోట్ల రూపాయలు ఇచ్చినా, ప్రపంచంలోని సమస్త సంపదను ధారపోసినా ఈ విధమైన అనుబంధాన్ని కృత్రిమంగా ఏర్పరచుకోలేము. మనకు, మన పూర్వీకులకు మధ్య ఉన్న అనుబంధంలో కొన్ని గొలుసులు తెగిపోయాయి. ఆ అనుబంధాన్ని సంపూర్ణం చేసే క్రమంలో, తెగిన గొలుసులను అతికించే మహత్కార్యమే కొత్త చారిత్రక స్థలాల పుస్తకం.

మన సాంస్కృతిక, చారిత్రక, విద్యాత్మక, సౌందర్యాత్మక, స్ఫూర్తిదాయక, ఆర్థికపరమైన వారసత్వాలకు కీలకమైన లింకులు చారిత్రక ప్రాధాన్య స్థలాలు. వాటిని కనుగొనడం ద్వారా, మరుగున పడిన వాటికి వెలికితీయడం ద్వారా మన వారసత్వాన్ని, దాని మూలాలను కనుగొనడం, ప్రాచుర్యంలోకి తీసుకురావడం యావత్ తెలంగాణ జాతి గర్వించదగ్గ మహత్కార్యాల్లో ఒకటి.

మన చరిత్ర... మనకు మాత్రమే ప్రత్యేకమైంది. అలాంటిది మరెవరికీ ఉండదు. ఎంత ప్ర యత్నించినా మరెవరూ అందులో భాగస్వాములు కాలేరు. అలాంటి చరిత్రను తెలుసుకొని, పదిలం చేసుకొని, భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. అందులో భాగంగానే ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నాం.

మన వారసత్వాన్ని భావితరాలకు అందించడం వారికి మనమిచ్చే ఒక అమూల్య కానుక. మరెవరూ అలాంటి అద్భుత కానుకను రేపటి తరాలకు అందించలేరు. ఇది మన అందరి ఆస్తి. ఆ ఆస్తిని భద్రపర్చుకోవడం, దాన్ని భావితరాలకు అందించడం మన బాధ్యత. ఈ విధమైన వారసత్వాన్ని అందించి

నేడు మనం ఇలాంటి మహోన్నత చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగి ఉండేందుకు కారణమైన పూర్వీకులకు మనం కృతజ్ఞతలు తెలియజేసుకునే విధానం ఆ సంపదను పరిరక్షించుకోవడమే. మనం ఎవరిమో తెలుసుకునేందుకు, మన మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు ఉపకరించేది ఈ విధమైన వారసత్వ సంపదనే.

మన ఇంట్లో ఒక పాత తరం ఉంటే మనకు ఎంతో ధీమాగా ఉంటుంది. క్లిష్టమైన సమస్యలకు వారు మనకు మార్గదర్శనం చేస్తారు. మనకు మరెన్నో అంశాలను బోధిస్తారు. జాతికి సంబంధించి వారసత్వ సంపద ఇదే విధమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. అడుగడుగునా అది మనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. పాఠాలను, గుణపాఠాలనూ నేర్పుతుంది. సరైన బాటలో ఎలా పయనించాలో మార్గనిర్దేశనం చేస్తుంది. చిమ్మచీకట్లో చిరుదీపం లాంటిది మన వారసత్వ సంపద. ఆ దీపం కొండెక్కకుండా, కొండల్లో దాగి ఉన్న మన చరిత్రను ఆ దీపం వెలుగులో మనం చూడాల్సి ఉంది. ఆ కర్తవ్యంలో ఒక అడుగు ఈ పుస్తక ప్రచురణ.

సహజవనరులను అపరిమిత స్థాయిలో వెలికితీయడం అన్ని విధాలుగా మనకు చేటు తెస్తోంది. మరీ ముఖ్యంగా చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్థలాల విషయానికి వస్తే, కొండల, గుట్టల విధ్వంసాన్ని, అడవుల నరికివేతను మనం అడ్డుకోవాలి. ఆయా చారిత్రక ప్రాధాన్య ప్రాంతాలను పరిరక్షించుకోవాలి. తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు ఉద్యమించిన రీతిలోనే ఈ ప్రాంతాల పరిరక్షణకు ఉద్యమించాలి. ఆ దిశలో మన కార్యాచరణను ఉధృతం చేసేందుకు ఒక కరదీపికగా ఈ పుస్తకం ఉపకరిస్తుంది.

నాటి కాలంలో ఒక్కో వ్యక్తి అనుభూతులకు, అనుభవాలకు, జ్ఞాపకాలకు, విజ్ఞానానికి ఇచ్చిన ఉమ్మడి రూపమే వివిధ రూపాల్లోని మన చారిత్రక వారసత్వ సంపద. అక్షరాలుగా, చిత్రలేఖనాలుగా, శిల్పాలుగా, ఉపకరణాలుగా ఈ సంపద నేడు మనకు లభ్యమవుతోంది. మన చారిత్రక ప్రాధాన్య వారసత్వ సంపద మనకు ఉన్నది దాన్ని నాశనం చేసుకునేందుకు కాదు... దాన్ని మనం ఆనందించేందుకు ... ఇతరులతో పంచుకునేందుకు... భావి తరాలకు అందించేందుకు.

తెలంగాణ సమాజం ఐక్యంగా ఉండేందుకు ఈ చారిత్రక వారసత్వం తోడ్పడుతుంది. యావత్ ప్రపంచంలో మానవ వికాసం చోటు చేసుకున్న అతి కొద్ది ప్రాంతాల్లో దక్కన్ పీఠభూమిలో భాగమైన మన తెలంగాణ ఒకటి. కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఇక్కడ మానవ జాతి నాగరికత అభివృద్ధి చెందడం మొదలైంది. అందుకు సాక్ష్యం మన వద్ద ఉన్న చారిత్రక ప్రాధాన్య ప్రాంతాలే.

తెలంగాణలోని పది జిల్లాలు కూడా ఒకే గొలుసులోని రంగురంగుల పూసల్లాంటివి. వీటన్నింటినీ అనుసంధానిస్తూ తెలంగాణ అనే దారం ఉంది. ఆ దారాన్ని పదిలం చేసుకుంటూ పది జిల్లాల అనుబంధాన్ని పటిష్ఠం చేసుకుంటూ మన చారిత్రక వారసత్వాన్ని పదిలం చేసుకుంటూ మునుముందుకు సాగుదాం.

నేటి కాలంలో వ్యక్తి తన స్వీయ ఉనికి కోసం సామూహిక ఉనికిని, సామాజిక శక్తులను, చారిత్రక వారసత్వాన్ని తోసిపుచ్చుతున్నాడు. ఇది క్షమించలేని నేరం. తెలంగాణలోని ప్రతి వ్యక్తి కూడా ఇక్కడి సుసంపన్న చారిత్రక వారసత్వానికి గర్వించాలి. దాన్ని తరతరాలకూ అందించాలి. అలా చేయడంలో తెలంగాణ యావత్ ప్రజానీకానికీ ఈ పుస్తకం ఒక దివిటీ కావాలి.

కరీంనగర్ జిల్లాలోని పాండవలొంక జలపాతం సమీపంలోని గుహల్లోని చిత్రలేఖనాలు, మహబూబ్ నగర్ జిల్లా మన్నెంకొండ సమీపంలోని పోతన్‌పల్లి గుహల్లోని చిత్రాలు, దొంగలగట్టులో మధ్య, కొత్త రాతియుగపు ఉపకరణాల సేకరణ, నల్గొండ జిల్లాలో ఆదిమ మానవుల చిత్రలేఖనాలు ... తెలంగాణ జిల్లాల్లో ద్యావనపల్లి సత్యనారాయణ ఎంతో శ్రమకోర్చి వెలుగు లోకి తీసుకువచ్చిన చరిత్రను ఇప్పుడు పుస్తకరూపంలో అందిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. తప్పిపోయిన చిన్నారి తన తల్లిని కలుసుకుంటే కలిగే ఆనందం ఇది. ఇంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు. ఇప్పటికి ఇది చిన్న ప్రయత్నమే అయినప్పటికీ తెలంగాణ సంపూర్ణ చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చే రేపటి ప్రయత్నానికి ఇది ఒక పటిష్ఠపునాదిని వేస్తుందని విశ్వసిస్తున్నాం.

ఒక జాతిని తుదముట్టించేందుకు ఆధునిక కాలంలో శత్రువులు ఎంచుకునే మార్గం ఆ జాతి చరిత్రను, సంస్కృతిని నాశనం చేయడం. తెలంగాణ జాతిపై కూడా అలాంటి ప్రయత్నాలు జరిగాయి. అలాంటి ప్రయత్నాలు ఇక ముందు జరగకుండా ఉండాలంటే, అలాంటి దాడులను తిప్పి కొట్టాలంటే మన చరిత్రను

మనం కాపాడుకోవాలి. ముందు తరాలకు అందించాలి. ఆ లక్ష్య సాధనలో మనం విజయం సాధించేందుకు ఒక అస్త్రంగా ఈ పుస్తకం ఉపయోగపడుతుందని విశ్వ సిస్తూ, ఆశిస్తూ ఈ ప్రయత్నాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో మీ సహకారాన్ని కోరుతున్నాం.

ఆరు దశాబ్దాల పరాయి పాలనలో మన చారిత్రక వారసత్వం మనకు కాకుండా పోయింది. అంతకు ముందు పాలించిన కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ వంశీయులు దక్కన్ సంస్కృతిలో భాగమై పోయినప్పటికీ, మన చరిత్రను వెలుగులోకి తీసుకురావడంలో, చారిత్రక ఆధారాలను పరిరక్షించడంలో చేసిన కృషి స్వల్పమే అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఇన్నాళ్ళూ మనకు దక్కకుండా పోయిన చరిత్రను ఇప్పుడు వెలుగులోకి తేవడం ఎంతో కష్టం. అలాంటి కష్టాన్ని ఇష్టంగా మార్చుకొని ఎంతో శ్రమించి అమూల్య అంశాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఎన్నో ఏళ్ళ క్రితం నుంచి ఎంతోమంది ఎన్నో విధాలుగా కృషి చేశారు. ఈ పుస్తక రచనకు గాను ద్యావనపల్లి సత్యనారాయణకు నా అభినందనలు.

మన చరిత్రను, సంస్కృతిని రేపటి తరం పౌరులైన నేటి విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉంది. అందుకు గాను ఈ పుస్తకంతో పాటుగా ఈ తరహా పుస్తకాలను విద్యార్థులకు పాఠ్యపుస్తకాలుగా, ఉపవాచకాలుగా పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. అలా చేసిన నాడు చరిత్ర, సంస్కృతిపై అవగాహన కలిగిన బలమైన రేపటితరాన్ని రూపొందించుకోగలుగుతాం. ఆ దిశలో ప్రభుత్వం కూడా తగు ప్రయత్నాలు చేయాలని కోరుకుంటున్నాం. తెలంగాణ చరిత్రను నమోదు చేయడంలో గతంలో ఎంతో నిర్లక్ష్యం జరిగింది. ఎన్నో వక్రీకరణలు చోటు చేసుకున్నాయి. స్వరాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఇప్పుడు మన చరిత్రను మనమే రాసుకోవాలి. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌ను విడగొట్టి తెలంగాణ స్టేట్ హిస్టరీ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేయాలి. చరిత్రకారులంతా తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం ముందుకు వచ్చి ఈ చరిత్ర రచన అధికారికంగా, సాధికారికంగా జరిగేలా చూడాలి. పాలకవర్గాల జీవితాలనే గాకుండా పాలిత వర్గాల జీవితాలకు కూడా అద్దం పట్టేలా ఆ రచన ఉండేలా జాగ్రత్త పడాలి.

ఇక రచయిత ద్యావనపల్లి సత్యనారాయణ విషయానికి వస్తే, ఆయన ఇప్పటి వరకు రాసిన పుస్తకాల్లో అత్యంత విలువైన పుస్తకం ఇది. ఎందుకంటే ఇందులోని మొదటి 11 వ్యాసాల్లో ఆయన కనుగొన్న 15 కొత్త చారిత్రక విశేషాలున్నాయి. 13వ వ్యాసంలో మరో ఆవిష్కరణ ఉంది. ఈ పదహారు చారిత్రక ఆవిష్కరణలు కూడా తెలంగాణ చరిత్రను తెలుసుకునే క్రమంలో ఆయన పేరును గుర్తు చేసుకునేలా చేస్తాయి అంటే అతిశయోక్తి కాదు. ఈ అంశాలు భవిష్యత్తులో తెలంగాణ చరిత్ర పాఠ్యాంశాలవుతాయని కూడా మేము విశ్వసిస్తున్నాం.

టి.ఆర్.సి ఇప్పటి వరకు ప్రచురించిన అన్ని ప్రచురణల మాదిరిగానే ఈ పుస్తకాన్ని కూడా తెలంగాణ ప్రజానీకం విశేషంగా ఆదరించగలదని ఆశిస్తూ.....

14th July 2015,
Hyderabad.

- M.VEDAKUMAR
Chairman
Telangana Resource Centre
email: vedakumar52@gmail.com
mobile: 09848044713, (INDIA)

DECCAN ACADEMY, "Chandram", 3-6-712/2, Street No. 12,
Himayatnagar, Hyderabad-500029. Telangana, INDIA.

*TRC Publication - 2015*

# తెలంగాణ మానస పుత్రిక

నేను ఇప్పటివరకు రాసిన పుస్తకాల్లో అత్యంత విలువైన పుస్తకం ఇది. ఎందుకంటే, ఇందులోని మొదటి 11 వ్యాసాల్లో నేను కనుక్కొన్న 15 కొత్త చారిత్రక విశేషాలున్నాయి. 13వ వ్యాసంలో కూడా మరో ఆవిష్కరణ ఉంది. ఈ 16 చారిత్రక ఆవిష్కరణలు... తెలంగాణ ప్రజలు, పండితులు, పరిశోధకులు, పర్యాటకులు, విద్యార్థులు తమ చరిత్రను చదివినప్పుడల్లా నన్ను గుర్తు చేసుకునేటట్లు చేశాయి. ఎందుకంటే, ఇవి తెలంగాణ చరిత్ర పాఠ్యాంశాలవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ప్రపంచ వారసత్వ దినోత్సవం (2015 ఏప్రిల్ 18) సందర్భంగా విడుదల చేసిన 'రాక్ ఆర్ట్ సైట్స్ ఇన్ తెలంగాణ' అనే పుస్తకంలో ఈ పుస్తకంలోని ఒకటవ, ఐదవ వ్యాసాలను ప్రచురించింది.

ఈ పుస్తకాన్ని రాసింది నేనే అయినా ఇది తెలంగాణ మానస పుత్రిక అని... అంటే, తెలంగాణ ప్రజల అభీష్టాల మేరకు రాయబడిందనేది నిజం. ఇందులోని చాలా వ్యాసాల పుట్టుకకు అనుకోకుండా జరిగిన ఆవిష్కరణలే ప్రధాన కారణమనీ ఒప్పుకుంటాను. అయితే తెలంగాణ చరిత్ర పట్ల నాకున్న అవ్యాజమైన ప్రేమ, కృషి ఈ అనుకోని ఆవిష్కరణల వెనుకున్న అసలు కారణాలనేవి గమనార్హం.

పసుల బుచ్చయ్య అనే నాయకపు గిరిజన నాయకుడు నన్ను వారి తెగ సంస్కృతిని అధ్యయనం చేయుమని వారి ప్రాంతాలకు తీసుకెళ్ళగా మొదటి వ్యాసం, ఎనిమిదవ వ్యాసాల్లో వివరించిన చారిత్రక ఆవిష్కరణలు వెలుగు చూశాయి. కాళిదాసు 'మేఘసందేశం'లో పేర్కొన్న 'సీతా స్నాన పుణ్యోదకం' (జలపాతం) కరీంనగర్ జిల్లాలోని రామగిరిలో ఎక్కడుందని వెతుకుతున్న క్రమంలో పాండవలొంక అనే జలపాతం సమీపపు గుహల్లో ఆది మానవులు గీసిన రాతి చిత్రలేఖనాలు నా కంటపడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లా మన్నెంకొండ సమీపంలోని పోతన్‌పల్లిలో ఉన్న గుహా చిత్రాలను

చూడడానికని వెళ్ళి వాటి అడ్రస్ కనుక్కునే క్రమంలో నేనే అక్కడి ఎదురుగట్టు గుహలో మరో రాతి చిత్రలేఖన సమూహాన్ని కనుగొనడం జరిగింది. ఇదే జిల్లా దొంగలగట్టులో ఉన్న రేఖా చిత్రాలను (petroglyphs) చూడడానికి వెళ్ళి వాటి సమీపంలో మధ్య రాతియుగం, కొత్త రాతియుగాలకు చెందిన పనిముట్లను సేకరించి ఆ రేఖా చిత్రాల యుగాలను స్థిరీకరించడం జరిగింది.

నిజాం రాష్ట్ర పురావస్తు శాఖ వందేళ్ళ కిందట ప్రచురించిన ఒక రిపోర్టులో రాచకొండలోని ఒక గుహలో స్థానికుల కథనం ప్రకారం వెలుగు చూడవలసిన శిల్పాలు ఉన్నాయని చదివి, ఆ గుహను వెతికే క్రమంలో మరో రెండు కొత్త గుహలను కనుక్కుని నల్లగొండ జిల్లా చరిత్రకు సంబంధించి మొట్టమొదటిసారిగా ఆది మానవులు గీసిన రాతి చిత్రలేఖనాలను, రేఖా చిత్రాలను వెలుగులోకి తెచ్చాను. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నా కృషిని గుర్తించి ఆ చిత్రాల శాస్త్రీయ అధ్యయనానికై నియమించిన త్రిసభ్య సంఘంలో నన్ను భాగస్వామిగా చేసింది. 'రాచకొండను కాపాడుకొందాం' అనే పుస్తకాన్ని రాచకొండలోని ఒక శిథిల ఆలయంలో ఆవిష్కరిస్తున్నప్పుడు ఆ ఆలయం పైకప్పుకున్న చిత్రాలు వంద మందిలో ఎవరికీ కనిపించకుండా నాకే కన్పించాయి. వాటిని శ్రీరామనవమికి సంబంధించిన చిత్రాలుగా గుర్తించి అవి గీయబడిన 650 సంవత్సరాల తరువాత శ్రీరామనవమి నాడే (2015 మార్చి 28) తెలంగాణ ప్రజలకు పత్రికల ద్వారా తెలిపాను. రాచకొండలోని చెరువు తీరాన ఒక శిలా శాసనముందని తెలిసి దాన్ని చూడడానికి వెళ్ళి అనుకోకుండా ఆ చెరువు నుంచి అంతఃపురానికి, రాజ భవనాలకు మంచి నీటిని సరఫరా చేసిన 650 ఏళ్ళ కిందటి భూగర్భ కాలువను కనిపెట్టాను.

ఇంద్రపాలనగరంలో 1600 ఏళ్ళ కిందట విష్ణుకుండి రాణి పరమ భట్టారికా మహాదేవి కట్టించిన బౌద్ధ విహారముందేమో చూద్దామని వెళ్ళి దాన్ని చూడలేక పోయాను కాని, అదే కాలపు బుద్ధుని శిల్పాలను, బౌద్ధ ఆచార్యుల శిల్పాలను మాత్రం కొత్తగా కనుక్కుని ప్రజలకు చూపగలిగాను– బుద్ధపూర్ణిమ రోజున (4–5–2015) వేపలసింగారంలో వింత జీవి పాదం శిలాజం బయటపడిందని తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఛైర్మన్ వేదకుమార్ గారు నా దృష్టికి తేగా నా దృష్టికి వచ్చిన మరిన్ని పురావస్తు ఆధారాలతో సమన్వయం చేసి ఆ పాదం శిలాజం కొన్ని వేల సంవత్సరాల క్రితం తెలంగాణ భూమి మీద నివసించిన హోమో ఎరెక్టస్ జాతి లేదా పురాణాల ప్రకారం అంగదుని జాతికి చెందిన మానవునిది అయ్యుంటుందని ప్రకటించాను.

భక్త కవి పోతన మీద ప్రేమతో ఆయన ఊరు బమ్మెరకు వెళ్ళి అక్కడ పోతన

వాడిన వ్యవసాయ బావి (నర్సింబావి) సమీపంలో ఆయన కంటే రెండు వేల ఏళ్ళ ముందటి నుంచే మనుగడలో ఉన్న ఆదిమానవుల విశ్వాసాలకు సంబంధించిన మెన్‌హిర్‌లు అనే స్మారక శిలలను కనుగొన్నాను.

మహబూబ్‌నగర్ జిల్లా వంగూరు మండలం తిమ్మాయిపల్లిలో రెండు వేల ఏళ్ళ కిందటి మానవుల బృహత్‌శిలా సమాధులున్నాయని చదివి వాటిని చూడడానికి వెళ్ళి ఆ గ్రామ పరిధిలో ఆ కాలం నుండే మనుగడలో ఉన్న గాజు పరిశ్రమ ఆనవాళ్ళను, అంతకు ముందటి కాలమైన కొత్తరాతి యుగపు కుండపెంకులు, ఆయుధాలను, 17వ శతాబ్దపు కుబేరాలయ శాసనాన్ని వెలుగులోకి తెచ్చాను.

ఇదే జిల్లా మన్ననూరులో ఉన్న నా మిత్రుని ఇంటికి వెళ్ళి సరదాగా తిరుగుతున్నప్పుడు ఆ ఊరిలో ఉన్న కాలాపానీ జైలులో ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుడు పండిత్ నరేంద్రజీని ఖైదీ చేసి సరిగ్గా 75 సంవత్సరాల కిందట విడుదల చేశారని గుర్తించి 75వ సంవత్సరం పూర్తయిన రోజునే (2015 ఏప్రిల్ 6) ఈ విషయాన్ని పత్రికాముఖంగా ప్రజలకు తెలిపాను.

తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా॥ కె.వి.రమణాచారి గారి కోరిక మేరకు భువనగిరి వెళ్ళి, చూసి దాని చరిత్ర, పర్యాటక అవకాశాల మీద సమగ్ర వ్యాసం రాసి ప్రచురించాను. నేను భువనగిరిలో కొత్తగా కనుక్కున్న బృహత్‌శిలా యుగపు భూ వలయాల రేఖా చిత్రపు వివరాలు ఆ వ్యాసంలో ఉన్నాయి. రమణాచారి గారి కోరిక మేరకే అక్కమహాదేవి గుహల పర్యాటక ప్రాధాన్యం మీద కూడా సమగ్ర వ్యాసం ప్రచురించాను.

హైదరాబాద్ నగర చరిత్రకు సంబంధించిన మొట్టమొదటి శాసనాలు చైతన్యపురిలోని కొసగుండ్ల నరసింహస్వామి ఆలయ రాళ్ళకు చెక్కబడ్డాయని ప్రముఖ తెలుగు చరిత్రకారుడు డా॥ పి.వి.పరబ్రహ్మశాస్త్రి గారు చెప్పగా, వాటిని కాపాడుకోవాలన్న స్పృహను నగర ప్రజలకు కలిగించాలనే సంకల్పంతో నేను ఆ శాసనాల మీద చిన్న పుస్తకం రాయగా దాని వేయి ప్రతులను తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఛైర్మన్ వేదకుమార్‌గారు ప్రపంచ వారసత్వ దినం నాడు (2015 ఏప్రిల్ 18) ఆ శాసనాల దగ్గరే పరబ్రహ్మశాస్త్రి గారితోటే ఆవిష్కరింప జేయించి స్థానిక ప్రజలకు ఉచితంగా పంచారు.

'తెలంగాణ' మాస పత్రిక సంపాదకులు అష్టకాల రామ్మోహన్ గారి కోరిక మేరకు కీసరగుట్ట చారిత్రక ప్రాధాన్యం మీద వ్యాసం రాశాను. కరీంనగర్ జిల్లా వీణవంక సమీప గ్రామస్థులు ఆవాల బుచ్చిరెడ్డిగారు కోరగా వీణవంక చరిత్ర మీద

వ్యాసం రాయగా ఆయన 'వేయేళ్ళ వీణవంక' అనే తన పుస్తకంలో ప్రచురించారు. పుష్కర గోదావరి తీర క్షేత్రాల చరిత్ర, పర్యాటక అవకాశాల మీద ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ పత్రికలు నాతో వ్యాసాలు రాయించుకున్నాయి.

తెలంగాణలో పురావస్తు శాఖ పుట్టి 101 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ చరిత్ర రచన ఆవశ్యకత ఒక వ్యాసం రాశాను. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా వేదకుమార్ గారు తెలంగాణ రిసోర్స్ సెంటర్‌లో నాతో ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేయించి, ప్రసంగ పాఠాలను 'మన తెలంగాణ' దినపత్రికలో ప్రచురింపజేయించగా ఈ పుస్తకంలోని చివరి వ్యాసం పుట్టింది.

ఈ విధంగా అనేక రకాల పరిస్థితులు, అనేక వర్గాల ప్రజలు, పత్రికలు ఈ వ్యాసాల పుట్టుకకు కారణం కాగా, వీటిని సామాన్య మానవుని సమీపానికి తీసుకెళ్ళింది పత్రికలు, దక్కన్ టీవీ, ఈటీవీ వంటి టీవీలు. వీరందరికీ పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పరిశోధన పిచ్చిలో పడి నేను ఈ మధ్య నా శ్రీమతి పుట్టిన రోజును కూడా మర్చిపోయి కనీసం ఆమెకు శుభాకాంక్షలు కూడా చెప్పలేకపోయాను. ఆమె నన్ను అర్థం చేసుకుంది. తెలంగాణ ప్రజలు కూడా నా చారిత్రక పరిశోధన ఫలితాల ఆధారంగా తెలంగాణ చారిత్రక వైభవం విషయమైన తమలో ఆత్మ విశ్వాసం పెంచుకుంటే నా కృషిని అర్థం చేసుకున్నట్లే. అదే నేను ఆశించేది.

ఈ పుస్తకాన్ని అడిగిన వెంటనే ప్రచురించిన తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టి.ఆర్.సి.) వారికి, సకాలంలో ముద్రించిన చరిత ఇంప్రెషన్స్ వారికి, లేఅవుట్ చేసిన భాగ్యలక్ష్మిగారికి, డిటిపి చేసిన మధుకు, గోదావరి చిత్రం వేసిన యు.పి. రామకృష్ణారావు గారికి, ఇంకా ఎన్నో సందర్భాల్లో, ఎన్నో విధాలుగా సహకరించిన మిత్రులకు, సద్విమర్శకులకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

అంకితం : ఈ పుస్తకం వెలుగు చూడడానికి వెనుక ఆత్మగా నిలిచిన తెలంగాణ చరిత్ర పిపాసులకు, పరిశోధకులకు, పాఠకులకు...

**– డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ**

హైదరాబాద్,
14 జూలై, 2015.

# విషయసూచిక

## I గుహా చిత్రాలు


1. నల్లముడి అక్షరాలలొద్దిలో ఆదిమానవుల చిత్రాలు 15
2. 'రామ'గిరి 'పాండవ'లొంకలో ప్రాచీన చిత్రాలు 18
3. మన్నెంకొండలో మధ్యరాతి యుగపు చిత్రాలు 22
4. దొంగలగట్టులో తొలి దేవత గోవు చిత్రాలు 25
5. రాచకొండలోగుహా చిత్రాలు, గుడి చిత్రాలు, భూగర్భ కాలువలు 28


## II చారిత్రక స్థలాలు


6. ఇంద్రపాలనగరంలో1580 ఏళ్ళ కిందటి బౌద్ధ శిల్పాలు 40
7. వేపలసింగారంలో వింత పాదం శిలాజం 44
8. మల్లూరు గుట్టపై బృహత్‌శిలా ఉద్యానవనం 50
9. బమ్మెరలో పోతనకు ముందటి చరిత్ర 56
10. తిమ్మాయిపల్లిలో కొత్తరాతి యుగం నుండి కుబేరాలయం దాకా 59
11. మన్ననూరులో కాలాపానీ కారాగారం 68
12. అక్కమహాదేవి గుహలు 71
13. భువనగిరి భువనైక సౌందర్యం 80
14. చైతన్యపురిలో హైదరాబాద్ మొదటి బౌద్ధ విహారం/శాసనం 98
15. కీసరగుట్ట 1600 ఏళ్ళ కిందటి రాజధాని 103
16. వీణవంక చారిత్రక సౌందర్యం 107


## III గోదావరి తీర ప్రదేశాలు


17. గోదావరి పరీవాహక ప్రదేశాలు – చారిత్రక విశేషాలు 117
18. గోదావరి నదీ లోయ నాగరికత 141


## IV అనుబంధాలు


19. ఇక మన చరిత్రను మనం రాసుకుందాం 161
20. తెలంగాణ చారిత్రక వారసత్వం – ఒక విహంగ వీక్షణం 164

# I


# గుహా చిత్రాలు

1

# నల్లముడి అక్షరాలలొద్దిలో ఆదిమానవుల చిత్రాలు

మానవ చరిత్రకు మాత్రమే కాకుండా లలిత కళలకు కూడా మొట్టమొదటి ప్రధాన ఆధారాలైన చిత్రలేఖనాలు రాతి గుహల్లో కన్పిస్తున్నాయి. తెలంగాణలో అలాంటివి ఇప్పటివరకు సుమారు 20 స్థలాల్లో ఉన్నాయని పురావస్తు శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. ఇప్పుడు ఖమ్మం జిల్లా ముల్కలపల్లి మండలం నల్లముడి గ్రామ శివారు అడవుల్లోని 'అక్షరాలలొద్ది' అనే గుహలో ఉన్న చిత్రలేఖనాలను నేను మొదటిసారిగా వెలుగులోకి తెస్తున్నాను. ఇక్కడికి ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచి మాదారం – కమలాపూర్ మీదుగా 30 కి.మీ. ప్రయాణించి చేరుకోవచ్చు.

ఒక సెలయేరు ఒడ్డున సుమారు పది మీటర్ల పొడవు, ఏడు మీటర్ల ఎత్తుతో దక్షిణాభిముఖంగా ఉన్న ఈ అక్షరాల లొద్ది గుహలో మూడు యుగాలకు చెందిన (మూడు రకాల) చిత్రలేఖనాలున్నాయి.



పల్లకి మోత



ఈ గుహలో చిత్రించిన చరిత్ర పూర్వ యుగానికి చెందిన చిత్రాల్లో ప్రధానంగా జంతువులు, దేవతలు, మానవ కార్యకలాపాలు కన్పిస్తాయి. జంతువుల బొమ్మల్లో ప్రధానంగా మనిషి పులిని ఈటెతో ఎదుర్కోవడం, పిల్ల ఏనుగులపై సవారీ చేయడం, మేక, ఎద్దుల వరుసలు, ఆవు-దూడలు కన్పిస్తాయి. ఎద్దుల్లో చారల ఎడ్లు, మూపురపు ఎడ్లు, కొచ్చెటి కొమ్ములున్న మైసూరు జాతి ఎద్దుల చిత్రాలు తెలంగాణకు వేల ఏళ్ళ కిందటే ఇతర ప్రాంతాలతో గల వ్యాపార సంబంధాలను, వ్యవసాయ ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. ఒక ఎద్దును దేవత ముందు బలివ్వడం కన్పిస్తుంది. ఇలాంటి ఆచారం ఇప్పటికీ సమీప అడవుల్లోని కోయ గిరిజనుల్లో వేల్పుల పండుగ సందర్భంలో కొనసాగుతోంది.

దేవతా చిత్రాల్లో ఒక దేవత త్రిశూలం ఆకారంలో గీయబడింది. త్రిశూలపు బయటి రెండు శూలపు కొమ్ములు మాత్రం కిందకి వేలాడాయి. ఇక బాణం పుల్లను నిలబెట్టినట్లున్న ఏడు వరుస చిత్రాలు రెండు చోట్ల ఉన్నాయి. వీటిని సప్తసంతానాలను ఇచ్చే దేవతలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. దేవతలను పల్లకిలో ఊరేగిస్తున్నట్లు ఒక చిత్రం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. 'ఓం' అక్షరానికి పూర్వరూపంగా మేధావులు భావిస్తున్న 'స్వస్తిక్' చిత్రం వేల ఏళ్ళ కిందటే ఇక్కడ చిత్రించబడడం చూస్తే మన ఘన సంస్కృతి-వారసత్వం పట్ల మనకు గౌరవం ఇనుమడించక మానదు.

ఇక్కడి మానవుల చిత్రాల్లో శరీరంలోని ఎముకలను '×' మార్కుతో చూపించారు. అదే విధంగా పిల్లల బొమ్మలున్నాయి. మనుషులు క్రూర జంతువులను ఎదుర్కోవడం, ఏనుగులను స్వారీ చేయడం, నావ నడపడం, దేవుడిని కొలువడం, లైంగిక కార్యక్రమంలో పాల్గొనడం వంటి ఎరుపు రంగు చిత్రాలు ఆసక్తిని కలిగిస్తాయి.

గుహ కింది వరుసలో ఎద్దుల రేఖా చిత్రాలు (Petroglyphs) ఎరుపు రంగు పూసి ఉన్నాయి. పశ్చిమం నుంచి తూర్పు వైపు సాగుతున్నట్లున్నాయి. ఈ రకం చిత్రాలు చాలా అరుదైనవి. ఇలాంటివి మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ మండలం



జూపల్లి గ్రామ పరిధిలోని దొంగలగట్టు గుహలో, ఒరిస్సాలో, దక్షిణాఫ్రికాలో, స్పానిష్ కాంటబ్రియాలో మాత్రమే ఇప్పటి వరకు వెలుగు చూసాయని రాతిచిత్ర నిపుణులు రాసారు. అవి మధ్య రాతి యుగానివని... అంటే ఇప్పటికి కనీసం పది వేల సంవత్సరాల కిందటివని కొందరు, నవీన శిలా యుగానికి చెందినవని కొందరు భావించారు. ఏనుగులు, దేవతా సంబంధ చిత్రాల్లో చాలావరకు రాక్షస గుళ్ళ యుగానికి చెందినవని ప్రాథమిక పరిశోధనలో తేలింది. ఏమైనా ఇక్కడి చిత్రాలను దైవంగా పూజించిన ప్రజలు ఇక్కడ కనీసం క్రీ.పూ. 3 వేల సంవత్సరాల నుండి క్రీ.శ. 2వ శతాబ్దం మధ్య మనుగడ సాగించారని చెప్పవచ్చు.

ఇప్పటికీ ఈ అక్షరాల లొద్ది గుహా చిత్రాలను స్థానిక నాయకపు గిరిజనులు పవిత్రంగా భావిస్తూ, ఏటేటా ఇక్కడ 'వరద పాశం' పోసి పూజిస్తూ కాపాడుతున్నారు. అవి విధ్వంసానికి గురి కాకముందే ప్రభుత్వ పురావస్తు శాఖ వెంటనే వాటిని కాపాడే చర్యలు తీసుకుని భావి తరాలకు అందించవలసి ఉంది.

(తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా॥ కె.వి.రమణాచారి గారికి వారి 63వ జన్మదినం (08.02.2015) సందర్భంగా ఈ పరిశోధన అంకితం)

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 8-02-2015*

# 2

# ‘రామ’గిరి ‘పాండవ’లొంకలో ప్రాచీన చిత్రాలు

తెలంగాణలో అత్యంత అందమైన కోట రామగిరి ఖిల్లా. ఇది కరీంనగర్ జిల్లాలో సుమారు 15 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. రామగిరి పర్వతాల మీది నుంచి వర్షాకాలంలో పలు జలపాతాలు దూకుతాయి. అందులో ఒకటి జాఫర్‌ఖాన్ పేట వైపు దూకుతుంది. ఇక్కడ దూకుతున్న ప్రదేశాన్ని పాండవుల లొంక అని పిలుస్తారు.

పాండవుల లొంక చాలా అందమైన ప్రదేశం. సుమారు 50 మీటర్ల వ్యాసంతో ఏర్పడిన గుండ్రటి స్టేడియం వంటి సహజ శిలా నిర్మాణం ఉందిక్కడ. ఈ సహజ శిలా స్టేడియం ఎత్తు సుమారు 40 మీటర్లుంది. ఈ స్టేడియంలోకి ఒకవైపు నుంచే ప్రవేశ ద్వారం ఉంది. మరో వైపు నుంచి వర్షాకాలంలో జలపాతం దూకుతుంది.





ఈ స్టేడియంలోకి ప్రవేశించిన వ్యక్తికి స్టేడియం మీదున్న వ్యక్తి గాని, మీదున్న వ్యక్తికి కిందున్న వ్యక్తిగాని కన్పించరు. అంత వ్యూహాత్మకంగా ఉంది ఈ పాండవుల లొంక. అందుకే "ఈ లొంకలో పాండవుల కాలంలోనే ప్రజలు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు, అసలు పాండవులే అరణ్యవాస కాలంలో ఇక్కడున్నారు" అని స్థానికులు చెప్తారు.

చారిత్రకంగా చూసినప్పుడు పాండవులు కాకున్నా పాండవుల కాలం... అంటే చారిత్రక పూర్వ యుగంలోనే ఇక్కడ ప్రజలు స్థిర నివాసం ఏర్పరచుకున్నది మాత్రం నిజం అని తెలిపే ఆధారాలు లభించాయి. అవి: రాతి చిత్రలేఖనాలు, రాక్షసగుళ్ళు.

పాండవుల లొంక స్టేడియం లోపల అడుగు భాగంలో చుట్టూ సహజమైన గుహలు ఏర్పడ్డాయి. ఈ గుహలు తమలో నివసిస్తున్న ప్రజలకు ఎండ, వాన తగులకుండా ఏర్పడ్డాయి. అందులో నివసించిన ప్రజలు ఖాళీ సమయంలో కళాపోషణ చేశారు – చిత్రలేఖనాల రూపంలో. దురదృష్టవశాత్తు వెయ్యేండ్ల కిందట ఈ లొంకలో కట్టిన గుహాలయం, అర శతాబ్దం కింద వేసిన పెయింటింగ్స్ వల్ల ఇక్కడి చారిత్రక పూర్వ యుగపు చిత్రలేఖనాలు 90 శాతం ధ్వంసమయ్యాయి. మిగిలిన కొన్ని చిత్రాలను మాత్రం ప్రజల ముందుంచుతున్నాను.

ఇప్పుడు ఇక్కడ మూడు చోట్ల ఎర్ర రంగు, తెల్ల రంగు చిత్రాలు కన్పిస్తున్నాయి. ఇక్కడి శివాలయం, పక్కనున్న హనుమంతుని విగ్రహం మధ్యనున్న గుహలో ఎర్ర



బృహత్‌శిలా సమాధి

రంగు చిత్రాలు, ఒక తెల్ల రంగు చిత్రం కన్పిస్తున్నాయి. ఎర్ర రంగు చిత్రంలో ఒక క్రూర జంతువును (పులిని?) కొందరు మనుషులు ఈటెలతో ఎదుర్కొంటున్నట్లు చిత్రించబడింది. దాని పక్కనున్న తెల్ల రంగు చిత్రంలో ఒక కొంగ సజీవ కళతో చిత్రించబడింది. నలుపు బాహ్య రేఖలతో చిత్రించబడిన ఈ తెల్ల కొంగ సజీవ కళతో చిత్రించబడింది. నల్లరంగు బాహ్య రేఖలతో చిత్రించబడిన ఈ తెల్లరంగు కొంగ ముక్కు చాలా పెద్ద ఉంది. ఇలాంటి కొంగ చిత్రం ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల దగ్గరి గాంధారి ఖిల్లాలోని గుహలో కూడా ఉంది.

ఇక పాండవులుగా చెప్పబడే చారిత్రక పూర్వయుగంనాటి రంగు చిత్రాలను అర శతాబ్దం కిందే స్థానికులు చెరిపేసి అవి ఉన్న గుహలో పాండవులు, ద్రౌపది, కృష్ణుడు, గరుత్మంతుడు, నారదుడు, గణేశుడి రంగు చిత్రాలను చిత్రించారు. స్థానికులు ఈ చిత్రాలను వేసే క్రమంలో పాత చిత్రాలు ఉన్న గుహ రాళ్ళను దొర్లించగా పడిపోయిన ఒక రాయి మీద ఇప్పటికీ ఒక ఎరుపు రంగు ఆవు చిత్రం కన్పిస్తుంది.

## బృహత్ శిలాయుగం ఎలాగంటే ...

పైన పేర్కొన్న చిత్రాలు బృహత్ శిలా యుగానికి (2 వేల ఏళ్ళ పూర్వం) చెందినవని చెప్పడానికి నిదర్శనంగా ఈ లొంక పై భాగంలో ఆనాటి ప్రజలు కట్టిన బృహత్ శిలా సమాధులు కన్పిస్తున్నాయి. గుహల్లో నివసించే ప్రజలు గుట్టలపైనున్న సమతల ప్రదేశాల్లో అలాంటి సమాధుల్ని నిర్మించుకునే ఆచారం ఆనాడుండేది. ప్రఖ్యాత పురావస్తు నిపుణులు డా॥ వి.వి.కృష్ణ శాస్త్రి గారు ఇదే కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ దగ్గరి రేగొండ గుహల్లో కనుగొన్న ఇక్కడిలాంటి ఎరుపు, తెలుపు రంగుల

చిత్రాలు బృహత్ శిలా యుగానికి చెందినవని ఇప్పటికే నిర్ధారించారు. అయితే రామగిరి పైనున్న శ్రీరాముడి గుహాలయానికి గుట్ట కింది నుంచి వెళ్ళే మార్గం పక్కనున్న ఒక చిన్న గుహలో కొత్త రాతియుగానికి చెందిన చిత్రాలున్నాయి. ఈ గుహ పరిసరాల్లో కృష్ణశాస్త్రిగారి సమక్షంలోనే ఠాకూర్ రాజారాం సింగ్ అనే చరిత్రకారులు కొత్తరాతి యుగపు పనిముట్లను కూడా సేకరించారు.

రాష్ట్ర పురావస్తు శాఖ, కరీంనగర్ జిల్లా పర్యాటక శాఖ ఈ చిత్రాలను పరిరక్షించి, ఇక్కడి జలపాతాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తే మన ఘన చరిత్రను రక్షించుకున్నట్లూ ఉంటుంది, పలువురికి ఆనందాన్నీ అందించినట్లుంటుంది.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 26–02–2015*

# 3

# మన్నెంకొండలో మధ్యరాతి యుగపు చిత్రాలు

వేల ఏళ్ళ క్రితం ఆదిమానవులు గుహల్లో నివసించారనడానికి నిదర్శనంగా ఇప్పటికీ కొన్నిచోట్ల వారు చేసిన రంగు చిత్రలేఖనాలు కన్పిస్తాయి. అలాంటి అరుదైన రాతి చిత్రాలు కొన్ని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నెంకొండ దేవాలయానికి సమీపంలో ఉండటాన్ని నేను 2015 జూన్ 7న గుర్తించాను.

రాయచూర్ రహదారి పక్కనున్న మన్నెంకొండ దేవాలయాన్ని చేరుకునే ముందు కుడివైపు కన్పించే ఎదురుగుండ్లగుట్ట– మైదానం అంచున ఒక పడగగుండు ఉంది. అది ఏర్పరచిన గుహ ఉపరితలానికి, తూర్పు గోడకు రెండు చిత్రలేఖనాల సమూహాలున్నాయి. ఉపరితలం చిత్రంలో నాలుగు తీగలు రెండు, మూడు మొగ్గలతో




ఎదురుమడుగు



పెనవేసుకున్నట్లున్న ఎరుపు రంగు చిత్రం చాలా అందంగా కన్పిస్తున్నది. ఇప్పటికీ ఏమాత్రం చెక్కు చెదరకుండా ఉంది. కొంచెం మొరటుగా ఉన్న ఇలాంటి డయామెట్రిక్ డిజైన్ చిత్రలేఖనాలు మెదక్ జిల్లాలోని వర్గల్‌లో ఉన్న సరస్వతీ ఆలయం వెనకున్న గుహలో కూడా ఉన్నాయి. అవి మధ్యరాతి యుగపు చివరి కాలానికి చెందినవని నిర్ధారించారు.

తూర్పు గోడకు వేసిన మరో ఎరుపు రంగు చిత్రం అడవి దున్నపోతుది గాని, గున్న ఏనుగుది గాని అయ్యుంటుంది. వేల ఏళ్ళుగా వర్షపు నీరు ఈ చిత్రం మీది నుండి కారిపోవడం వల్ల ఇందులోని జంతువు వీపు భాగం కరిగిపోయింది. బాగా గమనిస్తే ఏనుగు తలవంచి తొండంతో నీటిని పై భాగంలోకి చిమ్ముతున్నట్లు కనిపిస్తుంది. పై భాగంలో ఉన్న చిత్రం రాతి శాస్త్రం ప్రకారం విశ్వాన్ని / దేవున్ని సూచిస్తుంది. తరువాతి కాలపు ఆలయాల ద్వార తోరణాల పై గడపకు కన్పించే గజలక్ష్మి శిల్పాల్లో ఏనుగులు ఆ దేవతకు అభిషేకం చేస్తుండడం గమనార్హం. ఇలాంటి శిల్పాలకు ఈ మన్నెంకొండ రాతి చిత్రలేఖనాలు మాతృక అని చెప్పవచ్చు.

ఈ రాతి చిత్రాల వయస్సును తెలుసుకునే ప్రయత్నంలో ఈ గుహలో, చుట్టుపక్కలా శోధిస్తే రెండు ఎరుపు రంగు కుండ పెంకులు, ఒక నూరుడురాయి దొరికాయి. కుండ(పెంకు)లు కుమ్మరి చక్రం మీద చేసినవి కాక చేతితో చేసి తర్వాత కాల్చినవి. కాబట్టి పురావస్తు శాస్త్రం ప్రకారం ఇవి మధ్య రాతి యుగానికి చెందినవి. ఈ యుగం క్రీ.పూ.8500 సంవత్సరాల కిందటి నుంచి తెలంగాణలో మనుగడ సాగించింది. అయితే ఆ తరువాత యుగానికి చెందిన కొత్తరాతి యుగానికి సంబంధించిన నూరుడురాయి లభించడంతో ఈ ప్రాంతంలో ప్రజలు మధ్యరాతి



యుగం నుంచి కొత్తరాతి యుగం వరకు నివసించారని లేదా ఇక్కడి మధ్యరాతి యుగ ప్రజలు కొత్త రాతియుగ ప్రజలతో సంబంధాలు నెరిపారని చెప్పవచ్చు. కొత్త రాతియుగం సుమారు నాలుగున్నర వేల సంవత్సరాల కిందటి నుంచి మూడు వేల సంవత్సరాల క్రితం వరకు మనుగడలో ఉండేది. గుహ తూర్పు గోడ మీదున్న జంతువు చిత్రం రంగు మరీ ఎరుపుగా ఉండడంతో గోడ ఉపరితలానికి ఉన్న చిత్రం కంటే పాతదని చెప్పవచ్చు.

ఈ మన్నెంకొండ రాతి చిత్రలేఖనాలు, కుండ పెంకులు, నూరుడు రాయి వంటి వాటితో పోలికలున్నవే ఇక్కడి చుట్టుపక్కల 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న సంగనోనిపల్లి, పోతనపల్లి, దూపాడ్‌గట్టు వంటి ప్రాంతాల్లో కూడా లభించడం, అవి కూడా మధ్యరాతియుగం, కొత్తరాతియుగాలకు చెందినవి కావడం వల్ల ఈ విశాల ప్రాంతంలో ఏడెనిమిది వేల ఏళ్ళ కిందటి నుంచే మానవులు జీవన పురోగతి సాధిస్తున్నారని తేట తెల్లమైంది.

ఈ అరుదైన రాతి చిత్రలేఖనాల ప్రాంతాలను కలిపి ఒక పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తే మన ఘన చరిత్రను భావి తరాలకు అందించినట్లూ ఉంటుంది, ఈనాటి ప్రజలు ఆనందించడానికీ వీలవుతుంది. కాబట్టి పురావస్తుశాఖ ఈ మన్నెంకొండ గుహలో వెంటనే తవ్వకాలు చేపట్టి బయల్పడిన వస్తురూపక ఆధారాలను రాష్ట్ర వస్తుప్రదర్శనశాలలో భద్రపరచాలని, చిత్రలేఖనాలున్న గుహనేమో ఇనుప కంచె వేసి కాపాడాలని కోరుతున్నాను.

– *ప్రధాన తెలుగు దినపత్రికలు, 13-06-2015*

# 4

# దొంగలగట్టులో తొలి దేవత గోవు చిత్రాలు

వేల సంవత్సరాల కిందటి ఆది మానవులు గుహల్లో నివాసం ఉండేవారని మనకు తెలుసు. కాబట్టి ఆనాటి వారి జీవన సంస్కృతికి సంబంధించిన ఆధారాలు కూడా గుహల్లోనే లభిస్తాయి. అలాంటి గుహ ఒకటి మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ మండలం జూపల్లి గ్రామ పరిధిలో ఉన్న దొంగలగట్టు అనే గుట్ట దిగువ అంచున ఉన్న 'ఈరన్న గుండు' కింద ఉంది. ఈ గుహలో చారిత్రక పూర్వ యుగానికి చెందిన రేఖా చిత్రాలు (Petroglyphs) ఉన్నాయి.

32 ఏళ్ళ కిందట ఇక్కడి చిత్రాలను చూసిన నాగపూర్ పురావస్తు అధికారి కె.ఇస్మాయిల్ ఈ చిత్రాలపై గతంలో ఎరుపు రంగు కూడా ఉండి ఉండవచ్చని



చెప్తూ... ఆ నేపథ్యంలో ఈ గుహనే దక్షిణ భారత దేశంలో వెలుగులోకి వచ్చిన మొదటి మధ్యరాతియుగ స్థలం అని అభిప్రాయపడ్డారు.

## రేఖా చిత్రాలు


మైసమ్మ గుడి అని స్థానికులు పిలుస్తున్న ఈరన్న గుండు కిందున్న గుహలో రెండు చోట్ల రేఖా చిత్రాలున్నాయి. భూ ఉపరితలానికి అడుగెత్తున సుమారు రెండు అడుగుల పొడవు, అంతే ఎత్తు ప్రమాణాల్లో మూపురం, కొమ్ములు, గంగడోలు కలిగిన ఎద్దు ఒకటి చిత్రించబడింది. దాని పక్కన మరో రెండు ఎడ్లు చెక్కబడినాయి – ముందుకు (తూర్పు వైపుకు) గుంపుగా కదులుతున్నట్లుగా.

ఈ మొదటి సమూహపు చిత్రాలకు కొంచెం ముందువైపు ఆరడుగుల ఎత్తున ఇదే గుహ గోడకు మరో మూడు పశువుల రేఖా చిత్రాలున్నాయి. ఈ చిత్రాల్లో మొదటిది ఆవు చిత్రం. దాని కొమ్ములు పొట్టిగా ముందువైపుకి తిరిగి ఉన్నాయి. మూపురం లేదు. ఆవు వెనుక ఒక మూపురపు ఎద్దు, దీని వెనుక మరో కొమ్ముల ఎద్దు వరుసగా చిత్రితమయ్యాయి.

ఈ రెండు సమూహాల పశువుల చిత్రాల కింద చిన్న చిన్న లేగ దూడలు రెండేసి చిత్రించబడ్డాయి. వాటి కింద ఇప్పటికీ అర్థం కాని అక్షరాలు "గ్రాఫితీ మార్క్స్" చెక్కబడ్డాయి. ఇలాంటి వాటిని వందేళ్ళ కిందనే ఆనాటి నిజాం రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు యాజ్దానీగారు సేకరించారు.

## ఎప్పటివి, ఏమిటీ ప్రత్యేకత?

ఈరన్న గుండు పరిసరాల్లో నాకు మధ్యరాతి యుగానికి చెందిన రెండు సూక్ష్మరాతి ఆయుధాలు, కొత్తరాతి యుగానికి చెందిన వడిసెల రాయి, నూరుడు రాయి లభించాయి. ఇలాంటివేవీ కె. ఇస్మాయిల్‌కు లభించినట్లు ఆధారం లేదని రాతి చిత్ర శాస్త్ర నిపుణులు ఎన్. చంద్రమౌళిగారు రాశారు. మధ్యరాతి యుగం తెలంగాణలో క్రీ.పూ. 8500 సంవత్సరాల కిందటి నుంచి క్రీ.పూ. 1800 సంవత్సరాల మధ్య మనుగడ సాగించింది. కొత్తరాతి యుగం ఇప్పటికి సుమారు ఐదు వేల నుండి మూడు వేల సంవత్సరాల కిందట వర్ధిల్లింది. ఈరన్న గుండు రేఖా చిత్రాలను మాత్రం ఆనాటి మానవుడు రాగి వంటి లోహాల్ని మొదటిసారిగా వాడి, ఆ లోహ ఆయుధాలతోనే చిత్రించినట్లు కన్పిస్తుంది. కాబట్టి ఈ రేఖా చిత్రాలు కొత్త రాతి యుగానికి చెందినవయి ఉంటాయి.



రేఖా చిత్రాల్లో చిత్రించబడిన పశువుల శరీరం మధ్యలో చారలున్నాయి. ఎద్దుల కొమ్ములు ఈనాటి మైసూరు జాతి ఎద్దుల కొమ్ములను పోలి ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ఎద్దులు వేల సంవత్సరాల కిందటే దక్కను ప్రాంతమంతటా ఉండేవని చెప్పవచ్చు. అయితే ఇవే ఎద్దుల మూపురాలు, గంగడోలు సింధూ నాగరికత కాలానికి చెందిన ఎద్దుల నమూనాలను పోలి ఉండడం వల్ల ఆనాటి ఎద్దుల వ్యాపారం / రవాణా ఇంకా విస్తృతమైందని విశదమౌతోంది. ఏది ఏమైనా ఈ ఈరన్న గుండు గుహలో చిత్రించబడిన ఆవులు, ఎద్దులు ఇక్కడ తొలిసారి విస్తరించిన పాడి పంటల సంస్కృతికి నిదర్శనాలుగా నిలుస్తాయని, ఆ కోవలోనే పూజింపబడ్డాయని చెప్పవచ్చు.

ఇంతటి ప్రాధాన్యంగల ఈ తొలినాళ్ళ సంస్కృతీ స్థలాన్ని దుండగుల బారిన పడకుండా ప్రభుత్వం వెంటనే ఫెన్సింగ్ వేసి కాపాడాలి. శాస్త్రీయ పరిశోధనలు జరిపించి, వెలుగు చూసిన విశేషాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 15-03-2015*


# 5

# రాచకొండలో గుహా చిత్రాలు, గుడి చిత్రాలు, భూగర్భ కాలువలు

## చరిత్ర పూర్వయుగపు చిత్రాల్లో ఆది మానవుల జీవనం

మానవుడు జంతు దశ నుండి పరిణామం చెందాడని మనకు తెలుసు. జంతు దశ నుండి విడివడ్డాడని చెప్పడానికి నిదర్శనంగా రెండు ప్రధాన పరిణామాలు కనిపిస్తాయి. ఒకటి వేట ఆయుధాలు, ఆహార సేకరణ పనిముట్లను కనుక్కోవడం, రెండు చిత్రలేఖనంతో మొదలుపెట్టి లలిత కళలను కనుక్కోవడం. ఈ రెండు రకాల ఆవిష్కరణలతో మానవ జీవితంలో జంతు జీవితాలకు భిన్నంగా సుఖ సంతోషాలు చోటు చేసుకున్నాయి. వీటికి సంబంధించిన నిదర్శనాలు నాకు 2014 నవంబర్ 9 నాడు రాచకొండలోని రెండు గుహల్లో కనిపించాయి.






**మొదటి గుహలో**

రాచకొండలో సుమారు పది గుట్టలు ఉన్నాయి. వాటిల్లో ప్రధానమైనవి గుర్రాలగుట్ట, కచ్చేరిగుట్ట. గుర్రాల గుట్ట పైనున్న అనేక గుండ్ల సముదాయాల్లో రెండు గుండ్ల సముదాయాలు గుహలను ఏర్పరచాయి. ఆ గుహల్లో వేల ఏళ్ళ కిందట ఆది మానవులు గీసిన ఎరుపు రంగు చిత్రాలు, రేఖా చిత్రాలు (petroglyphs) ఉన్నాయి.

మొదటి గుహ గుర్రాల గుట్ట పైనున్న వైష్ణవాలయానికి ఆగ్నేయం వైపున అల్లంత దూరంలోనే ఉంది. ఈ గుహకు తూర్పు-పడమర దిశల్లో సహజమైన ప్రవేశ నిర్గమ ద్వారాలు ఉన్నాయి. ఉత్తరం వైపున్న గుండు పైన దక్షిణం వైపున్న గుండు పడగా నలుపై అడుగుల ఎత్తున్న గుహ త్రిభుజాకారంలో ఏర్పడింది. ఈ దక్షిణం వైపున్న గుండుకు ఉత్తరాభిముఖంగా ఆది మానవులు ఎరుపు రంగు చిత్రాలు గీశారు.

**దేవతా పటాలు, నృత్యాలు**


ఈ చిత్రాలు రెండు సమూహాలుగా ఉన్నాయి. పడమర వైపున్న ప్రధాన సముదాయంలో మూడు వరుసల్లో చిత్రలేఖనాలున్నాయి. వాటిని చూడగానే వేల ఏళ్ళ నాటి చిత్రాలు ఇంకా అంతే తాజాగా ఉండడమేంటని ఆశ్చర్యపోతాం. నాతో

వచ్చిన ఇద్దరు మిత్రులైతే 'అవి అసలు ఆది మానవుల చిత్రాలు కాదు, ఈ మధ్యనే ఎవరో జాజుతో గీసినవి' అని కూడా అన్నారు.

మొదటి వరుసలో మొదటిది, ప్రధానమైనది అయిన చిత్రం 'పటం' (Diametric Design). ఇది సుమారుగా దీర్ఘ చతురస్రాకారంలో ఒక మీటరు పొడవు, వెడల్పుల పరిమాణాలో ఉంది. దీర్ఘ చతురస్రాకారంలోపల సుమారుగా అష్టభుజాలు గీసి ఉన్నాయి. మొదట గీసిన పటాన్ని తరువాతి కాలంలో పెద్దది చేసినట్లు రంగుల మార్పు వల్ల తెలుస్తుంది.

ఈ దీర్ఘ చతురస్రాకార పటాన్ని భగవంతునిగా భావించారు ఆనాటి మానవులు. అట్లనటానికి సూచనగా పటం పైన కూడా దేవతా చిహ్నం చిత్రంచబడింది. పటానికి పక్కన పూజారి, పూజారి పక్కన నృత్యం చేస్తున్న మనుషుల చిత్రాలున్నాయి. ఒక నృత్య చిత్రంలో నలుగురు వ్యక్తులు ఒకరి చేతిని ఒకరు పట్టుకొని వర్తులాకారంలో నర్తిస్తున్నారు. వారి పక్కన మరో ఇద్దరు నృత్యం చేస్తున్నారు.

తరువాతి చారిత్రక యుగంలో... ఇప్పటికీ గ్రామీణ సమాజంలో జానపదులు దేవున్ని పటం వేసి ఆహ్వానించడం, గిరిజనులైతే ఆ దేవుని దగ్గర వలయాకారంలో నర్తించడం గమనించవచ్చు. ఈ రాచకొండనేలిన పద్మనాయక వంశం మాదేనని ఈ మధ్య ఆధారాలు చూపిస్తున్న ఆదివాసీ నాయకపోడులు ఇప్పటికీ ఇదే విధంగా



పటం వేసి నృత్యం చేస్తుండడం, ఇలాంటి సాంప్రదాయం వసంతోత్సవం పేరుతో రాచకొండ రాజుల కాలంలోనే అమలులో ఉండేదని ఆనాటి కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'లో వర్ణించబడి ఉండడం ఆసక్తిని రేకెత్తించే అంశాలు.

రెండవ పటం చిత్రం కొంచెం చిన్నగా ఉంది. దాని పక్కన పూజారి, పూజారి తరువాత భక్తులు వరుసగా చిత్రించబడ్డారు.

మొదటి వరుస కింద ఉన్న రెండవ వరుస చిత్రాల్లో స్త్రీ పురుషులు తప్పట్లు కొడుతూ నృత్యం చేస్తున్నట్లుండగా, వారి బిడ్డ అటు ముఖం చేసినట్లు కనిపిస్తుంది.

రెండవ వరుస కింద ఉన్న మూడవ వరుసలో కేవలం భక్తులే ఒకరి పక్కన/వెనుక ఒకరు వరుసగా నిల్చున్నట్లు 32 చిత్రాలున్నాయి. ఒక ఫీటు ఎత్తు, $1^{1/2}$ అంగుళాల దళసరి గీతలు ఈ భక్తులను సూచిస్తున్నాయి. 9వ గీత మాత్రం తల కిందులుగా నిలబెట్టిన త్రిశూలం లాగా చిత్రించబడింది.

పటాన్ని దేవుడిగా భావించడం, ఆ దేవుడికి చేసే పూజలో భాగంగా నర్తించడం ఆదిమానవుల ఆచారం అని పై చిత్రాల్లో వ్యక్తమైనట్లు స్పష్టంగా అర్థమవుతుంది. పట చిత్రాలు, గ్రామీణ సామూహిక నృత్యాల సంస్కృతి ఇప్పటికీ అక్కడక్కడా గ్రామాల్లో కొనసాగుతుండడానికి మూలాలు రాచకొండలో కనపడడం ఇప్పటి విశేషం.


రెండవ సముదాయపు చిత్రాల్లో ప్రధానంగా కనిపించే బొమ్మలు రెండు. ఒకటి స్త్రీ పురుష సంయోగ చిత్రం. మానవులు ఆశించే సంతానానికి కారణమైన ఈ సంయోగ చిత్రాన్ని అసమ చతుర్భుజాకారాల్లో డంబెల్ రూపంలో చిత్రించారు. రెండవ చిత్రంలో ఇద్దరు మనుషులు ఒక కావడితో ఒక జంతువు (జింక) సప్ప (వెనుక కాలు)ను మోస్తున్నట్లు చిత్రించబడ్డారు. ఈ కావడి మోత పల్లకిలాగా కూడా కనిపిస్తుంది. అయితే వేటాడిన జంతువు సప్ప మోత చిత్రం ఇప్పటికీ సవర గిరిజనుల సాంప్రదాయ చిత్రలేఖనంలో కనిపిస్తుంది. సవరులు (శబరులు) రామాయణ కాలంలో... ఒక అంచనాను అనుసరించి 7 వేల సంవత్సరాల కిందట నల్లగొండ పక్క జిల్లా ఖమ్మంలోని భద్రాచలం ప్రాంతంలో ఉండేవారని శబరి పురాణం తెలుపుతుండడం గమనార్హం.

## రెండవ గుహలో

రెండవ గుహ గుర్రాల గుట్ట ద్వారంలో నుండి కుడివైపు ఫర్లాంగు దూరం నడిచిన తరువాత వచ్చే గుర్రాల ఆకారంలో ఉన్న గుండ్ల కింద సహజంగా ఏర్పడిన గుహలో గజంనర ఎత్తైన గుండు ఉపరితలానికి రేఖా చిత్రాలు (petroglyphs) చెక్కి ఉన్నాయి.

ఈ రేఖా చిత్రాల్లో ఒక వ్యక్తి కింద రెండు వరుసల్లో ముగ్గురేసి వ్యక్తులు (మొత్తం ఏడుగురు) బాణాలు ఎక్కుపెట్టి ఒక క్రూర మృగాన్ని (పులి) ఎదుర్కొంటున్నట్లు చిత్రించబడ్డారు. పైన వ్యక్తి రేఖా చిత్రం పై సగం అస్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడుగురు వేటగాళ్ళ మధ్య ఏడు కప్ రంధ్రాలు (cup marks) త్రిభుజాకారంలో తొలుచబడ్డాయి. క్రూర జంతువును వెనుక నుండి కూడా కొందరు వేటాడుతున్నట్లు రేఖా చిత్రాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. వీరి కింద ఒక దండానికి జంతు మాంసపు చీలిక ముక్కలను (అరుగులను) ఆరబెట్టినట్లున్న రేఖా చిత్రముంది. ఇలాంటి చిత్రలేఖనాన్ని కూడా ఇప్పటికీ సవరలు వేస్తున్నారు.

ఈ గుహ పక్కనున్న మరో గుండు కింద ఏర్పడిన గుహలో ఉన్న అరుగు మీద కూడా అనేక కప్ రంధ్రాలు, నూరుడు బండ ఆనవాళ్ళూ కనిపిస్తున్నాయి. కొత్త రాతి యుగం (సుమారు 5 వేల సంవత్సరాల కిందటి) మానవులు తమ రాతి ఆయుధాలను నున్నగా చేసుకున్న నూరుడు రాయి ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. దాని పక్కనుండే సన్నటి నీటి ప్రవాహం పోయే ఛాయలు కన్పిస్తున్నాయి. నీరు నూరడానికీ అవసరమే కదా! కప్ రంధ్రాలు కూడా నునుపుగా చేయబడినవి – 2 సెం.మీ. పరిమాణాల్లో. ఇలాంటి రేఖా చిత్రాలు, కప్ రంధ్రాలు కర్ణాటకలో, తెలంగాణలో మెదక్ జిల్లా ఎద్దనూరులో, ఖమ్మం జిల్లా రామచంద్రాపురంలో... అంటే దక్కన్‌లోనే




ప్రత్యేక రీతిలో కన్పిస్తాయి. ఇక మొదటి గుహా చిత్రాలు ఇంకా పూర్వపువి. మధ్యరాతి యుగానికి చెందినవి. అయితే పరిసరాల్లో ఈ రాతి యుగాల తరువాతదైన రాక్షసగుళ్ళ యుగపు ఆనవాళ్ళు, కుండ పెంకులు కూడా కన్పిస్తున్నాయి. ఆ తరువాతి కాలపు చారిత్రక నివాసాల పరంపర కూడా కనిపిస్తుంది. కాబట్టి, ప్రభుత్వం నిపుణులతో సమగ్ర సర్వే చేయించే అవసరముంది.

నేను వెలుగులోకి తెచ్చిన ఈ రాచకొండ రాతి చిత్రాల మీద రాష్ట్ర ప్రభుత్వం నిజనిర్ధారణ చేయడానికై నియమించిన త్రిసభ్య సంఘం (ఇందులో నేనొక సభ్యున్ని) ... "ఈ రాతి చిత్రాలున్న గుహల్లో తవ్వకాలు జరుపాలని, తవ్వకాలు జరిపే వరకు ఈ రాతి చిత్రాలు కొత్త రాతి యుగం, దాని తరువాతదైన బృహత్‌శిలా యుగాలకు చెందినవని భావించవచ్చు" అని నివేదించింది.


రాష్ట్ర పురావస్తు శాఖ ప్రపంచ వారసత్వ దినోత్సవం నాడు (2015 ఏప్రిల్ 18) విడుదల చేసిన 'రాక్ ఆర్ట్ సైట్స్ ఇన్ తెలంగాణ' అనే ఆంగ్ల గ్రంథంలో నేను కనిపెట్టిన ఈ రాచకొండ రాతి చిత్రాల వివరాలను ప్రచురించారు.

## 650 ఏళ్ళ కిందటి రామనవమి చిత్రాలు

శ్రీరామనవమి అనగానే తెలుగువారికి గుర్తొచ్చేది భద్రాచలం రామాలయం. ఈ ఆలయాన్ని క్రీ.శ. 1665లో భక్త రామదాసు కట్టించాడని, అప్పట్నుంచి అక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని కీ.శే. బి.రజనీకాంతారావుగారు



పుత్రకామేష్టి యాగం




నిర్ధారణగా రాశారు. అంటే సరిగ్గా 350 సంవత్సరాలుగా తెలుగు ప్రజలు శ్రీరామనవమి పండుగను జరుపుకుంటున్నారని చరిత్ర చెప్తుంది. ఇప్పుడు ఈ చరిత్రను మరో 300 సంవత్సరాలు ముందుకు తీసుకు వెళ్ళాల్సిన చారిత్రక ఆధారాలు – శ్రీరామనవమికి సంబంధించినవి – ఇటీవల రాచకొండలో నా కంటపడ్డాయి.

నల్లగొండ జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని రాచకొండ గుట్టల్లో ఉన్న 14వ శతాబ్దం నాటి కోటగోడల ఆగ్నేయ ద్వారం దగ్గరలో ఉన్న ఒక వైష్ణవ ఆలయం పైకప్పుకు శ్రీరామావతార ఘట్టానికి సంబంధించిన చిత్రాలు చిత్రింపబడ్డాయి. ఆలయం పైకప్పుకు మొదట డంగు సున్నం పేస్ట్ పూసి నునుపైన గచ్చును చేసి దాని మీద 'రామాయణం'లో వర్ణించిన పుత్రకామేష్టి యాగం, రామావతార ఘట్టాలను నలుపు రంగు రేఖలతో అందంగా చిత్రించారు.

## చిత్రాలు ఇవి:

ఆలయం పైకప్పు నిండా ఒకప్పుడు చాలా చిత్రలేఖనాలుండేవి. అవన్నీ కాల గర్భంలో కలిసిపోగా అదృష్టవశాత్తు ఇప్పటికీ మిగిలి ఉన్న ఒకే ఒక్క రాతి పలక కొన్ని చిత్రలేఖనాలను ప్రదర్శిస్తున్నది. వాటిల్లో శ్రీరామనవమికి సంబంధించిన చిత్రలేఖనాలున్నాయి. ఆ చిత్రాలను, సమకాలీన శాసనాలను, సాహిత్య ఆధారాలను అధ్యయనం చేసి సమన్వయించి చూడగా ఆ చిత్రాలు "రంగనాథ రామాయణం"

అనే ద్విపద కావ్యంలోని బాలకాండ పద్యాలను అనుసరించి చిత్రించబడ్డాయని అర్థమౌతుంది.

రంగనాథ రామాయణంలో దశరథుడు పుత్రకామేష్టి – అశ్వమేధ యాగాలను చేశాడని ఇలా ఉంది.

"చిర తపోనిధి రుష్యశృంగు సమ్మతియు
గురుని యానతియు గైకొని మంచివేళ
స్పృహను శాంతా రుష్యశృంగులతోడ
..........................................
యాగవాటము సొచ్చి హయము వచ్చుటయు
పశువుల మున్నూటి ప్రథితాశ్వ మొకటి
విశసించి క్రతుకర్మవేదులు ప్రీతి
కామించి వేల్చిరి కడగి రుత్విజులు"

అంటే, వశిష్ఠుడు, రుష్యశృంగుడు తదితర మహర్షుల ఆధ్వర్యంలో దశరథుడు అశ్వమేధ యాగం, పుత్రకామేష్టి యాగం నిర్వహించాడని అర్థం. ఈ రాచకొండ ఆలయం పైకప్పు కింది వైపు వేసిన చిత్రాల్లో కూడా దశరథుడు వశిష్ఠున్ని గురువు స్థానంలో ఆసీనున్ని చేసి, శాంతా రుష్యశృంగుల ఆధ్వర్యంలో తన ముగ్గురు భార్యలను (కౌసల్య, సుమిత్ర, కైకేయి) పక్కన కూర్చోబెట్టుకొని పుత్రకామేష్టి యజ్ఞం నిర్వహిస్తున్నట్లున్న ఒక చిత్రలేఖనం ఉంది. దానిని ఆనుకొని ఉన్న మరో చిత్రలేఖనంలో దశరథుడు నిర్వహించిన అశ్వమేధ యాగంలో భాగంగా ఒక అశ్వం విజయవంతంగా అనేక రాజ్యాలు తిరిగి రాగా, ఆ గుర్రాన్ని రాజన్యులు పూజిస్తున్నట్లు సజీవకళతో చిత్రించబడింది.

రామాయణంలో ఈ యాగం సరయు నది ఒడ్డు మీద నిర్వహించబడినట్లు ఉంది. ఇక్కడి చిత్రలేఖన సముదాయంలో కూడా సరయునది చిత్రించబడింది. ఇక్కడి ఆలయం కూడా ఒక నది (వాగు) ఒడ్డున్నే ఒక ఎత్తైన స్థలం (వేదిక) పైన ఉండడం గమనార్హం. రామాయణంలో పేర్కొనబడినట్లే ఇక్కడి చిత్రలేఖనంలో నాలుగు వర్ణాల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) ప్రజలు, మంత్రులు, బ్రహ్మాది దేవతలు, దేవకన్యకలు, రుషులు, సేవకురాండ్రు కూడా చూడ ముచ్చటగా చిత్రించబడ్డారు.

రాచకొండ కోటలో ఉన్న రామాలయం ముందున్న ధ్వజస్తంభానికి చెక్కిన శాసనంలో అనపోతనాయుడనే రాజు ఆ ఆలయాన్ని 1365వ సంవత్సరంలో కట్టించాడని ఉంది. అప్పుడే ఈ చిత్రాలు వేయించి ఉంటారు కాబట్టి వాటి వయస్సు

2015 సంవత్సరపు శ్రీ రామనవమి నాటికి (మార్చి 28) సరిగ్గా 650 సంవత్సరాలు. క్రీ.శ. 1360 ప్రాంతంలో గోనబుద్ధ భూపతి 'రంగనాథ రామాయణం' రాశాడని ప్రముఖ చరిత్రకారులు కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు రాశారు. గోన బుద్ధుడు రాచకొండ రాజు అనపోతనకి సామంతుడు కాబట్టి, ఆయన రచన ఆధారంగా రామనవమి చిత్రాలు వేయించి ఉంటారు. పుత్రకామేష్టి యాగం ఫలితంగా రాముడు పుట్టాడు కాబట్టి, ఆయన పుట్టిన తిథిని (నవమిని) ఉత్సవంగా జరిపారని రామాయణంలో ఉంది కాబట్టి, ఆ చిత్రాలను వేయించిన రాచకొండ రాజులను ఇప్పటివరకు తెలిసిన చరిత్ర ప్రకారం తెలుగు దేశంలో మొట్టమొదటిసారిగా శ్రీరామనవమి ఉత్సవాలను జరిపిన తొట్టతొలి రాజులుగా కీర్తించవలసి ఉంది.

మరో వంద సంవత్సరాల తరువాత రాచకొండ రాజ్యం బహమనీ ముస్లింల దండయాత్రల్లో నశించిపోయినా అదే ముస్లిం రాజుల (గోల్కొండ కుతుబ్షాహీలు) రాజ్యంలోనే సరిగ్గా 300 సంవత్సరాల తర్వాత (1665లో) భద్రాచలంలో రామదాసు రామాలయాన్ని కట్టించడం, అక్కడ ప్రతియేట జరిగే శ్రీరామనవమికి ముస్లిం రాజులే స్వయంగా స్వామివారికి పట్టుబట్టలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం, మళ్ళీ సరిగ్గా 300 సంవత్సరాల తర్వాత 1965లో ఆ భద్రాచల రామాలయం పునరుద్ధరణకు నోచుకోవడంలో రాచకొండ రామనవమి చారిత్రక వారసత్వమే నేపథ్యమని చెప్పాలి. ఇంతటి ప్రాధాన్యం గల రాచకొండలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇప్పటి నుంచైనా రామనవమి ఉత్సవాలు జరుపుకుంటే బావుంటుంది.

## 650 ఏళ్ల కిందటి భూగర్భ కాలువలు

గురుత్వాకర్షణ ద్వారా నీటి సరఫరా అనే మాట వినగానే చాలా మందికి గోల్కొండ కోట గుర్తొస్తుంది. క్రీ.శ. 16వ శతాబ్దంలో దుర్గం చెరువు నుంచి గోల్కొండ కోటకు ఈ పద్ధతిలో నీటిని సరఫరా చేసిన సంగతి తెలిసిందే. కానీ, దానికన్నా రెండు శతాబ్దాలకు ముందే తెలంగాణ రాజధాని ఐన రాచకొండలో అదే గురుత్వాకర్షణ శక్తి ద్వారా చెరువుల నుంచి కోటలకు నీటిని సరఫరా చేసిన వైనం అదృష్టవశాత్తు నా దృష్టికి వచ్చింది – 2015 ఫిబ్రవరి 1 నాడు.

రాచకొండలో క్రీ.శ. 1365లో అనపోతనాయుడు అనే రాజు రెండు చెరువులు నిర్మింపజేశాడు. వాటిని అతని పేరు, బిరుదులు తెలిసేటట్లుగా అనపోత సముద్రం, రాయ సముద్రం అని పిలిచేవారు. అవి నిండిన తర్వాత కూడా పారే వాగు నుంచి... అంటే చెరువుల తూముల నుంచి కోట గుట్ట పాదంలో ఉన్న రాజభవనాలలోకి




మంచినీటిని సరఫరా చేసే రాతి కాలువను ఆ కాలంలోనే ఏర్పాటు చేశారు. పై భాగంలో ఉన్న చెరువుల నుంచి కింది భాగంలో ఉన్న భవనాలకు గురుత్వాకర్షణ ద్వారా నీరు సులభంగా ప్రవహిస్తుందనే భౌతిక శాస్త్ర సూత్రం ఆధారంగా 14వ శతాబ్దంలోనే రాతి కాలువలు నిర్మించి, వాటి ద్వారా రాజు, మంత్రులు, అంతఃపుర స్త్రీలు నివసించే భవనాలలోకి, స్నానాలగదుల్లోకి చిన్నచిన్న కాలువల గుండా మంచి నీటిని సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేశారు.

రాచకొండలో ఉన్న రాజుగుట్ట, నాగయకొండ మధ్య లోయలో పారే వాగు ఉత్తరం నుండి దక్షిణం వైపునకు మలుపు తీసుకున్న స్థలం నుండి రాజుగుట్ట కిందనున్న రాజభవనాల వరకూ సుమారు ఫర్లాంగు దూరం మేర ఈ రాతి కాలువ పైకపుతో కనపడుతుంది. సుమారు గజం వెడల్పు, అంతే ఎత్తు పరిమాణాలతో నిర్మించిన ఈ రాతి కాలువ నుండి నీళ్ళు బయటకు పోకుండా, బయటి నీళ్ళు కాలువలోకి రాకుండా కాలువ పై భాగాన్ని కూడా రాతి కప్పుతో అత్యంత నైపుణ్యంతో మూసివేశారు. రాళ్ళ మధ్య ఖాళీలు, అతుకులను డంగు సున్నంతో మూసివేశారు. పోనుపోనూ ఈ కాలువ పరిమాణం తగ్గుతూ పోయి రాజభవనాల ప్రధాన గోడల లోపల నిర్మించిన కాలువల పరిమాణం చివర్లో ఒకటిన్నర అడుగుల వరకూ తగ్గిపోయింది.




సుమారు ఐదువేల సంవత్సరాల కిందటి సింధు నాగరికతకు చెందిన నగరాలలో కూడా పైకప్పున్న కాలువల నిర్మాణాలున్నప్పటికీ అవి ప్రధానంగా వాడేసిన మురుగు నీటిని మాత్రమే బయటకు పంపేవి. ఇక చరిత్రకు తెలిసినంత వరకు నిత్యావసరాల నిమిత్తం మంచినీటిని సరఫరా చేసే రాతి కాలువల నిర్మాణాన్ని 11వ శతాబ్దంలో భోజరాజు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ సరస్సు ఆనకట్ట లోపల నిర్మించాడు. ఆయన రచించిన 'సమరాంగణ సూత్రధార' గ్రంథంలోని వాస్తు నిర్మాణ విశేషాలను (ఆలయ చూరు కింద ఝూరావళి అనే శిల్పాలు) అనుసరించిన పద్మనాయక రాజులు తమ రాజధాని రాచకొండలో భోజరాజు నిర్మించిన పద్ధతిలోనే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని అనుసరించి నీటి సరఫరా నిర్మాణాలు చేపట్టారని చెప్పవచ్చు.

ఏదేమైనా ఒక్క విషయం మాత్రం సుస్పష్టం. అది, దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా గురుత్వాకర్షణ సిద్ధాంతం ఆధారంగా మంచినీటిని సరఫరా చేసే నిర్మాణాలను చేపట్టింది మాత్రం రాచకొండలోనే అనేది. రాచకొండను క్రీ.శ. 1536లో జయించిన కులీ కుతుబ్‌షానో, అతడి వారసులో అక్కడి నీటి సరఫరా పద్ధతినే గోల్కొండ కోటలోనూ అనుసరించారు. తెలంగాణ ప్రజలు గర్వించదగిన ఈ ఘన వారసత్వ సంపదపై రాష్ట్ర పురావస్తు శాఖ సమగ్రంగా సర్వే జరిపించి విశేషాలను వెలుగులోకి తెచ్చి పరిరక్షించాలి.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 16-11-2014, 3-02-2015, 28-03-2015*


# II
# చారిత్రక స్థలాలు


6

# ఇంద్రపాలనగరంలో 1580 ఏళ్ళ కిందటి బౌద్ధ శిల్పాలు

ప్రపంచ మత ప్రవక్తలలో అత్యుత్తమ బోధనలు చేసిన గౌతమ బుద్ధుని జయంతి ప్రసిద్ధిగాంచిన శుభదినం. ఇది ఎప్పటి నుంచి తెలంగాణలో చారిత్రక ఆచారంగా వస్తున్నదని పరిశోధన చేస్తే తెలియవచ్చిన ఆసక్తికరమైన విషయం... తెలంగాణలో సరిగ్గా 1580 ఏళ్ళ కిందటి నుంచే బుద్ధపూర్ణిమ రాజుల ఆదరణకు, ప్రజల ఆశ్రయానికి నోచుకున్నదనేది.

సుమారు నాలుగు దశాబ్దాల కింద నల్గొండ జిల్లా తుమ్మలగూడెం గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయులు గారి ఇంట్లో ఉండిన రెండు విష్ణుకుండి రాజుల రాగి





కోటగోడ మీదుగా
కనిపిస్తున్న మూసీనది

శాసనాలను ప్రముఖ తెలంగాణ చరిత్రకారులు శ్రీ బి.ఎన్. శాస్త్రిగారు సేకరించారు. మొదటి శాసనంలో గోవిందవర్మ అనే రాజు తన 37వ రాజ్య సంవత్సరంలో వైశాఖ (బుద్ధ) పౌర్ణమి నాడు ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం శివారులో ఉంది)లో పద్నాలుగవ ఆర్య సంఘానికి చెందిన బౌద్ధ మతానుయాయుల సంక్షేమం కొరకు వారి అధ్యక్షుడు దశబలబలికి పేణ్కపర, ఎన్మదల అనే గ్రామాలను దానం చేశాడని ఉంది. బౌద్ధులు ఉంటున్న అక్కడి మహాదేవి విహారాన్ని గోవిందరాజు భార్య పరమ

భట్టారికా మహాదేవి నిర్మించిందనీ ఆ శాసనంలో ఉంది.

గోవిందరాజు 37వ రాజ్య సంవత్సరం క్రీ.శ.435 అని శ్రీ బి.ఎన్.శాస్త్రి, శ్రీ నీలకంఠ శాస్త్రి వంటి చరిత్రకారులు నిర్ధారించారు. అంటే 2015 సంవత్సరపు బుద్ధపూర్ణిమ (మే 5) నాటికి సరిగ్గా 1580 సంవత్సరాల కిందట తెలంగాణలో మొట్టమొదటి బుద్ధ పూర్ణిమ వేడుకలు జరిగాయని శాసనాధారం ఉందన్నమాట.

మరి శాసనంలో దీప, ధూప, గంధ, పుష్ప నైవేద్యాలు స్వీకరించినట్లుగా పేర్కొనబడిన బౌద్ధ విగ్రహాలు ఇప్పుడు ఇంద్రపాలనగరంలో ఏమైనా ఉన్నాయా అని నేను వెదికాను. నా పరిశోధనలో సఫలీకృతున్నయ్యాను. ఆ పరిశోధన ఫలితాలనే బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రజలు, పండితులు, బౌద్ధుల ముందు ఉంచుతున్నాను.

హైదరాబాదు నుండి భువనగిరి-వలిగొండ మీదుగా గాని, చౌటుప్పల్ మీదుగా గాని సుమారు 75 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఒకప్పటి విష్ణుకుండి రాజుల రాజధాని నగరమైన ఇంద్రపాలనగరాన్ని చేరుకోవచ్చు. ఇక్కడ ఇప్పటికీ పూజింప బడుతున్న శివాలయాన్ని దాటి శంకరగుట్ట వెనుక వైపుగా (మూసీ నది వైపుగా) ఒక అర ఫర్లాంగు దూరం నడిచి అక్కడ కనిపించే 30 అడుగుల ఎత్తైన మూడు గుండ్ల సముదాయంలోకి వెళ్తే వాటిల్లో ఎదురెదురుగా ఉన్న రెండు గుండ్లకు 15 అడుగుల ఎత్తున బుద్ధుడు ధ్యాన ముద్రలో కూర్చున్న శిల్పాలు, బౌద్ధ ఆచార్యుల శిల్పాలున్నాయి. ఇదే కాలంలో (1600 ఏళ్ళ కిందట) ఉత్తర భారతంలోని సారనాథ్‌లో ఇలాంటి బౌద్ధ (పద్మాసన ధ్యాన బుద్ధ) శిల్పకళనే ప్రాచుర్యంలోకి రావడం గమనార్హం. ఈ కాలంలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించిన బౌద్ధాచార్యుడు దిగ్నాగుని శిల్పం, గోవిందవర్మ శాసనంలో పేర్కొనబడిన మరో ఆచార్యుడు దశబలబలి శిల్పాలను ఇక్కడి ఆచార్యుల శిల్పాల్లో పోల్చుకోవచ్చు. కాయోత్సర్గ (నిల్చున్న) భంగిమలో ఉన్న ఒక ఆచార్యుని శిల్పంపై నాగపడగ ఉంది. ఇది బౌద్ధాచార్యులలో అత్యంత పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఆచార్య నాగార్జునునిది అయ్యుంటుంది. ఇలాంటిదే ఒక లోహ శిల్పం (ఆచార్య నాగార్జునునిది) విష్ణుకుండి రాజుల మరో రాజధాని ఐన కీసరగుట్ట పరిసరాల్లో చరిత్రకారుడు కుర్రా జితేంద్రబాబుగారికి లభించింది.

ఇంచుమించుగా పైన పేర్కొన్నటువంటి ధ్యాన బౌద్ధులు, బౌద్ధాచార్యుల శిల్పాలే ఇక్కడి పంచేశ్వరాలయం దాటినంక వచ్చే గుట్ట ప్రారంభపు గుహ పై భాగంలో చెక్కబడ్డాయి. ఈ ఘన వారసత్వాన్ని నూతన తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం కాపాడుకొని భావితరాలకు అందించుకోవాలి.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 4-05-2015*

*TRC Publication - 2015*


# 7

# వేపలసింగారంలో వింత పాదం శిలాజం

2014 అక్టోబరు 13 నాటి నమస్తే తెలంగాణ దినపత్రిక రెండవ పేజీలో నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపల సింగారంలో ఆదిమానవుని పాదం శిలాజం బయట పడిందనే వార్త వచ్చింది. ఆ పాదం ఫోటో ఈనాటి మానవుని పాదం లాగా కాకుండా ఒక జంతువు పాదం లాగా కనిపించింది. నిజ నిర్ధారణ చేయాలనే ఆసక్తితో వెంటనే తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టి.ఆర్.సి.) వేపల సింగారం గ్రామానికి వెళ్ళి అక్కడి ప్రజలు, ఆదిమానవుల ఆనవాళ్ళున్న పొలాల యజమానులు తదితరులతో ఒక పూట సమగ్ర విచారణ జరిపింది. ఈ విచారణలో తెలంగాణ చరిత్ర సంస్కృతులకు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలు ప్రస్తావనకు వచ్చాయి.

టి.ఆర్.సి. క్షేత్ర పర్యటనలో తెలుసుకొన్న విషయాలను నాతో చర్చించగా నేను ఈ క్రింది ప్రాథమికాంశాలను ప్రజలు, ప్రభుత్వం ముందుంచుతున్నాను.

వేపల సింగారం గ్రామ పరిధిలో ఉన్న ఊరగుట్ట పరిసరాల్లో గత నాలుగైదు



సంవత్సరాల క్రితం నుండి ఆ గ్రామస్థులు వ్యవసాయ భూమిని సిద్ధం చేసుకుంటున్న క్రమంలో పదులకొద్ది రాక్షసగుళ్ళు, డోల్‌మెన్‌లు బయల్పడ్డాయి. వాటిల్లో ఇనుప యుగం నాటి మానవుల అస్థిపంజరాలు, వారు వాడిన కుండలు, పనిముట్లు, ఆయుధాలు, మచ్చిక చేసుకున్న లేదా వేటాడి(చంపి)న జంతువుల అస్థిపంజరాలు తదితర అవశేషాలు కూడా బయటపడ్డాయి. రాక్షసగుళ్ళు అంటే చనిపోయిన మానవుల సమాధులు. ఒక్కో సమాధిని సుమారు 20 నుండి 30 గజమెత్తు గుండ్రిటి రాళ్ళను వలయాకారంలో పేర్చి నిర్మించేవారు. అలాంటి గుండ్లను గ్రామస్థులు ఈ మధ్య జేసీబీ, పొక్లెయన్లతో పక్కకు తోసివేసి పొలాలు, చేలను సిద్ధం చేసుకున్నారు. ఒక్కోసారి లోతుగా తవ్వినప్పుడు ఆ సమాధుల్లోని అవశేషాలు బయల్పడేవి. రాక్షసగుళ్ళకు సంబంధించిన గుండ్లను స్థానికులు ఇప్పటికీ రాక్షసగుళ్ళు అనే పిలుస్తున్నారు. డోల్‌మెన్‌లు కూడా ఆ యుగపు మానవ సమాధులే. అయితే ఇలాంటి సమాధుల్లో గజం ఎత్తు, మూడు గజాల వెడల్పైన రాతి సల్పలను వాడుతారు. ఇలాంటివి కొన్నింటిని గ్రామస్థులు తమ ఇళ్ళకు తీసుకెళ్ళారు.

## రెండు వేల ఏళ్ళకు పూర్వపు చరిత్ర:

ఇలాంటి రాక్షసగుళ్ళ (మెగాలిథిక్ బరియల్స్) నాగరికత తొలి తెలంగాణ సామ్రాజ్యం శాతవాహనుల కాలం వరకు... అంటే క్రీ.శ. 3వ శతాబ్దం వరకు కొనసాగింది. ఈ వేపల సింగారం రాక్షసగుళ్ళు అంతకు ముందు ఏ కాలంలో ఆ రూపానికి వచ్చాయో ఖచ్చితంగా చెప్పలేకున్నా అవి సుమారు 3 వేల సంవత్సరాల కిందటివని మాత్రం చెప్పవచ్చు. ఎందుకంటే... తెలంగాణలో (హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆవరణలో) నాలుగు వేల రెండు వందల సంవత్సరాల కిందటి రాక్షసగుళ్ళు కూడా బయటపడ్డాయి.

హైదరాబాదు విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న రాక్షసగుళ్ళలో లభించిన గింజలు మానవుడు వ్యవసాయం చేశాడని, పంటలు పండించాడని, అందుకోసం పనిముట్లు, ఆయుధాలు తయారు చేసుకున్నాడని, వాటిని ఇనుముతోనే చేసుకున్నాడని ఆ సమాధుల్లో దొరికిన ఆయా ఆధారాలను బట్టి తెలుస్తున్నది. పంటలు పండించాడంటే ఆ సమీప ప్రాంతంలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడని అర్థం. నివాస స్థానం ఏర్పరచుకోవాలంటే సమీపంలో సాగు నీరు, తాగు నీరు లభ్యమయ్యే సహజ నీటి వనరు (వాగు, ఏరు) ఉండాలి. ఇలాంటి వాతావరణం వేపల సింగారంలో ఉంది. కాబట్టి అక్కడ మూడు వేల ఏళ్ళ కిందట ఆనాటి ఆది మానవులు స్థిర నివాసం



ఏర్పరచుకున్నారు. అలా అక్కడ ఒక ఊరు ఏర్పడింది. కాబట్టే ఆ ప్రాంతాన్ని ఇప్పటికీ 'ఊరుగుట్ట' అనే పిలుస్తున్నారు.

ఈ ఊరుగుట్ట ప్రాంతంలోని ఊరు-జీవనం అలాగే వందలు, వేల సంవత్సరాల పాటు కొనసాగినట్లు ఆధారాలు కన్పిస్తున్నాయి. ఊరుగుట్ట సమీపంలోనే 'సీతమ్మ పాదాలు' అనే రాతి పాదాల గుర్తులు కన్పిస్తాయి. నిజానికవి జైనులు పూజించిన వారి గురువులు, తీర్థంకరుల పవిత్ర పాదాల చిహ్నాలు. జైనులను వేములు అంటారు. వారు ఉన్న ఊరి పేరు వేముల సింగారం. 'వేముల' కాలగమనంలో వేపుల-వేపల అయ్యి ఇప్పుడు వేపల సింగారం అయ్యింది. ఈ వేములు లేదా జైన మతస్థులు క్రీ.శ. ఆరంభ కాలం నుండి తెలంగాణలో ఉన్నా రాష్ట్రకూట రాజుల కాలంలో... అంటే 8 నుండి 10 శతాబ్దాల మధ్య కాలంలోనే వారి ప్రభావం ఎక్కువగా ఉండేది. వారి కంటే ముందు వేపల సింగారంలో రాక్షసగుళ్ళు ఉండేవి కాబట్టి ఈ జైనులో, మరెవరో ఆ ఊరికి సింగవరం (సింగారం) అనే పేరు పెట్టారు. రాక్షసగుళ్ళు చాలా ఎక్కువగా ఉన్న స్థలాలకు ఇలా సింగవరం, సింగారం, సింగపురం అనే పేర్లు స్థిరపడ్డట్లు చరిత్ర చెప్తుంది. కరీంనగర్ జిల్లాలోని వీణవంక మండలం పరిసరాల్లో రాక్షసగుళ్ళ నాగరికతకు చెందిన ఊర్లు రెండు (సింగపురం, సింగపూర్) ఉండటం గమనించ వలసిన ఒక ఉదాహరణ.

## చారిత్రక పరిసరాలు:

వేపల సింగారం చుట్టుపక్కల జైనుల సమకాలీన చారిత్రక పరిసరాలు కన్పిస్తున్నాయి. జైనుల సమకాలికులు, వారి ప్రత్యర్థి మతస్థులైన బౌద్ధమత సన్యాసులకు సంబంధించిన స్థావరం ఇక్కడికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉన్న బూరుగుగడ్డలో ఉంది. బూరుగుగడ్డ నిజానికి బుద్ధగడ్డ లేదా బుద్ధునిగడ్డ అయ్యుంటుంది. క్రీ.శ. తొలి శతాబ్దాలలో బుద్ధున్ని శయనమూర్తిగా శిల్పించడం ప్రారంభమైంది. బూరుగుగడ్డ ఆలయంలో కూడా శయనమూర్తి శిల్పం ఉంది. ఈ బౌద్ధ, జైన మతాలను కాదని క్రీ.శ.11, 12 శతాబ్దాలలో ఆనాటి (మలి) చాళుక్య రాజుల (కోడూరు/కందూరు చోడుల) కాలంలో హిందూ మతం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. బౌద్ధ, జైన ఆలయాలు హిందూ ఆలయాలుగా, బౌద్ధ, జైన విగ్రహాలు హిందూ విగ్రహాలుగా మార్చబడ్డాయి. ఈ క్రమంలోనే బూరుగుగడ్డ శయన బుద్ధ విగ్రహం శయన విష్ణుమూర్తిగా మార్చబడింది. ఈ బూరుగుగడ్డ చరిత్ర మీద డా॥ కనకరత్నం ఒక పుస్తకం రాసి ప్రచురించారు కూడా (రుద్రమదేవి కాలపు దాన శాసనాల మీద). ఊరగట్టుకు అల్లంత దూరంలో కన్పిస్తున్న కందిబండ మీద ఉన్న శివాలయం కూడా ఈ కాలంలోనే... చాళుక్యుల కాలంలోనే రూపు దిద్దుకుంది. ఇప్పటికీ ఇలాంటి మత పరిణామాల ప్రభావానికి ఈ ప్రాంతం లోబడుతూనే ఉంది. ఇందుకు ఉదాహరణగా గత పది సంవత్సరాల కిందనే... ఈ ఊరగుట్ట మీదనే క్రైస్తవ మతస్థులు కల్వరి శాఖను ప్రారంభించుకుని, అందుకు గుర్తుగా గుట్ట మీద ఒక శిలువను నిలబెట్టి ఆ గుట్టకు 'కల్వరిగుట్ట' అని నామకరణం చేయడాన్ని చూపవచ్చు.

## పాదం సంగతేంటి?

వేపల సింగారంలోని భద్రరెడ్డి పొలంలో కలుపు తీస్తున్నప్పుడు ఒక పాదం శిలాజం దొరికింది. ఆరు అంగుళాల పొడవు, నాలుగు అంగుళాల ఎత్తు ఉన్న ఆ పాదం శిలాజానికి ఆరు వేళ్ళున్నాయి. ఇంకా ఒక చిటికెన వేలు, బొటన వేలు పక్కన ఒక బొడిపె కూడా కన్పిస్తున్నాయి. ఆ పాదం శిలాజాన్ని వెల్లకిలా తిప్పితే పాదం మధ్యలో కాలువలాగా ఖాళీ స్థలం కన్పిస్తున్నది. మొత్తం మీద ఆ పాదం శిలాజం ఆది మానవుని పూర్వ రూపమైన (గొరిల్లా వంటి) జంతువు పాదం నుండి పరిణామం పొందుతున్న దానిలాగా కన్పిస్తుంది. అట్లయితే అది 40 వేల సంవత్సరాలకు పూర్వం మనుగడ సాగించిన హోమో ఎరక్టస్ జాతికి చెందిన ఆది మానవుని పాద శిలాజం అయ్యుండాలి.

ఇలాంటి ఆరు వేళ్ళ పాదాలున్న ఒక శిల్పాన్ని నేను మహబూబ్‌నగర్ జిల్లాలోని గుర్రంపల్లి గ్రామ పొలిమేరల్లో కనుగొన్నాను. ఆ విగ్రహంలో ఒక వీరుడు పూర్తిగా నిల్చున్న మనిషిలాగా కాకుండా కోతి లాగా నిల్చున్నట్లు కన్పిస్తున్నాడు. అతని చేతిలో కత్తి ఉంది. ఆ విగ్రహాన్ని కొందరు దుండగులు ఆలయంలో నుంచి బయటపడేసి ఆలయం కింద గుప్త నిధుల కోసం తవ్వి ఆలయం నామరూపాలు లేకుండా చేశారు. ఆ విగ్రహంలో చెక్కబడిన వీరుడు ఒక పెద్ద గుర్రం వంటి జంతువు మీద సవారీ చేసి రాజ్య రక్షణ చేసేవాడని సమీప గ్రామం గుర్రంపల్లిలోని పురావస్తు ఆధారాల (ఏకశిలా గుర్రం) వల్ల తెలుస్తుంది.

గుర్రంపల్లికి ఆ పేరు ఆ ఊరి శివారులో ఉన్న 9 అడుగుల ఎత్తైన ఏకశిలా గుర్రం విగ్రహం వల్ల వచ్చింది. ఆ విగ్రహం రాముని కాలపుదని ఆ విగ్రహమున్న భూమి యజమాని రాంరెడ్డి చెప్పారు. ఆ విచిత్రమైన విగ్రహం గురించి ఆరా తీయగా రెండు దశాబ్దాల క్రితం భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏ.ఎస్.ఐ) సంచాలకులుగా పని చేసిన ఐరావతం కార్తికేయ శర్మగారి దృష్టికి కూడా పైన పేర్కొన్న వీరుడి వంటి విగ్రహాలు ఒకటి రెండు వచ్చాయని, వాటి పైన పలు విచారణలు జరిపి, భారత సాంప్రదాయ సాహిత్య విశేషాలను పురావస్తు ఆధారాలతో సమన్వయం చేసి అటువంటి విగ్రహాలు రాముడు చంపిన వాలి కొడుకు అంగదునివని, అతని కాళ్ళకు ఆరేసి వేళ్ళు ఉండేవని, అతని వాహనం కూడా ఒంటె వంటి మూపురం కలిగిన గుర్రమని ప్రాథమికంగా నిర్ధారించారని, ఆ మేరకు రికార్డు చేశారని తెలిసింది.

ఈ నేపథ్యంలో వేపల సింగారం పాదం శిలాజం కూడా అంగదుడిదో, అంగదుని వంటి జాతి వీరునిదో అయ్యుంటుందని, అలాంటి ఆది మానవులు 40 వేల సంవత్సరాలకు పూర్వం తెలంగాణ గడ్డ మీద జీవనం సాగించేవారని, ఆ కాలానికి సంబంధించిన రంగు చిత్రాలు (పెయింటింగ్స్) తెలంగాణలో పలుచోట్ల వెలుగు చూశాయి కాబట్టి ఊరగుట్ట గుహల్లో కూడా కన్పించవచ్చని చెప్పవచ్చు.

పై నేపథ్యంలో ప్రభుత్వం ఈ క్రింది పనులు చేయవలసి ఉంది.

1. ఇటీవల నల్గొండ జిల్లా వేపల సింగారంలో లభ్యమైన పాదం శిలాజాన్ని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థకు (ఎన్.జి.ఆర్.ఐ) గాని, ఇతర అధునాతన పరిశోధన సంస్థకు గాని పంపించి దాని చారిత్రక వయసును నిర్ధారించాలి.
2. ఊరగుట్ట మీద, పరిసరాల్లో రాష్ట్ర పురావస్తు శాఖ నిపుణులు ఉపరితలంలో సమగ్ర పరిశోధన చేసి ఏమైనా రాక్ పెయింటింగ్స్, రాక్షసగుళ్ళు, కుండ పెంకులు, ప్రీ-హిస్టారిక్ పనిముట్లు లభ్యమైతే వాటిని సేకరించి, భద్రపరిచి,

వాటి ఇన్వెంటరీ తయారు చేయాలి.

3. ఇప్పుడున్న పొలాలు పండిన తరువాత మరో పంట వేయక ముందు పురావస్తు అధికారులు వచ్చి ఆయా పొలాల యజమానులు, స్థానిక చరిత్ర పై అవగాహన ఉన్న ప్రజల సహాయంతో ఆ పొలాల్లో ఉండిపోయిన రాక్షసగుళ్ళు తదితర పురావస్తు ఆనవాళ్ళను, వాటి విస్తీర్ణాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో సమగ్రంగా తవ్వకాలు చేపట్టాలి.
4. తవ్వకాల్లో చాలా పురావస్తు ఆధారాలు లభ్యమయ్యే అవకాశం ఉంటే ఆ స్థలం యజమానులకు నష్ట పరిహారం ఇచ్చి స్థలం సేకరించి తవ్వకాలు జరపాలి.
5. తవ్వకాల్లో చాలా రాక్షసగుళ్ళు లభ్యమైతే వాటిని అక్కడే కంచె వేసి పరిరక్షించి పరిశోధకులకు, పర్యాటకులకు ప్రదర్శనకు పెట్టాలి.
6. తవ్వకాల్లో ఎక్కువ సంఖ్యలో పురావస్తు ఆధారాలు లభ్యమైతే అక్కడే సైట్ మ్యూజియం నిర్మించి దానిలో వాటిని భద్రపరచాలి. తక్కువ సంఖ్యలో లభ్యమైతే వాటిని నల్గొండ జిల్లాలోని పానగల్ పురావస్తు మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టాలి.
7. పై చారిత్రక ఆధారాలను సమన్వయం చేస్తూ పురావస్తు శాఖ ఒక మోనోగ్రాఫ్ (పుస్తకాన్ని) ప్రచురించాలి.

*– నమస్తే తెలంగాణ దినపత్రిక, 20–10–2014*

# 8

# మల్లూరు గుట్టపై బృహత్‌శిలా ఉద్యానవనం

బృహత్ శిలాయుగంనాటి అవశేషాలు భారతదేశంలో చాలా చోట్ల కనిపించినా, ఇటువంటి వాటికి ప్రత్యేకంగా పేరు తెచ్చుకున్నది తెలంగాణా / దక్కను ప్రాంతం. తెలంగాణా నలుమూలలా బృహత్ శిలా సమాధులు వేలాదిగా ఉన్నా సంఖ్యలోగానీ, ఆకర్షణలోగానీ మల్లూరు తర్వాతే వాటిని గురించి చెప్పుకోవాలి.

తెలంగాణలో అత్యంత చూడచక్కని పల్లెల్లో 'మల్లూరు' ఒకటి. దాని చుట్టూ ఉన్న గుట్టలమీదనుంచి చూస్తే ఈశాన్యంగా ప్రవహించే గోదావరి మనసును ఉల్లాసభరితం చేస్తుంది. ఇప్పటిదాకా ఇది చారిత్రక లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికే ప్రసిద్ధి. కానీ మల్లూరు గుట్టలమీద ఉన్న కోట బయటి ప్రహరీగోడ వెంబడి కనిపించే



బృహత్‌శిలా సమాధి

వందలాది బృహత్ శిలా సమాధులపైకి ఎవరి దృష్టీ మళ్ళలేదు. గుడి పూజారిని అడిగితే 456 వేల రాక్షస గుళ్ళు ఉన్నాయంటాడు. 456 వేలు కాకపోయినా 456 అయితే ఉండి ఉంటాయి. ఇంత పెద్ద సంఖ్యలో బృహత్ సమాధులు, అదీ ఒకే చోట కనిపించే అత్యంత అరుదైన ప్రదేశం మల్లూరు.

## బృహత్ శిలా నిర్మాణాలు

చరిత్ర పూర్వ యుగానికి చెందిన ఇటువంటి ప్రాంతాలు వరంగల్ జిల్లా ఏటూరునాగారం చుట్టుపక్కల ఉండే అవకాశముందన్న సమాచారం ఓ పదేళ్ళ క్రితం నాకందింది. స్థానికుల సాయంతో ఇక్కడ అన్వేషణ చేద్దామనుకుంటున్న సమయంలో కొన్నాళ్ళ క్రితం పసుల బుచ్చయ్య అనే వ్యక్తి వచ్చి నన్ను కలిశాడు. ఆయన 'నాయకపు గిరిజన' తెగకు చెందినవాడు. తన తెగ పుట్టుపూర్వోత్తరాలు వెలికితీయాలని ఉందని చెప్పాడు. మల్లూరు గుడిని ఆయన తెగకు చెందినవారు కట్టారని, దాని మంచీచెడూ నిన్న మొన్నటిదాకా వారే చూసేవారని చెప్పాడు. తన నాయకపు తెగకు చెందిన మరో ఐదారు మందిని మాతో బయలుదేరాడానికి సిద్ధం చేశాడు. 2014 డిసెంబరు 26న వాడిగూడెం – రాజుపేట వైపు నుండి మల్లూరు గుట్ట ఎక్కాం.

గుట్ట పై భాగం భూమట్టానికి సుమారు వేయి అడుగుల ఎత్తున ఉంది. కింది నుంచి మనకు కనిపించినట్లుగా గుట్టపైకి నేరుగా ఎక్కడం కుదిరేది కాదనిపించింది. మాతో వచ్చిన మిత్రులు సాప్లం సత్తయ్య, ఆక తిరుపతి, శెగ్గం పుల్లయ్యలు మాకు గుడ్డెలుగుగుట్ట, కోటగుట్టల మధ్య నుంచి పైకి దారి చూపారు. నిజం చెప్పాలంటే మేం ఒక కచ్చా తోవన వెళ్ళాం. బహుశా 1950ల్లో ఈ గుట్టలున్న అడవినుంచి వెదురు బొంగులను కాగితం మిల్లులకు లారీల ద్వారా చేరవేయడానికి చేసిన దారి అది.

గుట్టకింది భాగమయిన వాడిగూడెం కుంట నుంచి 10 నిమిషాలు నడిచామో లేదో కోటగోడల వెలుపల బృహత్ శిలా సమాధులు ఎక్కడపడితే అక్కడ వెదజల్లినట్లుగా చాలా కనిపించాయి. ఒక్కచోటనే ఇన్నా? నోటంట మాట రాలేదు. అక్కడ 72 సమాధులున్నట్లు పుల్లయ్య చెప్పాడు. అవి కోట నిర్మాణం పనులు జరిగేటప్పుడు మరణించినవారివని చెప్పాడు.

పుల్లయ్య, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి గుళ్ళో వంశపారంపర్యంగా పనిచేస్తున్న చిరు ఉద్యోగి. ఈ 72 సంఖ్యకూ ఆయన తెగకూ ఒక విశేష సంబంధం ఉంది. 13, 14 శతాబ్దాలనాటి కాకతీయ సామ్రాజ్యంలో 72 మంది పద్మనాయకులు




ఒక కోట నుండి మరో కోటలోకి

(ఆయన తెగ) మాండలిక అధికారులుగా ఉండేవారని చరిత్ర చెబుతున్నది. వారు తమ తెగకు చెందినవారని, వారి సంఖ్యను సూచించే సంఖ్యలోనే ఇక్కడ సమాధులున్నాయని పుల్లయ్య భావన. కాని నిజానికి పుల్లయ్య చెప్పినదానికంటే ఎక్కువ సంఖ్యలో సమాధులున్నాయి అక్కడ. లారీలకోసం కచ్చాతోవ వేసేటప్పుడు చాలా సమాధులు ధ్వంసమయ్యాయి.

## బృహత్ శిలా నిర్మాణాల రూపం

పొలాల్లో కాపలాకు, విశ్రమించడానికి రైతులు వేసుకునే మంచెల అంత ఎత్తులో కాకుండా వాటి ఎత్తు తగ్గిస్తే ఎలా ఉంటాయో ఈ బృహత్ శిలా నిర్మాణాలు అలా కనిపిస్తాయి. ఇవి రకరకాల సైజుల్లో ఉన్నాయి. ఎక్కువభాగం అందాజాగా 2 మీ. వెడల్పు, 3 మీ. పొడవుతో, ఒక మీటర్ ఎత్తులో ఉన్నాయి. 3 గోడలుగా 3 వైపులనుంచి పెట్టిన రాళ్ళపై మూతగా పెట్టిన రాయి కొలత సుమారు 3.5 × 2.5 మీటర్లున్నది. ఒక్కో శిల ఒక్కో వైపు గోడగా ఉంది. ఆ మంచెలాంటి నిర్మాణానికి ముందు భాగం నుండి లోపలికి వెళ్ళడానికి ఒకటిన్నర అడుగుల దూరం దారి విడిచి రెండు శిలలను ఒకదాని సూటిగా మరొకదాన్ని నిలబెట్టారు. ఇవన్నీ ఏకశిలలే.

ప్రతి కట్టడం లోపల నీటిని నిల్వచేయడానికి సుమారు 2 మీ. × 1/4 మీ. × 1/4 మీ. కొలతలతో తొట్టెలాంటి నిర్మాణాలున్నాయి. వీటిని చాలామటుకు సిమెంటు రంగులో ఉన్న గట్టి రాయిని తొలిచి ఏర్పాటు చేశారు. ఈ రకం రాళ్ళు ఇక్కడి పరిసరాల్లో కనిపించకపోవడంతో వీటిని చాలా దూరం నుంచి తెచ్చి ఉండవచ్చనిపించింది. కొన్ని తొట్టెలను ఒకదాని పైన మరొకటి చెక్కినారు. కొన్ని చోట్ల నేలమీద పరిచిన శిలల్లోనే తొట్టెలు తొలిచారు. ఇప్పటికీ మన పూర్వీకుల సమాధులవద్ద ఆకుచిప్పల్లో నీళ్ళుంచే ఆచారం ఉంది కదా! చనిపోయిన వ్యక్తి బతికున్నకాలంలో మద్యపాన ప్రియుడయితే ఆ చిప్పల్లో సారా కూడా పోస్తుంటారు.

బృహత్ శిలా నిర్మాణాల్లో ఆశ్చర్యకరంగా నేలమీద రోలు గుంటలు కూడా కనిపించాయి. చనిపోయిన వ్యక్తి ఆహార ధాన్యాలను దంచుకోవడానికి చేసిన ఏర్పాటు ఇది. బృహత్ శిలా యుగంలో ఎవరయినా చనిపోతే, వారు బతికున్నప్పుడు ఉపయోగించిన వంట పాత్రలు, సామాన్లు, ఆయుధాలు వారి సమాధిలో ఉంచడం ఆచారంగా ఉండేది. ఇది వారి ఆత్మలకోసం చేసిన ఏర్పాటు (పునర్జన్మను నమ్మేవారు కనుక).

ఈ బృహత్ శిలా నిర్మాణానికి చుట్టూ కేంద్ర నిర్మాణం నుంచి 5 మీటర్ల దూరం వరకు నున్నగా మలిచిన గజం ఎత్తు శిలలను వలయాకారంలో నిలబెట్టారు. సమాధి నిర్మాణానికి, దాని చుట్టూ వలయాకారంలో నిలిపిన శిలలకు మధ్య ఖాళీ ప్రదేశాన్ని రాళ్ళతో లేదా ప్రత్యేకంగా తయారుచేసిన మెత్తటి బురదలాంటి పదార్థంతో లేదా మృదువైన శిలలతో నింపారు. మొత్తంగా చెప్పాలంటే – ఇదంతా చనిపోయిన వ్యక్తికి శాశ్వత నివాసంగా చేసిన ఏర్పాటు. ఎంత శాశ్వతంగా అంటే కనీసం 2500 ఏళ్ళ నుండి ప్రకృతి బీభత్సాలకు తట్టుకుని ఈ నిర్మాణ సంస్కృతి క్షేమంగా నిలబడింది.

## కాలక్రమం

ఇటీవలి కాలం వరకు భారత్‌లో ఇనుప యుగం అంటే క్రీ.పూ.1000కి, క్రీ.శ.200 సంవత్సరాలకు మధ్యకాలమని చరిత్రకారులు లెక్కించేవారు. అయితే హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఉన్న బృహత్ శిలా నిర్మాణాలపై ప్రొఫెసర్ కె.పి.రావు నాయకత్వంలో జరిపిన పరిశోధనల్లో బృహత్ శిలా సమాధుల సంస్కృతి తెలంగాణలో క్రీ.పూ.2 వేల ఏళ్ళనాటి నుంచే ఉందని తేలింది. అయితే మల్లూరు నిర్మాణాల్లో ఉపయోగించిన శిలల సైజు, ప్రాచీనతను చూస్తే, అవి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో లభించిన వాటికంటే పూర్వ కాలానికి చెందినవిగా

తోస్తున్నది. వీటిపై ప్రయోగశాలల్లో పరీక్షలు జరిపేవరకైనా మల్లూరు నిర్మాణాలు కనీసం 4200 ఏళ్ళనాటివని అనుకోవచ్చు. సమాధులలోపలి భాగంలో దొరికిన కుండ పెంకులు చూస్తే మాత్రం మల్లూరు బృహత్ శిలా యుగ సంస్కృతి దాదాపు 3 వేల ఏళ్ళనాటిదనిపిస్తుంది.

మల్లూరు కోటగోడలు ఉత్తర-దక్షిణ దిశల్లో రెండు కి.మీ. మేర విస్తరించాయి. కోట ప్రహరీ గోడ ద్వారం ఈశాన్యంలో ఉంది. ద్వార బంధం పై కప్పు (లింటెల్)ను రెండు దశాబ్దాల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కూలగొట్టారట. దీనివల్ల ద్వార బంధం మీద గానీ, కోట గోడల మీద గానీ రాజ చిహ్నలేవీ లేకుండా పోయి అవి ఏ కాలంలో నిర్మించబడ్డాయో తెలియరాలేదు. కోట పడమటి వైపు లోయ చాలా ఏటవాలుగా కిందికి దిగిపోయి శత్రువులెవరూ పైకి ఎక్కి కోట గోడలకు చేరుకోలేకుండా ఉంది. అయినా ఏటవాలు అంత ఎక్కువగా లేనిచోట పైకి ఎగబ్రాకడానికి వీలు లేకుండా గోడలు కట్టేశారు.

దీర్ఘ చతురస్రాకారంగా ఉండే మల్లూరు కోట మూడు భాగాలుగా ఉంది. కాబట్టి స్థానికులు వీటిని "మూడు కోటలు" అంటారు. వీటిలో ఒక భాగం నుంచి మరొక భాగానికి పోవడానికి రెండడుగుల వెడల్పు ఉండే ద్వారాలున్నాయి. ఈశాన్య దిశగా ఉన్న కోట ద్వారాన్ని దాటి మరో కోటలోకి పోతున్నకొద్దీ, దాటి వచ్చిన



బృహత్‌శిలా సమాధి చుట్టూ శిలావరణం

దానికంటే తర్వాతది పెద్దదిగా కనిపిస్తుంది. ఉత్తరపు కోట భాగం రాజు అంతఃపుర పరివారం, కులీనుల కోసం కట్టినదిగా కన్పించగా, మధ్యలో ఉండే కోట సిపాయిలు, పదాతి దళాలకోసం, దక్షిణపు కోట భాగం సాధారణ పౌరులకోసం ఉద్దేశించినట్లు కనిపిస్తుంది. ఉత్తర భాగంలో దీర్ఘచతురస్రాకారంగా ఉండే బావులున్నాయి. ఇవి వేసవిలో నీటికోసం సిద్ధం చేసినవి అయి ఉంటాయి. ఉత్తరపు కోటగోడకు ఇరువైపుల వేదికలాంటి గద్దెలున్నాయి. అవి రాజుకానీ, దళాధిపతులుకానీ వాటి మీద నిలబడి ఆదేశాలు జారీ చేయడానికి ఉద్దేశించినవి అయి ఉండవచ్చు లేదా ఏదేని ఇతర నిర్మాణంలో భాగం కావచ్చు.

కోటగోడ వెలుపల పడమటి భాగంలో అసంఖ్యాకంగా ఉన్న బృహత్ శిలా నిర్మాణాలు ఉత్తర గోడ దగ్గర ఉన్నవాటికంటే ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ సమాధులకు వాడిన రాతి పలకలు అన్నీ అక్కడ చుట్టుపక్కల దొరినవే.

కోట పడమటిగోడకు కొంత దూరంలో ఆనాటి మానవులు ఏర్పాటు చేసుకున్నవి రెండు కుంటలున్నాయి. అయితే అవి ఇప్పుడు నీళ్ళు లేక ఎండిపోయి కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో నిండుతాయేమో! చింత, ఉసిరి, శతావరి మొదలైన చెట్లు ఆ కుంటలచుట్టూ దట్టంగా ఉన్నాయి. ఇవన్నీ ఒకప్పుడు అక్కడ ప్రజలు నివసించినట్లు తెలిపే గట్టి ఆధారాలు.

చివరగా అయినా ముఖ్యంగా చెప్పుకోవాల్సిన దృశ్యం – మల్లూరు కోట ఎక్కి ఈశాన్యం దిక్కు చూస్తే... రెండు కి.మీ. మేర వ్యాపించిన గులాబీ రంగు ఇసుక తిన్నెల మధ్యనుంచి నీలం రంగు పులుముకుని గుంభనంగా ప్రవహించే గోదావరి, పిల్లగాలులకు తలలూపుతూ దాన్ని చుట్టుముట్టిన పంటపొలాలు – కళ్ళకు విందు చేస్తూ కనిపిస్తాయి.

ఈ మల్లూరు బృహత్ శిలా నిర్మాణాలు, ఇక్కడి కోట అరుదయినవి, అపురూపమైనవి. ఇవి మన వారసత్వ సంపద, మన చారిత్రక, సాంస్కృతిక పరిణామాలకు నిదర్శనాలు. తర్వాతి తరాల కోసం వీటిని పునరుజ్జీవింపచేయాలి, మరింత సజీవంగా మన పిల్లలకు అందించాలి. భారత పురావస్తుశాఖ, తెలంగాణ ప్రభుత్వం గట్టిగా తలచుకుంటే ఈ ప్రాంతాన్ని అద్భుతమైన బృహత్ శిలా ఉద్యానవనంగా తీర్చిదిద్దవచ్చు. వాడిగూడెం వైపున్న మల్లూరు గుట్ట పాదంలో కన్పించే చెరువులు, జలపాతం, మద్ది రామక్క, ఎర్రమ్మ దేవతలు ఆసక్తికరమైన అదనపు ఆకర్షణలు.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 5-02-2015, 19-02-2015*

# 9

# బమ్మెరలో పోతనకు ముందటి చరిత్ర

తెలుగు సాహిత్య క్షేత్రాన్ని వ్యవసాయం చేసినవారిలో అగ్రశ్రేణి కవి పండితులు బమ్మెర పోతన. ఆయన ఇంటిపేరైన బమ్మెర గ్రామం వరంగల్ జిల్లాలో జనగామ దగ్గరలో ఉంది. ఆ గ్రామ చరిత్రను పోతన కాలమైన 15వ శతాబ్దం నుండే పరిగణిస్తూ రావడం పరిపాటి అయ్యింది. కాని పోతన మీద ప్రేమతో నేను ఇటీవల బమ్మెరను దర్శించినప్పుడు అక్కడ నాకు పోతన కంటే రెండు వేల ఏళ్ళ ముందటి చారిత్రక ఆనవాళ్ళు కనిపించాయి. తెలంగాణ ప్రభుత్వం బమ్మెరలో పోతన స్మారక




నర్సిం బావి

మ్యూజియాన్ని నెలకొల్పాలన్న సంకల్పంతో ఉన్న నేపథ్యంలో ఈ మ్యూజియమ్స్ డే (సంగ్రహాలయాల దినోత్సవం, 18.05.2015) సందర్భంగా బమ్మెరలో పోతన స్మారకాలతో పాటు కాపాడవలసిన ఆయన పూర్వకాలపు చారిత్రక ఆనవాళ్ళను గూర్చి తెలియపరుస్తున్నాను.

బమ్మెరలో పోతన సాగుకు ఉపయోగించినవిగా చెప్తున్న రెండు బావులున్నాయి. ఒకదాని పేరు నర్సింబావి, రెండవదాని పేరు కురుంబావి. కురుంబావి పోతన తల్లి పేరుతో ప్రసిద్ధమైన లక్కమాంబ వాగు ఒడ్డున 'పోతన మాన్యం' సరిహద్దున ఉంది. ఇక నర్సిం బావి గ్రామాన్ని ఆనుకొనే ఉంది. ఇది చాలా పెద్దబావి. ఈ బావికి, వీరభద్రాలయానికి, మల్లన్న గుడికి మధ్యనున్న ఖాళీ స్థలంలో 'మెన్హిర్‌లు' (వీరుల స్మారక శిలలు) ఉన్నాయి. సుమారు 2 అడుగుల వెడల్పు, 10 అడుగుల పొడవుతో ఉండే రాళ్ళను రెండు, మూడు వేల ఏళ్ళ క్రితం మనుగడ సాగించిన బృహత్ శిలా యుగపు మానవులు తమ సమాధుల మీద గాని, ముందు గాని నిలబెట్టారు. అలాంటి స్మారక సమాధి శిలలను ఆంగ్లంలో మెన్‌హిర్స్ అంటారు.

ఇలాంటి బృహత్ శిలా యుగ సంస్కృతి లేదా మెన్హిర్‌లు ఉన్న ప్రాంతాలకు తెలంగాణలో చారిత్రక యుగంలో నరసింహుల ప్రాంతాలు... నరసింహులపల్లె, నరసింహ పేట, నర్సింగాపూర్... ఇలాంటి పేర్లు వచ్చాయి. అందుక్కారణమేమిటంటే, అంతటి బృహత్ శిలలతో నిర్మాణాలు చేపట్టిన 'నరు'లు 'సింహ'బలులు అని, అలాంటి వారు ఒకప్పుడు ఇక్కడే నివసించారని వారి నుంచి స్ఫూర్తి పొందేందుకు అలాంటి ప్రదేశాల పేర్లలో 'నరసింహ' అనే పదాన్ని పెట్టుకునేవారు. ఇదే విధంగా ఈ బమ్మెరలోని మెన్హిర్‌ల పక్కనున్న బావికి 'నరసింహ బావి' అని పేరు పెట్టారు.

ఈ నరసింహ బావిని నిజానికి ఒక గుట్టబోరుకున్న గుహను కలుపుకొని నిర్మించారు. ఈ గుహలో ఒకప్పుడు ఇక్కడ మెన్హిర్‌లు నిర్మించిన ప్రజలు తమ ఆరాధ్య దేవతల బొమ్మలను చిత్రించుకున్నారని పక్క గ్రామమైన గూడూరులో దొరికిన క్రీ.శ. 1124 నాటి శాసనాన్ని బట్టి అర్థమవుతుంది. ఆ శాసనంలో విరియాల మల్లుడు అనే సామంత మండలాధికారి ఇక్కడ మల్లేశ్వరాలయాన్ని కట్టించి, దాని నిర్వహణ కోసం 'బొమ్మరిగె' అనే గ్రామాన్ని దానం చేశాడని రాసి ఉంది. ఆనాటి బొమ్మరిగె పోతన కాలం నాటికి బమ్మెర అయ్యింది. స్థానికులు ఇప్పటికీ బొమ్మర అనే పిలుస్తున్నారు. ఈ బొమ్మరిగె లేదా బొమ్మర పదాల్లో విన్పిస్తున్న 'బొమ్మ' శబ్దం మెన్హిర్‌ల కాలపు మానవులు ఈ నర్సిం బావి కింది భాగంలో ఉన్న గుహలో సుమారు రెండున్నర వేల ఏళ్ళ క్రితం చిత్రించిన బొమ్మల ఉనికిని సూచిస్తాయి.




మెన్హిర్‌లు

ఇక మల్లేశ్వరాలయంగా శాసనంలో పేర్కొనబడిన మల్లన్నగుడి ఈ నర్సింబావి పక్కనే శిథిలావస్థలో ఉంది. ఇక పోతన తొలి కావ్యం 'వీరభద్ర విజయం' రచనకు స్ఫూర్తినిచ్చిన వీరభద్రాలయం కూడా మెన్హిర్‌ల పక్కనే శిథిల సౌంద్యర్యంతో వెలుగొందు తున్నది. దాని ఆవరణలో పోతన రాజసన్మానం పొందుతున్న అరుదైన శిల్పం కూడా ఉంది. పురావస్తు శాఖ ఈ పోతన స్మారకాలతో పాటు అంతకు ముందటి కాలపు మెన్హిర్‌లను, నర్సింబావిలోని బొమ్మలను (ఉంటే) పరిరక్షించి ప్రజల ముందు ప్రదర్శనకు పెట్టే చర్యలు తీసుకుంటే మన చరిత్ర ప్రాచీనత పట్ల ప్రేమను పెంచుకున్నవాళ్ళమవుతాం.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 18-05-2015*

10

# తిమ్మాయిపల్లిలో కొత్తరాతి యుగం నుండి కుబేరాలయం దాకా

ఈ మధ్య నేను పాలమూరు జిల్లా వంగూరు మండలం, తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలో ఉన్న చెన్నయవొలం గుట్టల్లో నెలకొన్న ఒక కోవెలలో ఉన్న 17వ శతాబ్దం నాటి శాసనాన్ని వెలికితీయడం జరిగింది. ఈ శాసన ప్రదేశం సమీపంలోనే తిమ్మినోని చెరువుంది. శాసనంలో పేర్కొనబడ్డ నరహరి పేరు మీద ఒక చెరువుంది. వీటి ఆధారంగా రాజుల ఉనికి ఈ ప్రాంతంలో ఉండి ఉండాలనే అనుమానంతో స్థానికుడు శ్రీ దొడ్డి రవితో విచారణ చేస్తే ఆయన ఇక్కడ కోటగట్టు అనే ప్రాంతముందని చెప్పాడు. 'కోట' పేరు వినగానే నా అనుమానం నిజమవుతుందేమోనని ఆతృతగా



కొత్తరాతి యుగపు గొడ్డలి




చరిత్ర పూర్వయుగపు కుండ పెంకులు

వెంటనే (26.4.2015 నాడు) కోటగట్టు (ఒక గుట్ట) ఎక్కి చూశాను. దురదృష్టవశాత్తూ అక్కడ కోట లేదు. ఎందుకంటే, అది కోటగట్టు కాదు, దాని పక్కనున్న సారగట్టు. పొరపాటు జరిగింది మంచికే అయ్యింది. ఎందుకంటే, ఈ సారగట్టు పైనున్న గుహల్లో అదృష్టవశాత్తు నవీన శిలాయుగం (కొత్త రాతి యుగం) నాటి పురావస్తు ఆధారాలు బోలెడన్ని లభించాయి. కోటగట్టు పైననేమో కొత్త రాతి యుగం తరువాత యుగమైన బృహత్ శిలా యుగానికి చెందిన సమాధి కట్టడాలున్నాయట.

మానవుడు ఆయుధాలకు వాడిన రాళ్ళు, లోహాలను బట్టి చరిత్రకారులు ఆయా యుగాలకు పేర్లు పెట్టారు. పాతరాతి యుగపు ఆయుధాలు పెద్దగా, మొరటుగా ఉండేవి. మధ్యరాతి యుగపు ఆయుధాలు చిన్నగా ఉంటాయి. కాబట్టి ఆ యుగాన్ని సూక్ష్మరాతి యుగం అని కూడా పిలుస్తారు. ఇక నవీన శిలాయుగం (కొత్త రాతి యుగం) నాటికి మానవులు ఆయుధాలను నునుపుగా, కొచ్చెగా తయారు చేయడం నేర్చుకున్నారు. అలాంటి ఆయుధాలతో సాగు చేయడం నేర్చుకున్నారు. సాగు వల్ల పంటలు పండే వరకు పంటపొలం దగ్గరే ఉండాలి కాబట్టి, మానవ జీవన గమనంలో మొట్టమొదటిసారిగా స్థిర నివాసం ఏర్పడింది. అప్పుడప్పుడే మానవులు గుహల్లో నుండి మైదాన ప్రాంతాలకు వస్తున్నారు. కాబట్టి, వారు వాడిన ఆయుధాలు కొన్ని గుహల్లో కూడా లభిస్తున్నాయి. అలాంటి కొత్త రాతి యుగపు రాతి గొడ్డలి ఒకటి

తిమ్మాయిపల్లి శివారులోని కోటగట్టు పక్కనున్న సారగట్టు గుహలో లభించింది.


నల్లసరపు రాయితో చేసిన నున్నని గొడ్డలి లభించిన గుహలో చాలా కుండ పెంకులున్నాయి. కొత్తరాతి యుగపు పనిముట్లు లభించిన గుహలోనే ఈ కుండపెంకులూ ఉన్నాయి. కాబట్టి, వాటిని కూడా కొత్త రాతి యుగానికి చెందినవిగానే భావించాల్సి ఉంటుంది – శాస్త్రీయ పరిశోధన జరిగే వరకైనా. ఇదే గుహలో ఒక ఎరుపు రజనునిచ్చే రాయి కూడా దొరికింది. ఆ రాయిని మరో రాయి మీద రాసినకొద్దీ ఎరుపు రంగు పొడి రాలుతూనే ఉంది. గుహ పైకప్పు రాళ్ళు కూలిపోయి పక్కనే ఎరుపు చారలతో కన్పిస్తున్నాయి. కాబట్టి, ఆ గుహలో ఒకప్పుడు ఎరుపు రంగు రాయిని ఉపయోగించి ఎరుపు రంగు బొమ్మలు వేశారనుకోవాలి. అలాంటి రంగు బొమ్మల గుహనే కొత్తరాతి యుగ ప్రజలకు దేవాలయం. ఆ దేవాలయాన్ని వేల ఏళ్ళ క్రితం ప్రజలు మెట్లెక్కి చేరుకునేవారనడానికి నిదర్శనంగా ఆ గుహలో ఒక మెట్లు తొలచిన రాయి కూడా కన్పిస్తూ ఉంది. ఇప్పుడు మాత్రం ఈ దేవాలయ గుహను అత్యంత సాహసం చేసి మాత్రమే చేరుకోగలం. గుహ పైనున్న రంధ్రంలో నుంచి దూరి గాని, గుహ ముందున్న ఒక పిడికెడు మందమున్న చెట్టు కాండాన్ని ఎక్కిగాని ఈ గుహాలయాన్ని చేరుకోవాల్సి ఉంటుంది. గుట్ట పైనున్న తేనెతెట్టల బెడదనూ దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఈ గుహాలయం పైననే మరో గుహాలయం ఉంది. అది ఎంత కష్టపడ్డా చేరలేనంతగా కూలిపోయి ఉంది.



ఈ గుహాలయానికి పైన ఉత్తరం వైపున గుండ్ల సముదాయాలున్నాయి. ఒక గుహ చీలిక మరిన్ని గుహావాసాలకు దారి తీస్తున్నది. ఆ గుహావాసాల గుండా ముందుకు సాగిపోతే గుట్ట శిఖరాగ్రానికి చేరుకోవచ్చు. అక్కడ కొత్త రాతి యుగపు మానవులు ఆయుధాలను నునుపుగా, కొచ్చెగా చేసుకోవడానికి నూరుకున్న నునుపైన గుంటలున్నాయి. గుహావాసాలు చీకటిగా ఉండటం వల్ల ఎలాంటి ఆధారాలు సేకరించలేక పోయినా గుహ చీలికలో మాత్రం కడవలు, కుండలు, గురుగులు, సొంగ కుండలు మొదలుకొని అనేక రకాల పెంకులు లభిస్తున్నాయి. నవీన శిలా యుగంలో కుమ్మరి చక్రం కనుక్కొన్నారనడానికి ఈ పెంకులు నిదర్శనం. పూర్వం ఇవే గుహల్లో స్థానికులు కొందరు (ఇప్పుడు ముసలివాళ్ళు) రోళ్ళు, రోకలిబండలు, ఊకను కూడా చూశామని చెప్పారు. ఏదేమైనా ఈ తిమ్మాయిపల్లి సారగట్టు గుహల్లో నవీన శిలా యుగంలో మానవ జీవనం మనుగడ సాగించింది నిజం. దాన్ని శాస్త్రీయంగా పురావస్తు శాఖ వెలికి తీయవలసి ఉంది.

## రెండు వేల ఏళ్ళ కిందటి గాజు పరిశ్రమ

'ఒక యువతి ఊహా లోకంలో విహరిస్తూ తన ప్రియుడ్ని పడక మంచం మీదికి రప్పించుకుని, కళ్ళు మూసుకుని, తన రెండు చేతులతో ప్రియుడ్ని వాటేసుకుంటున్నట్లుగా తనను తానే మైమరచి వాటేసుకున్నప్పుడు ఆమె చేతుల



బృహత్‌శిలా సమాధులు

గాజులు సన్నని శబ్దంతో లయబద్ధంగా తమకంగా కదిలాయి' అని తెలిపే ఒక కవిత రెండు వేల ఏళ్ళ నాటి తెలంగాణ తొలి కావ్యం 'గాథా సప్తశతి' రెండవ అధ్యాయం 33వ గాథ (కవిత)లో ఉంది. ఇక్కడ చెప్పదల్చుకున్న విషయమేంటంటే... అందమైన గాజులను తయారు చేసే పరిశ్రమ తెలంగాణలో రెండు వేల సంవత్సరాలకు ముందే మనుగడలో ఉందనేది. అందుకు నిదర్శనమైన ఆధారాలు 2015వ సంవత్సరపు శివరాత్రినాడు (ఫిబ్రవరి 17) నాకు మహబూబ్‌నగర్ జిల్లాలో కనిపించాయి.

తెలంగాణలో ఇప్పటికే కోటిలింగాల (కరీంనగర్ జిల్లా), కొండాపూర్ (మెదక్ జిల్లా), గాజులబండ (నల్గొండ జిల్లా) తదితర ప్రాంతాల్లో గాజులు, గాజు పూసలు రెండు వేల ఏళ్ళ క్రితపువి దొరికాయి. కాని ఇంతవరకు గాజు పరిశ్రమ తాలూకు ఆనవాళ్ళు వెలుగు చూడలేదు. గాజులబండ ప్రాంతంలో గాజు పరిశ్రమ ఉండేదని ఆ గ్రామం పేరే సూచిస్తున్నా అక్కడ కూడా ఇప్పటివరకు పురావస్తు శాఖ గాని, పరిశోధకులు గాని గాజు పరిశ్రమ ఆధారాలను వెలికి తీయలేదు. ఈ నేపథ్యంలో నేను చూసి వెలుగులోకి తెస్తున్న మహబూబ్ నగర్ జిల్లా వంగూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని 'గాజులబట్టి' ప్రాంతమే ఇప్పటి వరకు వెలుగు



*గాజు పరిశ్రమ ఆనవాళ్ళు*




చూసిన మొట్టమొదటి ప్రాచీన తెలంగాణ గాజుల పరిశ్రమ అవుతుంది.

తిమ్మాయిపల్లి పొలిమేరల్లో ఉన్న ఈ గాజులబట్టి ప్రాంతానికి హైదరాబాద్ – శ్రీశైలం రహదారిలో కల్వకుర్తి తర్వాత జూపల్లి దాటి చేరుకోవచ్చు. తిమ్మాయిపల్లి ఊరును, రోడ్డును, కోట మైసమ్మ గుడిని ఆనుకొనే ఉన్న ఈ గాజులబట్టి ఒక స్థూపంలా ఉంది. దాని చుట్టూ ఆరు ఎకరాల మేర గాజులు, గాజుల పూసలు, రకరకాల రంగుల రాళ్ళు, ఇతరత్రా ముడి పదార్థాలు, గాజు చిట్టేలు, గాజులబట్టీ మూసలు, బట్టీకి సంబంధించిన పునాదులు, పునాదిరాళ్ళు, గాజును కరిగించిన కుండలు (పెంకులు), గురుగులు, గిలాసలు, గాజుతో పోత పోయబడిన డిజైన్ల కుండ పెంకలు... ఇలా ఎన్నో గాజు పరిశ్రమ ఆధారాలు అంగుళం అంగుళం స్థలంలో కన్పిస్తున్నాయి. మన అదృష్టం కొద్దీ ఇంకా ఆ స్థలాన్ని ఎవరూ చేనుగా మలచకపోవడం వల్ల ఈ పరిశ్రమ ఆనవాళ్ళైనా ఇప్పటివరకు మిగిలాయి.

గాజులబట్టి ప్రాంతాన్ని ఆనుకుని 'దొడ్డి గోడలు' అని పిలుస్తున్న స్థలం ఉంది. ఆ స్థలంలో నాలుగు దశాబ్దాల క్రితం వరకు జూపల్లి దొరల పశువుల దొడ్లు ఉండేవని గ్రామస్థులు రంగినేని హనుమంతరావు, దొడ్డి రవి చెప్పారు. దొడ్డి గోడల్లో ఇప్పుడు బాగా పొదలు పెరిగి మనిషి దూరనంత జిబ్బుగా ఉన్నాయి. అతి కష్టం మీద కొంత దూరం పొదల్లో దూరితే అడుగడుగునా ప్రాచీన కాలపువి పెద్ద పెద్ద కుండ పెంకులు, ఇనుప, గాజు చిట్టాలు కన్పించాయి. ఈ దొడ్డి గోడల స్థలం నుంచి గాజులబట్టి

వైపు వెళ్తున్నప్పుడు ఎడమ పక్కన మరో గాజులబట్టి ప్రాచీన కాలపు ఇటుకలతో నిర్మించబడి శిథిల స్థితిలో కన్పిస్తుంది.

గాజులబట్టి ప్రాంతానికి తూర్పున ఒక కిలో మీటరు దూరంలో విశాలమైన గుట్ట బోరు, దానిపైన రెండున్నర వేల ఏళ్ళనాటి బృహత్ శిలా సమాధులు, చాళుక్యులు/కాకతీయుల కాలపు త్రికూటాలయం కన్పిస్తున్నాయి. బట్టికి, గుట్టకు మధ్య ఒక చిన్న ఏరు పారుతున్నది. బృహత్ శిలా యుగంలోను, మధ్య యుగాల్లోను గాజులు, పూసలు వాడుకలో ఉండేవి కాబట్టి, తిమ్మాయిపల్లి గాజు పరిశ్రమ రెండున్నర వేల ఏళ్ళ కిందటి నుంచి రాచకొండ పద్మనాయక రాజుల యుగం (ఐదు వందల ఏళ్ళ కింద) వరకు మనుగడలో ఉండేదని, ఇక్కడి నుండి కళ్యాణి (కర్ణాటక), వరంగల్, రాచకొండ, దేవరకొండ, పానగల్, కందూరు, గోల్కొండ మొదలైన తెలంగాణ నగరాలకు గాజు వస్తువులు సరఫరా అయ్యేవని చెప్పవచ్చు. అయితే గ్రామానికి చెందిన వృద్ధులు మాత్రం ఈ పరిశ్రమ నిజాం కాలం వరకు... అంటే 70 ఏళ్ళ కిందటి వరకు కూడా బలిజ వీరశైవ కులస్థుల ఆధ్వర్యంలో కొనసాగిందని చెప్పారు.

ఈ గాజు పరిశ్రమ కాలం, వైవిధ్యం, వైభవం తదితర విషయాలు శాస్త్రీయంగా తెలియాలంటే ఈ అరుదైన ప్రాంతంలో వెంటనే పురావస్తు శాఖ వారు తవ్వకాలు చేపట్టాలి. ముందుగా దుండగుల విధ్వంసానికి గురికాకుండా సంరక్షక చర్యలు తీసుకోవాలి.

## కొండ కోనల్లో కొలువైన కుబేరాలయ శాసనం

కొండకోనల్లో ఆదిమ మానవులు తలదాచుకున్నారు కాబట్టి వారి ఆవాసపు ఆధారాలు, ఆ తదుపరి కొండకోనలపై కోటగోడలు, దేవాలయాలు కట్టుకున్నారు కాబట్టి వాటి ఆధారాలు తెలంగాణ కొండకోనల్లో ఇంకా ఎన్నో ఉన్నాయి. వెదికే ఓపిక ఉంటే వెలుగు చూసే మూలాలు ఎన్నో. అలా నేను వెదికి వెలుగులోకి తెచ్చిన ఒక అరుదైన కుబేరాలయ శాసనాన్ని తెలంగాణ పురావస్తు శాఖ ఏర్పడిన 101 సంవత్సర సమాప్తి రోజున (2015 ఏప్రిల్ 26) బయటపెడుతున్నాను.

ఈ కుబేరాలయ శాసనం హైదరాబాద్ – శ్రీశైలం రహదారిలో కల్వకుర్తి/తాండ దాటిన తరువాత వచ్చే దేవరకొండ మార్గంలో తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని కమాల్‌పూర్ తండా వెనుక ఉన్న గుట్టల్లో చెన్నయగుట్టపైనున్న ఒక గుహాలయంలో ఉంది. ఇక్కడికి సాధారణంగా ఎవరూ వెళ్ళరు. నేను ఇక్కడికి వెళ్ళిన శివరాత్రి పండుగ నాడు (2015 ఫిబ్రవరి 17) కూడా ఈ ఆలయానికి ఎవరూ రాలేదు.





అంత ప్రయాసతో కూడి ఉంటుంది ఇక్కడికి చేసే ప్రయాణం.

స్థానికంగా పిలిచే 'చెన్నమయ్యవలం' (వనం) అడవులు, గుట్టలు, గుహలు, చెరువులతో పరివేష్టితమైంది. సుమారు మూడు కిలోమీటర్ల దూరం మూడు గుట్టలు దాటి వెళ్ళిన తరువాత చెన్నమయ్యగుట్ట కన్పిస్తుంది. దాని శిఖర ప్రాంతం చదునుగా, నివాసయోగ్యంగా ఉంది. ఒకప్పటి ఆవాసపు ఆనవాళ్ళు, రోళ్ళు ఇప్పటికీ కన్పిస్తున్నాయక్కడ. ఆ గుట్ట అంచున తూర్పుకు అభిముఖంగా ఒక ఆలయం, స్తంభాల మంటపం కన్పిస్తున్నాయి. ఆలయం ప్రాచీనంగా కన్పిస్తున్నదని అనుమానించి వెదికి వెదికి చూస్తే ముఖ మంటప స్తంభాలపైనున్న గుండుపైన క్రీ.శ.17వ శతాబ్దం నాటి శాసనం కన్పించింది.

ఈ శాసనం ఆరు వరుసలుగా ఉంది. పాలియోగ్రఫీ (రాత పాతదనం) ప్రకారం 17వ శతాబ్దానికి చెందిన ఈ శాసనంలోని అక్షరాలు ఇలా ఉన్నాయి.

ఏఱువరాజు నరహరి
ప్రగడ కొడుకు చెన్నమయ
కట్టించిన కుబేరాలయ
... ... రయ్యె నగరు
... ...కిన్ని మంగడప
హా శ్రీ శ్రీ



చెన్నయవొలం ఆలయం

శాసనంలో నరహరి అనేవాడు ఒక రాజ్యానికి మంత్రి (ప్రగడ) అని, అతని కొడుకు చెన్నమయ కుబేరాలయం కట్టించాడని, దానికి ముంగడప (ముఖ మంటపం) పెట్టించాడని ఉంది. ఏఱువరాజుల రాజధాని ఎల్లేశ్వరం పేర ఇక్కడ ఎల్లేశుకుంట అనే చెరువు, నరహరి కట్టించిన నరయన్ చెరువు ఇప్పటికీ ఉన్నాయి. గుహాలయం లోపల కుబేరుని విగ్రహం చాలా అందంగా శిల్పకళా చాతుర్యంతో వెలుగొందుతున్నది. మెడకు నగలు వేయడానికి చేసిన రంధ్రాలు కూడా కన్పిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ దుండగులెవరో ఆ విగ్రహపు తలను నరికివేశారు. నేను చూపిన ఫోటో ఆధారంగా శిల్పకళా నిపుణులు డా॥ ఈమని శివనాగిరెడ్డిగారు ఆ విగ్రహ శిల్పం 17వ శతాబ్దినాటిదని, ఇదే మహబూబ్‌నగర్ జిల్లాలోని చంద్రగుప్తి పట్టణ ప్రాంతంలో దొరికే 'పల్నాటి సున్నపురాతి'తో చేసిందని చెప్పారు.

ఇక్కడికి దగ్గరలోనే చెన్నమ రాజులో, మరో రాజులో కట్టించిన కోటగోడలు, ఆదిమవాసుల ఆవాస ఆనవాళ్ళున్నాయి. రాష్ట్ర పురావస్తు శాఖవారు తవ్వకాలు జరిపితే ఇంకా ఎంతో విలువైన చరిత్ర బయటికి వస్తుంది. ఇక్కడి గుట్టలు, లోయలు, చెన్నమయ్య గుడి వెనుక ఉన్న కొలను (కరువుకాలంలోనూ ఎండదు), చెరువులు– ఇవన్నీ కలిసి అడ్వెంచర్ పర్యాటకానికి అనువుగా, రాజధానికి కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలి.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 22-02-2015, 26-04-2015, 26-05-2015*

# 11

# మన్ననూరులో కాలాపానీ కారాగారం

ఒకప్పటి నిజాం/ హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజల్లో జాతీయ స్పృహను, స్వాతంత్ర్య కాంక్షను కలిగించడంలో ప్రధాన భూమికను పోషించింది 'ఆర్య సమాజం'. అది 1880ల నుండే హైదరాబాద్ రాష్ట్రంలో తన కార్యకలాపాలను కొనసాగించినా అవి ఉధృతమై నిజాం రాష్ట్రాన్ని ధిక్కరించే స్థితికి వచ్చింది 1938లో. అందుకు ప్రధాన కారకులు ఆర్య సమాజ నాయకుడు పండిత్ నరేంద్రజీ. అందుకే ఆయన పైన నిజాం ప్రభుత్వం రాజద్రోహ నేరం మోపి ఆయనను "హైదరాబాద్ రాష్ట్రపు కాలాపానీ"గా భావించే మన్ననూర్ జైలులో నిర్బంధించింది – 1938 అక్టోబర్




కాలాపానీ కారాగారం

15న. పండిత్ నరేంద్రజీ తన ఆత్మకథలో ఇలా రాసుకున్నారు.

"హైదరాబాద్ నుంచి 80 మైళ్ళ దూరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఒక పెద్ద కొండపై, దట్టమైన అడవిలో ఉన్న జైలులో నన్నుంచారు. ఆ చుట్టుపట్ల పులులూ, చిరుత పులులూ తిరుగాడుతుండేవి. ఒక ఏడాది, ఐదు నెలలు, 21 దినాల తర్వాత మన్ననూరు నుంచి వదిలిపెట్టారు".

2015 ఏప్రిల్ 6 నాటికి పండిత్ నరేంద్రజీ మన్ననూర్ కాలాపానీ జైలు నుంచి విడుదలై సరిగ్గా 75 సంవత్సరాలు పూర్తయినాయి. ఈ సందర్భంగా ఒకసారి ఆనాటి పోరాట నేపధ్యాన్ని, దాని వారసత్వాన్ని నెమరువేసుకోవడం తెలంగాణా ప్రజలకు ఒక చారిత్రక అవసరం.

పండిత్ నరేంద్రజీ జైలు నిర్బంధానికి నిరసనగా ఆర్య సమాజం వారు ఉధృతంగా సత్యాగ్రహం చేశారు. ఆ సత్యాగ్రహంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన 16 వేల మంది ఆర్య సమాజీయులు పాల్గొన్నారు. ప్రభుత్వ అణచివేత చర్యల్లో 21 మంది చనిపోయారు. చివరకు నిజాం ప్రభుత్వం తగ్గి ఆర్య సమాజీయులను సంప్రదింపులకు పిలిచింది. ఆర్య సత్యాగ్రహ సమితి తరపున దేశబంధు గుప్త సంప్రదింపుల్లో పాల్గొన్నారు. సంప్రదింపులు సఫలమైనాయి – ఒక్క నరేంద్రజీ విడుదల తప్ప. అయితే ఒప్పందానికి అంగీకరించమని ఆర్య సత్యాగ్రహ సమితి అధ్యక్షులు శ్రీ ఘనశ్యాంసింహజీ భీష్మించారు. చివరకి ఒప్పందం తర్వాత రెండు నెలలకు నరేంద్రజీని వదిలిపెట్టాలని అంగీకారం కుదిరింది. కాని రెండు నెలల తర్వాత కూడా నిజాం ప్రభుత్వం నరేంద్రజీని విడుదల చేయకపోవడంతో ఘనశ్యాంసింహజీ ఈ విషయాన్ని మహాత్మ గాంధీకి చెప్పి కాంగడీలోని గురుకులం ఆచార్యులు పండిత అభయదేవ్‌జీ విద్యాలంకార్‌ను హైదరాబాద్‌కు పంపారు. అభయదేవ్‌జీ, హైదరాబాద్ రాష్ట్ర ప్రధానమంత్రి సర్ అక్బర్ హైదరీ ఇద్దరూ యోగిరాజ్ అరవింద ఘోష్ శిష్యులుగా ఉన్నప్పుడు స్నేహితులు కావడంతో నరేంద్రజీ విడుదలకు మార్గం సుగమమైంది.

ఈ నేపథ్యంలో నిజాం ప్రధాని సర్ అక్బర్ హైదరీ 1940 ఏప్రిల్ 5న మన్ననూర్‌కు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవుల్లో ఉన్న ఫరహాబాద్ ప్రాంతాన్ని వేసవి శిబిరంగా మార్చటానికి ప్రణాళికను రూపొందించేందుకు ఆస్ట్రేలియాకు చెందిన నిపుణులతో పాటు ఫరహాబాద్‌కు వెళ్ళి, పని పూర్తయినాక తిరిగి హైదరాబాద్ వెళ్తూ మార్గ మధ్యంలో మన్ననూర్ జైలుని సందర్శించి పండిత్ నరేంద్రజీతో పది నిమిషాలసేపు మాట్లాడారు. మాటల సందర్భంగా నరేంద్రజీని అనేక విషయాలు అడిగారు. ఆయన అడిగినదానికల్లా నరేంద్రజీ సమాధానం చెప్పారు.




కాలాపానీ బావి

ఆ తరువాత అక్బర్ హైదరీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్‌కు ఆదేశాలిచ్చి హైదరాబాద్ వెళ్ళారు. ఆయన ఆదేశాల ప్రకారం మరుసటి రోజు... అంటే 1940 ఏప్రిల్ 6 నాటి అర్ధరాత్రి 12 గంటలకు పోలీస్ అధికారి అష్ఫాకుల్లాఖాన్ పర్యవేక్షణలో నరేంద్రజీని మన్ననూర్ జైలు నుంచి హైదరాబాద్‌కు చేరవేశారు.

ఇప్పుడు ఆనాటి మన్ననూర్ జైలులో ప్రభుత్వ పాఠశాల నడుస్తున్నది. దాని ముందు ఆర్యసమాజ్ వాళ్ళు 'నరేంద్రజీ స్మారక స్థూపం' కట్టించారు. దాని ముందు రోడ్‌నానుకొని ఆనాటి (150 ఏళ్ళ కిందటి) కాలాపానీ బావి ఉంది. ఆనాడు నిజాం రాష్ట్రంలో తీవ్రనేరస్థులకు ఇక్కడి నల్లమల అడవుల్లో ద్వీపాంతరవాస శిక్ష వేసి వారికి ఈ కాలాపానీ బావి నీళ్ళు ఇచ్చేవారట. వారు కొన్నాళ్ళకు శరీరంలో విషం పేరుకుపోయి చనిపోయేవారట. నరేంద్రజీ ఉద్యమ వారసత్వ చిహ్నాలను, ఆనాటి ఫరహాబాద్ పర్యాటక కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరిస్తే ప్రజలకు మంచి చారిత్రక పర్యావరణ పర్యాటక కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి.

*– ప్రధాన తెలుగు దినపత్రికలు, 6-04-2015*


## 12


# అక్కమహాదేవి గుహలు

ఇప్పటివరకు ఆసియాలో అతి పెద్ద శిలా తోరణం తిరుపతిలో ఉన్నదని చెప్తూ వస్తున్నారు. ఇక మీదట మహబూబ్‌నగర్ జిల్లాలో ఉందని చెప్పవలసి వస్తుంది. ఎందుకంటే... తిరుపతిలో కంటే ఐదింతలు పెద్దది, అరుదైనది, అందమైనదీ ఐన సహజ శిలా తోరణం మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ అడవుల్లో ఉన్న అక్కమహాదేవి గుహలకు ప్రాంగణంగా ఉంది.

## ఆహ్లాదకరమైన ట్రెక్కింగ్

హైదరాబాదు నుంచి శ్రీశైలం వెళ్ళే రహదారిలో సుమారు 170 కిలో మీటర్ల దూరం ప్రయాణం తరువాత... అందులో 35 కిలో మీటర్ల దూరం నల్లమల అడవులు,


శిలాతోరణం




పర్వతాల ఎగుడు-దిగుళ్ళు, వంకర-టింకర్ల వాహన ప్రయాణం తరువాత ఒక లోయలో కుడివైపుకు 'అక్కమహాదేవి గుహలకు దారి' అని ఒక చిన్న బోర్డు కనిపిస్తుంది. అక్కడి నుంచి 6 కిలో మీటర్ల దూరం అడవుల్లో ట్రెక్కింగ్ చేస్తే అక్కమహాదేవి గుహలకు చేరుకోగలం. 6 కిలో మీటర్ల దూరం నడవాలా? అని భయపడేవారికి రెండు ప్రత్యామ్నాయాలున్నాయి.

ఒకటి, శ్రీశైలం వరకు వాహనంలో మరో 45 కిలో మీటర్ల దూరం ప్రయాణించి, అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నడుపుతున్న బోట్లలో 22 కిలోమీటర్ల దూరం శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో ప్రయాణించి అక్కమహాదేవి గుహలను చేరుకోవచ్చు. ఇక రెండవ ప్రత్యామ్నాయం 6 కిలో మీటర్ల దూరం అలసట లేకుండా ఆనందిస్తూ నడవడం. ఇదెలా సాధ్యమో చూద్దాం.

ఆరు కిలో మీటర్ల నడకలో మనకు నల్లమల అడవులు, గుట్టల అసలు సౌందర్య విశేషాలు తెలిసొస్తాయి. గుట్టల వాలుల్లో, లోయల్లో ఏపుగా పెరిగిన చెట్లు పచ్చగా, దట్టంగా, విశాలంగా కన్పించడం, వాటి కింది నుంచి వెళ్ళే సెలయేళ్ళ శబ్దాలు విన్పించడమే కాని కన్పించకపోవడం, మానవ క్రూరమృగాల వాసన చూసి అటవీ క్రూరమృగాలు ఆ లోయల్లో దాక్కొని మనల్ని ఓరగంట చూస్తూ జాగ్రత్తపడడం... ఇలాంటి ఎన్నో అనుభూతులు అనుభవంలోకి వస్తాయి.

రాళ్ళు ఎన్ని రకాలుగా ఉంటాయో?... పరుపురాళ్ళు, సూదంటు రాళ్ళు, నాపరాళ్ళు, దిగుడురాళ్ళు, వివిధ ఆకారాల రాళ్ళు. సుమారుగా సగం దూరం వెళ్ళాక

కన్పించే విశాలమైన పరుపు రాళ్ళ దగ్గర కొన్ని సాంస్కృతిక విశేషాలు కన్పిస్తాయి. అక్కడ ప్రవహించే చిన్న చిన్న సెలయేళ్ళు చిన్న చిన్న నీటి మడుగులను ఏర్పరిచాయి. మరికొన్నింటినేమో అటవీ శాఖవారు అటవీ జీవజాలపు తాగునీటి అవసరాలకు తీర్చటానికి ఏర్పర్చారు. స్థానిక గిరిజనులు ఇక్కడి అడవుల్లో మేపే పశువులకు ఈ పరుపురాళ్ళ ప్రాంతం తాగు నీటి అవసరాలను మాత్రమే కాకుండా తాత్కాలిక ఆవాస ప్రాంతంగా కూడా పనికొస్తున్నది. ఇక్కడి బయలు ప్రాంతం క్రూర జంతువుల రాకను తెలియజేస్తుంది కనుక, ఇక్కడ రాత్రి మంటలు వేసుకొని పశుల కాపరులు తమ పశువులను, తమను రక్షించుకుంటారు. అక్కమహాదేవి గుహలకు వెళ్ళే భక్తులు కూడా ఇక్కడే ఒక మజిలీ చేసి, అల్పాహారాలను కానిచ్చి మళ్ళీ ప్రయాణిస్తారు. కాబట్టి ఇక్కడ ఆశ్చర్యకరంగా కన్నడ భాషలో బోర్డులు కన్పిస్తాయి. కర్ణాటక భక్తులే ఈ మార్గం గుండా ఎక్కువగా ప్రయాణించడం గమనార్హం.

ఇక పరుపు రాళ్ళ నుండి ప్రయాణం దక్షిణం వైపు దిగుడుగా సాగుతుంది – లోయల మధ్య, చిక్కని చెట్ల మధ్య. కొద్దిగా మైదాన ప్రాంతం కన్పించిన చోట సహజమైన లాన్ (lawn)లో కట్టిన కాటేజీల లాగా రెండు మూడు గుండ్రని గుడిసెలు కన్పిస్తాయి. మనుషులు కన్పించరు. మరి వాటిని ఎవరు, ఎందుకు కట్టారు అని ప్రశ్నించేవారికి తెలిసినవారు గాని, స్థానికులు గాని చెప్పే సమాధానం... ఆ గుడిసెలు చెంచు గిరిజనులవని. వారు నల్లమల అడవుల్లో ఇప్పటికీ వేల సంఖ్యలో ఉన్నారు. వారిది సంచార జీవనం. అంటే... ఎప్పుడు ఎక్కడ ఆహార వనరులు లభిస్తే అప్పుడు అక్కడ స్థిరపడతారు. వారి తాత్కాలిక నివాసాన్ని 'పెంట' అంటారు. ఆ పెంటలో వారు కనపడకపోవడానికి కారణం వారు ఆహార సేకరణకు వెళ్ళడం కాని, ఆ క్రమంలో ఆ పెంటనే వదిలి వెళ్ళడం కాని అయ్యుంటుంది. చెంచువాళ్ళు ఒకవేళ మనకు కన్పిస్తే మాత్రం మనకు పండగే. ఎందుకంటే... మన అచ్చమైన మాతృభాషను వారు మాత్రమే మాట్లాడతారు. సంస్కృతీకరణకు గురికాని తెలుగు సంస్కృతి ఏదైనా మిగిలి ఉంటే అది చెంచువారి దగ్గరే ఉంది. ఆటలు, పాటలు, వేటలు... దేని గురించైనా. తెలుసుకున్నోళ్ళకు తెలుసుకున్నంత మహదేవ!

## చెట్లు చేమలు

ప్రయాణ బడలిక తెలియకుండా మార్గమధ్యంలో మనకు ఎన్నో ఫలవృక్షాదులు కన్పిస్తాయి. సీజనల్ ఫలాలను తిన్పిస్తాయి. ప్రత్యేకించి వెలగపండ్లు. వినాయకుడికి ఇష్టం. 'కరి (ఏనుగు) మింగిన వెలగపండు' అనే సుమతి పద్యం మనకు తెలుసు.

కాని వెలగపండ్లు ఎన్ని రకాలుగా ఉంటాయి, ఎన్ని సైజుల్లో ఉంటాయి, తింటే ఎట్లా ఉంటాయి... ఇలాంటి ప్రశ్నలన్నింటికి సమాధానాలను వాటిని రుచి చూసి మరీ తెలుసుకోవచ్చు – ఈ నల్లమల అడవుల్లో. పరికి పండ్లు, మొర్రి పండ్లు, కోరింద పండ్లు... ఎన్నో రకాల పండ్లు దారి పొడవునా దర్శనమిస్తాయి, హర్షాన్నీ ఇస్తాయి – ఏరుకొని తింటే.

కృష్ణానది ఇంకొక ఫర్లాంగు దూరంలో కన్పిస్తుందనగా ఆశ్చర్యకరంగా అక్కడి అడవిలో హెలీపాడ్ నిర్మాణం కన్పిస్తుంది. అంతటి కీకారణ్యంలో హెలికాప్టర్ దిగడమా? అవును, సుమారు మూడు దశాబ్దాల కిందట శ్రీశైలం ఎడమ సొరంగ కాలువ నిర్మాణం ప్రారంభించడానికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన నిర్మాణమిది.

ఈ ప్రాంతపు గుట్టలు చాలా ఎత్తైనవి. అత్యంత ఎత్తైన శిఖరం ఎత్తు 914 మీటర్లు. అంటే సముద్ర మట్టానికి 3000 అడుగుల ఎత్తునున్న మనకు చల్లగాలులు తగిలి ఆహ్లాదాన్నిస్తాయి. ఆ గాలులు శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి పైనుండి తేమను మోసుకు రావడం వల్ల ఆ తేమ చల్లదనం తగిలి మనల్ని మనం మైమరచిపోతాం.

ఇక కృష్ణానది ఎడమ ఒడ్డును చేరుకున్నాక కన్పించే దృశ్యం మహా అద్భుతం. ఇక్కడి ఎత్తైన పచ్చని కొండల మధ్య ప్రాజెక్ట్ నీళ్ళు వ్యాపించడం వల్ల ఆ కొండలు ఆక్టోపస్ ఆకారంలో అందంగా కన్పిస్తాయి. కెమెరాలు, సెల్‌ఫోన్లు వాటంతటవే మన చేతుల్లోకి చేరుకొని వాటి అరుదైన అందాలను బంధిస్తూనే ఉంటాయి – అనాలోచతంగానే. అల్లంత దూరంలో ప్రాజెక్టు నీటిని కలుస్తున్న గుట్టల ఏటవాలు ప్రదేశాల్లో పై నుంచి కొట్టుకొచ్చి నిల్చినట్లు కన్పించే చెంచు పెంటలు, ప్రాజెక్టు



శ్రీశైలం బ్యాక్ వాటర్

నీళ్ళల్లో కొందరు మనుషులు  పుట్టీల్లో చేపలు పట్టుతుండడం, ఈ మధ్య తెచ్చుకున్న మరబోట్లు రయ్యిమని సాగుతుండడం... తేలియాడుతూ ఇవన్నీ చూస్తే అలసట తెలుస్తుందా? ఆహ్లాదం తప్ప.

కృష్ణానది ఒడ్డు అంచు వెంట కన్పిస్తున్న నీటిని చూస్తూ ఓ వంద మీటర్లు పశ్చిమం వైపుగా చివరి గుట్టను దిగాలి. తిరిగి ఎక్కడం సాహసమనే అన్పిస్తుంది. దిగిన తరువాత కొండ కొమ్ము ఒకటి ప్రాజెక్టు నీళ్ళలోకి చొచ్చుకొని కన్పిస్తుంది. అదే అక్కమహాదేవి గుహలు నెలకొన్న ప్రదేశం.

## అరుదైన, అందమైన గుహలు

ఈ అరుదైన, అందమైన అక్కమహాదేవి గుహలు కూడా శ్రీశైలం ప్రాజెక్టు నీళ్ళల్లో మునిగిపోయుంటే... ఊహించటానికే భయమేస్తుంది. ఎంతటి సహజ సౌందర్యాన్ని కోల్పోయేవాళ్ళమో!

నిజానికి అక్కమహాదేవి గుహలు రెండు సముదాయాలుగా ఉన్నాయి. నడుచుకుంటూ వెళ్ళేవారికి ముందుగా కన్పించేవి చిన్న గుహలు. శ్రీశైలం నుంచి బోట్లలో వచ్చేవారికి ముందుగా కన్పించేవి పెద్దగుహలు. చిన్న గుహలను గత దశాబ్దంలో రెండు గదులుగా మార్చారు. మార్చినవారు కర్ణాటకకు చెందిన ఒక రుషి భక్తులు. ఆయన ఇక్కడే పన్నెండేళ్ళు తపస్సు చేసి సిద్ధి పొందారట. ఆయన భక్తులు ఇక్కడ స్థిర నివాసం ఉంటున్నారు. తమ ఆశ్రమ వివరాలను క్లుప్తంగా కన్నడ శిలా శాసనంలో పొందుపర్చారు. ప్రతియేటా కార్తీక పౌర్ణమికి ఆ రుషిని ఆయన భక్తులు ఈ ఆశ్రమానికి పల్లకిలో మోసుకొచ్చి జాతర జరుపుతారు. అప్పుడు మాత్రం ఇక్కడ వేల మంది భక్తులు కన్పిస్తారు. ఎక్కువగా కన్నడిగులు. ఆ తరువాత మళ్ళీ కీకారణ్యమే.

చిన్న గుహలకు దక్షిణ దిశలో కొంచెం కింది వైపు పెద్ద గుహలున్నాయి. ఈ గుహలు ఒక పెద్ద సహజమైన భవనంలా కన్పిస్తాయి. భవనానికి ముందు పెద్ద పెద్ద స్తంభాలు, వాటిపైన ఎత్తైన పోర్టికో (పందిరి ఉపరితలం) ఉన్నట్లు ఈ గుహల ముందు కూడా ఆశ్చర్యకరంగా శిలా స్తంభాలు, వాటి పైన పెద్ద శిలా తోరణం ఉన్నాయి. ఈ శిలాతోరణం సుమారు రెండు గజాల మందం, ఐదు గజాల వెడల్పు, యాభై గజాల పొడవుతో తూర్పు-పడమర దిశల్లో నిల్పినట్లుగా ఏర్పడింది. దీని కింద వేయి మంది చేరి ఆడుకోవచ్చు. పాడుకోవచ్చు. ఇంత పెద్ద శిలా తోరణం తిరుపతిలోనే కాదు, బహుశా భారతదేశంలో కూడా ఎక్కడా ఉండి ఉండదు. ఉంటే

పర్యాటక శాఖవారు అలాంటి సహజ సౌందర్యాన్ని ఇప్పటికే గొప్ప పర్యాటక స్థలంగా ప్రాచుర్యంలోకి తెచ్చేవారే. ఇప్పుడు ఈ శిలాతోరణం ఉన్న అక్కమహాదేవి గుహలను మంచి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుండడం ముదావహం.

శిలా తోరణం లోపలికి వెళ్ళగానే ఉత్తర దిశన మూడు గుహలు కన్పిస్తాయి. ప్రధానమైన గుహ తూర్పు నుంచి పడమటి వైపు సాగుతుంది. సుమారు 70 అడుగులు వెళ్ళి మరో 30 అడుగులు ఉత్తరం వైపుకు, ఆ తరువాత 8 అడుగులు మళ్ళీ పడమటి వైపుకు వేయగానే అక్కడొక గజమెత్తు గద్దెపైన జానెడెత్తు శివలింగం దర్శనమిస్తుంది. హిందూ మతంలో 108కి చాలా ప్రాధాన్యముంది. వివిధ రకాల దేవతలను వారి అష్టోత్తర శత నామాలు నిష్టగా జపించి ప్రసన్నం చేసుకోవచ్చని నమ్మకం. ఇక్కడ అష్టోత్తర శత అడుగులు (వేసి) నడిచాక శివుని దర్శనం కావడం గమనించవలసిన విషయం. ఈ గుహ ఉత్తర భారతదేశంలోని వైష్ణోదేవి గుహను పోలి ఉండడం గమనార్హం. అక్కడా ఇలాగే నడిచి చేరుకోవాలి. అక్కడ చివర్లో మాత్రం నీటి ధార తగుల్తుంది. అది ఒక్కటే తేడా.

ఇక్కడి శివలింగాన్ని క్రీ.శ. 12వ శతాబ్దంలో శివశరణి అక్కమహాదేవి ప్రతిష్టించి, తపస్సు చేసి, 'వచనాలు' రాసి, పాడి శివున్ని మెప్పించి చివరికి అతనిలో లీనమైందని శివభక్తులు చెప్పుకుంటారు. అందుకు నిదర్శనమైన శిల్పాలు శ్రీశైలం ఆలయ ప్రహరీ గోడలపై చెక్కబడ్డాయి కూడా. శాస్త్రీయంగా చూస్తే ఆ శివలింగాన్ని ప్రకృతే ఏర్పరిచిందని చెప్పవలసి వస్తుంది. ఎందుకంటే... ఆ లింగం ఒక స్టాలగ్మైట్. ఎన్నో ఏళ్ళుగా గుహ పైనుంచి కిందపడ్డ నీటి బొట్లలో ఉండే సున్నం మాతృకలు క్రమంగా పైపైకి పేరుకుపోయి శివలింగ ఆకారానికి రూపమిచ్చాయి. అలా ప్రకృతే దేవుడిని ఏర్పరచడం దేవుడు విశ్వాంతర్యామి అనడానికి నిదర్శనంగా కన్పిస్తుంది.

ఇక రెండవ గుహ ఉత్తర ఈశాన్యం వైపు, మూడవ గుహ తూర్పు ఈశాన్యం వైపు కొనసాగుతున్నాయి. సుమారు పది గజాల ఎత్తున్న ఈ మూడు గుహలూ చీకటిమయాలే. గబ్బిలాల నిలయాలే. స్థానిక చెంచు పిల్లలు పదో పరకో తీసుకొని కొవ్వొత్తులు, టార్చిలైట్లతో పర్యాటకులను శివలింగం దగ్గరికి తీసుకెళ్తున్నారు. మిగతా రెండు గుహలు ఇంకా దుర్గమాలే. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ఈ గుహలన్నింటినీ శుభ్రం చేయించి, సోలార్ లైట్లు అమర్చి, లోపలికి ఆక్సిజన్ వాయువును పంపించే ఏర్పాట్లు చేయవలసి ఉంది.

అక్కమహాదేవి దర్శనభాగ్యంతో తాను ఇక్కడ ఉన్నానని చెప్పే ఒక శివభక్తురాలు

శిలాతోరణ ప్రాంగణంలో కూర్చుంటుంది. ఆ కన్నడ భక్తురాలితో కొద్దిసేపు తెలుగులో మాట్లాడి, చెంచు యువకుల దగ్గర పోనికేసిన పేలాలు తిని, టీ తాగి కొంచెం ముందుకెళ్తే మరిన్ని మంచి దృశ్యాలు కన్పిస్తాయి. ఎత్తైన పచ్చని గుట్టల నీడలు కృష్ణానది నీళ్ళల్లో నల్లగా ప్రతిఫలిస్తున్న దృశ్యం, గుట్టల మధ్య గుంకుతున్న సూర్యుడు ఉన్న నీళ్ళల్లో ప్రతిబింబించడం, గుట్ట దరుల్లో ఉన్న చిన్న చిన్న గుడిసెల సముదాయాలు, చేపల పుట్టీలు, రకరకాల చెట్లు, వాటిపై అటూ-ఇటూ గెంతే కోతులు, పక్షి విమానాలు, నెమళ్ళ కూతలు... ఇలా ఎన్నో వింతలు, సహజమైన అందాలు అక్కడికి వెళ్తేనే మధురస్మృతులుగా మారతాయి. చివరిగా, జాగ్రత్తగా చేయవలసిన కృష్ణానదీ స్నానాలనూ సొంతం చేసుకోవచ్చు.

## ఎకోటూరిజం అవకాశాలు

రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు మూడు గంటల ప్రయాణంలో... 170 కిలో మీటర్ల దూరంలో... అనేక ఎకో పర్యాటక విశేషాలతో అందుబాటులోకి రాగల అద్భుతమైన పర్యాటక స్థలం అక్కమహాదేవి గుహలు. తెలంగాణలో ఇప్పటివరకు అందుబాటులో లేని కేవ్ టూరిజం, శిలా తోరణం, 20 కిలోమీటర్ల దూరపు బోటు షికారు, 6 కిలోమీటర్ల ట్రెక్కింగ్, ట్రెక్కింగ్ సైక్లింగ్ అవకాశాలు ఇక్కడ మాత్రమే అందుబాటులోకి రాగలవు. సముద్ర మట్టానికి మూడు వేల అడుగుల ఎత్తులో ఉండటం వల్ల ఇక్కడి ఆక్టోపస్ ఆకారాలు గల పర్వతాలు వేసవి విడుదులకు అనుకూలంగా ఉన్నాయి. కింద కన్పించే శ్రీశైలం ప్రాజెక్టు నీళ్ళ అందాలు గుట్టలపైన నిర్మించే కాటేజీలకు అదనపు ఆకర్షణలను జోడిస్తాయి. గుట్టల పైనుండి గుహల వరకు రోప్‌వేలు నిర్మించవచ్చు.

అక్కమహాదేవి గుహల నుండి ఆవులపెంట, శ్రీశైలం ప్రాజెక్టు, పాతాళగంగ, చంద్రగుప్తి పట్టణం, పీనుగులగొంది, ఎస్సెల్బీసీ సొరంగం, కాకిలేటివాగు, దత్తాత్రేయ ఆశ్రమం, కదళీవనం రాతి చిత్రాలు తదితర ప్రదేశాలకు బోటు టూరిజం అభివృద్ధి చేయవచ్చు.

ఇప్పటికైతే ఔత్సాహిక పర్యాటకులు ఇక్కడికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్ననూరు ఫారెస్ట్ గెస్ట్‌హౌజ్‌లో గాని, దోమలపెంటలో ఉన్న విద్యుత్ శాఖ గెస్ట్‌హౌజ్‌లో గాని దిగి, అక్కడి నుండి అక్కమహాదేవి గుహలకు ఆరు కిలోమీటర్లు నడిచి చేరుకోవచ్చు. లేదంటే ఈగలపెంట నుంచి చేపలు పట్టేవారి బోట్లను ఎంగేజ్ చేసుకొని శ్రీశైలం బ్యాక్ వాటర్స్‌లో 20 కిలోమీటర్ల ప్రయాణించి ఈ గుహలను చేరుకోవచ్చు.

## ఎవరీ అక్కమ్మ, ఏమిటామె గొప్ప?

అక్కమహాదేవి గుహలను స్థానికులు అక్కమ్మ బిలం అని పిలుస్తారు. ఆ బిలంలో ఆమె ఎప్పుడో తపస్సు చేసిందని మాత్రం వారికి తెలుసు. అంతకు మించి ఆమె గురించి తెలుసుకోవలసినదెంతో ఉంది. అక్కమ్మ అసామాన్య విషయాలను సామాన్యులకు అర్థమయ్యే విధంగా వచనాలు రాసి, పాడి అసామాన్యులకు ఆదర్శప్రాయమయ్యింది – 12వ శతాబ్దంలోనే.

అక్కమ్మ క్రీ.శ.1150 ప్రాంతంలో ఉత్తర కర్ణాటకలోని ఉడుతడి అనే గ్రామంలో జన్మించింది. ఆమె యుక్త వయస్సుకు రాగానే ఆమె అందం చూసి జైనుడైన గ్రామాధికారి ఆమెను కాక్షించి పెళ్ళి చేసుకున్నాడు. కాని మోక్ష కాంక్ష కలిగిన అక్కమ్మ అతని చెర నుండి విడిపించుకుని, అతను వొలిచిన వలువలను వదిలేసి విరాగియై, మరో తెలుగువాడు దక్కను రాజధాని కళ్యాణ పట్టణంలో అప్పుడే ప్రచారం చేస్తున్న వీరశైవ మతం పట్ల అనురక్తురాలై అనుభవ మంటపంలో శిక్షణ పొంది, మంటపం పెద్ద అల్లమ ప్రభువు సూచనతో మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అడవుల్లో ఉన్న కదళీవనంలోని గుహల్లో చేరి అందులోని గుహేశ్వరున్ని మెప్పించే క్రమంలో అసామాన్య మేధావిగా పేరు గడించింది.

అనుభవం గడించడానికి ముందుగా తెలుగు దేశంలోని ప్రధాన తీర్థ క్షేత్రాలను... ప్రత్యేకించి శ్రీశైలం ద్వార క్షేత్రాలను దర్శించినట్లు ఆమెనే ఒక వచనలో ఇలా రాసింది.

'పృథ్విని గెలిచిన ఏలేశ్వరుని కంటి
భావభ్రల గెలిచిన బ్రహ్మేశ్వరుని (అలంపురం) కంటి'

ఏలేశ్వరం, అలంపురం క్షేత్రాలు తెలంగాణలోనే కృష్ణానది ఒడ్డున ఉండడం గమనార్హం.

అక్కమ్మ భక్తి, సాహిత్య విషయాల్లో ఒక ప్రధాన ప్రక్రియను ప్రారంభించింది. అదే మధురభక్తి. అంటే తను నమ్మిన దేవున్ని భర్తగా భావించి శృంగారం ఒలకబోయడం – సాహిత్య రూపంలో. ఇది అమలిన శృంగారమే. ఎందుకంటే... భగవంతుడు శారీరకంగా కలవడు కాబట్టి. ఈ భావనను అక్కమ్మ ఎలా చెప్పుకొచ్చిందో చూడండి.

'చెన్న మల్లికార్జునుని వధువునగు నాకు
వేరే శృంగారమెందుకు చెప్పరే అమ్మలారా!
ఇహమునకొక మగడు పరమునకొక మగడా?'

అని ప్రశ్నించిన అక్కమ్మ తను భర్తగా భావించిన చెన్న మల్లికార్జునునితో శారీరక శృంగారం సాధ్యం కాని విధం ఎట్టిదో కూడా చెప్తూ ఇలా వాపోయింది.

'కామించి కల్పించి కనలి బడలితినమ్మా
మోహించి ముద్దిచ్చి మరులైతినమ్మా
తెరదీయక మదివీడక వలచి నమ్మితినమ్మా
నా దేవుడు చెన్న మల్లికార్జునుడు
నన్నొల్లకున్న నేనేమందునమ్మా'

అలకలు (వెంట్రుకలు) చీరగా అంగంబు కప్పుకొని తిరుగుతూ మగవారిని లైంగిక వాసనకు గురిచేయకుండా మోక్ష సాధన వైపు మరల్చిన ధీర వనిత అక్కమ్మ. సాక్షాత్తూ కాకతీయ సామ్రాజ్య చక్రవర్తి గణపతిదేవుని గురువైన శివదేవయ్య ఆమె ప్రభావానికి లోనై 150 ఏళ్ళ తర్వాత ఇక్కడి అక్కనహళ్ళ (బుగ్గవాగు) ఒడ్డున మఠం కట్టుకొని ఇక్కడే తపస్సు చేసినట్లు తెలిపే శిలా శాసనం దొరికింది. ఆమె మధురభక్తి భావనను ప్రవేశపెట్టిన తరువాతి కాలంలో అదే భావనతో ప్రసిద్ధి పొందినవారిలో అన్నమయ్య, మీరాబాయి, రామదాసు, క్షేత్రయ్య, త్యాగరాజు వంటి మహామహు లెందరో ఉన్నారు. అయితే వీరంతా వైష్ణవ భక్తులు. ఆమె కీర్తనలు వీరి కీర్తనలకంటే వందల సంవత్సరాలు ముందటివి కావడంతో ఆమె కీర్తనలు వీరి కీర్తనలకు మార్గదర్శకాలయ్యాయని చెప్పవచ్చు.

కీర్తనలతోపాటు అక్కమ్మ కన్నడ భాషలో షట్‌స్థల వచనములు, సృష్టి వచనములు, యోగాంగ త్రివిధి (త్రిపది కృతి), అక్కన పీఠక తదితర అసామాన్య రచనలను ఈ అడవుల్లోనే రచించింది. అందుకే ఆమెను తదనంతరీకులు 'సాహిత్యనిధి' అని సంబోధించారు.

బసవేశ్వరుడు ప్రతిపాదించిన వీరశైవ మత శాఖను మొదటిసారిగా తెలుగు దేశంలో ప్రచారం చేసిన మత ప్రవక్త అక్కమ్మ.

'వేద శాస్త్రాగమ పురాణములెల్లను
వడ్లను దంచిన నూక తౌడు గనుడోయి
వీనిని మరల దంచుటెందులకు, చెరుగుటెందులకు
అటు ఇటు పారు మనసును నిలుపగలిగిన
అంత బట్టబయలు చెన్న మల్లికార్జునా?'


అంటూ అసామాన్యమైన, మింగుడుపడని వేదాంతసారాన్ని సామాన్యులకు ఇట్టే అర్థమయ్యేటట్లు చెప్పి సామాన్యులకు మతాన్ని, తద్వారా శాంతిని అందుబాటులోకి తెచ్చింది. అందుకే అక్కమహాదేవి నడయాడిన గుహలు 850 సంవత్సరాల తర్వాత కూడా సామాన్యులకు సందర్శనీయ స్థలాలు కాగలిగాయి.

*– నమస్తే తెలంగాణ దినపత్రిక, 22-02-2015*

# 13

# భువనగిరి భువనైక సౌందర్యం

దక్షిణ భారతదేశంలో దక్కను పీఠభూమి సహజమైన ఏకశిలా పర్వతాలకు ప్రత్యేక నిలయం. అలాంటి ఏకశిలా పర్వతాల్లో మైసూరు పీఠభూమి పైనున్న 'నందికొండ' తరువాత చెప్పుకోదగిన ఎత్తైన పర్వతం 'భువనగిరి'. ఆ తరువాత స్థానంలో పేర్కొనదైనా వరంగల్‌లోని 'ఏకశిల' ఏకంగా యావత్ తెలుగు దేశానికి 150 సంవత్సరాలు రాజధానిగా వర్ధిల్లింది. కాని దాని కంటే ఏడు వందల సంవత్సరాల ముందు నుంచే భువనగిరి తెలుగు రాజ్యాల సైనిక శిబిరంగా, సామంత రాజధానిగా వర్ధిల్లింది. పైగా క్రీ.శ. 1123 నాటికే తెలుగు దేశంలో పేరొందిన తీర్థక్షేత్రంగా కూడా వర్ధిల్లినట్లు భువనగిరిలోనే చాళుక్య రాజ్య సర్వసైన్యాధ్యక్షుడు కేశియరసర్ అనే దండనాయకుడు వేయించిన శాసనం తెలుపుతున్నది. పేరొందిన తీర్థక్షేత్రాలు సహజంగా అందమైన ప్రకృతిలో వర్ధిల్లుతాయి. భువనగిరిలో అందమైన ప్రకృతిలో ఉన్న చారిత్రక నిర్మాణాలు భువనగిరికి సువర్ణానికి సువాసన అబ్బిన స్థితిని చేకూర్చాయి.



భువనగిరి

## చరిత్ర పూర్వ యుగంలో

భువనగిరి ఏకశిలా పర్వతం భూమట్టానికి 600 అడుగుల ఎత్తుతో కొన్ని కోట్ల సంవత్సరాల కిందట భూమి నుంచి ఉప్పొంగిన లావా నిర్మితం. దాని మధ్యలో అక్కడక్కడా ఏర్పడిన గుహలు, దాని పరిసరాలు ఆదిమానవుని కాలం నుండి ఆధునిక మానవుని కాలం వరకు ప్రజలకు ఆశ్రయం ఇస్తూనే వస్తున్నవి. అందుకు నిదర్శనంగా ఈ కొండ పాదం నుండి రైలు మార్గం దగ్గర దాకా ఆది మానవుల సమాధులైన కెయిరనులు లేదా రాక్షసగుళ్ళు చాలా కన్పిస్తున్నాయని ఆచార్య బిరుదురాజు రామరాజు గారు రాశారు.

సుమారు రెండు నుండి మూడు వేల సంవత్సరాల కిందట ఇక్కడ మనుగడ సాగించిన ఆ రాక్షసగుళ్ళ యుగానికి చెందిన ప్రజలు పూజించిన స్థలాన్ని నేను కనిపెట్టాను. ఈ పూజాస్థలం భువనగిరిని ఎక్కుతున్నప్పుడు కోట మొదటి ద్వారానికి కొంచెం ముందుగా ఎడమ పక్కనున్న రాతి గుండ్లు ఏర్పరిచిన గుహ గోడపైనుంది. ఆ స్థలంలో ఒక అడుగు వెడల్పు, అడుగున్నర పొడవు కొలతలతో అండాకారపు వలయాల రేఖా చిత్రం చెక్కి ఉంది. ఈ వలయాలను లోహపు ఆయుధంతో... బహుశా ఇనుప ఉలితో చుక్కలు చుక్కలుగా చెక్కారు. ఈ అండాకారపు వలయాల రేఖా చిత్రాన్ని ఇంగ్లీష్‌లో డయామెట్రిక్ డిజైన్ పెట్రోగ్లిఫ్ అంటారు. ఆధునిక ఖగోళ శాస్త్రవేత్తల దృష్టిలో కూడా మన విశ్వం వలయాల (స్పైరల్) ఆకారంలో ఉందని చెప్పబడటం గమనార్హం. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనదిగా చెప్పబడుతున్న రుగ్వేద సాహిత్యం కూడా విశ్వం బృహత్ అండాకారంలో ఉందని, దాని కార్యకలాపాలను నడిపించేవాడు బృహణస్పతి అని పేర్కొంది. ఈ బృహణస్పతినే తరువాత్తరువాత గణపతి అన్నారు. అతని ముఖం ఏనుగు తల ఆకారంలో ఉంటుందన్నారు. భువనగిరి ఏకశిలా పర్వతం కూడా ఏనుగు ఆకారంలోనే కన్పిస్తుండడం గమనార్హం. ఆచార్య కె.పుల్లారావుగారి పరిశోధనల్లో మహబూబ్‌నగర్ జిల్లా ముదుమల్‌లోని బృహత్‌శిలా యుగపు మానవులకు ఖగోళశాస్త్రం పరిజ్ఞానముందని ప్రాథమికంగా తేలింది. అదే నేపథ్యంలో అదే యుగానికి చెందిన భువనగిరి బృహత్‌శిలా యుగపు ప్రజలకు కూడా ఖగోళశాస్త్ర పరిజ్ఞానం ఉందని చెప్పడానికి వీరు చెక్కుకున్న అండాకారపు వలయాల చిత్రం (విశ్వం ప్రతిరూపం) నిదర్శనమని, ఆ బృహత్ అండమే భువనగిరి అని పేరు రావడానికి భూమిక అయ్యిందని చెప్పవచ్చు.

బృహత్ శిలా యుగపు మనుషులు ఇనుప లోహాన్ని కనిపెట్టి విరివిగా వాడారు.

ఈ నేపథ్యంలో వారు పూజించిన ఇనుప లోహ దేవతను మామ్మాయమ్మ అనేవారు. శిథిల స్థితిలో ఉన్న అలాంటి మామ్మాయి గుడి భువనగిరి కింద ఉత్తరం వైపున ఉంది. ఆ గుడిని ఇటీవల స్థానికులు పునరుద్ధరించడంతో దాని పాతదనం ఇప్పుడు కన్పించదు. కాని, ఆ గుడిలో ఇప్పటికీ ఉన్న మామ్మాయి విగ్రహం మాత్రం పాతదే. దాన్నిప్పుడు  పోచమ్మ అంటున్నారు.

## ప్రాచీన యుగంలో

క్రీ.శ.4 నుండి 6 శతాబ్దాల మధ్య కాలంలో ఈ కోటను విష్ణుకుండులు కట్టించారని చెప్పడానికి ఆధారంగా ఆ వంశపు రాజు విక్రమేంద్ర భట్టారకవర్మకు సంబంధించిన నాణెం ఒకటి భువనగిరి రెండవ ద్వారం వద్ద దొరికింది. పీనుగుల దర్వాజాగా పిలుస్తున్న ఈ కోట ప్రవేశ మార్గం దగ్గర విష్ణుకుండుల శిలాశాసనం కూడా ఒకటుంది. దాన్ని ఎవరూ ఇప్పటివరకు గుర్తించలేదు, చదువలేదు. అలాగే ఈ కోటగోడ పైభాగంలో చెక్కిన లంఘిస్తున్న సింహం శిల్పాన్ని, మొదటి కోటగోడ ప్రవేశద్వారం ఎడమవైపున కోటగోడ బయటి వైపున్న మరో లంఘిస్తున్న సింహం శిల్పాన్ని ఇప్పటివరకు ఏ చరిత్రకారుడూ చూడలేదు. అవి విష్ణుకుండుల రాజచిహ్నాలు. ఈ భువనగిరికి సమీపంలోనే విష్ణుకుండి రాజధానులైన కీసర, ఇంద్రపాలనగరం ఉండడం గమనార్హం.



ఏనుగుల బావి

భువనగిరి ప్రాచీన ప్రాశస్త్యాన్ని తెలిపే భువనేశ్వరాలయం కూడా ఈ పట్టణానికి ఆగ్నేయ దిశలో ఉండేది. దాన్ని నాలుగైదు వందల సంవత్సరాల కింద బహమనీ ముస్లిములో, కుతుబ్షాహీ ముస్లిములో కూల్చి దాని స్తంభాలు, ఇతరత్రా శిథిల శిలలతో జమాలె బహార్ దర్గా, గోరీలు కట్టారు. భువనేశ్వరాలయం ఎప్పటి నుంచి మనుగడలో ఉండేదో చెప్పలేము కాని, ముస్లిముల కూల్చివేతనాటికి ఉన్న ఆలయాన్ని మాత్రం 12వ శతాబ్దారంభంలో కాకతీయ రాజు రెండవ బేతరాజు కట్టించి ఉండవచ్చు అని ఆచార్య బిరుదురాజు రామరాజుగారు భావించారు. అందుకు నిదర్శనం బేతరాజుకు, అతని సామ్రాట్టు ఆరవ విక్రమాదిత్య చాళుక్యునికి 'త్రిభువనమల్ల' అనే బిరుదు ఉండడం అని రామరాజుగారు రాశారు. తరువాత కాలంలో 'త్రిభువనగిరి' పదంలోని 'త్రి' లుప్తమై 'భువనగిరి' మిగిలిందని వారి వివరణ. భువనగిరి మీదున్న కోట, దాని కింద ఉన్న రెండు మట్టి కోటలను కలిపి త్రిభువనగిరి అని పిలిచారేమో మొదట.

కందూరు చోడ రాజుల శాసనాలు మాత్రం రామరాజు గారి పరిశోధనలకు భిన్నంగా ఆ చోడుల సామంతులే భువనగిరిలో రెండు దేవాలయాలను కట్టించారని, ఆ ఆలయాలకు పలువురు రాజన్యులు దానాలు చేశారని తెలుపుతున్నాయి. క్రీ.శ.1105లో భీమదేవ చోడరాజు నుంచి తిప్పపర్తి గ్రామాన్ని దానంగా పొందిన కావలియ బ్రహ్మదేవయ్య భువనగిరిలో కట్టించిన బ్రహ్మేశ్వర ఆలయం, మఠాలకు క్రీ.శ.1106 ఏప్రిల్ 8 నాడు కొలనుపాక రాజు పరమార జగద్దేవుడు దానాలు చేశాడని కొలనుపాకలోని ఒక శాసనంలో ఉంది. భువనగిరిలోని మసీదు ముందట దొరికిన మరో శిలాశాసనంలో సొడ్డలయ్య అనే దండనాయకుడు భువనగిరిలోని భీమనారాయణ స్వామి ఆలయానికి దానాలు చేసే సందర్భంలో భీమ దండనాయకున్ని స్తుతించడం కన్పిస్తుంది. ఈ భీమ దండనాయకుడు కందూరు చోడరాజు భీమదేవుడు అనేవాడే.

క్రీ.శ.12వ శతాబ్దారంభంలో కందూరు చోడులు, కాకతీయులు, ఇంకా కొందరు స్థానిక రాజవంశీయులు కూడా కళ్యాణి చాళుక్య రాజులకు సామంతులుగా, దండనాయకులుగా, సైన్యాధ్యక్షులుగా ఉండేవారు. అలాంటివారిలో లక్ష్మీదేవుడు అనే ఒక దండనాయకుడు చాళుక్యరాజు త్రిభువనమల్లుని కాలంలో క్రీ.శ.1111లో వైశాఖ పౌర్ణమి నాడు చంద్రగ్రహణ సమయంలో భువనగిరి కరణాలతో కలిసి భువనగిరిలోని సోమేశ్వర ఆలయానికి శాశ్వత గండదీపం (నందదీగ) దానం చేసినట్లు తెలిపే ఒక శిలా శాసనం భువనగిరిలోనే లభించింది.

చాళుక్య రాజుల సర్వసైన్యాధ్యక్షుడైన కేశియరసర్ పై ఆలయానికే క్రీ.శ.1123లో

గానుగలవాండ్ల నుంచి వచ్చే పన్ను బకాయిలను దానం చేసిన మరో శాసనమూ భువనగిరిలో దొరికింది. సరిగ్గా 23 సంవత్సరాల తరువాత... అంటే 1146 ఏప్రిల్ 15న (వైశాఖ శుద్ధ త్రయోదశి) సాక్షాత్తూ కళ్యాణి చాళుక్య చక్రవర్తి జగదేకమల్లుడు భువనగిరిలోని సోమేశ్వరాలయానికి వచ్చి దేవునికి, పూజార్లకు నెలనెలా కావలసిన సదుపాయాలకోసం పన్నుల నుంచి వచ్చే ఆదాయాన్ని, కొన్ని భూములను దానం చేసినట్లు తెలిపే మరో శిలాశాసనం స్థానిక ఖాజీ ఇంటి వెనుకున్న బావి దగ్గర దొరికింది. భువనగిరి కోటలోని మూడవ ప్రవేశ ద్వారాన్ని పీనుగుల దర్వాజా లేదా పీనుగుల దిబ్బ అని పిలుస్తారు. ఆ దర్వాజాకు రెండు వైపులా ఉన్న నాలుగు శాసనాలను ఇప్పటివరకూ ఎవరూ సరిగ్గా చదువలేకపోవడం వలన ఆ కాలం (12వ శతాబ్దం పూర్వార్థం) నాటి మరెన్నో చారిత్రక విషయాలు తెలియడం లేదు.

## మధ్యయుగంలో

మొత్తమ్మీద భువనగిరిలో (1976)లో లభించిన 8 శాసనాలు విశదం చేసేదేమిటంటే, భువనగిరి కోటను క్రీ.శ. 1100వ సంవత్సరం వరకే తెలంగాణలోని సామంతరాజులే నిర్మించారని, భువనగిరి ఒక తీర్థ క్షేత్రం కూడా అని. ఈ కోట క్రీ.శ. 1163 వరకు కళ్యాణి చాళుక్యులకు, ఆ తరువాత 1323 వరకు కాకతీయులకు సామంత రాజధానిగా మనుగడ సాగించింది. మరో పుష్కరకాలం వరకు మహమ్మద్ బిన్ తుగ్లక్ అనే ఢిల్లీ సుల్తాను దాడుల నేపథ్యంలో కాకతీయ రాజ్య పతనంతో అతలాకుతలమైనా క్రీ.శ. 1336 ప్రాంతంలో ముసునూరి నాయకుల ఏలుబడిలోకి వచ్చింది. కాని మళ్ళీ అనతి కాలంలోనే దక్కన్‌లో ఏర్పడిన మరో ముస్లిం రాజ్యం స్థాపకుడు బహమన్ షా ఆధీనంలోకి వెళ్ళిపోయింది. ఆయనకు, ముసునూరి కాపయ నాయకునికి మధ్య క్రీ.శ. 1350 ప్రాంతంలో కుదిరిన సంధిలో భువనగిరి ఉత్తర తెలంగాణ సరిహద్దుగా నిర్ణయించబడింది.

అయితే 20 సంవత్సరాలు తిరుగక ముందే 1369లో భువనగిరిని రాచకొండ పద్మనాయక రాజు అనపోత నాయడు ఆక్రమించాడు. అప్పటి నుంచి సుమారు ఐదు దశాబ్దాల కాలం ఆయన, ఆయన వారసుల పాలనలో కొనసాగింది. అందుకు నిదర్శనమైన ఒక శిలా శాసనం ఖాజీ ఇంటి దగ్గర దొరికింది. అది అనపోతన కొడుకు సింగమనాయకుడు వేయించింది. ఆయన మంత్రి బాచయ వేయించిన శాసనమూ పీనుగుల దిబ్బ దగ్గర ఉంది. ఆయన చిన్నతాత మనుమడు కొరవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక'లో భువనగిరిలో పురాణ శ్రవణం




జరిగేదని, ఆ నగర ప్రజలు శ్రీశైలం, ఆహోబిలం, ఓరుగల్లు, కాళేశ్వరం, ధర్మపురి సందర్శనలు చేసేవారని వివరణలున్నాయి.

క్రీ.శ.1432లో మళ్ళీ బహమనీ సుల్తానుల (అహ్మద్ షా) అధీనంలోకి వెళ్ళి ఇక 5 శతాబ్దాల పైబడి ముస్లింల పాలనలోనే ఉంది. బహమనీల వారసులు కుతుబ్షాహీలు, వారి తర్వాత వచ్చిన ముస్లిం రాజులు నిజామ్‌లు. అయితే మధ్య మధ్యలో.... 15వ శతాబ్దారంభంలో కొంతకాలం విజయనగర రాజ్య సామంతుడు మాదయ లింగమ నాయకుడు, 16వ శతాబ్దారంభంలో కొంతకాలం సీతాపతిఖానుడు, 18వ శతాబ్దారంభంలో కొంతకాలం సర్వాయి పాపన్న ఈ భువనగిరి కోటను ఆక్రమించి పాలించారని రామరాజు రాశారు. చాళుక్యుల కాలంలో ఉచ్ఛస్థితిని అనుభవించిన భువనగిరి మరోసారి 16, 17 శతాబ్దాలలో కుతుబ్షాహీల ఆధ్వర్యంలో ఆహ్లాదకరమైన స్థితిలో ఉన్నట్లు ఈ కొండ మీదున్న చారిత్రక అవశేషాల ద్వారా, ఆనాటి రచనల ద్వారా తెలుస్తున్నది. తారీఖ్-ఇ-జఫరా, తధ్‌కిరా వంటి సమకాలీన గ్రంథాలు గోల్కొండ చుట్టూ భోన్‌గిర్, నార్కొండ, పటాన్‌చెరు, ఇబ్రహీంపట్నం మధ్యనున్న 500 మైళ్ళ వైశాల్యంలో పూలు, ఫలాలతో కళకళలాడే పచ్చదనం విస్తరించి ఉండేదని వర్ణించాయి.

## ఆధునిక యుగంలో

ఆధునిక యుగంలో కూడా భువనగిరి తెలంగాణ చరిత్రలో చోటు సంపాదించుకున్న నాయకులను అందించింది. తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, భూదానోద్యమానికి తొలి ఊపిరినిచ్చిన భూదాన్ రామచంద్రారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోమ్ మినిస్టర్‌గా సేవలందించిన ఎలిమినేటి మాధవరెడ్డి భువనగిరి బిడ్డలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరెస్ట్ శిఖరాన్ని అతిచిన్న వయసులోనే అధిరోహించి రాష్ట్రానికి పేరు తెచ్చిన మాలావత్ పూర్ణ, ఆనంద్‌లకు వారి గురువు బిజినేపల్లి శేఖర్‌బాబు శిక్షణనిచ్చింది ఈ భువనగిరి మీదనే. ఇంతటి ప్రాధాన్యం కలిగి రాష్ట్ర రాజధాని నగరం (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోకి కూడా చేరిపోయి 163వ నంబర్ జాతీయ రహదారి మీద ఉంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం భువనగిరిని అడ్వెంచర్, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తుండడం ముదావహం.

చారిత్రక ప్రాధాన్యమున్న భవనగిరి ప్రకృతి సౌందర్యానికి, సాహసకృత్యాలకు కూడా నెలవు. 600 అడుగుల ఎత్తున్న ఈ ఏకశిలా నగరం ఎక్కితేనే మనకు ఈ అందాలన్నీ కనబడగలవు. హైదరాబాదుకు 45 కిలోమీటర్ల దూరంలో భువనగిరి పట్టణం మధ్యలో ఉన్న ఈ బృహత్ శిల పైన కొన్ని, చుట్టుపక్కల కొన్ని దర్శనీయ స్థలాలున్నాయి.

## కోటగోడలు, ప్రాంగణాలు

పట్టణం వైపున్న భువనగిరి గుట్ట ఏటవాలు స్థలం నుండి ఎక్కడం ప్రారంభించి ఓ వంద మెట్లు దాటాక కోట ద్వారానికి కుడివైపున, మనకు ఎడమ వైపున, కోట గోడ లోపల రాతి గుండ్ల సముదాయం కన్పిస్తుంది. ఈ గుండ్లల్లో ఒక ఇనుప ఫిరంగి కూరుకుపోతున్నది. ఫిరంగికి, కోట ద్వారానికి మధ్యలో నాలుగు గుండ్లు ఒక గుహను ఏర్పర్చాయి. అందులో ఒక రాయి ఉపరితలానికి ఒక వలయాల రేఖా చిత్రముంది. అడుగున్నర పొడవు, అడుగు వెడల్పు పరిమాణాలతో అండాకారంలో ఉన్న ఆ రేఖాచిత్రాన్ని (పెట్రోగ్లిఫ్) సుమారు మూడు వేల సంవత్సరాల కిందట ఇక్కడ నివసించిన బృహత్ శిలా యుగపు ప్రజలు విశ్వభువన భాండానికి... అంటే దేవునికి ప్రతిరూపంగా చిత్రించుకొని పూజించారు.

ఈ రేఖాచిత్రపు గుండ్లనుండి కోట ద్వారంలోకి ప్రవేశించే ముందు కుడివైపుకు

చూస్తే అల్లంత దూరంలో కోటగోడను ఆనుకొని మరికొన్ని గుండ్లు కన్పిస్తాయి. వాటికి ఆంజనేయుడు, వినాయకుని విగ్రహాలు చెక్కి ఉన్నాయి. భువనగిరిలో దొరికిన పద్మనాయక రాజు సింగమనాయకుని శాసనం ఆధారంగా, ఈ విగ్రహాల శిల్పరీతి ఆధారంగా వీటిని క్రీ.శ.1369లో సింగమ తండ్రి అనపోతనాయుడు ఈ కోటను జయించిన సందర్భంగానో, లేదా మరో 20 సంవత్సరాలకు ఇక్కడికి వచ్చిన సింగమనాయుడో చెక్కించారని చెప్పవచ్చు.

ఈ విగ్రహాల వెనుక కోట గోడకు మరికొన్ని శిల్పాలున్నాయి. వాటిల్లో ముందు కాలు ఎత్తి లంఘిస్తున్నట్లు కన్పిస్తున్న సింహం శిల్పం క్రీ.శ.4–6 శతాబ్దాల మధ్య తెలంగాణను పరిపాలించిన విష్ణుకుండి రాజుల అధికారిక చిహ్నాన్ని సూచిస్తుంది. విష్ణుకుండి వంశపు చివరి గొప్ప రాజు విక్రమేంద్ర భట్టారక వర్మకు సంబంధించిన నాణెం ఒకటి భువనగిరిపై దొరికింది. దీనిపైనున్న పీనుగుల దర్వాజా దగ్గర ఒక శిలా శాసనంలో కూడా విష్ణుకుండుల కాలపు అక్షరాలున్నాయి. వీటన్నింటి వల్ల భువనగిరి కోటను మొట్టమొదట విష్ణుకుండి రాజులు క్రీ.శ.4–6 శతాబ్దాల మధ్య కాలంలో నిర్మించారని చెప్పవచ్చు.

కోట ప్రవేశ ద్వారం అన్ని కోటలలాగే మూడు మలుపులతో శత్రు దుర్భేద్యంగా, హుందాగా ఉంది. ఇరుకైన మెట్ల వరుసలు అందంగా ఉన్నాయి. ఈ ద్వారానికి కొంత కాలం క్రితం వరకూ ఎత్తైన చెక్క తలుపులు ఉండేవట. ఈ ద్వారం ఇప్పటికీ కొంతసేపు ఆగి చూడదగిన అందంతో అలరారుతున్నది. దీనిని ఆనుకొని కుడివైపు కోటగోడలు భువనగిరి మీదికి సాగుతున్నాయి.

కోటగోడల వెంబడే విశాలమైన మెట్లున్నాయి. ఆ మెట్లనెక్కుతూ కిందివైపు నుండి వచ్చే గాలులను ఆస్వాదిస్తూ, చుట్టూ ఆవరించి ఉన్న పట్టణం, గుట్టలు, పచ్చని ప్రకృతి, పంట పొలాలు, చెరువులు చూస్తూ ముందుకు సాగితే కొంత దూరం తర్వాత మరో ప్రవేశ ద్వారం వస్తుంది. ఇది మొదటి ప్రవేశ ద్వారం కంటే మరింత ఉన్నతంగా ఉంది. దీన్ని చాళుక్యుల కాలం (క్రీ.శ.1100 ప్రాంతం) తర్వాత 15, 16 శతాబ్దాల్లో బహమనీలు, కుతుబ్షాహీ రాజులు బాగా మరమ్మత్తు చేశారని వారి (ముస్లిం) వాస్తుశైలి పూర్వపు నిర్మాణాల మీద కన్పిస్తుంది. ఈ ద్వారంలో భాగంగానే రహస్య సొరంగ మార్గం ఉంది. అంతకు ముందున్న ప్రవేశ ద్వారం తూర్పు వైపుకు ఉండగా దాన్ని మూసి వేయడం జరిగింది.

దాని పక్కనే ఒక ఎత్తైన వేదిక కట్టి దాని మీద ఒక పొడవైన ఫిరంగిని పెట్టారు – 16వ శతాబ్దంలో. కింది వైపు నుండి వచ్చే శత్రువులని పేల్చి వేయడానికి. ఈ

ఫిరంగికి ఎడమ వైపున మరో ఫిరంగి గద్దె ఉంది కాని, దాని మీది ఫిరంగి మాత్రం గుట్ట కింది భాగంలో ఉన్న నీటి గుండంలో పడిపోయిందట. ఈ రెండవ ప్రవేశ ద్వారాన్ని ఆనుకొని అనేక నిర్మాణాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిల్లో అందమైన అండాకారపు రాతి కప్పుతో ఉన్న రెండు మూడు గజాల పొడవైన జలకుండికలు మన దృష్టిని ఆకర్షిస్తాయి. ఇంకా స్నానాల గదుల వంటి నిర్మాణాలున్నాయి. ఈ స్థలంలో కుతుబ్షాహీల కాలంలో ఫిరంగులను, వాటికి కావలసిన మందు గుండ్లను తయారు చేసిన రోళ్ళు, డాకళ్ళు మొదలైన ఆనవాళ్ళు కన్పిస్తున్నాయి. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న మడిగల వెనుక ఈ మధ్య కూడా ఫుట్‌బాల్ సైజులో ఉన్న ఒక ఇనుప గుండు దొరికిందని పర్యాటకులకు టిక్కెట్లిస్తున్న వినోద్ చెప్పాడు. ఆ ఇనుప గుండు కోట పైనున్న ఫిరంగుల్లో ఒక పెద్ద ఫిరంగి శతృవుల పైకి పేల్చిందే.

## వంటశాల, మంటపం

ఫిరంగి వేదికల వెనుక చిన్నపాటి మైదానముంది. అందులో ఒక పెద్ద వంటశాల ఉంది. దానినానుకొని ధాన్యాగారాలున్నాయి. ఈ వంటశాల మీది వైపు కూడా అనేక గదుల వరుసలున్నాయి. అవి సైనికుల ఆవాసాలో, అశ్వశాలలో లేక కార్యాలయ గదులో అయ్యుంటాయి. ఈ గదులు, వంటశాల మధ్య ఒక శిలా మంటపం ఉంది. మంటప స్తంభాలు నాలుగూ శిల్పకళతో ఒప్పారుతున్నాయి. కాని అవి ఒక దేవాలయానివి కావు, ఒకే కాలానికి చెందినవి కావు. అవన్నీ సుమారు తొమ్మిది వందల ఏళ్ళ కిందట చాళుక్యుల కాలంలో ఇక్కడ నిర్మించిన ఆలయాలకు చెందినవి. వాటిని 14, 15 శతాబ్దాలలో బహమనీ వంశానికి చెందిన ముస్లిం రాజులు ధ్వంసం చేశారు. మూడున్నర దశాబ్దాల కింద సినీ హీరో కృష్ణంరాజుపై ఇక్కడ చిలకా గోరింక అనే సినిమాను చిత్రీకరిస్తున్నప్పుడు చుట్టుపక్కల పడి ఉన్న ఆలయ స్తంభాలను ఒక చోట చేర్చి మంటపం లాగా నిలబెట్టి, వాటి మధ్యలో ఆంజనేయుని విగ్రహాన్ని పెట్టి చిత్రీకరణ చేసుకున్నారట.


ఈ మంటపం నుండి ముందుకు సాగితే కుడివైపు కొండ అంచు, దాని కింద గుండం అగాధంగా కన్పిస్తాయి. ఆ కొండ అంచున కూర్చుంటే కింది నుంచి రివ్వున వస్తున్న చల్లగాలులు మన ముంగుర్లు రేపుతూ ఆహ్లాదాన్నిస్తాయి. ఈ కొండంచు వెంబడే గజమెత్తు మట్టిగడ్డ విశాలంగా కన్పిస్తుంది. ఆ మట్టిని ఏ వెయ్యేండ్ల కిందనో కింది నుంచి తెచ్చి ఆయా కట్టడాల నిర్మాణంలో వాడారు. ఆ మట్టిలో అనేక చారిత్రక అవశేషాలు దొరికే అవకాశాలు విశేషంగా కన్పిస్తున్నాయి. కాబట్టి, రాష్ట్ర పురావస్తు

శాఖ ఇక్కడ తవ్వకాలు చేపట్టవలసి ఉంటుంది.

ఈ మట్టి మేట నుంచి కొండ పైకి ఎక్కడానికి కొండ అంచునే రెండు గజాల వెడల్పైన మెట్లను ఏర్పాటు చేశారు. వాటి మీద గుర్రాలు ఒకప్పుడు వేగంగా పైకి పరుగెత్తేవి. ఇప్పుడు మాత్రం ఆకతాయిలు ఆ మెట్ల రాళ్ళను చాలా వాటిని కొండ కిందికి దొర్లించి వికృతానందం పొందుతుండడంతో వాటి ఆనవాళ్ళు మాత్రమే అక్కడక్కడా మిగిలాయి.

## సప్తగుండాలు

ఈ రాతి మెట్లకు సమాంతరంగా కొండ మధ్యలో ఉత్తరం నుంచి దక్షిణం వైపుగా సాగుతున్న ఏటవాలులో ఏడు నీటి గుండాలు ఏర్పడ్డాయి. వాటిని సప్తగుండాలు అని, ఏడు కన్యకల బావులు అని పిలుస్తున్నారు. నిజానికి అవి బావుల పరిమాణంలో కాకుండా కుంటల పరిమాణాల్లో ఉన్నాయి. వాటి నుండి ఒక్క నీటి చుక్క కూడా కిందికి వృధాగా జారిపోకుండా దంగు సున్నంతో కలిపిన రాతి నిర్మాణాలు చేశారు. వర్షాకాలంలో కొండ పైనుంచి జాలువారిన నీటితో నిండిన గుండాలు ఎండాకాలంలో కొండ పైనున్న ప్రజలకు ఉపయోగమయ్యేలా ఉన్నాయి. ఆ గుండాలను ఆనుకునే ప్రజలు, సైనికుల నివాస స్థానాలు, ఆలయాలు ఉండేవని చెప్పడానికి అక్కడ వాటి పునాదులు కన్పిస్తున్నాయి. భువనగిరిలో దొరికిన శాసనాల్లో ఇదొక తీర్థక్షేత్రం అనడానికి కారణం ఈ అరుదైన అందమైన నీటి గుండాలే. కిందికి పోతున్నా కొద్దీ ఈ నీటి గుండాల పరిమాణం, లోతు పెరుగుతూ పోయాయి. పూర్తిగా కింది వైపునున్న


సప్తగుండాలు

ఆరవ, ఏడవ గుండాలనైతే ప్రత్యేకంగా నిర్మించారు. వాటి మధ్య ఆనకట్ట కట్టారు. ఆ కట్టకు ఇరువైపులా గుండాల్లోకి మెట్లు కట్టారు. మెట్లకు సమాంతరంగా నీటి మట్టాలను తెలుసుకొనే రంధ్రాలు తొలిచారు.

సుమారు అడుగు ఎడంతో 60 నుంచి 100 అడుగుల లోతున్న ఈ గుండాలు ఈతకు అనువుగా ఉండేవి ఒకనాడు. ఈనాడేమో చిన్న చిన్న పెడల్ బోట్లు తిప్పడానికి అనువుగా ఉన్నాయి. కేవలం ఆనకట్టను నీరు జారిపోకుండా మరమ్మత్తు చేస్తే చాలు, మరింత ఆనందాన్ని మన సొంతం చేసుకోవచ్చు.

అన్నింటి కన్నా పైనున్న గుండం నుండి ఎడమ వైపుకి సాగితే కోట పైభాగానికి చేరుకుంటాం. కుడి వైపుకి సాగితే 'చెరువు కుంట'కు చేరుకుంటాం. మూడు తంతెలుగా ఉన్న భువనగిరి కొండ మొదటి తంతె కింది పాదం భాగంలో ఉన్న ఈ చెరువుకుంట చాలా అందమైనది. అరుదైనది. నిజంగానే ఒక చిన్నపాటి చెరువంత విశాలంగా ఉంది. ఎండాకాలంలో కూడా దానిలో నీళ్ళు ఎండిపోవడం లేదు. పైగా అంతు తెలియనంత లోతుగా ఉంది అంటారు. ఈ చెరువు మీదివైపు భైరవ శిల్పం చెక్కి ఉంది. దాన్ని క్రీ.శ.1369లో పద్మనాయకరాజు అనపోతానాయుడు చెక్కించాడు – భువనగిరిపై తన విజయానికి గుర్తుగా. చెరువు కుంట చుట్టూ అనేక రోలు గుంటలు, కుండపెంకులు కన్పిస్తున్నాయి. ఇవి ఒకప్పటి ప్రజల నివాసాన్ని, మందు గుండు సామాగ్రి తయారు చేసిన కర్మాగారపు ఆనవాళ్ళను తెలియజేస్తున్నాయి. ఇప్పటికీ ఈ చెరువుకుంట వెనుకనున్న కోటగోడనానుకొని ఉన్న రాతి గుండ్లల్లో ఒకప్పుడు (16వ శతాబ్దంలో) ఇక్కడే తయారైన ఫిరంగి కూరుకుపోతూ కన్పిస్తుంది.

## చెరువులు, కుంటలు

ఈ ఫిరంగి ఉన్న రాతి గుండ్లు మొదలుకొని భువనగిరి ఉపరితలం చుట్టూ విశాలమైన కోటగోడ ప్రహరీ చేయడానికి వీలుగా కట్టారు. కొండ అంచును పరివేష్టితమై ఈ గోడ ఉంది కాబట్టి, గోడ కింది కొండ నిటారుగా, జారుడుగా ఉంది కాబట్టి కింది నుంచి శత్రువులు ఎవరూ ఈ కొండను ఎక్కే సాహసమూ చేయలేరు. చేసినా వారిని అప్పుడే, అక్కడే ఎదుర్కొనే విధంగా గోడల్లో నుండి తుపాకులు పేల్చేందుకు, మసిలే నూనెను పోసేందుకు వీలుగా రంధ్రాలున్నాయి. చెరువుకుంట దగ్గరి ఈ కోట గోడ మీది నుంచి కుడి వైపుకు చూస్తే మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తీనేమి చెరువు అనే ఓ పెద్ద చెరువు కన్పిస్తుంది. దానిని భువనగిరి పర్యాటకుల కోసం బోటింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చు. తీనేమి

చెరువుకు, వరంగల్ వెళ్ళే రహదారికి మధ్య కొచ్చెగుట్టలున్నాయి. ఆ గుట్టల్లో ఒక ప్రాచీన శివాలయం బ్రహ్మాండమైన ముఖమండపంతో ఉండగా సమీపపు మరో గుట్టపై వీరభద్రాలయముంది. చరిత్ర, భక్తి, ట్రెక్కింగ్ మీద ఆసక్తి ఉన్న పర్యాటకుల కోసం ఈ ఆలయాలను పునరుద్ధరించాలి.

కొచ్చెగుట్టల పక్క నుంచి వెళ్తున్న వరంగల్ రహదారికి ఎడమవైపున రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య కొంత భూమి సేకరించింది. సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆ ప్రాంతం నుండి భువనగిరి పైకి రోప్‌వే (తాళ్ళ వంతెన) నిర్మించి, రోప్‌వే బకెట్లలో పర్యాటకులను చేరవేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నది.

రోప్‌వే నిర్మాణ స్థలానికి వెనుక/ఎడమ వైపున అమ్మకుంట అనే చెరువుంది. అది చాలా వరకు కబ్జాకు గురైంది. ఈ అమ్మకుంట, తీనేమి చెరువుల పేర్లు 8, 9 శతాబ్దాల్లో ఇక్కడ మనుగడలో ఉన్న జైన మతస్థుల ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తున్నాయి.

## కోటగోడ అంచుల వెంట

అమ్మకుంటను చూసి కోటగోడ మీదుగా ముందుకు సాగుతూ ఉంటే కొంచెం దూరం తరువాత ఆ కోటగోడ ఉత్తరపు కొస నుంచి మనం మళ్ళీ దక్షిణం వైపుకు తిరిగే విధంగా మలుపు తీసుకుంది. ఈ మలుపు ప్రాంతం చాలా థ్రిల్లింగ్‌గా...నిజం చెప్పాలంటే ఒకింత భయంకరంగా, అదే సమయంలో ఆహ్లాదకరంగా, ఆసక్తికరంగా కూడా ఉంది. 550 అడుగుల ఎత్తునున్న కోట బురుజుల కింద ఉన్న భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడ అందాలను, పాములాగా వంకలు తిరుగుతూ సాగిపోతున్న రైళ్ళ సోయగాలను, మరికొన్ని కిలోమీటర్ల దూరంలో కన్పిస్తున్న యాదగిరి క్షేత్రాన్ని ఈ కోట మలుపు నుండి చూడడం మరిచిపోలేని మధురానుభూతినిస్తుంది.

## రాణుల స్నానఘట్టాలు

భువనగిరికి పడమటి వైపున్న ఈ కోట బురుజులకు, కొండ స్థలానికి మధ్యనున్న ఖాళీ స్థలంలో మరో రెండు విశాలమైన కోనేర్ల వంటి నీటి గుండాలున్నాయి. వీటిని రాణి వాసపు స్త్రీలే వాడినట్లు తెలిపే స్నానపు గద్దెలు, సమీపపు పూల వనాలు, పక్కనున్న నంది, ఆంజనేయ విగ్రహాలు తెలియజేస్తున్నాయి. మరో గుండంలో చెత్తా చెదారం పడకుండా దాని పైన పందిరి వేశారని తెలిపే పునాది రంధ్రాలు కన్పిస్తున్నాయి. ఈ గుండాల నుండి  పూల వనాలకు నీటిని మోటల ద్వారా సరఫరా చేసేవారని తెలిపే ఆనవాళ్ళు కూడా కన్పిస్తున్నాయి. కనకాంబరాలు, గోరింటలు,

బంతులు, తీగ మల్లెలు మొదలైన పూల చెట్లు ఇప్పుడు కూడా పుష్పించి కన్పిస్తున్నాయి – వాటి విత్తనాలు ఏటా వర్షాకాలంలో మొలకెత్తుతున్నాయి కనుక. ఇక్కడున్న శివాలయాన్ని ధ్వంసం చేసి శివుడు, నంది విగ్రహాలను ఒక గుండంలో పడేశారు. వెయ్యేళ్ళ కిందటి నంది సౌందర్యం నీళ్ళలో నుండి కూడా పైకి కన్పిస్తున్నది. గుండం ఒడ్డునున్న కొండకే ఆంజనేయ విగ్రహాన్ని కొండకే తొలిచారు. పద్మనాయకరాజు అనపోతనాయడు ఆరున్నర శతాబ్దాల కింద ఈ భువనగిరిని జయించినప్పుడు కోటను అష్ట దిగ్బంధనం చేయడంలో భాగంగా చెక్కించిన ఆంజనేయ విగ్రహాల్లో ఇదొకటి.

## ఏనుగుల బావి

ఆంజనేయ విగ్రహం నుంచి ముందుకు సాగుతూ కొండ దక్షణపు చివరను చేరుకుంటున్న మార్గంలో మనకు మరో రెండు నీటి గుండాలు కన్పిస్తాయి. ఇవి కూడా విశాలమైనవే. చిట్టచివరి గుండాన్ని ఏనుగుల బావి అని పిలుస్తారు. ఈ బావి లోతు కూడా తెలియదట. లోతైన బావి కాబట్టే అందులో నీళ్ళు పచ్చగా ఉన్నాయి. కాని ఒకప్పుడు దీనిలోని నీటిని ఏనుగుల సహాయంతో శుభ్రం చేసేవారట. భువనగిరి అగ్రభాగాన ఉన్న రాజ భవనంలోకి ఈ బావి నుండే నీటిని పైపుల ద్వారా సరఫరా చేసేవారు. రాజ భవనం కంటే కొంచెం ఎత్తైన గోడలు (ఆర్చిలు) కట్టి, వాటి మీదున్న కుళాయిలోకి ఏనుగుల ద్వారా మోటతో నీటిని నింపి, దాని నుండి పైపుల ద్వారా రాజ భవనం గోడలనానుకొని ఉన్న కుండీలలోకి, స్నానాల గదుల్లోకి నీటిని సరఫరా చేసిన ఆధారాలు ఇప్పటికీ కన్పిస్తున్నాయి. ఈ ఏనుగుల మోట ఒక అద్భుత దృశ్యంగా కనిపిస్తుంది.

## రాజభవనం, ఫౌంటెయిన్

ఏనుగుల బావి దగ్గర నుండి చూస్తే చుట్టూ విస్తరించిన భువనగిరి పట్టణం కన్పిస్తుంది. బావి నుండి ఎడమ వైపుకు వెళ్తే ఒక విశాలమైన ఎత్తైన వేదిక కన్పిస్తుంది. అది సుమారుగా చదరంగా ఉంది. దాన్ని ఎక్కడానికి ఉత్తరం నుండి, దక్షిణం నుండి ఆరేసి మెట్లున్నాయి. మెట్లెక్కగానే మనల్ని అమితంగా ఆకర్షించేది దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న జల కుండం. సుమారు 4 గజాల వెడల్పు, 8 గజాల పొడవు గజంనర లోతుతో నిర్మించిన ఈ కుండం 4 అంచులను నాలుగే రాళ్ళతో కట్టడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 24 అడుగుల పొడవైన ఏకశిలా రాళ్ళను ఎలా అంత నునుపుగా, అందంగా మలిచారో మనకర్థం కాదు. ఈ జలకుండం కుతుబ్షాహీల

కాలంలో ఫౌంటెయిన్‌గా ఉండి ఉంటుంది. గుట్ట కింది నుంచి వచ్చే పిల్ల గాలులు ఈ ఫౌంటెయిన్ నీటి బిందువులను కలుపుకొని వచ్చి ఇచ్చే చల్లదనాన్ని ఆనాటి రాజులు ఇక్కడ ఆరుబయట కూర్చుని హాయిగా ఆస్వాదించేవారన్నమాట.

నిజానికి ఈ ఫౌంటెయిన్ రాజభవనం పశ్చిమపు ఆవరణలో ఉంది. దీని తరువాత తూర్పు వైపు మూడు ఆవరణలు ఒక్కొక్కటి మూడేసి విశాలమైన గదులతో నిర్మించబడ్డాయి. ఒకప్పుడు పడమటి ఆవరణలో కూడా మూడు గదులున్నట్లు భావిస్తే ఈ భవనంలో మొత్తం పన్నెండు గదులుండేవన్నమాట. ఇస్లామిక్ వాస్తులో ఇలాంటి నిర్మాణాన్ని బారాదరి అంటారు (బారా=12). బారాదరి సాధారణంగా కోట శిఖరాగ్ర స్థానంలోనే ఉంటుంది. ఇక్కడ కూడా అలాగే ఉంది.

## నిర్మాణ వైచిత్ర్యం

పడమటి ఆవరణ తరువాతి ఆవరణ మొదలుకొని తూర్పు ఆవరణ వరకు ప్రతి గది గోడ పునాది స్థలంలో మూడు గజాల పొడవు, గజం వెడల్పు, గజం లోతుతో ఉన్న భూగర్భ కుండీలు ఉన్నాయి. అంటే ప్రతి గదిలోనూ మంచినీటి వసతి ఉండేదన్నమాట. ఇలాంటి కుండీలలోకి ఏనుగుల బావి నుండి పైపుల కనెక్షన్ ఉంది. ఈశాన్యం వైపు గదిలో కుండీలకు నీరు బయటకు వెళ్ళే మార్గాలు కూడా ఉన్నాయి. కాబట్టి అవి మగురుదొడ్లు అయ్యుంటాయి. ఈ కుండీలన్నింటి మీద వేసిన రాతి పైకప్పులు శిల్పకళా శోభితంగా ఉన్నాయి.

పడమటి ఆవరణ నుండి తూర్పు వైపు ఆవరణ వైపు వెళ్తున్నాకొద్దీ నిర్మాణాలు, వాటి వైచిత్ర్యం పెరుగుతూ పోయింది. రెండవ ఆవరణలో రాజసం ఉట్టిపడేలా రెండు వైపులా రెండేసి పొడవాటి స్తంభాలున్నాయి. ఆ స్తంభాలను ఆనుకొని ఉత్తరం వైపు, దక్షిణం వైపు ఉన్న గదుల మీద 12 గజాల పొడవైన (ఒకే) కర్రతో చేసిన దూలాలున్నాయి– ఇప్పటికీ... అంటే అయిదారు శతాబ్దాలు గడిచిన తరువాత కూడా.

## అలంకరణలు

పడమటి ఆవరణలో గోడల కింది నుంచి పై వరకు డంగు సున్నంతో చేసిన అలంకరణలుండగా తూర్పు వైపు ఉన్న రెండు ఆవరణల్లోని ఆరు గదుల గోడలు అన్నీ గూడులతో అలంకరించబడినవి. అరంగుళం మందమున్న చెక్కలను అరడుగు, అడుగు పరిమాణాల్లో గూడులుగా చేసి, వాటి పైన రెండు మిల్లీ మీటర్ల మందంతో డంగు సున్నం పూసి అనేక అలంకరణలను రూపొందించడం అద్భుతంగా కన్పిస్తుంది.

మెత్తటి దుబ్బ/ఒండ్రు మట్టిని సున్నంతో కలిపి, అందులో కోడిగుడ్ల సొన పోసి తయారు చేసిన మిశ్రమంతో ఆ గూడులకు పూత పూయడం వల్ల అవి అత్యంత నునుపుగా, పోత పోసినట్లుగా అందంగా కన్పిస్తున్నాయి. ఆ గూళ్ళకు పసుపు రంగు పూయడం వల్ల వాటి అందం మరింత ఇనుమడించింది. వాటి అందాన్ని చూసి ఓర్వలేని జులాయిలు వాటిని రాళ్ళతో కొట్టడం, వాటి మీద తమ పేర్లు, ప్రియతముల పేర్లు బొగ్గుతో రాస్తుండడం వల్ల ఆ అందమైన గూళ్ళన్నీ చెదిరిపోతున్నాయి.

ఇలాంటి గూడులే భవనం పైన చుట్టూరా ఒక్కో యూనిట్‌లో 12 చొప్పున ఉండేవి. వాటినీ చాలా వరకు ధ్వంసం చేశారు. ఈ రాజభవనం రెండు అంతస్థుల్లో ఉంది. ఈశాన్యం, ఆగ్నేయపు గదుల నుండి పై అంతస్థుకు, భవనం కింద ఉన్న భూగర్భ అంతస్థుకు మెట్లున్నాయి. భవనం పైకి ఎక్కినప్పుడు మనకు భువనగిరి మీదనే కాదు, సకల భువన భాండం మీద అనుభూతి కూడా కలుగుతుంది. అందుక్కారణం ఎత్తు ఒకటి కాగా, ఈదర గాలి మరొకటి.

భవనపు తూర్పు ఆవరణలోని మధ్య గది మరీ అందమైనది. రాజుకు విశ్రాంతికై కేటాయించినదై ఉంటుంది. ఆ గది ముందు (తూర్పు) భాగంలో అర్ధ చంద్రాకారంలో ఒక బాల్కనీ ఉంది. బహుశా కుతుబ్షాహీ సుల్తాన్ (రాజు), లేదా అతని సైనికాధికారి సైనికులకు ఆజ్ఞలు ఇవ్వడానికి గానీ, ప్రజలకు ఝరోకా దర్శనమిచ్చి వారి సమస్యలు వినడానికి గాని ఈ బాల్కనీ ఉపయోగపడి ఉంటుంది.

భవనం కింద (అండర్ గ్రౌండ్‌లో) ఉన్న ఆర్చి గదులు అశ్వశాలలుగా, సైనిక గృహాలుగా ఉపయోగపడి ఉంటాయి. ఒకప్పుడు ఈ భవనం నలుమూలలా నాలుగు గద్దెలపై ఫిరంగులుండేవట. ఇప్పుడు మాత్రం ఆగ్నేయం వైపున్న గద్దె మీద మాత్రమే ఒక ఫిరంగి ఉంది. ఇప్పుడు ఈ భవనం చుట్టుపక్కల టెలీఫోన్ డిపార్ట్‌మెంటువారు మరిన్ని నిర్మాణాలు కట్టారు. అందులో దక్షిణం వైపున్న బిల్డింగ్‌ను గెస్ట్‌హౌజ్‌గా, రెస్టారెంట్‌గా వాడుకోవచ్చు.


రాజభవనం నుండి కిందికి దిగి వస్తున్నప్పుడు రెండవ కోట ద్వారం నుంచి నేరుగా కాకుండా కుడి వైపుకు తిరిగి ముందుకు సాగితే చాళుక్యుల కాలం నాటి కోటగోడలు, దర్వాజాలు, వారి కంటే ముందు కాలపు కట్టడాలు కూడా కన్పిస్తాయి. ఈ ప్రాంతాన్ని పీనుగుల దిబ్బ అంటారు. ఇక్కడి దర్వాజాలో నాలుగు శిలాశాసనాల రాళ్ళు పొదిగి ఉన్నాయి. ఈ కోటగోడ ముగిసే దాకా ముందుకు సాగితే అక్కడ మరో చిన్న దర్వాజా ఉంది. ఆ దర్వాజాకు ఇరువైపులా ఉన్న ద్వార పాలకుల విగ్రహాలను పూర్తిగా తొలిచేశారు. దర్వాజా పైగడపకు లక్ష్మీదేవికి ఏనుగులు తమ

తొండాలతో అభిషేకం చేస్తున్నట్లున్న శిల్పం చాలా అందంగా ఉంది. ఈ పీనుగుల దిబ్బ ప్రాంతంలో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపితే చాలా విశేషాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

## భువనగిరి పరిసర కట్టడాలు

భువనగిరి కింది భాగంలో తూర్పు వైపున ఒకప్పుడు ప్రాచీన పట్టణముండేది. ఇది రెండు కోటగోడల మధ్య ఉండేది. ఈ రెండు కోటగోడలూ మట్టితో కట్టినవే, కాని పటిష్టంగానే నిర్మించినవి అనడానికి నిదర్శనంగా మిగిలి ఉన్న ఎత్తైన గోడలు, వాటి చుట్టూ లోతైన కందకాలు కన్పిస్తున్నాయి. ఒక కోటగోడ పూర్తిగా ధ్వంసం కాగా మరొక కోటగోడ మాత్రం ఇప్పటికీ శిథిలమాత్రంగానైనా మిగిలి ఉంది. ఈ కోటగోడల్లో ఇప్పుడు చూడదగినవి ఒక్క ఆంజనేయ స్వామి గుడి, ఇటీవల కట్టిన మరో అమ్మవారి గుడి మాత్రమే. ఆంజనేయ స్వామి గుడి 50 ఏళ్ళ కిందట పునర్మించబడింది. ఈ గుడికి ఇరు పక్కలా రెండు నీటి గుండాలున్నాయి. వాటినానుకొని ఉన్న మట్టి గోడల్లో అనేక శిథిల శిల్పాలు, ఆలయ స్తంభాల ముక్కలు ఉన్నాయట.

ఆంజనేయ స్వామి గుడి నుండి ఉత్తరం వైపుకు సాగితే మామ్మాయి గుడి వస్తుంది. దాని ముందు వైపు ఇటీవల కట్టిన మల్లన్న గుడి ఉంది. దానికి ముందు భాగంలో చాళుక్యుల కాలపు ఆలయ శిల్పకళా ఖండం ఒకటి పడి ఉంది. ఇలాంటివి ఈ ప్రాంతంలో మరికొన్ని ఉన్నాయట. మల్లన్న గుడికి తూర్పు వైపున అల్లంత



దూరంలో ఒక ముస్లిం కట్టడం ఉంది. దాన్ని ఈ మధ్యే మసీదుగా మార్చారట. ఇంకా తూర్పు వైపు రహదారి దిశగా సాగితే పంట పొలాల మధ్యలో ఒక దర్గా, దాని వెనుక ఒక కోనేరు ఉన్నాయి. నిజానికి ఈ దర్గా ఒకప్పుడు భువనేశ్వరాలయం. స్థానిక కథనం ప్రకారం భోనయ్య అనే గొల్ల కులస్థుడు రాజుకి ఈ గుట్టను కోట కట్టడానికి అనువైన స్థలంగా చూపి, అందుకు సహకరించి, ప్రతిఫలంగా ఈ కోటకు తన పేరు (భోనగిరి) పెట్టుమని, తన పేరున భోనేశ్వరాలయం కట్టించుమని అన్నాడట. ఈ కథలో వాస్తవమున్నప్పటికీ, లేనప్పటికీ ఆలయం మాత్రం నిజం. ఇక్కటి ఆలయంలోని నంది విగ్రహాన్ని పోలీస్ యాక్షన్‌కు (1948కు) ముందు హైదరాబాదులోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న మ్యూజియానికి తరలించారట.

## పర్యాటక అవకాశాలు

భువనగిరి రాష్ట్ర రాజధానికి కేవలం 45 కిలోమీటర్ల దూరంలో, అదీ రహదారి మీద ఉంది కాబట్టి ఇక్కడ పర్యాటకం అభివృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉంది. ఇది సాహస పర్యటనతో పాటు చారిత్రక పర్యటనకు, ఎకోటూరిజానికి కూడా అనుకూలంగా ఉంది. దీని చుట్టుపక్కల కేవలం 25 కిలోమీటర్ల పరిధిలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రాలు అనేకం ఉన్నాయి. వాటిల్లో భారతదేశపు ప్రసిద్ధ క్షేత్రాల నిలయమైన సురేంద్రపురి 7 కిలో మీటర్లు, యాదగిరి 10 కిలోమీటర్లు, కొలనుపాక జైన దేవాలయాలు, పెంబర్తి ఇత్తడి హస్తకళా కేంద్రం 25 కిలోమీటర్ల దూరాల్లో ఉన్నాయి. భువనగిరి చుట్టుపక్కల్లో కొచ్చె గుట్టల్లో ఉన్న దేవాలయాలు, ఏనెలు అనే అరుదైన గుట్టలు, పెద్ద మర్రి చెట్టు, రెండు చెరువులు మొదలైనవి భువనగిరి పర్యాటక కేంద్ర ప్రాధాన్యతను పెంచుతాయి.


భువనగిరి పై నుంచి జాలు వారుతున్న జలపాతం

## అభివృద్ధి ప్రణాళికలు

పై నేపథ్యంలో భువనగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి క్రింద పేర్కొన్న ప్రణాళికలను పరిశీలనలోకి తీసుకోవచ్చు.

1. భువనగిరి పైనున్న సప్తగుండాల్లోని మొదటి రెండు గుండాలను (ప్రవేశ మార్గం దగ్గరున్న వాటిని), చెరువుకుంటను పునరుద్ధరించి వాటిల్లో చిన్న పెడల్ బోట్లను, సీ త్రూ (పారదర్శక) వాకింగ్ బాల్స్‌ను ఏర్పాటు చేయాలి. పైనుండి కింది వరకు వరుసగా ఉన్న సప్తగుండాలలో ఫౌంటెయిన్‌లు ఏర్పాటుచేయాలి.
2. అమ్మకుంటను, తీనేమి చెరువును బోటింగ్ పాయింట్లుగా అభివృద్ధి చేయాలి.
3. భువనగిరి పైనున్న చెరువుకుంట దగ్గరికి రోప్‌వే నిర్మించి, అక్కడి నుండి కోటగోడ వెంట బురుజులు, నీటి గుండాలను చూస్తూ రాజభవనం చుట్టూ తిరిగేలా వాకింగ్ ఎస్కలేటర్ లేదా సీ త్రూ (పారదర్శక) గాజు వంతెనను ఏర్పాటు చేయాలి.
4. గుట్ట కిందున్న ఆంజనేయస్వామి గుడికి ఉత్తరాన ఉన్న నీటి గుండాన్ని శుభ్రం చేసి, దాని వెనుక స్క్రీన్ ఆకారంలో ఉన్న బండకు సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయాలి. ఆ గుండంలోకి పైనుండి దూకే జలపాతం కింది వైపుకు కూడా జలపాతంగా జారుతుంది కాబట్టి, ఆ గుండంలోని నీటినే రొటేట్ చేస్తూ ఎప్పుడూ కనిపించే జలపాతం లాగా చేసి, దాని పైనుండి కొండపైనున్న రాజభవనం దగ్గరకు చేరుకునేలా ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి.
5. సప్తగుండాలు, రాణి గుండాలకు పక్కనున్న మట్టి మేటలపై ప్రాచీన కాలపు పూల వనాలను పెంచాలి. నిజాం కాలపు తమలపాకుల తోటలను పునరుద్ధరించాలి.
6. భువనగిరి చుట్టూ పడిపోయిన ఫిరంగులను, నల్గొండ పోలీస్ స్టేషన్ ముందు పెట్టిన భువనగిరి ఫిరంగులను ఒక చోటకు చేర్చి ఈ కోట ప్రాంగణంలో ప్రదర్శనకు పెట్టాలి.
7. భువనగిరి పైనున్న మట్టి మేటల్లో, పీనుగుల దిబ్బలో, కొండ కిందున్న కోటగోడల్లో, కందకాల్లో పురావస్తుశాఖ తవ్వకాలు చేపట్టి, చారిత్రక అవశేషాలను వెలికి తీసి సైట్ మ్యూజియంలో పెట్టాలి.
8. కొచ్చె గుట్టల్లో ఉన్న ఆలయాల వద్దకు ట్రెక్కింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయాలి. ఏనె గుట్టల్లో కూడా అడ్వెంచర్ టూర్లను, పక్కనే ఉన్న పాండవుల గుహలను, రెండెకరాల వైశాల్యంలో విస్తరించిన మర్రి చెట్టును ఎకో పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.
9. వెయ్యేళ్ళ కిందటి సోమేశ్వరాలయాన్ని, భోనేశ్వరాలయాన్ని పునరుద్ధరించాలి.
10. భువనగిరి కొండ ఉత్తర పాదంలో ఉన్న అమ్మకుంట దగ్గర లేక్‌వ్యూ గెస్ట్‌హౌజ్‌లు, రెస్టారెంట్స్ కట్టాలి. ఇవి రోప్‌వే కేంద్రానికి కూడా దగ్గరగా ఉంటాయి.
11. జాతీయ రహదారి నుండి దర్గా మీదుగా భువనగిరి వరకు, ఆ తరువాత భువనగిరి చుట్టూ ఇరువైపులా చెట్లుండే రోడ్డు వేయాలి.

*– నమస్తే తెలంగాణ దినపత్రిక, 14-06-2015*

14

# చైతన్యపురిలో హైదరాబాద్ మొదటి బౌద్ధ విహారం / శాసనం

చరిత్ర స్పృహ ఏ కొద్దిగా ఉన్నవారికైనా హైదరాబాదు చరిత్ర 500 ఏళ్ళ కిందటిదని తెలుసు. ఎందుకంటే, వారికి ఆ కాలపు కుతుబ్‌షాహీ కట్టడాలు, గోల్కొండ కోట, చార్మినార్ తెలుసు. మరి హైదరాబాద్ చరిత్ర 1600 ఏళ్ళ కిందటిదని ఎంత మందికి తెలుసు? ప్రపంచ వారసత్వ దినం (18.04.2015) సందర్భంగా హైదరాబాద్ ఘన చరిత్రను తెలిపే అత్యంత ప్రాచీనమైన చైతన్యపురి శాసనం గురించి ఒకసారి మననం చేసుకుందాం.

## నగరంలో మొదటి శాసనం

క్రీ.శ.400 ప్రాంతానికి చెందిన ప్రాకృత భాషా శాసనం చైతన్యపురిలో పారుతున్న మూసీనది కుడి ఒడ్డునున్న కొసగుండ్ల నరసింహస్వామి ఆలయం రాతి గోడపై



ఉన్నది. దానిని 1983–84లో పురావస్తు శాఖవారు కాపీ చేసి తమ వార్షిక నివేదికలో దాని సారాంశాన్ని ప్రచురించారు. మరో శాసనం భూ ఉపరితలానికి సుమారు 50 అడుగుల ఎత్తునున్న గుండు పైనుంది. దాన్ని ఎక్కలేక ఇప్పటివరకూ కాపీ చేయలేదు.


## గోవిందరాజ విహారం

కాపీ చేసిన ప్రాకృత శాసనం బ్రాహ్మీ లిపిలో ఉంది. ఇది 6 వరుసలుగా ఉంది. ఆ శాసనంలో భదంత సంఘదేవ అనే బౌద్ధమత అనుయాయి గోవిందరాజ విహారంలో ఉన్న గంధకుటి దగ్గర ఒక శిలావాస గృహం కట్టించాడని, ఆయన వీతరాగ సిరిదామ శిష్యుడు, పిండపాతిక వామధర ప్రశిష్యుడు, థెవిరశాఖకు చెందిన బమ్హదేవుని శిష్యుడని పేర్కొనబడింది. వాసుదేవ సిరిదాముడు పుఫగిరి మీద మహా విహారాన్ని కట్టించాడని కూడ ఈ శాసనంలో పేర్కొనబడింది.

ఈ శాసనం వలన ఇక్కడ విష్ణుకుండి వంశానికి చెందిన గోవింద రాజు బౌద్ధ సన్యాసుల కోసం తన పేరున గోవింద రాజ విహారాన్ని కట్టించాడని, సిరిదాముడు మరో మహా విహారాన్ని కట్టించాడని, వాటి నిర్వహణలకై సంఘదేవుని వంటి దాతలు ఎన్నో దానాలు చేసేవారని తెలుస్తున్నది.

## ప్రాథమికాంశాలు ఎన్నో

1. ఈ శాసనం హైదరాబాదు చరిత్రకు సంబంధించిన మొదటి చారిత్రక ఆధారం. (రాత కనిపెట్టక ముందున్న పురావస్తు ఆధారాలను చరిత్ర పూర్వ యుగానికి చెందినవిగా చరిత్రకారులు భావిస్తారు) ఈ శాసనం మొదటి పదమే 'పురి'. అంటే కోటగోడలున్న నగరం. పాలియోగ్రఫీ ప్రకారం ఈ శాసనం క్రీ.శ. 400 ప్రాంతానిది కాబట్టి, అప్పటికే హైదరాబాద్‌లో కోటగోడలున్న నగరముందని ఈ శాసనం వల్ల తెలిసింది.
2. తెలంగాణను పాలించిన మూడవ రాజ వంశం విష్ణుకుండులది. వారి వంశానికి చెందిన మొదటి శాసనం ఈ చైతన్యపురి శాసనం. దీని ద్వారా తెలుస్తున్న చారిత్రక పురుషుడు గోవిందరాజు. ఈయన హైదరాబాదు ప్రాంతం నుంచే యావత్ తెలంగాణకు తన రాజ్య విస్తరణ చేశాడని ఈ శాసనం విశదం చేస్తుంది.
3. ఈ శాసనంలో ఉత్తర భారత భాషల ప్రభావం కనిపిస్తుంది. ఉత్తర భారత బ్రాహ్మీ లిపికి సంబంధించిన అక్షరాలు ఇ, క, ర, ల, అనుస్వారం... ఇవి ఈ




శాసనంలో కన్పిస్తున్నాయి. ఈ శాసనం బౌద్ధులు ఆదరించిన ఆనాటి జన సామాన్య భాష పాళీ ప్రభావం కన్పిస్తుంది. వీతరాగ, పరంపర మొదలైన సంస్కృత పదాలు ఈ శాసనంలో ఉన్నాయి. అయితే ప్రాకృత భాషలో వేసిన శాసనాల్లో ఇదే చివరిది కావడం కూడా గమనార్హం.

'పాండహులావాసం' అనే పదబంధంలో 'పాండహులు' అనేది తెలుగు పదం అని డా॥ పి.వి.పరబ్రహ్మశాస్త్రి గారు గుర్తించారు. పది+ఆరు = పదారు కావలసింది పదహారు అయిన విధానం 'పాండహులు' అనే పదంలో కన్పిస్తుంది. అయితే పాండవుల ఆవాసం అంటే సామాన్యంగా అలాంటి పేర్లతో పిలిచే గుహల్లో ఒకప్పుడు ఆది మానవులు నివసించేవారని అర్థం. అయితే తెలంగాణలో 'పాండవులోళ్ళు' అని నాయకపోడు గిరిజనులను ఆశ్రయించిన తెగ ప్రజలు కూడా ఉన్నారు. మరో తెలుగు పదం 'తొలుచువాండ్రు' అనేది విష్ణుకుండి పట్టణమైన కీసరగుట్టలో కనిపించింది.

4. ప్రొఫెసర్ అజయ్ మిత్ర శాస్త్రి గారు చెప్పిన ప్రకారం పిండపాతిక అనే హీనయాన బౌద్ధ శాఖ బుద్ధుని కాలం నుండే (క్రీ.పూ. 5వ శతాబ్దం) మనుగడలో ఉంది. ఆ శాఖకు చెందిన బౌద్ధ సన్యాసులు హైదరాబాదు ప్రాంతంలో ఉండేవారని ఈ శాసనం సూచించింది. అప్పటి హిందూ మత అవశేషాలతో సమానంగా బౌద్ధ మత సంబంధ శాసనం లభించడం గమనార్హం.

## ముందుకు జరిగిన చరిత్ర


చైతన్యపురి శాసనం వల్ల హైదరాబాదు ప్రాంత చరిత్ర మాత్రమే కాదు, విష్ణుకుండి రాజవంశ చరిత్ర కూడా ముందుకు జరిగింది. అంతకు ముందు విష్ణుకుండి గోవిందరాజు పాలనా కాలాన్ని డా॥ ఎస్.శంకరనారాయణ్ క్రీ.శ.422–460 అని, డా॥ ఎన్.వెంకట రమణయ్య క్రీ.శ. 405–445 అని భావించారు. కాని ఈ శాసనం వల్ల ఆయన పాలనా కాలం క్రీ.శ. 375–420 అని దీన్ని మొదటిసారి చదివిన డా॥ పి.వి.పరబ్రహ్మశాస్త్రిగారు నిర్ధారించారు.

## గోవిందరాజు

చారిత్రకంగా విష్ణుకుండి రాజవంశ స్థాపకుడు గోవిందరాజు అని చైతన్యపురి శాసనం తెలిపింది. ఆ వంశ స్థాపన హైదరాబాద్ ప్రాంతంలోనే జరిగిందనీ ఈ శాసనం విశదం చేసింది. గోవిందరాజ విహారం అనే బౌద్ధ సన్యాసుల విహారం 1600 సంవత్సరాల కిందటే ఇప్పటి చైతన్యపురిలో ఉండేదని ఈ శాసనం తెలిపింది. కాని దాన్ని ఎవరు కట్టించారోననే సందేహాన్ని తీర్చే రెండు రాగి శాసనాలను బి.యన్.శాస్త్రి గారు నల్గొండ జిల్లా తుమ్మల గూడెంలో సేకరించారు. మొదటి శాసనంలో గోవిందరాజు సకల దక్షిణాపథంలో అనేక స్థూప విహారాలను కట్టించాడని ఉండగా, రెండవ శాసనం అతన్ని 'శోభా సముదయాధిక మహా విహార ప్రతిష్ఠాపనాధిగతాంత' అని పేర్కొంది. కాబట్టి ఆయన తన పేరున చైతన్యపురిలో గోవిందరాజ విహారాన్ని కట్టించాడని చెప్పవచ్చు.

## ఇప్పుడేం చేయాలి?

1978లో చూసిన శాసనాన్ని పట్టించుకోని ప్రభుత్వాన్ని స్థానిక ప్రజలు బలవంతం చేసి 1983–84లో కాపీ చేయించారు కాబట్టి, ఇప్పటికీ కాపీ కాని మరో శాసనాన్ని స్థానికులు, వారసత్వ సంపద పరిరక్షణ పిపాసులు ప్రభుత్వంతో చెప్పి ఆ శాసనాన్ని కాపీ చేయించాలి. పెద్ద శాసనానికి సున్నం వేసి కనపడకుండా చేశారు కాబట్టి, పురావస్తు శాఖ వెంటనే దాన్ని శుద్ధి చేసి దాని చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. రెండు శాసనాల్లోని అంశాలను తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో అనువదించి ఆ వివరాల బోర్డును ఇక్కడ పెట్టాలి. శాసన గుండ్ల ప్రాంతం పరిరక్షణ స్థలమని, దుండగులు శిక్షార్హులని పురావస్తు శాఖ బోర్డు పెట్టాలి.



శాసనం ఎస్టాంపేజ్

## శాసనం - మూలం

పురిమవిడాల పాండహులావాసం పుఫగిరి మహా
విహార పతిథాపకస వాసుదేవ సిరిదామస మహా
వీతరాగస మదాజ పిండపాతిక (వా)దామధరస
పరంపరాగతస బమ్హదేవ థెవిరస సిసేన భదంత
సంఘదేవేన గోవిందరాజ విహారస గంధక చివరిక
-త సెలసంవాస ఘరం పతిథాపితమ్

## శాసన పాఠం (తెలుగులో)

భదంత సంఘదేవుడు గోవిందరాజ విహారంలో ఉన్న గంధక కుటీరంలో శిలా గృహము కట్టించాడు. పుష్పగిరి మహా విహారాన్ని కట్టించిన వీతరాగ వాసుదేవ సిరిదాముడు, పిండపాతిక (వా)దామధరుల శిష్య పరంపరకు చెందిన బ్రహ్మదేవ థెవిరుని శిష్యుడుగా సంఘదేవుడు పేర్కొనబడ్డాడు.

– *ఆంధ్రజ్యోతి, 18-04-2015*

# 15

# కీసరగుట్ట
# 1600 ఏళ్ళ కిందటి రాజధాని

తెలంగాణలో వేలాది శివాలయాలున్నా లక్షలాది మంది ప్రజలు శివరాత్రి నాడు హైదరాబాదు శివారులో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామలింగేశ్వర ఆలయానికే వెళ్ళడం, అక్కడున్న శివలింగాలకే పాలాభిషేకం చేస్తుండడం మనకు తెలుసు. ఎప్పట్నుంచి అలా జరుగుతోందో తెలుసుకుందాం!

కీసరగుట్టకు ఆ పేరు 'కేసరిగట్టు' అనే పదం నుంచి వచ్చింది. కేసరి అంటే సింహం అని అర్థం. ముందు కాలు ఎత్తి లంఘిస్తున్న సింహం రాజచిహ్నంగా గల విష్ణుకుండి రాజులు ఈ ప్రదేశం రాజధానిగా యావత్ తెలంగాణను మాత్రమే కాకుండా కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న ఆంధ్రను, రేవా (నర్మదా) నది వరకు గల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రాంతాలను కూడా క్రీ.శ.4వ శతాబ్దం నుండి 6వ శతాబ్దం వరకు పరిపాలించారు. వారి సింహ చిహ్నం గల నాణేలు, లోహ పరిశ్రమలు,



శిల్పాలు అనేకం కీసరగుట్టపైన, గుట్ట కిందనున్న చెరువుల పరిసరాలలో బయటపడ్డాయి. సుమారు 40 ఏళ్ళ కిందటి నుంచి ఇక్కడ తవ్వకాలు చేపడుతున్న పురావస్తు శాఖ అన్వేషణలో ఇప్పటికీ అనేక చారిత్రక అవశేషాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

## కోటగోడలు, గుళ్ళు

కీసరగుట్ట కింద అలనాటి మహానగర శిథిల నిర్మాణాలు అనేకం ఉన్నాయి. కాలక్రమంలో వ్యవసాయ విస్తరణలో భాగంగా అనేక నిర్మాణాలు ధ్వంసమైనా ఇప్పటివరకు ఆనాటి రాజ ప్రాసాదాలు, అంతఃపురాలు, గదులు, పాకశాలలు శిథిల మాత్రంగానైనా మనకు తెలియవచ్చాయి. ప్రతి ప్రాసాదానికీ చుట్టూ ప్రహరీ గోడలున్నాయి. ప్రతి నిర్మాణమూ ఎత్తైన వేదికపైనే నిర్మితమైనట్లు తెలియజేసే విశాలమైన మెట్లు కన్పిస్తున్నాయి. ప్రతి ప్రధానమైన నిర్మాణానికీ సింహద్వారాలున్నాయి. విశాలమైన భవనాల మధ్యలోకి గాలి, వెలుతురు ప్రసరించడానికి ఏర్పాట్లు కన్పిస్తున్నాయి.

ఈ లౌకిక భవనాల పరిసరాల్లోనే మత ప్రధానమైన నిర్మాణాలు– గుళ్ళు గోపురాలున్నాయి. భారత దేశంలో మొట్టమొదటి గుళ్ళు నాగార్జునసాగర్‌లో




బయటపడినా అవి ప్రాజెక్టులో మునిగిపోయాయి. ఇక ఆ తరువాత కాలానికి చెందినవి... అంటే సుమారు 1600 ఏళ్ళ కిందటి గుళ్ళు ఈ కీసరగుట్టలోనే బయటపడ్డాయి. ఇక్కడి గుళ్ళన్నీ ఇటుకలతో నిర్మించినవే. ఈ కాలపు ఇటుకల పొడవు 16 అంగుళాల పైనే ఉంటుంది. ఇక్కడి గుళ్ళన్నీ గర్భగుడి, అంతరాళం, మండపం ఇత్యాది వాస్తు ప్రమాణాలతోనే నిర్మించబడ్డాయి.

ఇక్కడి ప్రధానమైన గుడి మాత్రం ప్రత్యేకమైనదని తవ్వకాల్లో తెలిసింది. గర్భగుడి అడుగు భాగంలో తవ్వగా అందులో ఒక గర్భాపాత్ర, ఒక మనిషి ఎముకలగూడు (అస్థి పంజరం) దొరికాయి. గర్భాపాత్ర చుట్టూ పడగ విప్పిన నాగుపాముల అల్లిక ఉంది. దేవుడు సంతానాన్ని ఇస్తాడు కాబట్టి, సంతాన సంబంధమైన దోషాలను నివారిస్తాడు కాబట్టి, దాంపత్య/సంతాన సంబంధ దోషాలను నాగదోషం/కుజదోషం అంటాము కాబట్టి ఆ నాగదోష నివారణకై ఈ నాగకుంభాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించారు అనిపిస్తుంది. ఇక మనిషి ఎముకల గూడు మోకరిలుతున్న ఆకారంలో ఉంది. అది ఒక రుషి జీవ సమాధిని సూచిస్తుందనిపిస్తుంది. కాని పురావస్తు నిపుణులు ఐరావతం కార్తికేయ శర్మగారు ఒక మనిషిని బలి ఇచ్చిన తరువాత దేవాలయ నిర్మాణం చేసి ఉంటారని భావించారు.

కీసరగుట్ట మీద ఉన్న రామలింగేశ్వరాలయాన్ని 17వ శతాబ్దంలో గోల్కొండ కుతుబ్షాహీ రాజుల మంత్రులు అక్కన్న మాదన్నలు రిపేరు చేయించి ఉంటారు. అలా తెలంగాణలో వారు చాలా ఆలయాలను పునరుద్ధరించారు. కాబట్టే వారి పేర ఇప్పటికీ స్థానికులు 'ఇది అక్కన్న మాదన్న ఆలయం' అని చూపుతుంటారు. వారే శ్రీశైలంలో మోగే నగారా భేరీ శబ్దం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉమామహేశ్వరంలో, ఆ తరువాత రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరంలో విన్పించేటట్లు, అక్కడి శబ్దం ఈ కీసర రామలింగేశ్వరాలయానికి విన్పించాకే ఇక్కడ పూజలు జరిగేటట్లు ఏర్పాట్లు చేశారని పై మూడు చోట్లా స్థానికులు చెప్తారు.

ఇక గుట్టపైన కన్పించే శివలింగాలను హనుమంతుడు కాశి నుంచి మోసుకొచ్చే లోపలనే ముహూర్తం దాటి పోతున్నదని రాముడు శివలింగ ప్రతిష్ఠ చేయడంతో అలిగి తన తోకతో విసరివేయడంతో అవి అక్కడక్కడ పడిపోయి ఇప్పటికీ కన్పిస్తున్నాయని స్థానికులు చెప్తుంటారు. నిజానికి విష్ణుకుండి రాజు మాధవవర్మ 5వ శతాబ్దంలో అనేక రాజులపై యుద్ధాల్లో గెలిచి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా ఒక్కొక్క శివలింగ ప్రతిష్ఠ చేస్తూ పోగా అనే విజయాలకు గుర్తుగా కీసరగుట్టపై అనేక శివలింగాలు కన్పిస్తున్నాయి. ఇదే దృష్టాంతం విష్ణుకుండి రాజుల మరో రాజధాని

*'తొలుచువాండ్లు' అనే శిలా శాసనం*



ఇంద్రపాలనగరంలో (మూసీనది మధ్యలో) కూడా కన్పిస్తుంది. తూర్పు చాళుక్యుల వంటి ఇతర రాజులూ ఈ ఉదాహరణను (విజయలింగ ప్రతిష్టలను) పాటించారు.

ఇంకా కీసరగుట్ట తవ్వకాల్లో లభించిన దైనందిన అర్చక శివలింగం, లజ్జగౌరి (పాలిండ్లు, యోని, తల స్థానంలో పూవు గల దేవత), బౌద్ధమతాచార్యులు నాగార్జునుడు, పంచలోహ జైన తీర్థంకరుల విగ్రహాలు, నశం డబ్బి, ఇనుప చిట్టేలు... ఇవన్నీ ఆనాటి మత వైవిధ్యాన్ని, సామరస్యాన్ని, లోహ పరిశ్రమ నైపుణ్యాలను తెలియజేస్తాయి. ఇక ఆ పరిసరాల్లోని కొన్ని రాతి గుండ్లపై 'తొలుచువాండ్రు' వంటి తొలి తెలుగు పదాలు లభించాయి. పూర్తిస్థాయి తవ్వకాలు చేపడితే మరెన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చేసే అవకాశముంది.

*– తెలంగాణ మాస పత్రిక, ఆగస్ట్ 2015*

# 16

# వీణవంక చారిత్రక సౌందర్యం

దేశ చరిత్ర, రాష్ట్ర చరిత్ర రచనలు దాదాపుగా పూర్తయినాయి. ఇక స్థానికులకు తమ ప్రాంతాల పట్ల గౌరవాభిమానాలు పెంచటానికి స్థానిక చరిత్రలను నిర్మించవలసి ఉంటుంది. స్థానిక చరిత్రలు... రాష్ట్ర చరిత్రలు, దేశ చరిత్రల్లో మిగిలిపోయిన ఖాళీలను కూడా పూరిస్తాయి కావున స్థానిక చరిత్రలే నిజమైన చరిత్రలు. ఈ సత్యాన్ని గుర్తించి ఇప్పటివరకు చరిత్రకారులు దృష్టి సారించని కరీంనగర్ జిల్లాలోని వీణవంక చరిత్రను స్థూలంగా తెలుసుకుందాం.

కరీంనగర్ జిల్లాలో పారే గోదావరి నదికి ఉపనది ఐన మానేరు నదిలో కలిసిపోయే వీణవంక వాగు అర్ధ చంద్రాకారపు ఒడిలో నెలకొన్న గ్రామం వీణవంక. ఈ వాగు పడమర నుంచి తూర్పు వైపుకు ప్రవహిస్తూ మధ్యలో మూడు కిలోమీటర్ల



దూరం మాత్రం అర్ధ చంద్రాకారపు వంకను ఏర్పరిచింది. ఆ వంకలో గ్రామం ఏర్పడింది– మూడు పక్కలా నీరు సమృద్ధిగా లభిస్తుంది కాబట్టి. అయితే ఎండా కాలంలో ఈ వాగు ఎండిపోతుంది కాబట్టి ఊరికి, వాగుకు తూర్పు కొసన ఏటవాలు ప్రదేశంలో మూడు నాలుగు పెద్ద బావులు తవ్వారు. వాటి ఒడ్డు మీద నాలుగు నదీ దేవతల శిల్పాన్ని నిలిపారు. కాబట్టి ఈ బావులను దేవతల బావులు అని పిలుస్తున్నారు. ఇక్కడి దేవతలు గంగా, యమున, గోదావరి, సరస్వతి అనే నదులకు ప్రతీకలు. (గంగేచ యమునేచైవ గోదావరీ సరస్వతి).

ఈ నదీ దేవతలు, వాగు ఆధారంగానే ఇక్కడి ఊరికి వీణవంక అనే పేరు వచ్చింది. స్థానికులు తమ ఊరి పేరును ఇప్పటికీ అలవోకగా ఎణంక, ఎన్నంక అని చెప్తుంటారు. ఎన్నంక అనే పదం వెణ్ణవంక అనే పదబంధం నుండి పుట్టింది. వెణ్ణ అనే పదం పెణ్ణ లేదా పెన్న అనే పదానికి సరళ రూపం. పెన్న అంటే మూల తెలుగు భాషలో నది, వాగు అని అర్థం. కృష్ణా నది ఇదే విధంగా కణ్ణబెణ్ణ అని నాల్గవ శతాబ్దం నాటి మైదుకూరు శాసనంలో పేర్కొనబడింది. తరువాతి కాలంలో కృష్ణవేణి అయ్యింది. క్రీ.శ. 1422 నాటి 'ద్రవ్య రత్నావళి' అనే మంజీరా నది ప్రాంతపు గ్రంథంలో కూడా పెన్న అంటే నది అనే అర్థమే తీసుకోబడింది. అలాగే వీణవంక వాగు పేరు కూడా 'వెణ్ణవంక' నుండి 'వేణివంక' అయ్యింది. వేణి అంటే ప్రవాహం వంటి కురులు (ఉంగరపు వెంట్రుకలు). వేణివంక తరువాతి కాలంలో 'వీణవంక'గా రూపాంతరం చెందింది. దేవతల శిల్పంలోని నదీదేవతల కురులు కూడా ప్రవాహాలను చూపించే విధంగానే చెక్కబడ్డాయి. నలుగురు దేవతలు ఒకరి తర్వాత ఒకరు తమ కుడి–ఎడమ చేతులు కలిపి పైకెత్తి కుండలో ప్రవాహపు నీళ్ళను ప్రదర్శిస్తున్నారు. అర్ధ సుఖాసనంలో ఉన్న నలుగురు నదీ దేవతలు అలా మూడు నీటి కుండలనే ప్రదర్శిస్తున్నారు కాబట్టి మూడు ప్రవహించే నదులనే సూచిస్తున్నారని, అప్పటికే సరస్వతి నది మాయమైందని అర్థం చేసుకోవాలి.

ఇక వీణవంకలో ఉన్న ప్రధాన దేవాలయం వేంకటేశ్వరాలయం గర్భగృహపు పై గడపకు కూడా దేవతా శిల్పానికి ఇరు పక్కలా తాబేలు, చేప శిల్పాలు చెక్కబడ్డాయి. చేప గంగా నదికి, తాబేలు యమున లేదా గోదావరికి ప్రతిరూపంగా చెక్కబడ్డాయి.

ఈ నదీ దేవతల శిల్పశైలి తొలి చాళుక్యుల కాలాన్ని సూచిస్తున్నది. అంటే సుమారు 6వ శతాబ్దం ప్రాంతం. ఆ కాలపు పాటిగడ్డ, అందులో పెంకులు, ఇతరత్రా చారిత్రక శిథిలాలు కూడా దేవతలబాయి దగ్గర కన్పిస్తున్నాయి. అయితే అంతకు ముందే వీణవంక ప్రాంతంలో జన జీవనం ప్రశస్తంగా ఉంది అనడానికి నిదర్శనాలు




ఇక్కడికి సమీపంలోని కల్వలగుట్ట దగ్గర కన్పిస్తున్నాయి. కల్వల అనే పదబంధం కల్+వల అనే రెండు పదాల సముచ్చయం. కల్ అంటే రాళ్ళు, వల అంటే గుండ్రటి వరుస. మొత్తంగా గుండ్రటి రాళ్ళ వరుస. సుమారు గజం వ్యాసంతో ఉన్న రాళ్ళను అయిదారు గజాల వ్యాసంతో వర్తులాకారంలో నిలపడం. ఇలాంటి నిర్మాణాలు కొన్ని పదుల సంఖ్యలో కల్వలగుట్ట నైరుతి పాదంలో కన్పిస్తున్నాయి. ఇవి రాక్షసగుళ్ళు అని స్థానికులే ఇప్పటికీ పిలుస్తున్నారు. ఇవి సుమారు రెండున్నర వేల సంవత్సరాల క్రితం చనిపోయిన పెద్దల సమాధులు. వారి సమాధుల్లో వారి అస్థిపంజరాలు, వారు జీవించి ఉన్నప్పుడు వాడిన ఆయుధాలు, పనిముట్లు, పాత్రలు కొన్నింటిని ఉంచుతారు.

అయితే వీణవంక చరిత్ర రెండువేల సంవత్సరాలదే కాదు, అంతకంటే రెండు మూడు వేల సంవత్సరాల ముందటి చిత్రలేఖనాలు కూడా ఇక్కడికి సమీపంలోని కల్వలగుట్ట గుహ ఉపరితలాల్లో గత సంవత్సరం వరకు ఉండేవి. ఇప్పుడు ఆ గుట్టను గ్రానైట్ క్వారీకి ఇవ్వడంతో ఆ గుహలు, వాటిల్లోని చిత్రలేఖనాలు కనుమరుగయ్యాయి. స్థానిక పెద్ద మనుషులు వివరించిన సమాచారాన్ని బట్టి ఆ చిత్రలేఖనాలు నవీన శిలాయుగానికి చెందినవనిపిస్తుంది. నవీన శిలా యుగంలోనే మానవులు గుహల్లో నుండి మైదానం/నీటి ప్రాంతానికి వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకోవడం జరిగింది. ఇలా సుమారు 5 వేల సంవత్సరాల క్రితం జరిగింది. నవీన శిలాయుగానికి ముందటిదైన మధ్యరాతి యుగంలో కూడా కల్వలగుట్ట గుహల్లో చిత్రలేఖనాలు లిఖించారని తెలుస్తున్నది. ఎలాగంటే, అప్పటి మనుషులు వేటాడిన జంతువులు ఆ

చిత్రలేఖనాల్లో ప్రధానంగా చిత్రించబడ్డాయని స్థానిక పెద్ద మనుషులు చెప్పారు. ఇలాంటి చిత్రలేఖనాలు కొన్నింటిని ఈ ప్రాంతపు మానేరు–గోదావరి ప్రాంతాల్లో ఠాకూర్ రాజారాం సింగ్ గారు సేకరించారు.

రెండువేల సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లాలోని కోటి లింగాల నుండి యావత్ దక్కను, దక్షిణ భారతదేశాన్ని పాలించిన శాతవాహన రాజుల యుగంలో వీణవంక వాగు పడవ ప్రయాణానికి అనువుగా ఉండేది. కొన్ని వస్తువులను ఈ ప్రాంతం నుండి మానేరు, గోదావరి నదుల ద్వారా రోమన్ సామ్రాజ్యానికి కూడా వ్యాపారం నిమిత్తం పంపించినట్లు ఈ జిల్లాలోని కొన్ని స్థలాల్లో దొరికిన రోమన్ నాణేలు నిరూపిస్తున్నాయి. శాతవాహనుల తరువాత ఇక్ష్వాకు రాజుల కాలంలో హారితిని పూజించడం జరిగింది. ఆ దేవత పోలికలు వీణవంకలో ఉన్న దేవతల బావి (నదీ మాతృకల) శిల్పంలో కన్పిస్తాయి. ఇక తరువాతి రాజులైన తొలి చాళుక్యుల కాలంలోనేమో ఈ శిల్పాన్ని చెక్కినట్లు, కాబట్టి వీణవంకలో 6వ శతాబ్దం నాటికి వ్యవసాయ ప్రాధాన్య జన జీవనం వర్ధిల్లినట్లు చెప్పవచ్చు.

మహారాష్ట్రలోని లాతూరు (లట్టలూరు), మాల్ఖేడ్ (మాన్యఖేటం) ప్రాంతాల నుంచి ఎదిగిన రాష్ట్రకూట రాజులు తొలి చాళుక్యులను ఓడించి రాజ్యపాలన చేశారు. వారి సామంతులుగా ఎందరో తెలంగాణ ప్రాంతాలకు వచ్చి స్థిరపడ్డారు. రాష్ట్రకూటులు జైన మతాన్ని ప్రధానంగా పోషించారు కాబట్టి, వారి సామంతులు కూడా తమ తమ ప్రాంతాల్లో జైన దేవాలయాలను కట్టించారు. అలా కట్టించబడిందే వీణవంకలోని వేంకటేశ్వరాలయం. ఇది మొదట... అంటే క్రీ.శ. 9వ శతాబ్దంలో జైన దేవాలయమే అనడానికి కొన్ని నిదర్శనాలు ఆ గుడిలోనే కన్పిస్తున్నాయి.

ఈ దేవాలయం గర్భగృహ ద్వారపు పై గడపకు లాటనా శిల్పం ఉంది. లాట (గుజరాత్) దేశపు శిల్ప సాంప్రదాయపు శిల్పం కాబట్టి దానిని లాటనా శిల్పం అంటారు. ఈ శిల్పంలో దేవతకు ఒకవైపు తాబేలు, మరొక వైపు చేప శిల్పాలున్నాయి. ఇది రాష్ట్రకూట సాంప్రదాయమే. గర్భగుడి వెనుకనున్న మంటపం స్తంభాలు అష్టముఖాలతో చెక్కబడ్డాయి. ఇలాంటి స్తంభాల రాష్ట్రకూట మంటపం మహబూబ్‌నగర్ జిల్లాలోని మీనాంబరం దేవాలయంలో కూడా ఉంది. అక్కడి శాసనం అది రాష్ట్రకూటుల నిర్మితమేనని పేర్కొంటుంది. గుడి వెనుకనున్న విజయస్తంభం, దానిపైనున్న చిన్న మంటపం... ఇవి రాష్ట్రకూట సామంతులుగా కరీంనగర్ జిల్లాలోని నగునూరు ప్రాంతాన్ని పాలించిన మేడ (వెంగొణ్ణ కుల) రాజులు నగునూరులో దేవాలయాల ముందు చెక్కించిన నిర్మాణాలనే (ధ్వజస్తంభాలనే) పోలి ఉన్నాయి. వారు కూడా జైన

మతానుయాయులే. వీణవంక వేంకటేశ్వరాలయం ఆవరణలో ఉన్న జైన ముని విగ్రహం, జైన శైలిలో ఉన్న వినాయక విగ్రహం కూడా వీణవంక వేంకటేశ్వరాలయం మొదట జైన దేవాలయమేనని నిరూపిస్తున్నాయి. పైగా స్థానికంగా 'ఒక నగ్న స్త్రీ ఇక్కడి విజయ స్తంభాన్ని తన చిటికెన వేలితో నిటారుగా నిలుపగలిగింది' అని చెప్తుండడాన్ని బట్టి, నగ్న సాంప్రదాయం జైనులదే కాబట్టి ఇక్కడి వేంకటేశ్వరాలయం మొదట జైన దేవాలయమేనని, దాని ప్రధాన ద్వారం మొదట్లో దక్షిణం వైపున్న కోనేరువైపే ఉండేదని నిస్సంశయంగా చెప్పవచ్చు.

క్రీ.శ. 973 సంవత్సరంలో రాష్ట్రకూటులను ఓడించి మళ్ళీ చాళుక్యులే దక్కనులో రాజ్యాధికారం చేపట్టారు. వీరి కాలంలో కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధుడు పెనుగంటి ముచ్చిరడ్డి. క్రీ.శ. 1172–73 ప్రాంతంలో ఈయన వెలనాటి చోళరాజు రెండవ కులోత్తుంగ చోడునికి సహాయంగా దక్షిణాన దర్శి నుండి ఉత్తరాన సింహాచలం వరకు కోస్తాంధ్ర ప్రాంతాలను జయించి 'చోళరాజ్య స్థాపనాచార్య' అనే బిరుదు పొందాడు. ఆ విజయ చిహ్నంగానే ఆయన అప్పటికున్న జైన దేవాలయాన్ని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంగా పెద్ద ఎత్తున మార్పు చేర్పులు చేయించి ఉంటాడు. (ఈ కాలపు చాళుక్యులు దగ్గరలోని బిజిగిరి షరీఫ్ కోటలో కూడా లక్ష్మీనరసింహాలయాన్ని కట్టించారు). ఈ దేవాలయానికి ప్రహరీ గోడ కట్టించి నలు



దిక్కులా దర్వాజాలు పెట్టించాడు. ఆనాటికి దక్షిణ ద్వారం అశుభం అనే భావన ప్రాచుర్యంలోకి వచ్చింది కాబట్టి దాన్ని మూసి, గర్భగృహంలోని జైన విగ్రహాలను తీసేసి అందులో లక్ష్మీనరసింహ స్వామిని ప్రతిష్ఠించి, ప్రధాన ద్వారాన్ని ఉత్తరం వైపుకు మార్చినారు. ఆలయపు ఉత్తర ద్వారపు పై గడపకు కూడా శంఖచక్రాలు తొలిపించారు. ప్రవేశ ద్వారం పైన కళ్యాణ మంటపం కట్టించారు. ఇలాంటి నిర్మాణం నిజామాబాద్ జిల్లాలోని బండ రామేశ్వరంలోనూ చూడవచ్చు.

ఇదే ముచ్చనాయకుడిని అనుమకొండ కాకతీయ రాజు రుద్రదేవుడు క్రీ.శ.1181లో జయించి విజయ సూచనగా లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వాయువ్యంలో శివాలయం కట్టించాడు. దాన్ని మొదటిసారి కట్టించారు కనుక దాని ద్వారాన్ని తూర్పు వైపే పెట్టించారు. అప్పట్నుండి శివాలయం ప్రధానాలయం అయ్యి లక్ష్మీనరసింహస్వామిని ఎవరూ పట్టించుకోక పోవడంతో మంథని గ్రామస్థులు ఆ స్వామి విగ్రహాన్ని తీసుకెళ్ళి తమ ఊర్లో ప్రతిష్ఠించుకున్నారు. లక్ష్మీనరసింహ స్వామి లక్ష్మీనారాయణ స్వామి అయ్యాడు. ఇప్పటికీ మంథని బ్రాహ్మణులు తమ ఊరి లక్ష్మీ నారాయణ స్వామిని వీణవంక నుంచి చింతపండు బళ్ళల్లో తీసుకొచ్చారని చెప్తుంటారు. అయితే ఆ స్వామితో పాటు వీణవంకలోని శాసనాన్ని కూడా తీసుకెళ్ళినట్లున్నారు. అదిప్పుడు మంథనిలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం అర్ధ మండపపు పై గడప స్థానంలో కన్పిస్తుంది.

12వ శతాబ్దం నాటి వీణవంక శివాలయాన్ని కొన్నేళ్ళ కిందనే విప్పించి కొత్త గుడి కట్టారు. పాత శివాలయపు శిల్పాలు, శిలా ఫలకాలు కొన్ని ఆలయ ఆవరణలో కన్పిస్తున్నాయి. వాటిల్లో వినాయకుడు, హనుమంతుడు, నాగ-నాగిని, గజలక్ష్మి, వినాయక సహిత సప్తమాతృకల శిల్ప ఖండాలు మొదలైనవి. ఎనిమిది శతాబ్దాల చరిత్రకు మచ్చు తునకలుగా కన్పిస్తున్నాయి.

వీణవంక శివాలయం నాటి నుంచి నేటి వరకు పూజలందుకుంటూనే ఉన్నది. లక్ష్మీనారాయణ దేవాలయం మాత్రం కాకతీయుల తరువాత మళ్ళీ మార్పుకు గురైంది. రేచర్ల పద్మనాయకులు నల్గొండ జిల్లాలోని రాచకొండ నుండి యావత్ తెలంగాణను పరిపాలించారు. వారిలో సర్వజ్ఞ సింగ భూపాలుని కాలం (క్రీ.శ.1384-99) నుండి వైష్ణవ మతం ప్రాధాన్యం సంతరించుకుంది. కాబట్టి ఆయన కాలంలోనో, కొన్ని దశాబ్దాల తరువాత కాలంలోనో వీణవంక లక్ష్మీనారాయణాలయ పునరుద్ధరణ జరిగి గర్భగృహంలో వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠించబడ్డాడు. కంచి వేదాంత దేశికాచార్యుల సిద్ధాంతం మేరకు ఆ వేంకటేశ్వర స్వామి ప్రభా మండలంలో విష్ణుమూర్తి దశావతారాలు




శిల్పించబడ్డాయి. ఇలాంటి సమకాలీన విగ్రహం, ఆలయం నిజామాబాదు జిల్లాలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఉన్నాయి.

అయితే అనతి కాలంలోనే రాచకొండ రాజులపైన గుల్బర్గా (కర్ణాటక) ప్రాంతం నుంచి బహమనీ సుల్తానుల దాడులు జరిగాయి. ఆ దాడుల్లో క్రీ.శ.1435 ప్రాంతంలో వీణవంక వేంకటేశ్వరాలయం ప్రమాద పరిస్థితికి గురి కావడంతో స్థానికులు స్వామి


విగ్రహంతో పాటు ముఖ్యమైన విగ్రహాలను దగ్గరలోని కల్వలగుట్ట పైకి రహస్యంగా చేరవేశారు. అలా సుమారు నాలుగు శతాబ్దాల పాటు అక్కడే ఉన్న విగ్రహాలు క్రీ.శ.1824లో కొన్ని మళ్ళీ యథాస్థానానికి వచ్చాయని ఆ సంవత్సరంలో వీణవంక దేశ్‌ముఖ్ ఒక బ్రాహ్మణునికి అగ్రహారంగా రాసిచ్చిన దాన పత్రంలో పేర్కొనబడింది. మాజీ సర్పంచ్ పాడి రాంకృష్ణారెడ్డి కుటుంబ చరిత్ర కూడా చాలా పాతదిగానే తోస్తుంది. 12వ శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశంలోనే అమలులో ఉన్న పాడి కావలి వ్యవస్థ ముచ్చరడ్డి దక్షిణ విజయ యాత్రతో తెలంగాణకు పరిచయమైంది. అప్పుడు మంథనికి వచ్చిన కొన్ని పాడి కావలి కుటుంబాలు తమ ఉచ్ఛస్థితికి కారకుడైన ముచ్చరడ్డి ప్రతిష్ఠించిన లక్ష్మీనారాయణాలయాన్ని పునరుద్ధరించి లక్ష్మీవేంకటేశ్వరస్వామిని మూలవిరాట్ స్థానంలో ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. పాటి వంశ రెడ్లు కొన్ని శతాబ్దాల కింద వీణవంకకు వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడ కూడా భూస్వామ్య పద్ధతిలో ఇటీవలి కాలం వరకు పాలన చేశారు. వారు కట్టుకున్న గడీ ఆనవాళ్ళను కూడా ఇప్పటికీ చూడవచ్చు.

ఇక్కడికి సమీపంలోని బేతిగల్ గ్రామంలో ఉన్న కోట, అక్కడి రాజ చిహ్నాలు, దేవాలయాలు, శిల్పాలు, రాజ సమాధులు, వీరగల్లులు మొదలైనవాటిని, వీణవంక పరిసరాల్లోని రాచ సమాధులను పరిశీలిస్తే అవి ముచ్చరడ్డి తండ్రి కాటరడ్డి (రెండవ బేత (క్రీ.శ.1076–1108) అనే కాకతీయ రాజు సేనాని) కాలపువిగా తోస్తున్నాయి. వాటిని భావి పరిశోధకులు పరిశీలిస్తే ఎన్నో కొత్త చారిత్రాకాంశాలు వెలుగు చూడవచ్చు.

*– వెయ్యేళ్ళ వీణవంక, 2014*

# III

# గోదావరి
# తీర ప్రదేశాలు


గోదావరి పుష్కర శోభ
తెలంగాణ
శ్రీరాంసాగర్ డ్యాం
బాసర
ధర్మ పురి
కాళేశ్వరం
ముళ్ళకట్ట
భద్రాచలం


17

# గోదావరి పరీవాహక ప్రదేశాలు - చారిత్రక విశేషాలు

## తీర క్షేత్రాలు

యావత్ భారతదేశంలో అత్యంత పవిత్రమైనది, పొడవైనది ఐన గంగా నది తరువాత దక్షిణ భారతంలో అంతే పవిత్రమైనది, పొడవైనది ఐన నది గోదావరి. అందుకే గోదావరిని దక్షిణ గంగ అని పిలుస్తారు. ఇంకా ఆసక్తికరమైన విషయమేమిటంటే గంగ కంటే గోదావరి వయసు పెద్దది కాబట్టి దీనిని వృద్ధగంగ అని కూడా అంటారు. దీని తరువాత వచ్చింది గంగ కాబట్టి గంగ పేరే గోదావరి నుంచి పుట్టిందని చెప్పాలి.

'గంగి గోవు పాలు' అనే మాట తెలుగునాట ప్రశస్తమైనది, ప్రాచీనమైనది. గోదావరి పదంలోని 'గోద' అంటే 'గో'వు ఇచ్చిన ('ద') పాలు అని, ఆవరి అంటే పాల వంటి శుభ్రమైన నీళ్ళను ఆవరించుకుని పారుతున్నదని అర్థం. అందుకే రెండున్నర వేల ఏళ్ళ కిందటి బౌద్ధ సాహిత్యంలో గోదావరిని 'తెలివాహ'... అంటే తెల్లని నది అని పేర్కొన్నారు. అయిదున్నర శతాబ్దాల క్రితం ప్రసిద్ధ తెలంగాణ కవి



పోతన కూడా గోదావరిని

"అభ్రంకష శుభ్ర సముత్తుంగ భంగ"

యని వర్ణించాడు. అంటే గోదావరి ఆకాశమంతటి నిర్మలమైన జలాలతో అలలు అలలుగా పారుతున్నదని ఆయన భావన. ఆయన కాలపు మరో ప్రసిద్ధ తెలంగాణ కవి కొరవి గోపరాజు తన 'సింహాసన ద్వాత్రింశిక'లో

"........త్ర్యంబక శిఖరో
ద్భూతను విఖ్యాత పరమపూత త్రిలోక
మాత మహా పాతక సం
ఘాత విఘాతానుయాత ............"


అని కీర్తించిన గోదావరి ఆయన చెప్పినట్లే మహారాష్ట్రలోని నాసిక్ నగరం దగ్గరి త్ర్యంబకేశ్వరంలో పుట్టి త్రిలోకాలు... అంటే ఈనాటి మూడు రాష్ట్రాలైన మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో... ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో... గోపరాజే మరో చోట చెప్పినట్లు 'దక్షిణ గంగ'గా (దక్షిణాభిముఖియై), 'గౌతమి'గా, 'మహాతీర్థం'గా ఏయే చోట్ల ప్రవహిస్తున్నదో చూద్దాం.

గోదావరి మొత్తం పొడవు 1465 కిలోమీటర్లు కాగా తెలంగాణలో సుమారు 550 కిలోమీటర్ల దూరం పారుతుంది.

## త్రివేణి సంగమంతో ప్రారంభం

నిజామాబాద్ జిల్లాలో పారుతున్న మంజీర, హరిద్రా నదులతో గోదావరి కందకుర్తి వద్ద సంగమిస్తుంది. క్రీ.శ. 1677లో శివాజీ మహారాష్ట్ర నుంచి గోల్కొండకు


బాసర




వస్తున్నప్పుడు కందకుర్తి బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చాడు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపకులు హెడ్గేవార్ కందకుర్తివారే.

గోదావరి కందకుర్తి నుంచి ఉత్తరాభిముఖంగా ఆదిలాబాద్ జిల్లాలోని బాసర వరకు పారి అక్కడ ఆసీనురాలైన జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని పావనం చేస్తుంది. భారతదేశంలోనే అతిపెద్ద సరస్వతీ క్షేత్రంగా బాసర ప్రసిద్ధి గాంచింది. ఏ మాత్రం వీలు కల్పించుకోగలిగేవారైనా తమ పిల్లలను తప్పకుండా బాసరకు తీసుకువచ్చి జ్ఞాన సరస్వతీ ఆలయంలో విద్యాభ్యాసం చేయించిన తరువాతే పాఠశాలలకు పంపుతారు. బాసర అనే పేరు 'వ్యాసపురి' అనే పేరు నుంచి వచ్చిందని తెలిపే వేయేళ్ళ కిందటి శిలా శాసనం బాసరలోనే ఉన్న పాపన్న గుడిలో ఉంది. ఇంకా అరడజను శిలా శాసనాలు, శిల్పకళా ఖండాలతో శిథిల సౌందర్యంతో అలరారుతున్న బాసర అసలు చరిత్రను విశదం చేసే ఈ ఆలయాన్ని పునరుద్ధరించవలసి ఉంది.

బాసర మొదలుకొని ఆదిలాబాద్ జిల్లాలోని గోదావరి తీరమంతా అమ్మవారి ఆలయాలకు ప్రసిద్ధి చెందింది. బాసరకు తూర్పున కొంచెం దూరంలోనే రేణుకాపూర్ గ్రామావాసం ఉంది. దాని పరిసరాల్లోని గోదావరి ఒడ్డు అంచునే వేయిన్నర సంవత్సరాల కిందటి రేణుక ఆలయముంది. అందులో ఇప్పుడు దత్తాత్రేయుని పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

రేణుకాపూర్ దాటిన తరువాత ఒక వాగు వచ్చి వోని అనే ఊరు దగ్గర గోదావరిలో కలుస్తుంది. 'వోని' అనే మాట 'యోని' అనే పదం నుంచి పుట్టింది. 'యోని' నుంచే ప్రజలు, పశుపక్ష్యాదులు పుడుతాయి కాబట్టి, అతి ప్రాచీన కాలంలో

మొట్టమొదట యోనినే మాతగా పూజించారు. పురుష సంపర్కం లేకుండా పుట్టుక జరుగదు కాబట్టి పుట్టించేవాన్ని బ్రహ్మ అన్నారు. ఆయన పేరు మీద 'బ్రహ్మగాం' అనే ఊరు 'వోని'కి ఈశాన్యంలో కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

## బ్రహ్మేశ్వరం

వోని తర్వాత తూర్పున కొన్ని కిలోమీటర్ల దూరంలో వచ్చే సవరగాం దగ్గర గోదావరి ఉత్తరాభిముఖియై బ్రహ్మేశ్వరం వరకు అలాగే పారుతుంది. బ్రహ్మేశ్వరం కూడా అనాదిగా వస్తున్న అవ్వ-అయ్యల ఆలయాలకు ప్రసిద్ధి గాంచింది. జన్మనిచ్చిన అమ్మే జీవితం సజావుగా సాగడానికి అవసరమయ్యే సంపదనూ సమకూర్చే ప్రయత్నమూ చేస్తుంది. సంపదల్లో బంగారానికి ప్రాచీన కాలం నుంచి ప్రత్యేక స్థానముంది. ఆ బంగారాన్ని ఇచ్చే దేవత 'బంగారమ్మ' విగ్రహం బ్రహ్మేశ్వరంలో ఉంది. బంగారాన్ని 'కనకం' అంటారు కాబట్టి, బ్రహ్మేశ్వర దేవాలయ సమూహం ఉన్న ఊరి పేరు 'కనకాపూర్'. నారు పోసిన తండ్రి నీరు పోస్తాడు కాబట్టి, అలాంటి ఆది పిత బ్రహ్మకు ఇక్కడ 'బ్రహ్మాండం' మీద ఆలయముంది.

ఇక్కడ గోదావరి రెండు పాయలుగా చీలి 'అండం' ఆకారంలో ఒక ద్వీపాన్ని ఏర్పరచింది. ఆ ద్వీపం మీదున్న ఆలయ సముదాయం చుట్టూ గోదావరి పాయ తిరుగుతుంది. ఆధ్యాత్మిక భాషలో చెప్పాలంటే గోదావరి ఇక్కడ బ్రహ్మ ప్రదక్షిణం చేస్తుంది. అంతేకాదు, మొన్నమొన్నటి వరకు ఆలయం కిందున్న నిర్మిత సొరంగంలో



బ్రహ్మేశ్వరం




కూడా వర్షా కాలంలో గోదావరి ప్రవేశించి బ్రహ్మ-బంగారమ్మల పాదాలను ప్రక్షాళన చేసేది. భక్తులు కూడా ఈ సొరంగ మార్గంలో ప్రదక్షిణ చేసిన తరువాత దేవుడ్ని దర్శించుకునేవారట. ఈ మధ్యనే ఒక బాబా ఆ సొరంగాన్ని కూడ్పించాడట. తెలంగాణకు బంగారు పంటలనిచ్చే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఈ బ్రహ్మేశ్వరం నుంచే ప్రారంభమవుతుంది. ఎంతో ప్రాచీన కాలంలోనే నిర్మించబడిన పంట కాలువ కూడా బ్రహ్మేశ్వరానికి పశ్చిమాన కనకాపూర్ శివారులో ఉంది.

ఈ కనకాపూర్ కాలువ, బ్రహ్మేశ్వరం చుట్టూ తిరిగే గోదావరి పాయ, బ్రహ్మేశ్వరం ఆలయం కిందున్న వర్తులాకార సొరంగ ప్రదక్షిణా మార్గం, ఆలయాన్ని ఒరుసుకొని శ్రీరాంసాగర్‌లోకి పారే విశాలమైన గోదావరి... వీటన్నింటిని కలుపుకొని ఈ ప్రాంతాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా అడ్వెంచర్, పర్యావరణ పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేసుకోవచ్చు. బ్రహ్మేశ్వరానికి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్- భైంసా రహదారిలో వచ్చే నర్సాపూర్-లొహెస్ర మీదుగా గాని, గోదావరి ఉత్తరపు ఒడ్డు వెంట బాసర నుంచి గాని ప్రయాణించి చేరుకోవచ్చు. నిజామాబాద్ జిల్లాలోని యంచ అనే గ్రామం దగ్గరి నుంచి సవరగాం మీదుగా పుట్టిలలో గాని, బోట్లలో గాని గోదావరి ప్రవాహంలో ప్రయాణించి కూడా చేరుకోవచ్చు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కూడా పడవల్లో ప్రయాణించి బ్రహ్మేశ్వరం చేరవచ్చు.


అయితే పడవలను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది.

కందకుర్తి నుంచి క్రమంగా ఉత్తరం వైపు పారిన గోదావరి బ్రహ్మేశ్వరం నుంచి క్రమంగా దక్షిణం వైపు తిరగడం ప్రారంభిస్తుంది.

## శ్రీరాంసాగర్

ఇప్పటి వరకు తెలంగాణకు అతి ముఖ్యమైన అన్నదాత, 'ఆధునిక దేవాలయం' శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. దీనిని ఆదిలాబాద్ జిల్లాలోని గోదావరి తీరస్థ గ్రామం పోచంపాడు, నిజామాబాద్ జిల్లాలోని గోదావరి తీరస్థ గ్రామం దూద్‌గాం గ్రామాల మధ్య కట్టినారు. ఇది గత నాలుగు దశాబ్దాలుగా ఉత్తర తెలంగాణ రైతులకు ఫలప్రదాయినిగా ఉంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలోనే తెలంగాణకు సంబంధించిన మొట్టమొదటి రాజకీయ, మత, సాంస్కృతిక వ్యవస్థలు రెండున్నర– మూడు వేల ఏళ్ళ క్రితమే రూపుదిద్దుకున్నాయని పురావస్తు, బౌద్ధ, పౌరాణిక సాహిత్య ఆధారాలు తెలియజేస్తున్నాయి.

క్రీ.పూ. 8వ శతాబ్దం నాటి 'ఐతరేయ బ్రాహ్మణం' అనే వేద సాహిత్య గ్రంథంలో ఈ ప్రాంతం 'ఆంధ్రుల' ప్రాంతంగా పేర్కొనబడింది. అందుకు నిదర్శనంగా ఇప్పటి ఈ గోదావరి నదికి ఉత్తరాన 'అంధ్' అనే గిరిజన తెగ ప్రజలు ఇప్పటికీ ఉన్నారు; నిర్మల్ దగ్గర వారి ప్రాచీన పట్టణమైన 'అంధకూరు' ఉంది. ఆ కాలంలోనే ఆపస్తంబుడు అనే బ్రాహ్మణ మేధావి ఈ ప్రాంత ప్రజల ఆచార వ్యవహారాలను దృష్టిలో ఉంచుకొని అవి ఆదర్శవంతంగా ఎలా ఉండాలో వివరిస్తూ 'స్మృతి' (వ్యవహార ధర్మం) శాస్త్రం రాశాడు.


శ్రీరాంసాగర్




అది మొదలు ఈ ప్రాంతానికి మోక్షం అన్వేషణలో భాగంగా పలువురు బ్రాహ్మణ పండితులు ఉత్తరాది నుంచి వచ్చారు. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో వందలకొద్దీ మేధావులు మోక్ష అన్వేషణ మార్గాలు వెదికారు. ఆ క్రమంలోనే జైన, బౌద్ధ, ఆజీవిక మొదలైన మతాలతో పాటు వందలకొద్ది మత శాఖలు ఆనాటి బ్రాహ్మణ మతానికి వ్యతిరేకంగా పుట్టుకొచ్చాయి. ఆ కోవలోనే కోసల దేశపు నగరమైన శ్రావస్తి నుంచి బావరి గోత్రానికి చెందిన బ్రాహ్మణుడు ఇక్కడి అస్సక రాజ్యంలో ఉన్న ములక ప్రాంతానికి వచ్చి ఇక్కడి వెలగ వనంలో ఫలాలు, పరిగె ఏరుకుంటూ జీవనం గడిపేవాడని రెండున్నర వేల ఏళ్ళ కిందటి బౌద్ధ గ్రంథమైన 'సుత్తనిపాత'లో ఉంది.

అస్సక లేదా అశ్మక మహాజన పదం రెండున్నర వేల సంవత్సరాల కిందట భారతదేశంలో ఉన్న పదహారు మహాజనపదాలలో ఒకటి మాత్రమే కాకుండా దక్షిణ భారతదేశంలో వెలిసిన మొట్టమొదటి / ఏకైక రాజ్యం. అశ్మక రాజు బోధన్ రాజధానిగా గోదావరి–నర్మద నదుల మధ్య ప్రాంతాన్నంతటినీ పాలించేవాడని భారతంలో ఉంది.

బావరి జీవించిన ములక గ్రామం శ్రీరాంసాగర్ కుడివైపున ఉంది. 1830 జులై 28 నాడు ఆ గ్రామం గుండా ప్రయాణించిన ఏనుగుల వీరాస్వామయ్య అనే కాశీ యాత్రికుడు ఆ గ్రామం పేరును 'మూకల' అని పేర్కొన్నాడు. ఇప్పుడు ముప్కల్ అంటున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఒక పెద్ద గ్రామం సమీపంలో బావరి యజ్ఞాన్ని

తడపాకల గోదావరిలో పుట్టువెంట్రుకలు



చేశాడని 'సుత్తనిపాత'లో ఉంది. ఆ పెద్ద గ్రామం ముప్కల్ లేదా శ్రీరాంసాగర్ దగ్గర్లో ఉన్న బాల్కొండ గాని, దూద్‌గాం గాని లేదా గోదావరి ఉత్తరపు ఒడ్డునున్న సోన్ గ్రామం గాని అయ్యుంటుంది. ఈ గ్రామాలన్నిటికీ దగ్గరలో ఉన్న పోచంపాడులో బావరి యజ్ఞం చేశాడని తెలిపే పురావస్తు ఆధారాలు లభించాయి.

భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ పోచంపాడులో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1963 జులై 26న పునాది రాయి వేసిన తరువాత ప్రాజెక్టు పనులు పుంజుకుంటున్నప్పుడు ఈ ప్రాంత చరిత్ర ప్రాజెక్టులో మునిగిపోకూడదని పురావస్తు శాఖ పోచంపాడులో తవ్వకాలు జరిపిన మూడు బృహత్‌శిలా యుగపు సమాధుల్లో రెండవదానిలో మధ్య వయసు గల ఒక ఆడ గుర్రపు అస్థి పంజరం తలతో సహా చెక్కు చెదరకుండా బయల్పడింది. ఈ సమాధులు కూడా రెండున్నర వేల సంవత్సరాల కిందటివే కావడంతో, ఆ కాలపు యజ్ఞాల్లో ప్రధానమైనది అశ్వమేధ యాగం కావడంతో బావరి చేసిన అశ్వమేధ యాగంలో భాగంగా సమాధి చేయబడినది ఈ పోచంపాడు గుర్రపు అస్థి పంజరమే అని చెప్పవచ్చు. కాదంటే... అశ్మక రాజ గురువు కూడా బావరి అని తెలుస్తుండడంతో ఆ రాజు చేసిన అశ్వమేధ యాగ చిహ్నమైనా ఆ అస్థి పంజరం అయ్యుండవచ్చు. లేదా అస్సక/అశ్మక పదం అసలు రూపం అశ్వం కాబట్టి, అశ్వం అంటే గుర్రం కాబట్టి దక్షిణ భారత దేశంలో

మొట్టమొదటిసారిగా గుర్రాలను ప్రధాన జీవనంలో భాగంగా చేసుకున్న ఈ ప్రాంత ప్రజలు తాము చనిపోయినప్పుడు తమతో పాటు తమ గుర్రాన్ని కూడా సమాధి చేయించుకునేవారని పోచంపాడు పురావస్తు తవ్వకాలు తెలిపాయి. మొత్తమ్మీద శ్రీరాంసాగర్ ప్రాంతంలో రెండున్నర వేల ఏళ్ళ కిందటే గుర్రం స్వారీ చేసేవారని ఒక సమాధిలో దొరికిన ఇనుప కళ్ళెం కూడా తెలియజేసింది.

అశ్మక అంటే ఇనుప రాయి గల దేశమని. ఒక దేశానికే 'ఇనుము' అని పేరు స్థిరపడింది కాబట్టి, ఈ ప్రాంతంలోనే ఇనుము లోహం కనిపెట్టబడిందని, ఇక్కడి నుంచే ప్రపంచమంతా పాకిందని, ప్రపంచ నాగరిక సంస్కృతి వేగంగా విస్తరిల్లింది ఇనుము కనిపెట్టిన తరువాతనే అని, అందుకు కారణభూతమైన తెలంగాణకు ఆ ఘనత దక్కుతుందని ఇప్పుడిప్పుడే మేధావులు అంగీకరిస్తున్నారు.

పోచంపాడులోని మూడవ సమాధిలో బొక్కతో చేసిన పొక్క గల పూస దొరుకగా, రెండవ సమాధిలో బొక్కతో చేసిన దువ్వెన దొరికింది. ఈ అలంకారిక ఆధారాలు ఆనాడు అద్దమూ (దర్పణం) ఉండేదని తెలుపుతాయి. ఇది నిజమే అనడానికి నిదర్శనంగా ఈ ప్రాంతంలో కుశదర్పణం అనే గ్రామముంది (అని 1830 లోనే ఏనుగుల వీరాస్వామయ్య రాశాడు).

శ్రీరాంసాగర్‌కు తూర్పున మూడు కిలోమీటర్ల దూరం నుండి ప్రాజెక్టు అందాలను చూస్తూ గోదావరి పైనున్న బ్రిడ్జిని నిజామాబాద్ జిల్లా నుండి దాటి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించగానే కుడివైపు సోన్ కోట కన్పిస్తుంది. 'సోన్' అనే పదం స్వర్ణ అనే పదం నుంచి పుట్టిందని తెలుస్తుంది. ఎందుకంటే, 1830 ఆగస్టు 1న ఈ గ్రామాన్ని దర్శించిన ఏనుగుల వీరాస్వామయ్య దీనిని 'స్వర్ణ' గ్రామమని, ఈ గ్రామంలో, దీని చుట్టుపక్కలున్న చిన్న చిన్న గ్రామాల్లో చాలామంది బ్రాహ్మణులు–మాధ్వులు, స్మార్తులు, పంచాంగవేత్తలు–ఉన్నారని తన 'కాశీయాత్రా చరిత్ర'లో రాశారు. చరిత్రను ఇంకా వెనుకకు తవ్వుకుంటూ పోతే తెలిసేదేమంటే... బావరి ప్రధానమైన పదహారు మంది శిష్యులలో ఒకని పేరు హేమకుడు. 'హేమ' అంటే స్వర్ణం లేదా బంగారం. బావరికి ఈ ప్రాంతంలో 500ల మంది శిష్యులుండేవారని, హేమకునికీ బ్రాహ్మణ శిష్యులుండేవారని 'సుత్తనిపాత' చెప్పింది కాబట్టి, ఈ స్వర్ణ గ్రామం మొదట హేమకుని పేరు మీదనే ఏర్పడిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. 2500 సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ స్వర్ణ (సోన్) గ్రామం నిరంతరాయంగా బ్రాహ్మణ ప్రాధాన్య గ్రామంగా మనుగడ సాగించడం ఆసక్తికరమైన విషయం.

## సప్త గోదావరి

శ్రీరాంసాగర్ దాటి తడపాకల మీదుగా కొన్ని పదుల కిలోమీటర్ల దూరం ప్రవహించి 'మొగలిపేట గంగ' దగ్గర గోదావరి కరీంనగర్ జిల్లాలో ప్రవేశిస్తుంది. ఇక్కడి గోదావరి అందం ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించే ప్రతి ఒక్కరూ చూసి తీరాలి. ఎందుకంటే, ఇక్కడ గోదావరి అకస్మాత్తుగా ఉత్తరాభిముఖియై రెండు పాయలుగా చీలి భారతదేశంలోనే అతి పెద్ద నదీ ద్వీపాన్ని ఏర్పరిచింది. ఈ నదీ ద్వీపం పేరు బాదనకుర్తి. దీని పొడవు సుమారు 15 కిలోమీటర్లు. దీన్ని చూడని భారతీయ భూగోళ శాస్త్రజ్ఞులు ఇప్పటి వరకు అస్సాంలో పారుతున్న బ్రహ్మపుత్ర నదిలోని ద్వీపమే పెద్దదని చెప్తుండడంతో యునెస్కో (ఐక్యరాజ్య సమితి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ) అక్కడ ఒక మ్యూజియాన్ని పెట్టింది. కాబట్టి అలాంటి ఒక అంతర్జాతీయ సాంస్కృతిక వారసత్వ సంస్థను ఇక్కడ నెలకొల్పాలని తెలంగాణ ప్రభుత్వం యునెస్కోకు ప్రతిపాదనలు పంపాలి.

క్రీ.పూ. 8వ శతాబ్దపు వ్యాకరణవేత్త పాణిని తన 'అష్టాధ్యాయి' గ్రంథంలో ఈ ప్రాంతపు 'సప్త గోదావరి'ని పేర్కొన్నాడు. గోదావరి సప్త గోదావరిగా... అంటే ఏడు పాయలుగా చీలి పారే దృశ్యం శ్రీరాంసాగర్‌కి తూర్పున కొన్ని కిలోమీటర్ల దూరంలోనే... కరీంనగర్ జిల్లాలో గోదావరి ప్రవేశించే చోట... వేంపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో కన్పిస్తుంది. సప్త గోదావరిని వాల్మీకి తన రామాయణంలో కూడా రమణీయంగా వర్ణించాడు. ఆయన ఈ ప్రాంతీయుడు కాబట్టే సీతారాములు తమ వనవాస కాలాన్ని గోదావరి తీరాన ఎక్కువగా గడిపినట్లు రాశాడని విజ్ఞులు చెప్పడానికి నిదర్శనంగా ఈ సప్త గోదావరి ప్రాంతంలో ప్రాచీన కాలం నుండి వాల్మీకి తెగ ప్రజలు ఇప్పటికీ నివసిస్తున్నారు.

బాదనకుర్తి మీదివైపు కరీంనగర్ జిల్లాలోని వేంపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో సప్తగోదావరి ఉంది. ఇక్కడ మొదట కనిపించే దుబ్బరేవులో దిగి ఒక పాయ దాటి రాజుగారి పాయ కూడా దాటిన తరువాత గోదావరిలోని ఏడు (సప్త) పాయలు మళ్ళీ ఒకే పాయగా కలిసిపోయి లింగాల రేవు వద్ద గోదావరి మళ్ళీ రెండు పాయలుగా చీలి బాదనకుర్తి ద్వీపాన్ని ఏర్పరిచింది. కుతూహలుడు అనే కవి తన కావ్యం లీలావతిలో వర్ణించిన ప్రకారం ఈ సప్తగోదావరి ఒడ్డునే ఉన్న భీమేశ్వరాలయం ముందరే రెండు వేల సంవత్సరాల క్రితం శాతవాహన రాజు హాలుడు ఇక్కడి ద్వీప రాజును చంపి ఆయన కూతురు లీలావతిని పెళ్ళి చేసుకుని ఇక్కడి నుంచి గోదావరి ఒడ్డునే మహారాష్ట్రలో ఉన్న తన రాజధాని ప్రతిష్టానానికి వెళ్ళాడని అర్థమవుతుంది. శాతవాహన తొలి రాజధాని కరీంనగర్ జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాలలో

ఉన్న ఇటుకల పరిమాణమే (21 అంగుళాల పొడవు) ఈ శిథిల భీమేశ్వరాలయ ఇటుకల పరిమాణమూ కావడంతో హాల–లీలావతుల వివాహం ఇక్కడే జరిగిందని, ఆ తరువాతి కాలంలో కొంత మంది ఆంధ్ర కవులు రాసినట్లు ఆంధ్రలోని దాక్షారామ భీమేశ్వరాలయంలో కాదని నిర్ధారణ అయ్యింది.

## బాదనకుర్తి

బాదనకుర్తి గ్రామానికి కరీంనగర్ జిల్లాలోని ఓబులాపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ రేవుల నుంచి ఇటీవలి కాలం వరకు పుట్టిల మీద ప్రయాణించి చేరుకునేవారు. గత రెండు సంవత్సరాల కిందట ఈ గ్రామానికి ఇరువైపుల నుంచీ గోదావరిని దాటే బ్రిడ్జిలు నిర్మించబడ్డాయి. ఈ గ్రామం పరిధి రెవెన్యూ రెండు జిల్లాల్లోనూ ఉంది.

బాదనకుర్తిలో సుమారు 2,600 ఎకరాల భూమి ఉంది. అందులో 1,800 ఎకరాలను వ్యవసాయానికి, 200 ఎకరాలను నివాసానికి వాడుకుంటూ మిగతా 600 ఎకరాల భూమిని అటవీ పెంపకానికి వదిలారు. కాబట్టి పచ్చని వనాలతో, చుట్టూ గోదారి నీళ్ళతో ఎకోటూరిజానికి అనువైన ప్రదేశం ఈ బాదనకుర్తి.

క్రీ.శ.4వ శతాబ్దానికి చెందిన బుద్ధఘోషుడు 'పరమార్థజ్యోతిక' అనే పేరుతో 'సుత్తనిపాత'కు రాసిన వ్యాఖ్యాన గ్రంథంలో బావరి, బోధిసత్వ శరభంగ జ్యోతిపాలుడు కవిటవనం (వెలగతోట) అనే ఈ అంతర ద్వీపం మీద నివసించేవారని రాశాడు. రెండున్నర వేల సంవత్సరాల కిందట ఈ ప్రాంతాన్ని అంధకరట్ట అని పిలిచేవారని, ఇది దండకారణ్యంలో భాగంగా ఉండేదని ఆయన రచన వలన తెలుస్తుంది. ఈ 'వెలగ' పేరుతో ఈ దీవి చుట్టు పక్కల చాలా గ్రామాలున్నాయి. గోదావరికి ఇరువైపులా ఉన్న ఆ గ్రామాల పేర్లు వలిగొండ, వెలగనూరు, వెలుగుమెట్ల, వెల్గటూరు మొదలైనవి. బావరి పేరుతో బావపూరు కుర్దు, బాదనకుర్తి, బాదనపల్లి మొదలైన ఊర్లున్నాయి. శరభంగుని పేరుతో సారంగపూర్ అని గోదావరికి ఇరువైపులా రెండు గ్రామాలున్నాయి. బావరి శిష్యుల పేరు మీద కూడా గోదావరి తీరాన గ్రామాలు వెలిశాయి. అలా మోఘరాయ పేరు మీద మొగిలిపేట, మొఖ్రావుపేట, కప్పడి పేరు మీద కప్పరావుపేట, పోసాల పేరు మీద పొలాస మొదలైన గ్రామాలేర్పడ్డాయి. ఆంధ్రలోని మొగల్రాజపురం బౌద్ధ గుహలు కూడా మోఘరాజు పేరు స్ఫూర్తితో ఏర్పడినవే. ఎందుకంటే, బుద్ధుడి వద్దకు బావరి పంపిన 16 మంది శిష్యులకు బుద్ధుడే స్వయంగా తన మతాన్ని ఆవలి తీరాలకు తీసుకెళ్ళమని చెప్పినట్లు 'సుత్తనిపాత' ద్వారా తెలుస్తుంది. అలా బౌద్ధ మతం ఈ బాదనకుర్తి నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,

ఇతర దక్షిణాది రాష్ట్రాలకు చేరుకుంది. ఇందుకు నిదర్శనంగా బౌద్ధ జాతక కథలైన ఇంద్రియ జాతకం, శరభంగ జాతకం ఈ బాదనకుర్తి ద్వీపం మీదనే తొలినాళ్ళ బౌద్ధ మతం, థేరవాద బౌద్ధం, అంధక బౌద్ధ సంఘం మనుగడ సాగించాయని పేర్కొనడాన్ని చూపవచ్చు.

గౌతము బుద్ధుని కంటే 40 సంవత్సరాలు పెద్దవాడైన బావరి ఈ ప్రాంతంలో 500 మంది శిష్యులకు మూడు వేదాలు, ఇతిహాసాలు, నిఘంటువులు, లక్షణ శాస్త్రాలు, కెటుభాలు (కర్మకాండ క్రతు శాస్త్రాలు) బోధించేవాడు-2550 సంవత్సరాల క్రితమే. 120 సంవత్సరాల వయసు వచ్చినా విజ్ఞానం మీద కుతి తీరక బుద్ధుని గురించి అత్త కామినీ అనే స్థానిక దేవత ద్వారా విని ఆయన దగ్గరకు క్రీ.పూ. 485లో 16 మంది శిష్యులను వారి శిష్య సమూహాలతో సహా పంపాడు. వారిలో పింగియ అనేవాడు తిరిగి వచ్చి తనకు బుద్ధుడు బోధించిన ధర్మాన్ని బావరికి చెప్తుండగా బుద్ధుడు వెలుగు రూపంలో కనిపించి, ఇరువురికీ 'మృత్యు రాజ్యం ఆవలి పారం చేరెదరు గాక' అని చెప్పాడు. ఇది జరిగి ఇప్పటికి (2015 నాటికి) సరిగ్గా 2500 సంవత్సరాలు. అది స్ఫూర్తిగా బౌద్ధం గోదావరి ఆవలి తీరం... అంటే గోదావరికి దక్షిణంగా ప్రచారమయ్యింది.

ఎక్కడైతే బావరికి ఈ బౌద్ధ బోధ జరిగిందో ఆ గ్రామాన్ని ఇప్పటికీ 'బావపూర్ కుర్దు' అంటున్నారు. కుర్దు లేదా కుద్దు అంటే నిజమైనది అని అర్థం. (ఈ వివరాలు తెలిపే సుత్తనిపాత 'ఖుద్ధకనికాయ' అనే బౌద్ధ సాహిత్యంలో భాగం కావడం గమనార్హం). నిజంగా కూడా గోదావరి ఇక్కడి నుండే దక్షిణం దిశగా పారుతుంది. కాబట్టి ఈ బావపూరు కుర్దులో బుద్ధుడు, బావరి స్మారక స్థూపాలు కట్టిస్తే భావితరాలకు స్ఫూర్తిగా ఉంటుంది. బుద్ధుని మరణానంతరమే బాదనకుర్తిలో ఆయన ధాతువుల మీద స్థూపం కట్టించినట్లు కొన్ని ఆధారాలు తెలుపుతున్నాయి. ఇక్కడ దత్తాత్రేయ మందిరం ముందర ధ్వజ స్తంభం ప్రతిష్ట కోసం తవ్వుతున్నప్పుడు స్థూపం ఆనవాళ్ళు బయట పడ్డాయి. ఇక్కడ ప్రాచీన కాలపు జలదుర్గం ఆనవాళ్ళు కూడా ఉన్నాయని, దాని విశాల గోడలున్న ప్రాంతాన్ని 'గోడలపనుపు' అని పిలుస్తున్నారని తెలుస్తుంది. పెద్ద దిగుడు బావి, బ్రాహ్మీ శాసనం తదితర ఆధారాలూ ఉన్నాయని తెలుస్తుంది. ప్రభుత్వం పరిశోధనలు చేయించాలి.

రెండు పాయల గోదావరి బావపూర్ కుర్దు వద్ద మామూలు గోదావరిగా మారి వలిగొండ తరువాత కొన్ని కిలో మీటర్ల దూరంలో కడెం నదిని కలుపుకొని, మరి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న బాదనపల్లి దాటి దక్షిణాభిముఖంగా... దక్షిణ గంగగా ధర్మపురి చేరుకుంటుంది.

## ధర్మపురి

అయిదున్నర శతాబ్దాల క్రితం కొరవి గోపరాజు తన 'సింహాసన ద్వాత్రింశిక'లో ధర్మపురి ముందరే ఉన్న గంగలో గ్రాహిలుడు అనే పాత్ర చేత జలకమాడించి, యముని కుండము దూరించి, చివర్లో ఉన్న బ్రహ్మకుండమును ముట్టించి, నిజదైవమైన ధర్మపురి నరసింహునికి మొక్కించి, పక్కనే ఉన్న రామేశ్వర స్వామిని మనకు అభీష్ట సంపదలనివ్వమని ఇలా అడిగించాడు.




*ఉ॥ శాశ్వతమౌ కృపారసము చాడ్పున ముందర గంగ వారగా*
*విశ్వజనీన వృత్తి పృథివిం తగు రూపున నిల్చి సంతతా*
*నశ్వం భుక్తి ముక్తి సదనంబగు ధర్మపురీశుడైన రా*
*మేశ్వరు డెల్ల కాలమును నీవుత మాకు నభీష్ట సంపదల్*

ధర్మపురిలో ఉన్న హనుమాండ్ల గడ్డ, మఠం రేగళ్ళు, బూదాం మసీదు తదితర ప్రదేశాల్లో రెండున్నర వేల సంవత్సరాల కాలపు చరిత్ర నిక్షిప్తమై ఉంది. పురావస్తు తవ్వకాలు జరిపితే ఎన్నో ఆసక్తికరమైన చారిత్రక విషయాలు వెలుగు చూస్తాయి. ధర్మపురిలో ఇప్పుడున్న చారిత్రక ఆలయాల్లో ప్రధానమైన వాటిని సుమారు వేయి సంవత్సరాల కిందట చాళుక్యుల కాలంలో (క్రీ.శ. 1018లో) కట్టించారు. ఇక్కడి ప్రధాన గుండాన్నేమో ఆసక్తికర నిర్మాణంగా మలిచింది స్థానిక రాజులే, ఆరు వందల సంవత్సరాల కిందట (క్రీ.శ. 1397లో).



*ధర్మపురి: లక్ష్మినరసింహస్వామి*

## పద్మల్‌పూరి కాకో (అమ్మల కన్న అమ్మ)

ధర్మపురికి ఆవలి వైపు గోదావరి తీరాన గుడి రేవు దగ్గర గోండు గిరిజనుల దేవత 'పద్మల్‌పూరి కాకో' అనే దేవత కొలువై ఉంది. కాకో అంటే గోండు భాషలో అమ్మల కన్న అమ్మ అని అర్థం. తెలంగాణ చరిత్రకు తెలిసి ఈ దేవతనే మొట్టమొదటి దేవత. 500 పైసలు ఇవ్వనందుకు ఒక బ్రాహ్మణుడు బావరి తల ఏడు రోజుల్లో ఏడు వక్కలవుతుందని శపించగా అత్త కామినీ అనే స్థానిక దేవత బావరికి బుద్ధుని కలువుమని చెప్పినట్లు, ఆయన పంపిన పదహారు మంది శిష్యులు జటా జూటాలతో, జంతు చర్మాలతో (అజినం) వెళ్ళి బుద్ధున్ని వైశాలి నగరంలో కలిసినట్లు, వారిలో అజితకణ్ణి అనేవాడు తన అజినాన్ని పక్కకు జరుపుకొని బుద్ధునికి సాష్టాంగ నమస్కారం చేసినట్లు రెండున్నర వేల సంవత్సరాల కిందటి 'సుత్తనిపాత' గ్రంథంలో ఉంది. అందులో పేర్కొన్న అత్త కామిని ఈ కాకో దేవతనే. ఏడు తలల పామును గోండులు ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లోను, గాంధారి ఖిల్లాలోను కొలుస్తారు. ప్రతి యేటా ఆదిలాబాద్ జిల్లాలోని గోండు గిరిజనుల గుస్సాడి నృత్య బృందాలు (అక్రా) కాకో దేవత దగ్గరికి వచ్చి తమకు శక్తినివ్వమని వేడుకుంటూ జాతర జరుపుతారు. గుస్సాడి నృత్యం చేసేవారు సుత్తనిపాతలో పేర్కొన్నట్లు జటాజూటాలు, అజినాలు (జింక చర్మాలు) ధరిస్తారు. ఇంతటి ప్రాచీనమైన ఈ గిరిజన సాంస్కృతిక మత కేంద్రాన్ని ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేయవలసి ఉంది. గోదావరి పేరు కూడా గోండావరి... అంటే గోండుల ప్రాంతపు నది అనే మౌఖిక చరిత్రను కలిగి ఉన్న విషయాన్ని గమనించాలి.

## అర్ధ చంద్రాకారాల గోదావరి

ధర్మపురి దాటిన తరువాత గోదావరిపై రాయపట్నం దగ్గర బ్రిడ్జి ఉంది. దాన్ని దాటిన తరువాత గోదావరి ఉత్తర తీరాన తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధి చెందిన గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయముంది. గోదావరి పుష్కరాలకు అధిదేవత నారాయణుడు కావడంతో నారాయణ క్షేత్రాలైన ఈ సత్యనారాయణ స్వామి, ధర్మపురి నరసింహ స్వామి ఆలయాల సమీపాల్లో పారుతున్న గోదావరిలో స్నానం చేసి స్వామి వార్లను దర్శించుకుంటే భక్తులలోని నారాయణ నాడి శుద్ధియై వారిలో హర్షాతిరేకాలు వెల్లివిరుస్తాయని విజ్ఞులు చెప్తారు.

రాయపట్నం తరువాత కరీంనగర్ జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల దగ్గర నుండి గోదావరి అర్ధ చంద్రాకారంలో పారడం ప్రారంభిస్తుంది. ఈ కోటి లింగాలలోనే 2100 సంవత్సరాల క్రితం దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి




సామ్రాజ్యం (శాతవాహనులది) వెలిసింది. ఇక్కడ దక్షిణాభిముఖియై చంద్రవంక ఆకారంలో పారే గోదావరి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చెగ్గాం (మంగలిగడ్డ) దగ్గర ఉత్తర దిశగా మలుపు తీసుకుని మరో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు దగ్గర చంద్రవంక ఆకారపు పారకాన్ని పూర్తి చేస్తుంది. తెలంగాణ సహజ కవి పోతన భాగవత రచనకు స్ఫూర్తినిచ్చింది మంగలిగడ్డ ప్రాంతపు గోదావరే. పోతన తను 'పులిన తలంబున మంటప మధ్యంబున' కూర్చుని మహేశ్వర ధ్యానం చేస్తున్నప్పుడు తనను శ్రీరాముడు భాగవతం రాయుమని ఆజ్ఞాపించాడని తన



భాగవతంలో చెప్పిన మాటల్లోని ఇసుక దుబ్బ చేను (పులిన తలం), మంటపం ఈ మంగలిగడ్డలోని రాజరాజేశ్వర స్వామి మంటపరూప ఆలయానికే వర్తిస్తాయి.

## గౌతమిగా మంథని నుండి

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరిఖని, మంథని, రేగొండ మీదుగా కాళేశ్వరం వరకు గోదావరి మరోసారి చంద్రవంక ఆకారంలో పారుతుంది. గోదావరిఖని ప్రాంతంలో పారే గోదావరిలో మేడిపల్లి వాగు కలుస్తుంది. దాని ఒడ్లపై తెలంగాణలో మొట్టమొదటి మానవులు వాడిన పనిముట్లు, బ్రాహ్మీలిపి కంటే పూర్వపు (2300 సంవత్సరంల కంటే ముందటి) లిపి కొన్ని త్రిభుజాకార, చతుర్భుజాకార బొమ్మల రూపంలో కన్పించాయని ఈ ప్రాంతపు చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ రాశారు. మంథని వేయి బ్రాహ్మణ కడపలు (కుటుంబాలు) ఉన్న క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి గోదావరి తీరంలో కాకతీయ రుద్రదేవుని కాలంలో... 12వ శతాబ్దంలో అతని మంత్రి గంగాధరుడు గౌతమేశ్వర ఆలయాన్ని కట్టించాడు. ఇప్పుడు శిథిల స్థితిలో ఉన్న ఆ ఆలయాన్ని దాని వాస్తుశిల్ప విశిష్టతల దృష్ట్యా పునరుద్ధరించవలసి ఉంది. ఇక్కడ గౌతముని పేరు మీదే ఎందుకు ఆలయం వెలిసిందంటే, ఇక్కడే పురాణ ప్రసిద్ధి పొందిన గౌతమ మహర్షి భార్య అహల్యతో ఇంద్రుడు రంకు జరిపాడని, మహర్షి శపించగా ఆమె రాయిగా మారి రామాయణ కాలంలో రాముడు తాకగా మళ్ళీ అహల్యగా రూపాంతరం చెందిందనే కథ విన్పిస్తుంది. కథాంశాలకు నిదర్శనంగా ఆవలి


ఎల్. మడుగు

తీరాన (ఆదిలాబాద్ జిల్లా శివ్వారం (గ్రామం శివారులో) గుహలో తొలిచిన లంజ గుళ్ళు కనిపిస్తాయి. ఈ గుళ్ళకు అభిముఖంగా... అంటే గోదావరి కుడి ఒడ్డున ఖానాపూర్ శివారులో కొన్ని శిల్పాలు కన్పిస్తాయి. ఇక గుళ్ళ కిందనేమో విశాలమైన 'లంజ మడుగు' ఏర్పడింది. దానికా పేరు అహల్య ఉదంతం వల్లనే వచ్చిందనేది పురాణం. కాదు, జైనులు, బౌద్ధులు 8, 9 శతాబ్దాలలో తమ సంఘంలోకి స్త్రీలను అనుమతించి, క్రమక్రమంగా రూపొందిన తాంత్రికవాదం నియమాల ననుసరించి స్త్రీ సంభోగం ద్వారా కూడా మోక్షాన్ని సాధించవచ్చునే భావన బాగా ప్రచారం కావడం కారణంగా ఇక్కడి గుళ్ళు లంజగుళ్ళు అయినాయనేది చారిత్రక వివరణ. ఇక్కడే గౌతమ మహర్షి తపస్సు చేసి శివుని జటాజూటం నుండి గోదావరిని తెచ్చాడు కాబట్టి, ఇక్కడి నుండి గోదావరిని గౌతమీ నది అంటారని మరో కథ ప్రచారంలో ఉంది.

ఏది ఏమైనా 3 కిలో మీటర్ల పొడవుతో గోదావరిలో ఏర్పడిన ఈ విశాలమైన మడుగు మొసళ్ళకు ఆవాస కేంద్రంగా ఉంది. శిల్పాల్లో గోదావరి నదికి ప్రతిరూపంగా మొసలిని చెక్కడం గమనార్హం. పచ్చని అటవీ తీరాలతో, బీచ్‌ను తలపించే ఇసుక తిన్నెలతో ఈ మడుగు ప్రాంతం ఆహ్లాదకరమైన పర్యాటకానికి అనువుగా ఉంది కాబట్టి, ప్రభుత్వం ఈ ప్రాంతానికి 'ఎల్ మడుగు' అని పేరు పెట్టి, ఇక్కడ 'వాటర్ స్పోర్ట్స్', గెస్ట్‌హౌస్‌లు, రెస్టారెంట్ వంటివి ఏర్పాటుచేస్తే పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్షించవచ్చు.

## కాళేశ్వరం

మంథనికి కొన్ని కిలోమీటర్ల దూరంలో రేగొండ దగ్గర కరీంనగర్ జిల్లాలో పారే మానేరు నది వచ్చి గోదావరితో సంగమిస్తుంది. ఇక్కడి నుంచి గోదావరి ఉత్తర ముఖంగా ప్రవహించి కాళేశ్వరం చేరేలోపల ఒక శృంగం ఆకారాన్ని ఏర్పరుస్తుంది. కాళేశ్వరం దగ్గర ఉత్తరాన్నుంచి వచ్చి ప్రాణహిత నది గోదావరిలో సంగమిస్తుంది. కాళేశ్వరంలోని ముక్తేశ్వర లింగం నాసికల్లో పోసే అభిషేక జలం అంతర్వాహిని సరస్వతి నదిగా వెళ్ళి గోదావరిలో సంగమించడం వల్ల ఇక్కడ త్రివేణి సంగమం





కాళేశ్వరం

ఏర్పడిందని, కాబట్టి ఇక్కడి గోదావరి స్నానం చాలా పవిత్రమైందని భావిస్తారు. రెండున్నర శతాబ్దాల కిందట నాగపూర్ భోంస్లే రాజు ముక్తేశ్వర లింగంలో పాలు పోసి అవి అంతర్వాహినిగా వెళ్ళి గోదావరిలో కలవడాన్ని కళ్ళారా చూసి ఆశ్చర్యపడ్డాడట. కాళేశ్వరంలోని ప్రాచీన ఆలయాలను కూడా కాకతీయులే పదమూడవ శతాబ్దంలో కట్టించారు. ఇక్కడి ప్రధానాలయంలో ఒకే పానవట్టంపై కాళేశ్వర, ముక్తేశ్వర లింగాలు ఉండడం విశిష్టమైన విషయం. కాళ లేదా కాలుడు అంటే యముడు




కాళేశ్వరం

కాబట్టి ఇక్కడి గోదావరిలో కాళేశ్వరున్ని పూజించి పితృ తర్పణాలు చేస్తే పితరులకు ఇక్కడి ముక్తేశ్వరుని ద్వారా ముక్తి లభిస్తుందని విశ్వసిస్తారు. ఇక్కడి ప్రాంతం విశాలమైన అడవులతో, అష్ట తీర్థాలతో, షట్కోణాలతో, పలు ఆలయాలతో తిరుమల తిరుపతి క్షేత్రంలాగా అభివృద్ధి చేసుకునే అవకాశాలను కలిగి ఉంది.

## ముళ్ళకట్ట

కాళేశ్వరం దాటి మహదేవపూర్ మీదుగా పారే గోదావరిలో ఉత్తరం వైపు నుంచి ఇంద్రావతి నది వచ్చి రేగుండ దగ్గర కలిసిపోతుంది. అక్కడి నుంచి దక్షిణాభిముఖంగా పారే గోదావరిలో కంతనపల్లి ప్రాంతంలో ప్రకృతి రమణీయంగా


ముళ్ళకట్ట

ఉంటుంది. ఇక్కడ ఏర్పడిన విశాలమైన మడుగు, ఇసుక మేటలు, ఈశాన్యం నుంచి వచ్చి గోదావరిలో కలిసే చీకుపల్లి వాగు, అంతకు ముందు ఆ వాగుపై చిందులేసే బొగత జలపాతం... ఇవన్నీ ప్రశాంత వాతావరణాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రేమించే పర్యాటకులకు పరమానందాన్నిస్తాయి.

కంతనపల్లి తరువాత కొద్ది దూరంలోనే ముళ్ళకట్ట అనే గ్రామముంది. కోయ, నాయకపు గిరిజనులు అధికంగా నివసించే ఈ ప్రాంతం నుండి గోదావరి ఆవలివైపు ఖమ్మం జిల్లాలోని పూసూరుకు చేరుకోవడానికి నిర్మించిన బ్రిడ్జిని తెలంగాణ తొలి


కడేకల్



బొగత

ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ గారు 2015 జులైలోనే ఆవిష్కరిస్తారు. వరంగల్ జిల్లాలో ఈ ముళ్లకట్ట దగ్గరే ప్రభుత్వం ఈసారి ప్రతిష్టాత్మకంగా పుష్కర వసతులను ఏర్పరచింది. చుట్టుపక్కలున్న రొయ్యూరు, కదేకల్ గ్రామాల నాయకపు గిరిజనులు చేసే లక్ష్మిదేవర సంబురం అనే ఉత్సవ సంబంధ నృత్యాలు ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణలు.

## మల్లూరు

ముళ్ళకట్ట దాటి ఏటూరునాగారం దగ్గర మేడారం సమ్మక్క సారక్క జాతర జరిగే ప్రదేశం నుంచి పారుతూ వచ్చే జంపన్న వాగుని కలుపుకుని గోదావరి మల్లూరు


మల్లూరు




లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర సమీపం గుండా పర్ణశాలకు చేరుకుంటుంది. పాండవులు వనవాసం చేస్తూ తెలంగాణ ప్రాంతంలో తిరుగుతున్నప్పుడు భీముడు ఇక్కడి గిరిజన కన్యను ప్రేమించి, పెళ్ళి చేసుకొని ఘటోత్కచున్ని కనడం వల్ల ఇక్కడి గిరిజనులు... ప్రత్యేకించి నాయకపోళ్ళు భీమున్ని, అతని బావ కృష్ణున్ని, ఆయన భార్య లక్ష్మిని ఆరాధిస్తారు. 'సుత్తనిపాత'లో రెండున్నర వేల సంవత్సరాల క్రితం 'ఇల్లు' అనే అర్థంలో వాడిన 'నగరు' అనే మాటను ఇప్పటికీ అదే అర్థంలో నాయకపోళ్ళు వాడుతున్నారు. మల్లూరులో ఉన్న వారి లక్ష్మీపురం గూడెం (ఇప్పుడు ఖాళీ చేశారు)లో ఉన్న లక్ష్మీ దేవిని పూజించేటప్పుడు ఈ 'నగరు' అనే పట్నం వేస్తారు.

సమీపపు గుహాలయంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం పొట్ట నుండి రక్తం కారుతుండడం ఇక్కడి విశేషం. గుహ గోడలో ఉన్న మట్టి వంటి మెత్తటి శిలకే విగ్రహాన్ని చెక్కి, విగ్రహం పై నుంచి ఎరుపు తొక్కలు గల చెట్ల వేర్ల ద్వారా ఇంకే నీరు ఎరుపై స్వామివారి పొట్ట నుంచి ఉబికేటట్లు ఏర్పాట్లు చేయడం వల్ల అలాంటి విశేషం (రక్తం కారడం) సాధ్యమైంది.

వేయి అడుగుల ఎత్తున్న ఈ మల్లూరు గుట్ట పైనున్న రెండున్నర వేల ఏళ్ళ కిందటి బృహత్ శిలాయుగం నాటి కోటను, ఆనాటి వందలాది సమాధులను వనరులుగా చూపుతూ ఈ ప్రాంతాన్ని 'తెలంగాణ బృహత్‌శిలా ఉద్యానవనం'గా అభివృద్ధి చేయవచ్చు. గుట్టపై నుంచి కన్పించే గోదావరి అందాలు, జాలువారే జలపాతాలు, గిరిజన దేవతలు అదనపు ఆకర్షణలు.

## పర్ణశాల–భద్రాచలం


మల్లూరు దాటి చర్ల మీదుగా గోదావరి పర్ణశాలను చేరుతుంది. ఈ మధ్యలో తాలిపేరు నది గోదావరితో సంగమించే దృశ్యం అద్భుతంగా ఉంటుంది. అందుకే పంచవటిగా ప్రసిద్ధి పొందిన ఈ ప్రాంతంలో సీతారామలక్ష్మణులు తమ వనవాస కాలంలో అత్యధిక భాగం గడిపారట. బ్రహ్మపురాణంలో ఈ ప్రాంతం రథచరగిరి అని, ధూరపాతకం అని, పాప ప్రణాశన తీర్థం అని, గాలవము అని పలు పేర్లతో పేర్కొనబడింది. ధృతవ్రతుడు అనే బ్రాహ్మణుడు మహిష (కోయ గిరిజన) యువతిని పెళ్ళి చేసుకొని, గాలవ ముని ఆశ్రమంలో కొడుకును కనిన తరువాత పులి దాడిలో చనిపోగా అతని భార్య ఆశ్రమ వాసులందరితో రంకు చేసి, కమలాద్రి (రాజమండ్రి)కి వెళ్ళి వేశ్యయై, కొన్నాళ్ళకు చెడిపోయి కమలాద్రికే చేరిన తన కొడుకుతో కూడా కొడుకని తెలియక రంకు చేసి, తెలిసిన తరువాత మళ్ళీ గాలవమునిని ఆశ్రయించి ఆయన చెప్పినట్లు పుష్కర గౌతమి (గోదావరి)లో మునిగి పాపాలు పొగొట్టుకున్నారట. కాబట్టి ఈ పర్ణశాల దగ్గరి గోదావరి స్నానం భక్తుల పాపాలను ప్రక్షాళన చేస్తుందని నమ్ముతారు. కొరవి గోపరాజు చెప్పిన గ్రాహిలుడు (గాలవుడు?) కూడా సమీపపు ఉష్ణగుండాల దగ్గర గోదావరిలో స్నానం చేశాడు.


పర్ణశాల నుండి దక్షిణంగా ప్రవహించి భద్రాచలం చుట్టూ తిరిగి మళ్ళీ తూర్పు వైపు పారే గోదావరికి కొద్ది దూరంలోనే ఉష్ణగుండాలున్నాయి. భద్రాచలానికి 5


పర్ణశాల




కిలోమీటర్ల ముందే గోదావరిలో ఏర్పడిన 'మోతెగడ్డ' అనే ద్వీపం మీద వెలసి కోయ గిరిజనుల చేత ఆరాధించబడుతున్న వీరభద్రుడు (శివుడు) కూడా గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక'లో పేర్కొనబడ్డాడు. గోపరాజు పేర్కొన్న ఎనమండుగురు స్త్రీల నృత్యం ఈనాటికీ కొనసాగుతున్న 'కొమ్ముకోయ' నృత్యానికి సరిపోతుంది. పుట్టిలో ప్రయాణించి చేరుకోవలసిన ఈ మోతెగడ్డ ద్వీపం మీద కాటేజీలు, రెస్టారెంట్ కట్టించి గోదావరిలో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేస్తే మంచి ఎకోటూరిజం సైట్ పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది.






గోపరాజు తరువాత రెండు వందల ఏళ్ళకు... క్రీ.శ.1665లో భద్రాచలంలో కంచెర్ల గోపన్న అనే తహశీల్దారు కోదండ రామాలయం కట్టి రామదాసుగా ప్రసిద్ధుడయ్యాడు. ఆయన భక్తికి మెచ్చి గోల్కొండ కుతుబ్షాహీ రాజు అబుల్ హసన్ తానీషా సీతారాములకు ప్రతీ యేటా శ్రీరామనవమి నాడు ప్రభుత్వం తరఫున పట్టుబట్టలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించే సాంప్రదాయాన్ని ప్రారంభించగా అది ఈనాటి వరకూ నిరాటంకంగా కొనసాగుతుండడం విశేషం. భద్రాచలం దాటి గోదావరి కిన్నెరసాని నదిని కలుపుకొని తెలంగాణ సోదర రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది.

– *నమస్తే తెలంగాణ, 12-07-2015*

# 18

# గోదావరి నదీ లోయ నాగరికత

భారతదేశపు అత్యంత పెద్ద నది, అత్యంత పవిత్ర నది ఐన గంగానది కంటే ఎక్కువ వయసు గలది, దక్షిణ భారతదేశంలో అతిపెద్దది ఐన నది గోదావరి నది. కాబట్టే గోదావరిని వృద్ధనది అని కూడా పిలుస్తారు. గంగానదిని భగీరథుడు శివుడి జటాజూటం నుంచి తెచ్చినందుకు అది భాగీరథి అని పిలువబడినట్లే గోదావరిని గౌతమ మహర్షి తెచ్చాడు కాబట్టి దీనిని గౌతమీ నది అని కూడా పిలుస్తారు.

మనం నివసిస్తున్న భూగోళం స్థూల రూపమైతే మనిషి దాని సూక్ష్మ రూపం. భూమిలో ఉండే 108 ధాతువులే అదే నిష్పత్తిలో మనిషి శరీరంలో కూడా ఉంటాయి. ఉదాహరణకు భూమిలో 72 శాతం నత్రజని ఉంటే మనిషి శరీరంలో కూడా అంతే మోతాదులో ఉంటుంది. భూగోళంలో నీరు 79% ఉంటే మనిషి శరీరంలో కూడా అంతే శాతం ఉంటుంది. అలాగే భూగోళంలో 72 వేల నదీ నదాలుంటే వాటి సూక్ష్మరూపాలైన నాడులు మానవ శరీరంలో కూడా అదే సంఖ్యలో ఉంటాయి. 72 వేల నదుల్లో 101 ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమైనవి కాగా భారతదేశంలో ప్రధానమైనవి 12. ఇవి మానవ శరీరంలోని ప్రధానమైన 12 నాడులకు ప్రతీకలు. భూగోళం ఉన్న పాలపుంతలోని సూర్య మండలంలో అత్యంత పెద్దదైన బృహస్పతి (గురు) గ్రహం సింహం ఆకారంలో కన్పించే నక్షత్ర మండలంలో (రాశిలో) తిరిగే సంవత్సరం మన భూమ్మీద ఉన్న గోదావరి నదికి దగ్గరగా ఉంటుంది. 12 సంవత్సరాలకు ఒకసారి గోదావరి విషయంలో ఇలా జరుగుతుంది కాబట్టి దీన్ని గోదావరి పుష్కరం అంటున్నాము. భూగోళం మీది గోదావరి మనిషి శరీరంలోని నారాయణ (జ్ఞాన) నాడికి స్థూల రూపం. ఈ గోదావరి పుష్కరాల సమయంలో బృహస్పతి గ్రహం ప్రభావం గోదావరి ప్రాంతం మీద పడడంతో పాటు దాని సూక్ష్మరూపమైన మనిషిలోని నారాయణ నాడి మీద కూడా పడుతుంది.

'నారాయణం' అంటే జ్ఞానక్షేత్రం అని. నారాయణ నాడికి అధిదేవత నారాయణుడు కాబట్టి నారాయణ క్షేత్రాలను, ఆయన జ్ఞాన వరదుడు కాబట్టి జ్ఞాన క్షేత్రాలను ఈ గోదావరి పుష్కర కాలంలో దర్శించాలి. తెలంగాణలో నారాయణ క్షేత్రాల్లో ప్రసిద్ధమైనవి ధర్మపురి నరసింహస్వామి క్షేత్రం, గూడెం సత్యనారాయణస్వామి క్షేత్రం (ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం), భద్రాచల రామాలయం. ఇలాగే తెలంగాణలో గోదావరి తీరం వెంబడే ఉన్న జ్ఞాన సంబంధ ఆలయాల్లో ప్రసిద్ధమైనవి బాసరలోని జ్ఞాన సరస్వతీ క్షేత్రం, అక్కడికి తూర్పున సుమారు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న బ్రహ్మేశ్వర క్షేత్రం, మంథనిలో ఉన్న గౌతమేశ్వర క్షేత్రం, కాళేశ్వరంలోని ముక్తేశ్వర క్షేత్రం. గౌతమేశ్వర, కాళేశ్వర క్షేత్రాలు జ్ఞానం తరువాతి దశ ఐన ముక్తిని ప్రసాదించే క్షేత్రాలుగా కూడా ప్రసిద్ధి చెందాయి. కాబట్టి ఈ క్షేత్రాలు మన పూర్వీకులకు చేసే పిండ తర్పణాలకు కూడా పేరుగాంచాయి.

మొత్తమ్మీద అర్థమయ్యేదేమిటంటే... ఈ భూమి మీద ఈ గోదావరి పుష్కరాల సమయంలో అంతరిక్ష గ్రహాల శక్తి ప్రసరిస్తుంది కాబట్టి, దానిని పైన వివరించినట్లు



తెలంగాణలో గోదావరి *(Art by U.P. Ramakrishna Rao)*

హేతుబద్ధంగానో, మత పరంగానో నమ్మేవాళ్ళు ఈ పుష్కరాల సమయంలో ప్రవహించే గోదావరిలో ఎక్కడో ఒకచోట గాని, లేదా పైన పేర్కొన్న ఏదో ఒక్క క్షేత్ర సమీపపు గోదావరిలో గాని నిజమైన భక్తితో స్నానం చేసి, భగవత్ ధ్యానం చేసి, పితరులకు పిండ ప్రదానం చేసి, వీలైనంత దానం చేస్తే వారిలోని గోదావరి నదికి ప్రతిరూపమైన నారాయణ (జ్ఞాన) నాడి ప్రభావవంతంగా పనిచేసి తత్ఫలితంగా వారు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు. విశ్వసించేవారికి ఆ సంతోషాన్నిచ్చేది నారాయణుడు. విశ్వసించనివారికి గోదావరి తీర్థయాత్ర చేయడం కూడా సంతోన్నిస్తుంది గదా! యద్భావం తద్భవతి. మనం భావించేదే మన అనుభవంలోకి వచ్చి ఆనందాన్నిస్తుంది. మనం ఎలా భావిస్తే అలాంటి అనుభూతులు అనుభవంలోకి వస్తాయి. ఇలా భావించకపోతే ఇలాంటి అనుభవాలు ఎదురవవు.

గోదావరి ఎంతకాలం నుండి మనిషికి సుఖ సంతోషాలనిస్తున్నదని వెనుక చరిత్రను తరచి చూస్తే... మనిషి సుఖసంతోషాలకు కారణమైన సంస్కృతే దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ గోదావరి లోయలోనే రూపుదిద్దుకున్నదని,



అంతకంటే కోట్ల సంవత్సరాల ముందే ఈ లోయలోనే లక్షల జీవ జంతుజాలాలు జీవం పోసుకుని, మనుగడ సాగించి, కాలగమనంలో కొన్ని మట్టికొట్టుకు పోయాయని... ఇలా అనేకానేక ఆసక్తికర అంశాలు తెలుస్తాయి.

ఈనాటి మహారాష్ట్రలోని నాసిక్–మహాబలేశ్వర్ కొండల్లో పుట్టిన భయంకరమైన లావా ద్రవం సుమారు 6 కోట్ల సంవత్సరాల కిందట తెలంగాణ మీదుగా పారి బంగాళాఖాతంలో కలువగా దాని ప్రవాహమార్గంగానే ఈనాడు కన్పిస్తున్న గోదావరి లోయ మార్గం ఏర్పడిందని, ఆ లావా వేడిలో ఆనాడు ఈ ప్రాంతంలో జీవించిన అతిపెద్ద జీవులైన డైనోసార్లతోపాటు లక్షలాది జీవులు శాశ్వతంగా నాశనమయ్యాయి. ఆనాటి కారడవులు ఆ వేడిలో కాలిపోయాయి కాబట్టి వాటి బొగ్గును ఇప్పుడు మనం తవ్వితీసుకుని ఇంధనంగా, శక్తి వనరుగా వాడుకుంటున్నాము. ఇప్పటికీ సింగరేణి ప్రాంతంలో, బొగ్గు బావుల్లో రాక్షసబల్లుల (డైనోసార్లు) బొక్కలు, దంతాలు దొరుకుతున్నాయి. 1880ల నుంచే దొరుకుతున్న ఈ రాక్షసబల్లుల అస్థిపంజరాలను మొదట బ్రిటిష్ మ్యూజియంలోను, తరువాత కలకత్తాలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలోను, ఆ తరువాత హైదరాబాదులోని నేషనల్ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉన్న మ్యూజియంలోను ప్రదర్శనకు భద్రపరిచారు. ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లాల మధ్య పారుతున్న గోదావరి లోయలో వేమనపల్లి–భూపాలపల్లి మధ్య ప్రాంతపు బొగ్గు బావుల్లో ఈ రాక్షసబల్లుల అస్థిపంజరాలు, ఎముకలు, దంతాలు ఎక్కువగా లభిస్తున్నాయి.

ప్రపంచ జీవ జంతుజాలాలలో అత్యంత ప్రధానమైన మనిషి మనుగడకు గోదావరి నది ఎలా ఊతమిచ్చిందో ఇప్పుడు చూద్దాం. సుమారు 20 లక్షల సంవత్సరాల కిందటి నుంచి ఈ భూమ్మీద మనిషి పరిణామం చెందుతూ వస్తున్నాడని, అతడి మొదటి ప్రస్థానం ఆఫ్రికా ఖండంలో, ప్రత్యేకించి తూర్పు ఆఫ్రికాలో ప్రారంభమైందని పురావస్తు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూగోళ శాస్త్రజ్ఞుల ప్రకారం భూఖండ కదలికల శాస్త్రాన్ని (ప్లేట్ టెక్టానిక్ థియరీ) అనుసరించి భారత భూఖండం 6,00,000 సంవత్సరాల క్రితం తూర్పు ఆఫ్రికా నుండి విడిపోయి వచ్చి రష్యా–చైనా భూఖండానికి ఆనుకుంది. కాబట్టి విడిపోయిన భూభాగంలో ఉన్న మనుషులకు... అంటే తూర్పు ఆఫ్రికా ప్రజలకు, భారత మూల ప్రజలకు మధ్య పోలికలు (ఉదా: నలుపు రంగు, జన్యువులు) ఉన్నాయని మానవ శాస్త్రజ్ఞులు తేల్చారు. అలాంటి మూలవాసులు గోదావరి లోయలో లక్షల సంవత్సరాలుగా క్రమక్రమంగా తమకంటూ ఒక ప్రత్యేకమైన జీవన సంస్కృతిని ఏర్పరచుకున్నారు.

ప్రపంచ మానవ సంస్కృతి చరిత్రను చరిత్రకారులు ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి: 1. చారిత్రక పూర్వయుగం, 2. చారిత్రక యుగం. రాత కనిపెట్టక ముందు... అంటే 2300 సంవత్సరాల కంటే ముందు కాలంలో జరిగిన మానవ పరిణామ క్రమం అంతా చారిత్రక పూర్వ యుగం అవుతుంది. ఆ తరువాత హిందూ రాజులు పరిపాలించిన యుగాన్ని ప్రాచీన యుగం అని, ముస్లిం రాజులు పాలించిన యుగానికి మధ్యయుగమని, యూరోపు దేశస్థులు భారతదేశంలో పాలనాపరంగా గానీ, మరో విధంగాగానీ ప్రభావం చూపిన యుగాన్ని ఆధునిక యుగమని పిలుస్తారు.

చారిత్రక పూర్వయుగంలో మానవులు ప్రధానంగా రాతి ఆయుధాలనే వాడారు కాబట్టి రాతి ఆయుధాల శైలినిబట్టి ఆయా యుగాలకు పేర్లు పెట్టారు. అవి ఇలా ఉన్నాయి.

1. తొలి పాతరాతి యుగం - 5 నుంచి 1.25 లక్షల సంవత్సరాల క్రితం
2. మధ్య పాతరాతి యుగం - 50,000 నుంచి 20,000 సంవత్సరాలు
3. మలి పాతరాతి యుగం - 20,000 నుంచి 10,000 సంవత్సరాలు
4. మధ్య రాతి యుగం - క్రీ.పూ. 8,500 నుంచి 2,000 సంవత్సరాలు
5. కొత్త రాతి యుగం - క్రీ.పూ. 3,000 నుంచి 1,500 సంవత్సరాలు
6. రాక్షసగుళ్ళ యుగం - క్రీ.పూ. 1,500 నుంచి క్రీ.శ. 300 సంవత్సరాలు

రాక్షసగుళ్ళ యుగంలో రాత/లిపి రూపొందింది. అయితే ఆ యుగపు గ్రాఫితి మార్క్సను ఇప్పటికీ చదువలేకపోతున్నాం. కాబట్టి ఈ యుగాన్ని చారిత్రక పూర్వయుగం-చారిత్రక యుగం మధ్య సంధి యుగం (ప్రోటో హిస్టరీ) అని పిలుస్తారు.

పైన పేర్కొన్న అన్ని యుగాలలో మానవుని చరిత్ర గోదావరి తీరాల్లో ఎలా పరిణామం పొందిందో ఇప్పుడు చూద్దాం. గోదావరి పడమటి నుంచి తూర్పు వైపుకు ప్రయానిస్తున్నది కాబట్టి దాని ప్రవాహం వెంట నెలకొన్న ప్రధాన చారిత్రక స్థలాలను గూర్చి తెలుసుకుంటూ పోదాం.

## మంజీరా సంగమంతో మొదలై...

గోదావరి నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి దగ్గర తన ఉపనది మంజీరతో సంగమించి తెలంగాణలో ప్రవేశిస్తుంది. ఈ సంగమ స్థానం నిజానికి ఉత్తర, దక్షిణ సంస్కృతుల సంగమ స్థానం కూడా. రెండున్నర వేల సంవత్సరాల కిందట భారతదేశంలో మనుగడ సాగించిన మొట్టమొదటి మహాజనపదాలు (రాజ్యాలు)

పదహారింటిలో పదిహేను ఉత్తర భారతంలో ఉండగా దక్షిణ భారతదేశంలో ఏర్పడిన ఒకేఒక మహాజనపదమైన అశ్మక జనపదం ఈ గోదావరి-మంజీర సంగమ ప్రాంతంలో... బోధన్ రాజధానిగా ఉండేది. ఉత్తర భారతంలో అప్పటికే బుద్ధుని కాలంలోనే పేరు ప్రఖ్యాతులు గాంచిన బౌద్ధమతాన్ని అశ్మక రాజ గురువు బావరి గోత్రజుడు ఈ ప్రాంతపు తెలంగాణకు తెచ్చాడు. కందకుర్తి దగ్గర ఇప్పుడున్న వారధి (బ్రిడ్జ్) ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాల మధ్య ఇలా సాంస్కృతిక వారధికి ప్రతిరూపంగా నిలుస్తున్నది.

## బాసర / బ్రహ్మేశ్వర జ్ఞానప్రదాయినులు

భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన అరుదైన జ్ఞానసరస్వతీ ఆలయం ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి ప్రవేశించే చోటైన బాసరలో ఉంది. ఇక్కడికి బోధన్ మీదుగా, నిర్మల్ మీదుగా చేరుకోవచ్చు. సాక్షాత్తూ వ్యాస మహర్షి ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించాడని చెప్పే స్థలపురాణానికి నిదర్శనంగా ఆలయానికి ముందు వైపున్న వ్యాసగుహలను, ఫర్లాంగు దూరంలో ఉన్న వ్యాస శిలను చూపుతారు. ఈ శిలను రాయితో కొడితే లోహపాత్ర వలె శబ్దాన్నిస్తుంది. శబ్దాన్ని క్రమబద్ధీకరించడంతోటే అక్షరాలు-భాష-జ్ఞానం పుట్టాయి. జ్ఞానానికి అధిదేవతైన సరస్వతి ప్రధానాలయం నుంచి గోదావరి వైపు వెళ్తున్నప్పుడు కనిపించే బృహత్‌శిలా సమాధులు ఇక్కడ మూడువేల సంవత్సరాల కిందటి నుంచే మానవ సంస్కృతి విలసిల్లుతున్నదని విశదం చేస్తాయి. సరస్వతి ఆలయానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 1100 ఏళ్ళ కిందటి ఆలయాలు ఇక్కడ మొదటి వేమువాడ/బోధన్ చాళుక్యుల కాలంలో (క్రీ.శ.750-973) జైన మతస్థులు సరస్వతిని ఆరాధించారని తెలుపుతాయి. తరువాత మలి (కళ్యాణి) చాళుక్యులు, కాకతీయుల కాలంలో ఈ ఆలయాలు హిందూ ఆలయాలుగా మారాయని, ఈ ప్రాంతం వ్యాసపురి అని పిలువబడిందని తెలిపే అరడజను శాసనాలు ఆలయ స్తంభాలకు చెక్కి ఉన్నాయి. ఇక బాసరకు సంబంధించిన స్థలపురాణం మూడు శతాబ్దాల కిందటిది. దానిని ఇటీవల ప్రాచ్యలిఖిత భాండాగారం ప్రచురించింది. ఇక్కడికి కిలోమీటరు దూరంలో గోదావరి ఒడ్డు అంచునే వేయేండ్లకంటే ఎక్కువ వయసున్న 'బంగారమ్మ ఆలయముంది'. ఆ శిథిల ఆలయంలో ఇప్పుడు దత్తాత్రేయుని పాలరాతి విగ్రహం పెట్టారు.

బాసరకు తూర్పున సుమారు 20 కిలోమీటర్ల దూరంలో గోదావరి ఒడ్డునే మరో 'బంగారమ్మ' ఆలయముంది. ఆమె పేరు మీదనే ఇక్కడ కనకాపురం అనే

ఊరుంది (కనకం=బంగారం). సరస్వతి భర్త పేరు మీద ఈ ఆలయ సమూహాన్ని బ్రహ్మేశ్వరం అని పిలుస్తున్నారు. ఈ ఆలయాలకు కూడా బాసర సమకాలీన చరిత్ర ఉందని తెలిపే ఒక శిలాశాసనమూ ఇక్కడుంది. ఈ ఆలయ సమూహం చుట్టూ గోదావరి పాయ ఒకటి తిరిగిపోతుంది. ఆలయం కింద ఒక సొరంగ మార్గముంది. గోదావరి నీళ్ళు వర్షాకాలంలో ఈ సొరంగంలో ప్రవేశించి ఆలయ సమూహం చుట్టూ తిరిగిపోయేవి. ఇతర కాలాల్లో భక్తులు ఈ సొరంగంలో తిరిగిన తరువాతే దేవతలను దర్శించుకునేవారు. గత కొంత కాలంగా ఇక్కడ ఆశ్రమ వాసం చేస్తున్న ఒక బాబా ఇటీవలే ఈ సొరంగాన్ని మూయించారు. ప్రశాంత ప్రకృతిని కోరుకునేవారు ఈ పుష్కరాల కాలంలో ఇక్కడ గోదావరి స్నానాలకు వెళ్ళడం బాగుంటుంది.

'కనకాయి' అని పిలువబడుతున్న మరో 'బంగారమ్మ' తీర్థ క్షేత్రం ఇదే ఆదిలాబాద్ జిల్లాలో బజార్‌హత్నూర్ దగ్గర పారుతున్న గోదావరి ఉపనది కడెం నది మధ్య ద్వీపం పైనుంది. కడెం నది కడియం ఆకారంలో పారేది ఇక్కడే. ద్వీపం చుట్టూ రెండు వేల సంవత్సరాల కంటే ముందు నుంచే మనుగడలో ఉన్న కోట, కోటకు చేరేందుకు రాతి నిర్మిత రహదారి ఉన్నాయి. కోటకు దక్షిణంగా రెండు మూడు జలపాతాలు దూకుతున్నాయి. ఈ శాకాహార దేవతను ఆంధ్రులకు మూలపురుషులైన అంధ్ అనే గిరిజనులు పూజిస్తున్నారు.

'పద్మల్‌పూరి కాకో' అని ఆదిలాబాద్ జిల్లా గోండు గిరిజనులచే పూజింపబడుతున్న మరో 'అమ్మల కన్న అమ్మ' తీర్థ క్షేత్రం ఖానాపూర్ దగ్గర గోదావరి ఒడ్డునే ఉంది. సరస్వతి మాతను 'పద్మపత్ర విశాలాక్షి', 'పద్మకేసర వర్ణనీ' అని కీర్తించడం గమనార్హం. ఖానాపూర్‌కు తూర్పున సుమారు 50 కిలోమీటర్ల దూరంలో గోదావరి ఉత్తరపు ఒడ్డునున్న మంచిర్యాలకు ఉత్తర దిశలో ఉన్న గాంధారి ఖిల్లాలో గోండు – నాయకపు గిరిజనులు 'గాంధారి మాత'ను కొలుస్తారు. ఇక ప్రౌఢ సరస్వతి ఆలయమేమో కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వర క్షేత్రంలో గోదావరి దక్షిణ తీరంలో ఉంది. ఇలా ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుగా పారే గోదావరి సంతానం, సంతోషం, జ్ఞానం ఇచ్చే దేవతలకు ప్రసిద్ధి చెందింది.

## ఆదిమానవులు / గిరిజనుల క్షేత్రాలు

గోదావరి, దాని ఉపనది ఐన కడెం నది పరిసరాల్లో సుమారు 5 లక్షల సంవత్సరాల కిందటి నుంచి ఈనాటి వరకు ఆదిమానవులు, గిరిజనులు నివసిస్తున్నారని పురావస్తు ఆధారాలు తెలుపుతున్నాయి. కడెం నది ఘనపూర్, పొచ్చెర,

కనకాయి, కుంటల దగ్గర జలపాతాలుగా దూకుతుంది. వీటి పరిసరాల్లో తొలి పాతరాతి యుగం నుండి మానవులు జీవనం సాగించినట్లు రూఢిపరిచే రాతి ఆయుధాలు, పనిముట్లు తదితర ఆనవాళ్ళు దొరికాయి. బోథ్ మండల కేంద్రం దగ్గర్లో ఉన్న వాంకిడి గ్రామంలోని డాక్‌బంగ్లాకు నైరుతి దిశలో 40 వేల సంవత్సరాల కిందట మానవులు వాడిన 333 రాతి బ్లేడులు తదితర పనిముట్లను, వారు తిని పడేసిన జంతువుల బొక్కలను (42) తెలంగాణ చరిత్రకారులు శ్రీ ఠాకూర్ రాజారాం సింగ్‌గారు సేకరించారు. మధ్య పాతరాతి యుగానికి చెందిన మనుషులు ఇక్కడ ఒకటిన్నర మీటరు వ్యాసంతో గుండ్రటి గద్దెలను, 2 ని $1^{1/2}$ మీటర్ల కొలతలతో దీర్ఘచతురస్రాకార గద్దెలను ఏడింటిని 20 ని 10 మీటర్ల వైశాల్యంలో కట్టుకున్నారని, వాటిని పడుకోవడానికో లేదా వేటాడిన జంతువుల మాంసాలను తినే యోగ్యంగా చేసుకోవడానికో ఉపయోగించుకున్నారని శ్రీ సింగ్ రాశారు. వాటికి పడమరన అలాంటివి మరిన్ని ఉన్నాయన్నారు. ఇక్కడ వంకలుగా తిరుగుతున్న వాగుకు వరదలను అడ్డుకోవడానికి ఒక మీటరు మందంతో వేల ఏళ్ళ కిందటే గోడలను నిర్మించుకోవడం ఆశ్చర్యకరమైన అంశం. ఇక్కడ మానవ సంస్కృతి పరంపర కొనసాగిందని తెలిపే తరువాతి తరపు మలి పాతరాతి యుగపు పరిశ్రమ ఆధారాలు కూడా లభించాయి.

తొలి పాతరాతి యుగం నుండి మధ్య పాతరాతి యుగం, మధ్య పాతరాతి యుగం నుండి మలి పాతరాతి యుగం, దాని నుండి మధ్యరాతి యుగం పరిణమించాయని తెలిపే చెకుముఖి రాయి, రాగి రంగు రాతి ఆయుధాలు, పనిముట్లు పొచ్చెర జలపాతం కుడి ఒడ్డున దొరికాయి. 1,35,000 సంవత్సరాల కంటే ముందే ఈ అందమైన ప్రదేశంలో నివసించిన తొలి పాతరాతి యుగం మానవులు వాడిన 76 పనిముట్లను సేకరించి, వాటికి రెట్టింపు సంఖ్యలో కనిపించిన పనిముట్లను అక్కడే వదిలేశానని శ్రీ సింగ్ రాశారు.

తెలంగాణలో అత్యంత పెద్ద జలపాతమైన కుంటల జలపాతం సమీపంలో కూడా ఆది మానవులు వాడిన రాతి పనిముట్లు సుమారు ఒక ఎకరం స్థలంలో కన్పిస్తున్నాయని పురావస్తు శాఖ గుర్తించింది.

రాతి యుగం తరువాత మనుషులు తెలంగాణలో ప్రధానంగా ఇనుప పనిముట్లు వాడారు. సుమారు మూడు వేల సంవత్సరాల కిందటి నుంచి ఈ యుగ ప్రజలు పెద్ద పెద్ద బండరాళ్ళతో సమాధులు కట్టారు కాబట్టి ఈ యుగాన్ని బృహత్‌శిలా యుగం అని కూడా పిలుస్తారు. వీరికి సంబంధించిన ఇలాంటి ఒక ముఖ్యమైన స్థలం పోచంపాడ్‌లో కనిపించింది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో మునిగిపోయిన

పోచంపాడులో తవ్వకాలు చేపట్టిన మూడు సమాధుల్లోనూ మనిషి అస్థికలతోపాటు జంతువుల ఎముకలు, ఇనుప పనిముట్లు కన్పించాయి. ప్రత్యేకించి ఉలినిగాని, డాగర్ కత్తిని గాని మనిషి పాదాల దగ్గరగాని, తల దగ్గర గాని పెట్టారు. రెండవ సమాధిలో ఒక మధ్య వయసు ఆడ గుర్రాన్ని సజీవంగా పూడ్చారు. దాని తలను ఒక పీట మీద ఉంచడం చూస్తే ఈనాడు దేవతలకు తెలంగాణ గ్రామీణులు గొర్రె, మేకలను బలి ఇచ్చి వాటి తలలను ఒక పీట మీద పెట్టి వాటి మీద కల్లు, నీళ్ళు పోయడం గుర్తుకు వస్తుంది. ఈ సమాధిలో గుర్రాన్ని స్వారీ చేసేటప్పుడు కాళ్ళు పెట్టుకునే ఇనుప కడియం దొరికింది. ఈ ఆధారాలతో ఆనాటి మానవులు గుర్రాలను స్వారీ చేసేవారని, బలిచ్చేవారని (అశ్వమేధ యాగం), పశువులను మచ్చిక చేసేవారని, జంతువులను వేటాడి తినేవారని తెలుస్తుంది. ఇక్కడి సమాధుల్లో దొరికిన దంతపు దువ్వెన, ఎముక పూసలు వారు అలంకరణ విషయంలో సాధించిన ప్రగతిని సూచిస్తాయి. ఇప్పుడు పోచంపాడు లేకున్నా దాని ప్రాంతంలో కట్టిన తెలంగాణ 'ఆధునిక దేవాలయం' శ్రీరాం సాగర్ ప్రాజెక్టు అందాలను చూడవచ్చు, దాని కింది వైపున పారుతున్న గోదావరిలో స్నానం చేయవచ్చు.

## బ్రాహ్మణ / పుణ్యక్షేత్రాలు

శ్రీరాం సాగర్‌కు తూర్పున మూడు కిలోమీటర్ల తరువాత ఉన్న బ్రిడ్జిని 75 సంవత్సరాల కింద నిజాం కాలంలో కట్టారు. దానినానుకొని ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సోన్ గ్రామం అనాదిగా బ్రాహ్మణుల నివాసానికి పేరు గాంచింది. గోదావరి నది మధ్యలో... కరీంనగర్ జిల్లా, ఆదిలాబాద్ జిల్లాల మధ్యన ద్వీపం మీదున్న బాదనకుర్తి గ్రామం రెండున్నర వేల సంవత్సరాల కిందట ఇక్కడ జీవించిన 'బావరి' గోత్రజుడైన బ్రాహ్మణుని పేరు మీద వెలిసిందని సుమారు 40 ఏళ్ళ కిందట శ్రీ ఠాకూర్ రాజారాం సింగ్, డా॥ వి.వి.కృష్ణ శాస్త్రి తదితర పరిశోధకులు నిర్ధారించారు. ఇక్కడే గోదావరి ఏడు పాయలుగా చీలింది కాబట్టి సప్తగోదావరి ఇదే అని, దాని ఒడ్డునే క్రీ.శ.1వ శతాబ్దం నుండి భీమేశ్వరాలయం మనుగడలో ఉన్నట్లుగా పురావస్తు ఆధారాలు కన్పిస్తున్నాయి. కాబట్టి, సాహిత్య ఆధారాలు వర్ణించిన సప్తగోదావరి ఆంధ్రలోని దాక్షారామ భీమేశ్వరాలయం ప్రాంతపుది కాదు, ఇక్కడిదే అని రూఢీ అయ్యింది. ఇక్కడే రెండు వేల ఏళ్ళ కిందట (బాదనకుర్తి) ద్వీప రాజకన్య లీలావతిని సాతవాహన రాజు హాలుడు పెళ్ళి చేసుకున్నాడని తెలుస్తున్నది. ద్వీప సాతవాహన

రాజధాని కోటిలింగాల కూడా గోదావరి దక్షిణపు ఒడ్డున ఇక్కడికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలోనే ఉండడం గమనార్హం.

ఈ ప్రాంతం తరువాత గోదావరి కొన్ని కిలోమీటర్ల దూరం తూర్పుగా ప్రవహించి ధర్మపురి దగ్గర చాలా అరుదుగా దక్షిణాభిముఖంగా పారుతుంది. కాబట్టి ఇక్కడ దీనిని దక్షిణ గంగ అంటారు. ఇక్కడ గోదావరి మళ్ళీ తూర్పు వైపు మలుపు తీసుకునే క్రమంలో దాని ప్రవాహ ఉధృతి ఫలితంగా ఇక్కడ కొన్ని లోతైన గుండాలు ఏర్పడ్డాయి. ఇవి ఎండ కాలంలో కూడా ఎండిపోకుండా మనుషులకు నీటి వనరుగా ఉపయోగపడ్డాయి. కాబట్టి ఇక్కడ చారిత్రక పూర్వ యుగం నుండే మానవ సంస్కృతి విలసిల్లింది. ఇందుకు నిదర్శనంగా ఇక్కడి నుండి ధమ్మన్నపేటకు వెళ్ళే రోడ్డు పక్కన తవ్విన భూదొంతరల్లో మధ్యరాతి యుగం (10,000 సంవత్సరాల) నాటి సూక్ష్మరాతి ఆయుధాలు లభించాయి. ఆనాటి మానవులు ధర్మపురిలో ఉన్న గుండాల సమీపపు రాతి గుహల్లో వేసుకున్న రంగు చిత్రాలు తదనంతర కాలంలో నరసింహస్వామికి ప్రతిరూపాలయ్యాయి. పూర్వకాలపు 'నరు'డు 'సింహ'బలుడు అన్న అర్థంలో 'నరసింహ' పదం పుట్టింది. ఈ ధర్మపురిలో రెండు-రెండున్నర వేల సంవత్సరాల క్రితం బౌద్ధమతం కూడా వర్ధిల్లిందని 'ధమ్మపురి' అనే పేరు, ఇక్కడి 'బూదాం' మసీదు ఆధారాలు సూచిస్తున్నాయి. ధర్మపురిలోని హన్మాండ్లగడ్డ-మఠం రేగళ్ళ ప్రాంతంలో కనిపించే సాతవాహన కాలపు 21 అంగుళాల పొడవైన ఇటుకలు, యజ్ఞవాటికలు తొలి సాతవాహన రాజులు ఇక్కడ యజ్ఞాలు నిర్వహించారని తెలుపుతాయి. ఆ తరువాత విష్ణుకుండి రాజుల కాలంలో రామలింగ క్షేత్రంగా, నరసింహ క్షేత్రంగా ధర్మపురి ప్రసిద్ధి చెందింది. వేయేళ్ళ కిందటే (క్రీ.శ. 1018లో) ధర్మపురిలో కట్టిన (చాళుక్యుల కాలపు) నరసింహాలయాలను (ఇప్పుడు వేరే పేర్లున్నాయి) ఇప్పటికీ చూడవచ్చు. 500 బ్రాహ్మణ కడపలతో తెలుగునాట ప్రసిద్ధి గాంచింది ఈ ధర్మపురి. ఇక్కడి గోదావరి గుండాల్లో స్నానం చేయడం పుణ్యప్రదమని తెలుగు ప్రజలు అనాదిగా నమ్ముతున్నారు.

ధర్మపురికి 10 కిలోమీటర్ల దూరంలో తూర్పువైపు ప్రవహిస్తున్న గోదావరి ఉత్తరపు ఒడ్డున గూడెం గుట్ట మీద సత్యనారాయణ స్వామి ఆలయముంది. దీనిని గత అర శతాబ్దం కిందట స్థానిక సాతాని వైష్ణవుడు కట్టించాడు. ఇక్కడికి ప్రతి పౌర్ణమికి విశేషంగా భక్తులు వస్తారు. అలా అనతి కాలంలోనే ఇది ఆంధ్రలోని

అన్నవరం సత్యనారాయణస్వామి అంతటి ప్రాచుర్యాన్ని సంపాదించుకుంది. ఇక్కడ రాయపట్నం దగ్గర గోదావరి మీద వంతెన కూడా ఉండడంతో కరీంనగర్ జిల్లా మీదుగా వచ్చే యాత్రికులకు కూడా ఈ ఆలయం అందుబాటులోకి వచ్చింది. గోదావరి పుష్కరాలకు నారాయణుడు అధిదేవత కావడం, ఆ దేవుడి నిలయం ఈ గూడెం గుట్ట మీద ఉండడంతో ఈ ఆలయం, సమీపపు గోదావరి ఈ పుష్కరాల సమయంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

గూడెం–లక్షెట్టిపేటకు సుమారు 10 నుండి 15 కిలోమీటర్ల దూరంలో రెండు మూడు గిరిజన క్షేత్రాలున్నాయి. అవి చిన్నయ్య, పెద్దయ్య దేవుళ్ళ ఇల్లారులు (ఆలయాలు). పాండవుల వనవాస కాలంలో భీముడు ఇక్కడి గోండు–నాయకపు గిరిజనుల ఆడపడుచు హిడింబిని ప్రేమించి, ఆమె ద్వారా ఘటోత్కచున్ని కనడంతో భీముడు, పాండవులు, వారి మార్గదర్శి కృష్ణుడు, ఆయన భార్య లక్ష్మి తదితరులు ఈ గిరిజనులకు ఆరాధనీయులయ్యారు. అలా భీమున్ని చిన్నయ్య అని, అతని అన్న ధర్మ రాజును పెద్దయ్య అని గిరిజనులు మాత్రమే కాదు, ఈ ప్రాంతపు రైతులందరు కూడా వారి ఇల్లారులను దర్శించి పూజించనిదే సాగు మొదలుపెట్టరు. ఈ ఇల్లారుల ప్రాంతాలు గుట్టలు, గుహలు, శిఖరాలు, సెలయేళ్ళతో అలరారే ప్రకృతి సౌందర్య నిలయాలు. ఈ రెండు క్షేత్రాల మీదివైపు ఉన్న అర్జునుని పూజించే అర్జునలొద్ది ప్రాంతం కూడా చాలా అందమైంది. దాని మీదుగా కన్పించే తిర్యాని లోయలో 5 లక్షల సంవత్సరాల కిందటే ఆనాటి పాతరాతి యుగపు మనుషులకు ఏనుగులతో పరిచయముందని తెలిపే ఏనుగు బొక్కల శిలాజాలు ఆసిఫాబాద్ సమీపంలో దొరికాయి. ఈ క్షేత్రాల మీదుగా పారే వాగులన్నీ గోదావరిలోనే కలుస్తాయి.

ధర్మపురి తరువాత బ్రాహ్మణులకు, పుణ్య క్షేత్రాలకు ప్రసిద్ధిగాంచిన స్థలాలు... గోదావరి తీరం వెంబడి... కాశిపేట / గుంజపడుగు, మంతెన, రామగిరి, కమ్మంపల్లి, కాళేశ్వరం, పర్ణశాల, భద్రాచలం. గోదావరి దక్షిణ తీరంలో కరీంనగర్ జిల్లాలో ఉన్న కాశిపేట / గుంజపడుగు, మంథని ప్రాంతం నుంచే గోదావరిని గౌతమీ నది అని పిలుస్తారు. మంతెన / మంథని సమీపపు లంజమడుగు, కాశిపేట సమీపపు గుంజపడుగు ప్రాంతాలను కలిపి పిలుస్తుంటారు ఈ ప్రాంతీయులు. లంజమడుగు అనే పేరు రావడానికి కారణాలుగా గౌతమ మహర్షి భార్య అహల్య చంద్రునితో చేసిన లంజతనం, లేదా రామాయణం ప్రకారం మాండకర్ణి అనే రుషి వేశ్యలతో ఈ

మడుగు కింది విలాస గృహంలో చేసిన కామకేళి, లేదా స్థానికులు చెప్పే ఒక రాణి ఇక్కడి మడుగు అవతల వ్యక్తితో చేసిన రంకు కథనాలు విన్పిస్తాయి.

ఇక్కడికి సమీపంలో కొత్తరాతి యుగం పనిముట్లు దొరికిన మందమర్రి నుండి మాండకర్ణి ఎదిగి ఉంటాడు. గౌతముడు కాశీ విశ్వేశ్వరుని జటాజుటం నుంచి గోదావరిని తెచ్చాడని స్కాందపురాణం చెప్తున్నది కాబట్టి, అందుకు నిదర్శనంగా చూపే గుంజపడుగు దగ్గర వేయేళ్ళనాటి కాశిపేట ఆలయాలు కన్పిస్తాయి. లంజమడుగు ఒడ్డున రెండు వేల ఏళ్ళ కిందటి బౌద్ధ గుహలున్నాయి కాబట్టి, క్రీ.శ. ఏడెనిమిది శతాబ్దాలలో వాటిల్లో తంత్ర / వజ్రయానశాఖ మొదలై స్త్రీల సాంగత్యంలో లంజతనం ప్రబలింది కాబట్టి. ఈ కారణంగా కూడా ఈ ప్రాంతపు మడుగుకు ఆ పేరు వచ్చి ఉంటుంది. ఈ మడుగు ఎండా కాలంలో కూడా ఎండిపోకుండా నీటి వనరుగా ఉండడంతో పాటు ఆదిలాబాద్ జిల్లాకు పుట్టీలమీద చేరవేసే వంతెనగా కూడా ఉంది. కాబట్టి ఈ ప్రాంతానికి వంతెన అనే మరో పేరు వచ్చింది. 'వంతెన' గ్రామీణ ఉచ్చారణలో 'మంతెన' అవుతుంది. అదే శిష్టుల వ్యవహారంలో మంథెన, మంథని, మంత్ర కూటంగా పిలువబడింది. చారిత్రక నేపథ్యాలు ఏవి ఉన్నా లంజమడుగు మాత్రం పర్యాటకానికి అనువైన ప్రదేశం కాగా, మంథని ఎనిమిదిన్నర శతాబ్దాల కిందటి గౌతమేశ్వర ఆలయంతో పాటు పలు చారిత్రక ఆలయాలకు, వేయి మంది బ్రాహ్మణులకు, పితృతర్పణాలకు, పడవ ప్రయాణాలకు ప్రసిద్ధి చెందింది.

మంత్రకూటంగా పిలువబడిన మంథనికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే చిత్రకూటంగా పిలువబడిన రామగిరి ఉంది. వాల్మీకి రామాయణంలోని అరణ్యకాండలో చెప్పినట్లే గోదావరి నది దాటి ఉత్తరం నుంచి దక్షిణం వైపు తాటి వనాల గుండా దాటుతూ ఈ రామగిరిని ఎక్కవలసి ఉంటుంది. రాముడు అరణ్య వాసంలో ఉన్నప్పుడు పంచవటి– పర్ణశాల వద్ద మారీచున్ని, అతని 12 వేల రాక్షస సైన్యాన్ని ఎదుర్కొన్నప్పుడు అంతరిక్షంలో ఉన్న గ్రహస్థితి (వాల్మీకి రామాయణం) ఆధారంగా పుష్కర్ భట్నాగర్ అనే పరిశోధకుడు అమెరికన్ టైమ్ మిషన్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సంఘటన జరిగింది క్రీ.పూ.5077లో అని నిర్ధారించారు. అదే కాలపువి... అంటే 7 వేల సంవత్సరాల కిందట... అంటే రాముడు–సీత రామగిరి మీద గడిపిన కాలపు రాతి ఆయుధాలను మూడున్నర దశాబ్దాల కిందట ఆనాటి పురావస్తు సంచాలకులు వి.వి.కృష్ణశాస్త్రి గారి సమక్షంలో ఠాకూర్ రాజారాం సింగ్

గారు సేకరించారు. నేనేమో ఆ యుగానికి చెందిన ఎరుపు రంగు, తెలుపు రంగు చిత్రలేఖనాలను వెలుగులోకి తెచ్చాను.

చారిత్రకంగా రామగిరి ఖిల్లా క్రీ.శ. 8వ శతాబ్దం నాటికే మనుగడలో ఉన్నట్లు వేములవాడ చాళుక్యరాజు యుద్ధమల్లుని శాసనం వల్ల తెలుస్తుంది. ఆ తరువాత ఇది వరుసగా పొలవాస మేడరాజులు, కాకతీయులు, మసునూరు, రాచకొండ నాయక రాజులు, గోల్కొండ కుతుబ్షాహీల కాలంలో మనుగడ సాగించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. సుమారు 15 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ రామగిరి అందానికి మురిసిపోయి మొఘల్‌రాజు ఔరంగజేబ్ గోల్కొండ రాజు అబ్దుల్లా కూతురు (బేగం)తో తన కొడుకు పెళ్ళిని ఇక్కడ 1656 ఏప్రిల్ 6 నాడు జరిపించగా ఈ ప్రాంతానికి బేగంపేట అనే పేరు వచ్చింది. మధ్య యుగాలలో రామగిరి బ్రాహ్మణులకు, మునులకు ఆశ్రమంగా, ఆశ్రయంగా ఉండింది. రాజకోటలు, భవనాలు, మందిరాలు, లోయలు, జలపాతాలతో అలరారే రామగిరిపై నుంచి చూస్తే గోదావరి, అందులో కలిసే మానేరు అందాలు కన్పిస్తాయి.

మంథనికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో గోదావరిలో కలవడానికి వడివడిగా ప్రవహిస్తున్న మానేరు నది తీరాన కమ్మంపల్లిలో రామప్ప వాస్తు శిల్పశైలిని పోలిన జంట దేవాలయాలున్నాయి. వీటిని 13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని రాజగురువు విశ్వేశ్వర శివాచార్యులు కట్టించినట్లు అక్కడే శాసనం దొరికింది. చంద్రవెల్లి (సందరోళ్ళ) గుళ్ళుగా పిలుస్తున్న ఈ దేవాలయాలు ఇప్పుడు శిథిల స్థితికి చేరుకుంటున్నప్పటికీ వాటి స్తంభాలు, గోడల మీదున్న శిల్పాలు తమ అరుదైన అందంతో మనల్ని కట్టిపడేస్తాయి. ఈ ఆలయాల్లో కూడా బ్రాహ్మణులకు ప్రత్యేక ఏర్పాట్లుండేవని ఇక్కడి శాసనమే చెప్తున్నది.

మంథని నుంచి కాళేశ్వరం వైపు చేసే ప్రయాణం చాలా ఆహ్లాదకరమైన అనుభూతినిస్తుంది. కారణం, ఈ ప్రయాణం గోదావరి దక్షిణ తీరం వెంట విస్తరించిన ఎగుడు దిగుడు గుట్టల్లో, లోయల్లో, దట్టమైన అడవుల్లో సాగుతుంది. ఇక కాళేశ్వరం చేరిన తరువాత పొందే ఆధ్యాత్మిక అనుభూతి, ప్రకృతి అందాలకు పరవశించే అనుభూతి అనుభవించవలసినవే కాని చెప్పనలవి కానివి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వంటి రమణీయ క్షేత్రమిది. ఉత్తరం నుంచి ప్రాణహిత నది వచ్చి ఇక్కడ గోదావరిలో సంగమిస్తుంది. ఇంకా వెన్‌గంగ, వరద అనే చిన్న నదులు కూడా ఇక్కడే గోదావరిలో

సంగమిస్తాయి.

కాళేశ్వరం ప్రధానాలయంలో ఒకే పానవట్టం మీదున్న రెండు శివలింగాలలోని ఒక శివలింగానికి ఉన్న రెండు నాసికా రంధ్రాల్లో పోసిన అభిషేక జలం భూగర్భం గుండా అంతర్వాహినిగా సరస్వతి నది పేరుతో వెళ్ళి గోదావరిలో సంగమిస్తుంది. కాబట్టి తెలంగాణలో అత్యంత పవిత్రమైన సంగమ క్షేత్రంగా కాళేశ్వరం పేరొందింది. కాబట్టే కాకతీయ ప్రతాపరుద్ర రాజు ఆస్థాన కవి విద్యానాథుడు తన 'ప్రతాపరుద్ర యశోభూషణం' అనే అలంకార శాస్త్ర గ్రంథంలో కాళేశ్వరాన్ని తెలుగుదేశంలో ప్రధానమైన మూడు శైవ క్షేత్రాలలో ఒకటిగా... త్రిలింగ దేశ సరిహద్దు తీర్థ క్షేత్రంగా అభివర్ణించాడు. చనిపోయిన పితరులకు పిండ తర్పణాలు చేయడానికి ప్రధాన క్షేత్రం ఇది. ప్రధానాలయంలో ఉన్న జంట లింగాల్లో ఒక లింగం పేరు కాళేశ్వరుడు, మరో లింగం పేరు ముక్తేశ్వరుడు. ఈ దేవుళ్ళు యముడు, శివుడికి ప్రతిరూపాలు. కాబట్టి ఇక్కడ చనిపోయినా లేదా చనిపోయినవారి చితాభస్మం ఇక్కడి గోదావరి సంగమంలో కలిపినా ముక్తి లభిస్తుందని విశ్వసిస్తారు. ఈ విశ్వాసం ఆధారంగానే కాకతీయ వంశపు చివరిరాజు ప్రతాపరుద్రుడు తన రాజ్యాన్ని తన వారసులకు అప్పగించి తను ఇక్కడ గోదావరి సంగమంలోనే తనువు చాలించాడనే ఒక చారిత్రక నేపథ్య గాథ ప్రచారమయ్యింది.

ఏది ఏమైనా కాళేశ్వరంలోని త్రివేణి సంగమ ప్రదేశం, అష్టతీర్థాలు, షట్కోణాలు, కాళేశ్వర-ముక్తేశ్వర ఆలయాలు, రామలింగేశ్వరాలయం, ప్రౌఢ సరస్వతీ ఆలయం, సూర్య ఆలయం, మత్స్య శిల్పఖండం తదితరాలు దర్శనీయాలు. కాళేశ్వరం అనాదిగా బ్రాహ్మణ కుటుంబాలకు ప్రసిద్ధి చెందింది. కాళేశ్వరం దగ్గర గోదావరి శృంగం ఆకారంలో ప్రవహించడం అద్భుతమనిపిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా తుమ్మిడిహట్టి వద్ద అనుకున్న ప్రాజెక్టును ఇప్పుడు కాళేశ్వరం వద్ద నిర్మించి ఎక్కువ నీటిని అందుబాటులోకి తేవాలని తెలంగాణ ప్రభుత్వం తాజా ప్రణాళికలు రచిస్తున్నది.

కాళేశ్వరం తరువాత గోదావరి కరీంనగర్ జిల్లా దాటి వరంగల్ జిల్లాలో కొంచెం దూరమే ప్రవహిస్తుంది. ఈ జిల్లాలోని ఏటూరునాగారం అడవుల్లో 40 కిలోమీటర్లు ప్రయాణం చేసి ముళ్ళకట్ట గ్రామం నుండి గోదావరి మీద కొత్తగా నిర్మించిన బ్రిడ్జి దాటి ఖమ్మం జిల్లాలోని పూసూరు గ్రామానికి చేరుకోవడమే చాలా ఆహ్లాదాన్నిస్తుంది. ఈ 40 కిలోమీటర్ల ప్రయాణంలో నాలుగైదే గిరిజన గ్రామాలు

ఒంటరిగా కలుస్తాయి. గోదావరి తీర సమీప గ్రామాలైన రొయ్యూరు, కడేకల్లు నాయకపు గిరిజనులు ఆటపాటల మధ్య నిర్వహించే 'లక్ష్మిదేవర పెళ్ళి సంబురం' వేడుకలకు ప్రసిద్ధి గాంచాయి. వరంగల్ జిల్లాలో ముళ్ళకట్ట వద్దనే ప్రభుత్వం పుష్కర ఘాట్లు ఏర్పాటు చేస్తున్నది కాబట్టి పుష్కరాల సమయంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఈ అరుదైన గిరిజన నృత్యరీతులను ఈసారి భక్తులు వీక్షించవచ్చు.

వరంగల్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఒకే ఒక ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉంది. అది మల్లూరులో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం. ఈ క్షేత్రం ప్రధానాలయంలో సుమారు 8 అడుగుల ఎత్తున్న స్వామివారి విగ్రహం పొట్టలో నుండి ఎప్పుడూ రక్తం కారుతుంది. ఆ రక్తంతో తడిపిన పసుపును భక్తులు తీసుకెళ్ళి సంతానవృద్ధి, పాడిపంటల అభివృద్ధి నిమిత్తం ఉపయోగిస్తుంటారు. ఎప్పుడో ఒక గిరిజనుడు తెలియక వేసిన గొడ్డలి వేటు స్వామి పొట్టలో దిగగా రక్తం కారుతుందని స్థలపురాణంలో చెప్తారు. నిజానికి స్వామివారున్న గుహ గోడ మెత్తటి రాయిది కాగా అందులోకి పైనుండి ఎరుపు వర్ణపు వేర్లుండే చెట్లు తమ వేర్లను సహజంగా దించగా, అలాంటి సన్నపు వేర్లను స్వామివారికి మొలుస్తున్న వెంట్రుకలని, గుట్ట గుహలోకి వేర్ల ఎరుపుదనాన్ని కలుపుకొని ఇంకుతున్న ఎరుపు నీళ్ళనేమో కారుతున్న రక్తమని భావిస్తుంటారు. అయితే ఇంతటి ప్రకృతి విశేషాన్ని ఒక చోట చూడగలగడం, దాన్ని పరమాత్మ అనుకోవడం ప్రకృతి శక్తి మీద ప్రజలకున్న భక్తికి నిదర్శనం.

అయితే స్థలపురాణంలో చెప్తున్నట్లు ఒక నాయకపు గిరిజనుడే ఈ ఆలయ సృష్టికర్త అన్నది మాత్రం నిజం అనడానికి నిదర్శనంగా స్వామివారి ఎదురుగా ఆ భక్తుని రేఖా చిత్రంతో కూడిన శిలాశాసనం వాకిట్లో ఉంది. నాయకపు గిరిజనులు ఆరాధించే లక్ష్మిదేవర ఆలయం (ఇల్లారి), ఇటీవలే లేచిపోయిన వారి గూడెపు ఆనవాళ్ళు, నిజాం కాలంలో వారికి స్వామి సేవ చేయడానికి వంశం పారంపర్య హక్కుగా ఇచ్చిన వెండి సనదు... ఇవన్నీ ఈ స్వామివారు మొదట నాయకపు గిరిజనుల దేవుడని నిరూపించే అంశాలు. ఇప్పుడు మాత్రం బ్రాహ్మణులే ఈ ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ఆలయ సమీపంలో ఉన్న చింతామణి అనే చిన్న జలపాతం, హనుమ ప్రతిష్టలు, బృహత్‌శిలా యుగపు సమాధి కట్టడాలు, పచ్చని ప్రకృతి ఆసక్తిని, ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

అసలు మల్లూరు గుట్ట ఇంకా అందమైంది, ఆసక్తికరమైంది. అయితే 600 అడుగుల ఎత్తున్న ఆ గుట్టను ఎక్కితేనే ఈ అనుభూతులు అనుభవంలోకి రాగలవు. కనీసం రెండున్నర వేల సంవత్సరాల క్రితమే గుట్ట మీద కట్టిన కోటగోడలు, ప్రాంగణాలు, భవన వేదికలు, బావులు, చెరువులు, కోటగోడలనానుకొని ఉన్న వందలాది బృహత్‌శిలా సమాధులు, వాస్తు విశేషాలు, జలపాతాలు, కొండ దేవతలు... ఇలా ఎన్నో విశేషాల సమాహారం మనల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది. తెలంగాణలో... యావత్ భారతదేశంలోనే ఇంత పెద్ద బృహత్‌శిలా యుగ స్థలం మరోటి లేదు. కాబట్టి దీన్ని తెలంగాణ బృహత్‌శిలా పార్కుగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది. అన్నింటినీ మించి ఈ గుట్టపై నుంచి చూస్తే కనిపించే విశాలమైన గోదావరి ప్రవాహం, ఇసుక తిన్నెలు, ఒయాసిస్సు వంటి నీటి గుండాలు, వాటి మధ్య కనిపించే గిరిజన గూడేలు, పచ్చని పంటపొలాలు మన కడుపు నింపేస్తాయి.

మల్లూరు దాటి ఖమ్మం జిల్లాలో ప్రవేశించే గోదావరి పర్ణశాల దగ్గర దక్షిణ ముఖంగా తిరిగి ప్రవహిస్తుంది. రామాయణంలోని అరణ్యకాండలో చాలా భాగం ఈ పర్ణశాల– పంచవటి ప్రాంతంలోనే జరిగినట్లు, చివరికి సీతను రావణాసురుడు ఎత్తుకుపోవడంతో రామాయణం ఇతర ప్రాంతాలకు వెళ్ళినట్లు రామాయణంతో ఏమాత్రం పరిచయమున్న వారికైనా తెలుసు. అగస్త్య మహర్షి చెప్పగా వచ్చి, ఈ ప్రాంతపు ప్రకృతికి పరవశించి సీతారామ లక్ష్మణులు చాలా కాలం ఇక్కడే ఉండిపోయారని, వారిక్కడ ఉన్నప్పుడు స్నానం చేసిన గోదారి తీరాలు, సీత బట్టలు ఆరవేసుకున్న ఆనవాళ్ళు, ఆమె వాడిన పసుపుకుంకుమ రాళ్ళు, ఆడిన వామనగుంటలు, రావణుడి రథ చక్రాల గాడులు, రావణుడు సీతతో సహా భూమిని పెళ్ళగించగా ఏర్పడిన గుంట తదితర విశేషాలెన్నో ఇక్కడ కన్పిస్తాయి. ఇక్కడ గోదావరిలో తాలిపేరు నది సంగమించే దృశ్యం అందమైంది.


పర్ణశాల నుండి భద్రాచలం చేరడానికి 5 కిలోమీటర్ల ముందే గోదావరి నది మధ్యలో ఉన్న వొూతెగడ్డ అనే ద్వీపం మీద కోయ గిరిజనులు కొలిచే వీరభద్రాలయముంది. పుట్టిల మీద మాత్రమే ఈ ద్వీపం మీదికి వెళ్ళటం, తిరిగి రావటం గుర్తుండిపోయే మధురానుభూతులనిస్తాయి.

తెలంగాణలో గోదావరి పారే చివరి స్థలం భద్రాచలం. ఇక్కడ గోదావరి భద్రాద్రి అనే గుట్ట చుట్టూ తిరుగుతూ సోయగంతో ప్రవహిస్తుంది. మూడువేల సంవత్సరాల

కిందట భద్రళపురిగా పిలువబడిన ఈ ప్రాంతంలో జైన మతానికి చెందిన పదవ తీర్థంకరుడు శీతలనాథుడు ప్రసిద్ధి చెందగా సరిగ్గా మూడు వందల యాభై సంవత్సరాల కిందట... అంటే క్రీ.శ. 1665లో ఈ భద్రగిరిపై కంచర్ల గోపన్న సీతానాథుని (రామ) ఆలయం కట్టించి రామదాసుగా పేరు గాంచాడు. మళ్ళీ సరిగ్గా మూడు వందల సంవత్సరాలకు... అంటే 1965లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భద్రాచలం రామాలయాన్ని సమూలంగా పునర్నిర్మించింది. రాముడి ఎడమ ఒడిలో సీత ఒదగడం, రాముడు కోదండాన్ని పట్టుకొని ఉండడం ఈ ఆలయంలోని మూలవిరాట్టు ప్రత్యేకత. రామదాసే శ్రీరంగం నుంచి శ్రీవైష్ణవ బ్రాహ్మణులను రప్పించి ఇక్కడ అర్చకులుగా నియమించడంతో భద్రాచలం శ్రీమన్నారాయణ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. గోదావరి పుష్కరాల అధిదేవత నారాయణుడే కావడంతో ఈ పుష్కరాల సమయంలో ఇక్కడ గోదావరిలో చేసే స్నాన, ధ్యాన, దాన, పిండప్రదానాలకు విశిష్టత ఏర్పడింది.

ఇలా... పైన వివరించిన విధంగా గోదావరి అందంగా కన్పించే చోటల్లా తెలంగాణలో ఆలయాలు వెలిశాయి. కాబట్టి ఈ గోదావరి పుష్కరాల సందర్భంగా తెలంగాణ ప్రజలు, పర్యాటకులు, భక్తులు ఆయా ఆలయాల సమీపపు గోదావరిలో స్నానం చేసి, దాని అందాలని చూసి, దాన తర్పణాలు చేసి తరించాలని, తద్వారా తెలంగాణా సంస్కృతిని గౌరవించుకోవాలి.

*– ఆంధ్రజ్యోతి, 5-07-2015*


River Godavari
from Brahmagiri to Bay of Bengal
Nasik
Aurangabad
Maharastra
Parbhani
Nanded
Karnataka
Manjeera
Nizamabad
Pochampad
Kadem
Andhra Pradesh
Karimnagar
Itchampally
Indravathi
Chattisgarh
Bhadrachalam
Sabari
Konta
Orissa
Polavaram
Godavari Barrage
Eluru
Rajahmundry
Kakinada
Bay of Bengal

# IV

# అనుబంధాలు

19

# ఇక మన చరిత్రను మనం రాసుకుందాం

ఏడు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నారు. కాని చరిత్ర మరొక విధంగా నడిచింది. పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు తెలంగాణ నిజాం రాష్ట్రం నుండి విడిపోయి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో పడింది. మరిన్ని బాధలు అనుభవించింది. ఏమైతేనేం చివరికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రానే వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలు ఎలాంటివి, అసలు ప్రత్యేక తెలంగాణను ప్రజలు ఎందుకు కోరుకున్నారు, తెలంగాణకున్న ప్రత్యేక సాంస్కృతిక విశేషాలు, అస్తిత్వాలు ఏమిటి... ఈ విషయాలన్నింటి నుంచి మనం భావి తరాలకు వారసత్వంగా ఏమి అందించాలను కుంటున్నాము. దీని పైన ఇప్పుడు విస్తృతమైన చర్చ జరుగవలసిన అవసరముంది. తత్ఫలితంగా తదనుగుణంగా రాసిన తెలంగాణ చరిత్ర పుస్తకాలను మన వారసులకు పాఠ్యాంశాలుగా అందించవలసి ఉంది.

2015 ఏప్రిల్ 26 నాటికి తెలంగాణలో పురావస్తు శాఖ ఏర్పడి 101 సంవత్సరాలు పూర్తయినాయి. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్ర స్పృహ కలిగి, దాన్ని రికార్డు చేయడంలో కృషి చేసిన మహనీయులను ముందుగా తలుచుకుందాం. సుమారు వంద పది సంవత్సరాల కింద తెలంగాణ చరిత్రతో పాటు భారతదేశ చరిత్రను హిందూ యుగం, మహమ్మదీయయుగం అనే గ్రంథాలుగా రాసి ప్రచురించి తెలంగాణ చరిత్ర పితామహ అనే బిరుదుకు అర్హత సంపాదించుకున్న వారు కొమర్రాజు లక్ష్మణరావుగారు. ఆయన వారసత్వంగా అందుబాటులోకి వచ్చిన లక్ష్మణరాయ పరిశోధక మండలి తెలంగాణ శాసనాలను సంపుటాలుగా ప్రచురించింది.

1914లో ఏర్పడిన హైదరాబాదు రాష్ట్ర పురావస్తు శాఖ దాని తొలి సంచాలకులు యాజ్దానీ గారి ఆధ్వర్యంలో ఎన్నో శాసనాలను వెలికి తీసి ప్రచురించింది. ఎన్నో

తవ్వకాలు చేపట్టి తెలంగాణ చరిత్రను భారతదేశంలో అత్యంత ప్రాచీన చరిత్ర గల రాష్ట్రాల సరసన నిలబెట్టింది. యాజ్దానీ జరిపినంత పరిశోధన మరే కాలంలోనూ జరుగలేదని ప్రముఖ చరిత్రకారులందరూ ఒప్పుకుంటారు.

హైదరాబాదులో మొట్టమొదటిసారిగా 'దక్కన్ హిస్టరీ కాంగ్రెస్' వార్షిక సమావేశం 1943లో డా॥ గ్రిగ్సన్ అనే ఆంగ్లేయ పండితుని ఆధ్వర్యంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ సంక్షోభం కారణంగా నిధులు లేక రెండవ వార్షిక సమావేశం నుండి వాయిదా పడిన సమావేశం మళ్ళీ జరుగలేదు. 2008లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ మొదటి వార్షిక సమావేశం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగింది. కారణాలు ఏమైనప్పటికీ అది కూడా రెండవ వార్షిక సమావేశం తరువాత మళ్ళీ సమావేశం కాలేదు. అంతకుముందే ఏర్పాటైన తెలంగాణ హిస్టరీ సొసైటీ కొన్ని పుస్తకాలను ప్రచురించింది. కాని వార్షిక సమావేశాలు జరుపలేదు. చెప్పేదేమంటే, ఇప్పటికైనా తెలంగాణ చరిత్రకారులు ఒకే వేదిక పైకి వచ్చి తమ ప్రాంత చారిత్రక నేపథ్యాన్ని రాసుకోవలసిన సమయం ఆసన్నమైందని.

ఎందుకంటే, గతంలో కూడా కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనా, రాజ్యమైనా ముందు పండితులను ఒక్క తాటి పైకి తెచ్చి తమ చరిత్రను అధికారికంగా రాయించాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ అనే అధ్యయన సంస్థను ఏర్పరచి, దాని ద్వారా భారతదేశపు చరిత్రను, ప్రత్యేకించి స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రాయించారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కూడా బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన తెలుగు భాషా సమితి 'తెలుగు సంస్కృతి' పేరున తెలుగు వారి చరిత్రను అధికారికంగా ప్రకటించారు. ఆ పుస్తకమే మొన్నటి వరకు తెలుగువారి చరిత్రకు ప్రామాణిక రిఫరెన్స్ గ్రంథంగా అందుబాటులో ఉండేది. బెజవాడ గోపాలరెడ్డి ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతటి ప్రాధాన్యం గల వ్యక్తి చరిత్ర రచన చేయించడంలో బాధ్యత తీసుకున్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా తెలంగాణ ప్రభుత్వ పెద్దలు వెంటనే తెలంగాణ చరిత్ర రచనా సంఘాన్ని ఏర్పరచి తెలంగాణ చరిత్రను అధికారికంగా ప్రామాణికంగా రాయించాలి. ప్రాచీన చారిత్రక వైభవాన్ని తెలిపే పాఠ్యాంశాలతో పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకై ఆయా వర్గాల ప్రజలు, నాయకులు, ఉద్యమకారులు చేసిన కృషిని, త్యాగాలను ప్రత్యేక అధ్యాయాలుగా రాయించాలి.

నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌లో తెలంగాణ చరిత్రకారులు, చరిత్ర ప్రేమికులు, సంస్థలు కూడా శాశ్వత సభ్యత్వం, వార్షిక సభ్యత్వం

రుసుములు చెల్లించి, వ్యాసాలు రాసి ఆ కాంగ్రెస్ నిర్వహణలో భాగస్వామ్యం పంచుకుంటున్నవారు ఎందరో ఉన్నారు. కాబట్టి పూర్వపు ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌ను విభజించి 'తెలంగాణ స్టేట్ హిస్టరీ కాంగ్రెస్' ఏర్పాటు చేయాలి.

దేశ స్థాయి ఆర్కైవ్స్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ లిఖిత ప్రతులున్నాయి. అలాగే మన పురావస్తు శాఖ కూడా దేశంలోనే అత్యంత ఎక్కువ సంఖ్యలో నాణేలను వెలుగులోకి తెచ్చిన ఘనతకు దక్కించుకుంది. ఈ ఆర్కైవ్స్, ఆర్కియాలజీ, సమకాలీన సాహిత్య సారస్వత ఆధారాలను సమన్వయం చేస్తూ రాయగలిగే ప్రామాణిక / ప్రముఖ చరిత్రకారులతో వెంటనే చరిత్ర రచనా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

తెలంగాణలో ఇప్పటివరకు ఐదు జిల్లాల శాసన సంపుటాలే ప్రచురితమయ్యాయి. నిజామాబాదు, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల శాసనాల ప్రతులు (ఎస్టాంపేజ్‌లు) ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. చరిత్ర రచనకు శాసనాలు అత్యంత ప్రామాణిక ఆధారాలు కాబట్టి, ముందుగా జిల్లాల శాసనాల సంపుటాలను ప్రచురించాలి. ఆదిలాబాద్ జిల్లాలో వెంటనే గ్రామాలవారీగా శాసనాలు సేకరించే ఏర్పాట్లు చేయాలి. ఇలా చేస్తేనే మన గత చారిత్రక వైభవాన్ని మన వారసులకు అందించగలం.

*– ఆంధ్రజ్యోతి, 19-05-2015*

# 20

# తెలంగాణ చారిత్రక వారసత్వం – ఒక విహంగ వీక్షణం

తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ వారు వారం వారం నిర్వహిస్తున్న “చర్చ” కార్యక్రమంలో భాగంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా 2015 ఏప్రిల్ 18 నాడు నాతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. అందులో తెలంగాణ వారసత్వంపై ప్రసంగించాను. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవి.

ఒకప్పుడు “ఆంధ్ర” అంటే మనమే
ఇప్పటికీ ఆదిలాబాద్‌లో “అంధ్” తెగ
తిలింగ ప్రస్తావన చేసిన ప్రాచీన విదేశీ యాత్రికులు
ఆంధ్ర శాతవాహనుడు తెలంగాణ వాడే!
నేటి ఆంధ్ర – అప్పట్లో గృధ్రక, దగ్ధ రాష్ట్రం
నేటి కోస్తా ప్రాంతం ఒకప్పుడు కీకారణ్యం
ఆ అడవులు నరికిన గొడ్డళ్ళు తెలంగాణవే
నేటి ఆంధ్రాకు నాగరికత నేర్పింది తెలంగాణ
ప్రవాహాలకు అడ్డుకట్ట వేసి చెరువులు చేసింది మనమే
కవయిత్రి మొల్ల మన ఆడపడుచు
హైదరాబాద్‌కు 1600 వందల ఏళ్ళ చరిత్ర
బమ్మెరగా మారిన బొమ్మరిగె
భారత అధికారిక శాలివాహన శకం మనదే!
నన్నయ్య చదువుకున్నది తెలంగాణలోనే!
చైనా గ్రేట్ వాల్ తరువాత మనమే గ్రేట్!
పెంకులు దొరికినా, నిధులు దొరికినా ప్రభుత్వానికి అందిద్దాం
తెలంగాణ సాంస్కృతిక వారసత్వ సంపద – దాని పరిరక్షణ అనే

చర్చనీయాంశంలో ప్రధానంగా నాలుగు పదాలున్నాయి. అవేమిటంటే... తెలంగాణ, సంస్కృతి, వారసత్వం, పరిరక్షణ. వీటిని ఒక్కసారి నిర్వచించుకుందాం. తెలంగాణ అనే పదం కొత్తగా ఏర్పడింది కాదు. ఈ రోజున మనం దాన్ని ఒక భౌగోళిక ప్రాంతంగా గుర్తించాం. ఈ పదం ఎప్పుడు మనుగడలోకి వచ్చిందో చూడాలి. తెలంగాణ కోసం 60 ఏళ్ళ నుంచి కొట్లాడినాం. అంతకు ముందు నిజాం రాష్ట్రం ఉండేది. హైదరాబాద్ రాష్ట్రం అని కూడా అనేవారు. ఆ రాష్ట్రంలో మరఠ్వాడా (మహారాష్ట్ర), రాయచూరు (కర్నాటక), తెలంగాణ అని మూడు ప్రాంతాలు ఉండేవి. కారణాలు ఏవైనప్పటికీ, 1948లో నిజాం రాష్ట్రాన్ని భారతదేశంలో కలిపేసుకున్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చేశారు. అప్పుడే ప్రజలు, నాయకులు వ్యతిరేకించారు. "ఆంధ్ర సంస్కృతి వేరు. మా వారసత్వం వేరు, వారి వారసత్వం వేరు. అప్పటికే రెండు వందల ఏళ్ళుగా వారు బ్రిటిష్ పాలనలో ఉన్న మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నారు. మేము వందల ఏళ్ళుగా కుతుబ్షాహీలు, నిజాంల పాలనలో ఉన్నాం. ఇలాంటి నేపథ్యంలో ఎలా కలుస్తాము?" అని ప్రశ్నించారు. అప్పుడు ప్రధాని నెహ్రూ ఏమన్నారంటే, "ఇప్పుడు అమాయకురాలైన తెలంగాణ అనే అమ్మాయిని ఆంధ్ర అనే గడసరి అబ్బాయికి ఇచ్చి పెళ్ళి చేస్తున్నాం. అన్ని పెళ్ళిళ్ళు నిలవొచ్చు. నిలవకపోవచ్చు. పొసగకపోతే విడాకులు తీసుకోవచ్చు" అని.

## ఆంధ్రులు పుట్టింది తెలంగాణలోనే

కాకతీయులు వరంగల్ నుంచి తెలంగాణను మాత్రమే గాకుండా ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని కూడా పాలించారు. వారి పాలనాకాలంలో... అంటే ఏడు వందల ఏళ్ళ క్రితం తెలంగాణ పదం లేదు. ఇప్పుడు మనం అనుకుంటున్న ఐడెంటిటీ (అస్తిత్వ) వాదన అప్పుడు లేదు. అప్పుడు వారి రాజధాని వరంగల్‌ను అంధ్రనగరి అనే అన్నారు. తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్‌ని కూడా కలుపుకొని తెలుగువారందరినీ ఆంధ్ర శాతవాహనులు పాలించారు. ఈ ఆంధ్ర జాతి నేటి ఆంధ్రాలో కాకుండా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే "అంధ్" అనే గిరిజన తెగ రూపంలో ఇప్పటికీ ఉంది. ఇది మొదట్లో అంధక జాతిగా ఉండేది. రెండున్నర వేల ఏళ్ళ క్రితం నాటి బౌద్ధ సాహిత్యంలో అంధక రట్ట, అంధక జాతి ప్రస్తావనలు ఉన్నాయి. ఈ అంధక అనేది ప్రాకృత లేదా పాళీ భాషా పదం. సంస్కృతంలో అది అంధ్రగా, ఆ తరువాత ఆంధ్రగా మారింది. మొట్టమొదట ఆంధ్ర జాతి లేదా అంధ జాతి ప్రజలు ఇప్పటి తెలంగాణలోనే ఉండేవారు అనడానికి నిదర్శనంగా పశ్చిమ ఆదిలాబాద్ జిల్లాలో

అంధ్‌జాతి ఇప్పటికి కూడా కనిపిస్తోంది. నిజాం ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేక హోదా ఇస్తున్నప్పుడు మొట్టమొదటగా గుర్తించింది ఈ తెగ వారినే. ఈ ఆంధ్రులు ఉన్న ప్రాంతం అప్పుడూ, ఇప్పుడూ ఇప్పటి తెలంగాణ ప్రాంతానిదే.

## పురాణాల్లో తిలింగ జాతి ప్రస్తావన

ఆంధ్ర శాతవాహనులు కరీంనగర్ జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల నుంచి పాలించారు. బౌద్ధ మతసాహిత్యంలో ఈ కోటిలింగాల గోదావరి దక్షిణ ఒడ్డున ఉన్న "ఆంధ్రనగరి"గా పేర్కొనబడింది. తెలింగనగరిగా కాదు. మరి తెలంగాణ ఎక్కడి నుంచి వచ్చింది? ఈ తెలింగ, తెలంగాణ పదాలను పోలి ఉన్న పదాలు కూడా ఎప్పటి నుంచే వాడుకలో ఉన్నాయి. పురాణాల్లో కూడా తిలింగ జాతి ప్రస్తావన ఉంది. మనం మనవారి కన్నా విదేశీయులనే ఎక్కువగా విశ్వసిస్తాం. ప్లినీ, టాలమి వంటి యూరప్ దేశాల యాత్రికులు తిలింగ జాతి గురించి పేర్కొన్నారు. ఈ తిలింగ జాతి ఉండే ప్రాంతాన్ని టిలింగాన్‌గా వ్యవహరించారు. అదే తెలంగాణగా మారింది. ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు దక్షిణాన తమిళనాడు ఉంది. తమిళులు తెలుగువారిని వడుగర్ అంటారు. అంటే "ఉత్తరాన ఉన్న వారు" అని అర్థం. ఉత్తర భారతీయులు మన ప్రాంతాన్ని "దక్కన్" అని అంటారు. దానికి సమాన అర్థం ఇచ్చే తెన్ను అనే పదం ఉంది. 'దారీ తెన్నూ తెలియదు' అని ఇప్పటికీ అంటూంటాం. తెన్ను అంటే దక్షిణం అని అర్థం. అటు ఉత్తరాదికి, ఇటు దక్షిణాదికి మధ్యన తెలంగాణ ప్రాంతం ఉంది కాబట్టి వడుగర్, దక్కన్, తెన్ను పదాలు తెలంగాణను సూచిస్తాయి. ఆంధ్ర, తెలంగాణ మధ్య స్పష్టత ఎందుకు లేదు? దానికీ కారణం ఉంది. ఆంధ్రశాతవాహనుల రాజుల్లో ఒకరు గౌతమీపుత్ర శాతకర్ణ. ఒకటో శతాబ్దంలో ఇప్పటి ఆంధ్ర ప్రాంతాన్ని ఆక్రమించాడు. అక్కడ కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో ఒక జ్ఞాపకంగా ఒక ఆలయం కట్టించాడు. ఆయన మరణించిన తరువాత అందులో విష్ణు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈయన ఆంధ్ర శాతవాహన రాజు కాబట్టి ఆ విగ్రహానికి ఆంధ్ర విష్ణు అని పేరు వచ్చింది. ఆంధ్ర జాతికి మూలపురుషుడు ఆంధ్ర విష్ణు అని చెప్పడం వెనుక ఈ ఆంధ్ర శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి నేటి ఆంధ్ర ప్రాంతంలో తన పాలనను ప్రవేశపెట్టడం అనే చారిత్రక నేపథ్యం ఉంది.

## గద్దలు తిరుగాడిన నేల నేటి కోస్తాంధ్ర

అప్పట్లో ఇప్పటి కోస్తాంధ్ర ప్రాంతాన్ని గృధ్రక రాష్ట్రం లేదా దగ్ధ రాష్ట్రం అనే

వారు. అంటే గద్దలు తిరిగే ప్రాంతం అని. దట్టమైన అడవులు ఉండేవి. ఆ నేల అంతా సారవంతమైంది. తెలంగాణలో మూడు, నాలుగు వేల ఏళ్ళ క్రితమే ఇనుము వినియోగం ఉండేది. ఆ లోహంతో గొడ్డళ్ళు తయారు చేసి అడవులను నరికేసి, దగ్ధం చేసి ఆంధ్రలో నాగరికత ప్రవేశపెట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో తెలుగు, ఆంధ్ర కలిసిపోయాయి. అంటే ఆంధ్రులు అన్నా, తిలింగులు అన్నా మనమే. తెలంగాణ నుంచే ఆంధ్ర ఏర్పడింది. ఇలా రెండు వేల ఏళ్ళ క్రితమే తిలింగ, తత్సంబంధ పదాలు వాడుకలోకి వచ్చాయి. మనం మొట్టమొదట తెలంగులం. ఆంధ్రులు ఉత్తరాది నుంచి వచ్చి ఉంటారు. వారిని కలుపుకున్నాం. ఆ తరువాత మధ్యయుగాల్లో ముస్లింలు వచ్చారు. రెండు వందల ఏళ్ళ క్రితం క్రైస్తవులు వచ్చారు. వారినీ కలుపుకున్నాం. బౌద్ధులు ఉత్తర భారతం నుంచి వచ్చారు. జైన మతం కూడా. అందరినీ కలిపేసుకున్నాం. దీన్నే మిశ్రమ సంస్కృతిగా వ్యవహరిస్తున్నాం.

## తెలంగాణకు ప్రత్యేక సంస్కృతి

తెలంగాణకు ప్రత్యేక సంస్కృతి ఎలా వచ్చిందో చూద్దాం. మానవ సంస్కృతిని... జీవనవిధానాన్ని ఐదారు కోణాల్లో చూస్తాం. ఈ కోణాల్లో రాజకీయం, ఆర్థికం, సామాజికం, మతం, కళా సంస్కృతి, తత్వ సంస్కృతి విశేషాలు ఉంటాయి. వారసత్వం అంటే గతం నుంచి మనకు పరంపరగా వచ్చింది అని అర్థం. ఉదాహరణకు మొదట ఒక అంశాన్ని కనుగొన్నారు అనుకుందాం. అది తరువాత కొంతకాలానికి సంప్రదాయం అయ్యింది. ఆ తరువాత వారసత్వం అయ్యింది. దీనికి సాంకేతిక నిర్వచనం కూడా ఒకటుంది. ఏదైనా వస్తువు లేదా జ్ఞానం వంద సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలదై ఉంటే అది వారసత్వం అవుతుంది. మిగతా జంతుజాలానికి, మనిషికి మధ్య తేడా కనబర్చేది ఈ వారసత్వమే. మనం పుట్టగానే మనకు ఆస్తి వస్తుంది. ఐదారేళ్ళకే వృత్తిపై అవగాహన ఏర్పడుతుంది. అది మనకు మన పూర్వీకుల నుంచి వారసత్వంగా లభిస్తుంది. మిగతా జంతుజాలానికి అది లేదు. మరి ఈ వారసత్వం వల్ల ఒరిగేది ఏమిటంటే, ఇది జ్ఞానాన్ని అందించడం ద్వారా మన జీవన విధానాన్ని సులభతరం చేస్తుంది. స్థిర ఆర్థిక వ్యవస్థను అందిస్తుంది. వారసత్వం ద్వారా వినోదాన్ని పొందుతాం. అభివృద్ధికి అవకాశం ఉంటుంది. సామాజిక స్థితి (నాగరికత) వస్తుంది.

ఈనాటి తెలంగాణ నాగరికత వేరు, ఆంధ్ర నాగరికత వేరు. తెలంగాణ భౌగోళిక పరంగా సమశీతోష్ణస్థితిని కలిగి ఉంటుంది. ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళితే అక్కడి సముద్ర

తీరం నేపథ్యంలో అక్కడ జీవన విధానం మరో రకంగా ఉంటుంది. సంస్కృతి, నాగరికత వేరుగా ఉంటాయి.

## వారసత్వంతో నాగరికత...

వారసత్వం వల్ల నాగరికత సంక్రమిస్తుంది. జంతువులకు, మనకు ఇంకో తేడా ఏమిటంటే, వినోదం అనేది మనకే ఉంటుంది. అంటే మనం "మిగులు" కనిపెట్టాం. పంట పండించి మిగులు పెట్టుకుంటాం. అంటే జంతువుల లాగా ఏరోజుకా రోజు సంపాదించుకోవడం అని గాకుండా మిగులు నుంచి వాడుకుంటాం. దీని వల్ల మనకు సమయం మిగిలింది. అది వినోదానికి వినియోగించుకుంటున్నాం. వినోదం అంటే ఆటపాటలు, సాహిత్యం, కళలు... ఇవన్నీ. ఇవి మనకు వారసత్వంగా వచ్చాయి. అంటే ఆర్థికవ్యవస్థ, నాగరికత, వినోదం... మూడింటినీ వారసత్వంగా పొందుతున్నాం.

## మన వారసత్వం చెరువుల నిర్మాణం

వారసత్వం ప్రధానంగా మూడు రకాలు. నేచురల్ హెరిటేజ్, బిల్ట్ హెరిటేజ్, ఇంటాజిబుల్ హెరిటేజ్. నేచురల్ హెరిటేజ్ అంటే మన ప్రాంతానికి సంబంధించింది. ఒక గుట్ట, ఒక గుహ, ఒక నది..ఇలా ఏదైనా సహజ వనరు కావచ్చు. మన పూర్వీకులు వాటిని ఉపయోగించుకున్నారు. రూపురేఖలు మార్చారు. అలా అవి మనకు వారసత్వంగా మారాయి. ఆ ఫలాలను మనం పొందుతున్నాం. మనది పీఠ భూమి కావడంతో ఆ నదులతో మనం అంతగా ప్రయోజనం పొందలేక పోతున్నాం. బృహత్ శిలాయుగంలో ప్రజలు ...రెండు గుట్టల మధ్య ఏదైనా ప్రవాహం ఉంటే, దానికి అడ్డంగా కట్ట కట్టడం నేర్చుకున్నారు. అలా కుంటలు అనేవి అందుబాటులోకి వచ్చాయి. బృహత్ శిలా యుగం నాటి సమాధులకు చేరువలో మనకు ఆనాటి కుంటలు కనిపిస్తాయి. ఇక ఆ తరువాత చెరువులు కట్టడం నేర్చుకున్నారు. కుంట కట్టేందుకు పది మంది చాలు. పెద్దది కట్టడానికి వంద మంది కావాలి. అంటే అంత సమాజం అక్కడ ఉండాలి. ఒక గ్రామ ప్రజలు మొదట ఒక చిన్న కుంట కట్టారు. దాని ఫలితాలు అంది, సమాజం పెరిగి అవసరాలు పెరగడంతో ఆ తరువాత చిన్న చిన్న వొర్రెలను వాగులోకి మళ్ళించారు. వాగుకు అడ్డంగా రెండో కుంట కట్టారు, మూడో కుంట కట్టారు. ఇలా.

చాళుక్యులు ఇక్కడి వారే. వారు సప్త సంతానాల భావనను ప్రవేశపెట్టారు.

పుత్ర సంతానం ఒకటైతే, చెరువులు నిర్మించడం కూడా సంతానంలో భాగమే. అది ఊరి సంతానానికి సంబంధించింది. కుంటలు, చెరువులు కట్టించడం ఇందులో భాగం. ఆ భావన పెరిగి కాకతీయుల కాలానికి గొలుసుకట్టు చెరువుల భావన వచ్చింది. చెరువు నిండి నీళ్ళు వృథా పోకుండా, ఇలా గొలుసుకట్టు చెరువులు కట్టాలనే భావన వచ్చింది. తద్వారా సహజ వనరులైన వాగు వంకలు...కుంటలు, చెరువులు, కాలువలుగా రూపాంతరం చెంది మనకు వారసత్వ సంపదగా అందాయి.

## గుహల్లో బొమ్మలూ మన వారసత్వమే!

గుహలు ఏర్పడడం సహజంగా జరిగేది. ఈ గుహలు ఎప్పుడు వారసత్వంగా మారుతాయి అంటే... ఆ గుహల్లో మానవులు నివసించిన దాఖలాలు కనిపించినప్పుడు. మన వద్ద పదివేల ఏళ్ళ క్రితం నుంచే మనుషులు ప్రత్యేక గుహలను నివాసానికి ఎంచుకున్నారు. వాటి గోడలపై పెయింటింగ్‌లు వేశారు. కాల నియమాలను గమనించి దాన్ని, భూమిని, రుతువులను, తమ జీవనాన్ని ఎవరో నడిపిస్తున్నారు అనుకొని దేవతలను ఏర్పరచుకున్నారు. అన్నం, ఆనందం ఇచ్చేది దేవుడు అనుకున్నారు. వారికి ప్రత్యక్షంగా కనిపించింది ఆవు. అది పాలు ఇస్తుంది. ఎరువునిస్తుంది. అది చనిపోతే దాని చర్మం చెప్పులు చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది. అలా అన్నాన్ని, ఆనందాన్ని ఇచ్చే గోవు గోమాతగా రూపుదిద్దుకుంది. దాంతో రకరకాల రంగుల్లో, ప్రధానంగా ఎరుపు రంగులో గోమాతను చిత్రంగా వేశారు. గోమాత తరువాత ఇతర దేవతా పూజా చిత్రాలూ ప్రారంభమయ్యాయి. అవి ఈ రోజుకు కూడా గుహల్లో కనిపిస్తున్నాయి. మొదట గుహ గోడలను సున్నంతో పూసేవారు. ఆకుపసరుతో పెయింట్ వేసే వారు. సున్నంతో ఆకుపసరు కలిసి ఎరుపురంగు వచ్చేది. గుహలు ప్రకృతిలో భాగం అయినప్పటికీ, వాటిల్లో చిత్రలేఖనాలు వేయడం వల్ల అవి మనకు వారసత్వంగా మారాయి.

## అమూర్త వారసత్వం

మరొక రకం వారసత్వాన్ని ఇంటాజిబుల్ హెరిటేజ్... అంటే అమూర్త వారసత్వం అంటారు. ఇది కంటికి కన్పించదు. మనకు కలిగిన జ్ఞానానికి ఆధారాలు ఎలా చెప్పగలం? బతకడానికి లేదా ఆనందం పొందడంలో జ్ఞానం పాత్ర ఉంటుంది. వ్యవసాయాన్నే ఉదాహరణగా తీసుకుంటే, వివిధ ఉపకరణాలు, క్రిమికీటకాలను దూరం చేసుకోవడం, ఏ కాలంలో ఏ పనులు చేయాలి...ఇవన్నీ మనకు పరంపరగా

వచ్చాయి. అలాగే విలువలు ఉన్నాయి. అవన్నీ ఇన్‌టాంజిబుల్ వారసత్వంలో భాగమే. విలువలే సంస్కృతికి పునాదిగా మారాయి. ఉదాహరణకు ఒక భర్తకి ఒక భార్య, ఒక భార్యకు ఒక భర్త ఉండడం లాంటివి. రెండున్నర వేల ఏళ్ళకు పూర్వం గణరాజ్యాలు ఉండేవి. పశువుల మేతకు కావాల్సిన ప్రదేశం కోసం, మహిళల కోసం యుద్ధాలు జరిగేవి. గిరిజన ప్రాంతాల్లో (ఇప్పటికీ కొన్నిచోట్ల) సంత (శాండీ) కు యువతీ యువకులంతా వెళ్ళి ప్రేమలో పడడం జరుగుతుండేది. ఒక ఊరి అమ్మాయి మరో ఊరి అబ్బాయికి నచ్చితే ఆ పెళ్ళికొడుకు తరఫు వారు ఆ గ్రామానికి “యుద్ధం” తరహాలో వెళ్తారు. అవతలి వారు అంగీకరించకపోతే అమ్మాయిని ఎత్తుకుని వచ్చేవారు. పెళ్ళిల్లో వరుడు వధువు తలమీద జీలకర్ర, బెల్లం పెడతాడు కదా! అందులో బాణపు ముల్లు ఉంటుంది. అంటే అబ్బాయి వీరత్వంతో అమ్మాయిని గెలుచుకున్నాడని అర్థం. మంగళసూత్రం, గాజులు, మెట్టెలు, ఉంగరాలు లాంటివి నిజానికి ఆభరణాలు కాదు, ఆ అమ్మాయిని బలవంతంగా గుంజుకుపోయారనడానికి నిదర్శనాలు. అంటే ఆ గాజులు, కడియాలు, మొదలైనవి బేడీల్లాంటివి. ఎద్దును ఎటూ పోకుండా చేసినట్లుగా వేస్తారు. అది ఆచారం ఒకప్పుడు. ఇప్పుడు సంప్రదాయంగా మారిపోయింది. ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్ళి చేసుకోవడం యాభై ఏళ్ళ క్రితం దాకా కొనసాగింది. బలవంతులు అలా తమ బలప్రదర్శన చేసేవారు. మరి బలం లేని వారి సంగతేంటి? వారికి కూడా సుఖం కావాలి కదా! అందుకు సమన్యాయం, సంక్షేమం అవసరాలయ్యాయి. ఇక్కడే విలువలు, సంస్కృతి ఏర్పడ్డాయి. ఇవి అమూర్త వారసత్వంలో భాగాలు.

## ధర్మం – నైతికత – విలువలకు పెద్దపీట

తెలంగాణలో ఆపస్తంబుడు మొదటి ధర్మశాస్త్రవేత్త. 2800 ఏళ్ళ క్రితం గోదావరి తీరంలో ఉండేవాడు. అది కోటిలింగాల ప్రాంతమే అయి ఉంటుందని భావిస్తున్నారు. ఆ కాలంలో బోధన్ ప్రాంతంలో గణ రాజ్యం ఉండేది. ఆయన ధర్మశాస్త్రం రాశారు. ఆయన తరువాత పలువురు రుషులు ధర్మశాస్త్రాలు రాశారు. ఒక భార్యకు ఒక భర్త అని నియమం పెట్టారు. ఎత్తుకుపోవడాన్ని “కన్యాదానం”గా మార్చారు. ఇలా నైతికత అనేది ఏర్పడింది. నీతి అందరి శ్రేయస్సు కోసం పుట్టింది. అలా శ్రేయోరాజ్య భావన పుట్టింది. కులవృత్తులు ఏర్పడ్డాయి. విలువలు పుట్టడం, పతనం కావడం, సంస్కరణకు గురి కావడం... ఇలా సంస్కృతి కొనసాగుతూ వచ్చింది. ఇదంతా ఇన్‌టాంజిబుల్ హెరిటేజ్.

ఇక వారసత్వ రక్షణ విషయానికి వద్దాం. ఇప్పుడు మనం ఉన్న స్థితికి పునాదులు గతంలోనే ఉంటాయి. వారసత్వం, గతం మన జీవనశైలిని సరళీకృతం చేస్తాయి. దీన్ని రేపటి తరానికి అందించకపోతే వారు అయోమయంలో పడుతారు. ఉదాహరణకు గుడి అనే భావన కూడా వారసత్వ పరంపరలో భాగమే. వరాలు కావాలని ధనికులు గుడికి పోతారు. దానాలు చేస్తారు. ఆ దానాలు దొరికే గుడిని ఆశ్రయించి అనాథలు బతుకుతుంటారు. ఇలాంటి గుడిని భావి పౌరులకు మనం బాధ్యతగా వారసత్వ సంపదగా అందించాలి. క్రీడామైదానాలు కూడా అలాంటివే.

మనకు సహజంగా చరిత్ర పట్ల ప్రేమ ఉంటుంది. ఉదాహరణకు మనం డైరీ రాస్తాం. ప్రముఖులం కానప్పటికి, మన డైరీని మరెవరూ చదవకపోయినప్పటికీ, చదవాల్సిన అవసరం లేనప్పటికీ డైరీ రాస్తుంటాం. ఓ ముప్పై ఏళ్ళ తరువాత గతం మీది అభిమానంతో మనమే చదువుకుంటాం. ఒక్కోసారి ఇలాంటివే పెద్ద చారిత్రక అంశాలను వెల్లడిస్తాయి. ఉదాహరణకు శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో స్థానాపతి అనే ఉద్యోగి ఉండే వాడు. ఆయనకు ఒక రోజు పొద్దునే శ్రీకృష్ణదేవరాయలను చూసే అవకాశం లభించింది. అప్పుడు రాజు చిన్న అంగవస్త్రంతో వ్యాయామం చేస్తున్నాడు. ఆ విషయాన్ని ఆయన లిఖించాడు. అలా అప్పట్లో రాజులు వ్యాయామం చేసేవారనే లాంటి విషయాలు మనకు తెలిశాయి. అంటే, మనకు చరిత్ర పట్ల ఉండే సహజాతాన్ని సంతృప్తిపరుచుకోవడానికి కూడా మనం మన వారసత్వాన్ని కాపాడుకోవాలి అనేది చెప్పదగిన సారాంశం.

## శ్రేయోరాజ్య భావన ...

ప్రతి జాతికి వినోదం కూడా అవసరమే. జాతి ప్రజలంతా ఆనందించాలి. అంటే శ్రేయోరాజ్యం ఏర్పడాలి. లేకుంటే ఉద్యమాలు వస్తాయి. ఆ వినోదం కూడా మనకు వారసత్వంగా వచ్చిందే. అస్తిత్వ భావన (ఐడెంటిటీ) అనేది మరో ముఖ్యమైన అంశం. మన ప్రత్యేక ఐడెంటిటీ మనకు భోళాతనం ఎక్కువగా ఉండటం. అమాయకత్వం, నిరక్షరాస్యత కూడా. మనల్ని ముస్లింరాజులు సుమారు 6 శతాబ్దాలు పాలించారు. ఇక్కడ ఉర్దూలో బోధన జరిగేది. అదీ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చదువుకు దూరమైపోయారు. ఇది కూడా... అంటే నిరక్షరాస్యత కూడా ఎక్కువగా ఉండటం మొన్నటి వరకూ మన ఐడెంటిటీలో భాగంగానే ఉండింది. నిరక్షరాస్యత ద్వారా వచ్చిన అమాయత్వాన్ని ఆసరాగా తీసుకొని ఆంధ్రులు మోసం చేయడాన్ని మాత్రం భరించలేకపోయాం. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం.

ఈ వారసత్వాన్ని ఎవరు రక్షించాలి? ప్రభుత్వం అని అంటే... ప్రభుత్వం అంటే ఎవరు? ఆ బాధ్యత చేపట్టేది ఉద్యోగులే. అంటే ప్రజలే. ఇక సామాజిక కార్యకర్తలు కూడా ఈ బాధ్యత చేపట్టాలి. కుతుబ్‌షాహీ సమాధులను కాపాడుతున్నది ఆగాఖాన్ ట్రస్ట్ వారు. వారు రూ. వంద కోట్లు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. నీకు నీవు సహాయం చేసుకోవాలని అంబేద్కర్ ప్రబోధించినట్లుగా మనమే మన వారసత్వాన్ని కాపాడుకోవాలి.

## హైదరాబాద్‌కు 1600 వందల ఏళ్ళ చరిత్ర

మన హైదరాబాద్‌లో చైతన్యపురి ఉంది. అక్కడ మన హైదరాబాద్‌కు సంబంధించి 1600 ఏళ్ళ క్రితం నాటి శాసనం ఉంది. అప్పట్లో గోవింద రాజు అనే రాజు బౌద్ధ సన్యాసుల కోసం అక్కడ ఒక విహారం తన పేరిట కట్టించారు. అది మన వారసత్వ సంపద. దాన్ని కాపాడుకునేందుకు అక్కడి ప్రాంతీయులే ముందుకు వచ్చారు. 1978లో అక్కడ ఉండే కొమండూరు శేషాచార్యులు ఆ శాసనాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పురావస్తు శాఖ అధికారులు అంతగా పట్టించుకోలేదు. దాంతో ఆయన స్థానిక నాయకులతో కలసి ఒత్తిడి చేస్తే ప్రభుత్వం దిగివచ్చింది. శాసనాన్ని వెలుగులోకి తెచ్చింది. ఫలితంగా హైదరాబాద్ చరిత్ర 1600 ఏళ్ళ క్రితం నాటిదని తెలిసింది.

## రాజకీయ వారసత్వం

ఇక వారసత్వం విషయానికి వస్తే మొదటగా రాజకీయం గుర్తుకు వస్తుంది. రాజకీయ వారసత్వం గణరాజ్యాలతో ప్రారంభమైంది. కొత్తరాతియుగం నుంచి సామూహిక నివాసాల భావన మొదలైంది. అప్పుడే చక్రం కనిపెట్టారు. దీంతో దూరాలకు వస్తువులను తీసుకెళ్ళడం, కుండల్లో మిగులు దాచుకోవడం అనే భావన ఏర్పడడం, తదనుగుణంగా ఆర్థికవ్యవస్థ, రాజకీయ వ్యవస్థ ఏర్పడడం చోటు చేసుకున్నాయి. అలా గ్రామ పెద్ద వచ్చాడు. అప్పట్లో గ్రామణి అని వ్యవహరించేవారు. ఆలమందలు ఉన్న చోట ఊరు ఏర్పడింది. ఆలేరు, ఆలంపురం, ఆలగడప పేర్లు ఇలా పుట్టుకొచ్చాయి. ఆవులను, పిల్లలను, మహిళలను, ఆస్తులను కాపాడేందుకు రక్షణ వ్యవస్థ ఏర్పడింది. ఈ సైనికులకు నాయకుడు ఉండేవాడు. వాడే పాలకుడయ్యేవాడు. కల్, తొర్రు, కుర్రు లాంటివి ఈ సామూహిక ఆవాసాలకు పేర్లుగా ఏర్పడ్డాయి. ఇవి గుట్టల దిగువన ఉండేవి. ఇవన్నీ కొత్త రాతియుగం నాటి

సంస్కృతికి నిదర్శనాలు. గుట్టల్లో గుహలు ఉండేవి. వాటిలో చిత్రలేఖనాలు ఉండేవి. దైవం (గోమాత) వెలిసింది కూడా అక్కడే. బొమ్మ పేరుతో ఏర్పడిన గ్రామాలు కూడా చాలా పాతవి. బొమ్మకల్, బొమ్మపల్లి లాంటివి ఇందుకు నిదర్శనం.

## నాటి బొమ్మరిగె...నేటి బమ్మెర

మనకు బమ్మెర పోతన తెలుసు. ఆయన గ్రామానికి వెళ్తే, పక్కనే ఉన్న గూడూరులో ఉన్న ఒక శాసనం గుర్తుకువస్తుంది. క్రీ.శ. 1124లో విరియాల మల్లుడు ఆ శాసనం వేయించాడు. బొమ్మరిగె అనే ఊరిని తాను కట్టించిన మల్లేశ్వర దేవాలయం పోషణ కోసం చెరువుతో సహా దానం చేసినట్లు అందులో ఉంది. బొమ్మరిగె క్రమంగా బమ్మెర అయింది. మరి బొమ్మ ఉండాలి కదా! అందుకోసం అన్వేషిస్తే రెండు బావులు కన్పిస్తాయి. ఒకదాన్ని నర్సింబావి, రెండో దాన్ని కురుం బావి అంటున్నారు. నర్సింబావి కింద ఒక గుహ ఉంది. దానిలో ఒకప్పుడు బొమ్మలుండేవనిపిస్తోంది – పురావస్తు పరిశోధన అనుభవం ప్రకారం. ఇలాంటివన్నీ ఎంతో పాతవి. రాజకీయ సంస్కృతి అక్కడ పుట్టింది అనడానికి అవి నిదర్శనాలు. ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య మనం ఉన్నాం. ఈ ప్రాంతాన్ని దక్కన్ అంటున్నారు. మనది దక్కన్ సంస్కృతి. మన ప్రాంతానికి ఉత్తర దక్షిణ ప్రాంతాల నుండి ప్రజలు వలస వచ్చారు. ఫలితంగా మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. ఇది మన రాజకీయ వారసత్వ ప్రత్యేకత.

## దక్షిణాదిన మనదే మొదటి సామ్రాజ్యం

రాజవంశాల వారీగా మన వారసత్వాన్ని చూస్తే... దేశంలో 2,600 సంవత్సరాల నుంచి రాజరికాలు కొనసాగుతున్నాయి. బౌద్ధ సాహిత్యంలో వాటిని జనపదాలు అన్నారు. అవి మొత్తం పదహారు అయితే, ఉత్తర భారతంలో పదిహేను ఉన్నాయి. దక్షిణాదిలో ఒక్కటే ఉంది. అది అస్మక దేశం. అది ఉత్తర తెలంగాణలో భాగం. అది తెలంగాణ రాజ్యంగా ఉన్నప్పుడు, కర్నాటక, తమిళనాడు, కేరళలో అలాంటి రాజ్యాలు లేవు. ఈ అస్మక రాజ్యపు రాజధాని బోధన్. అప్పట్లో దాన్ని పోతలి అనే వారు. పోత (పని ప్రారంభించే ముందు ముగ్గు పోయడం) అనే పదం నుంచి అది వచ్చింది. పెళ్ళి చేసేటప్పుడు, దేవుడిని ఆవాహన చేసేటప్పుడు పోత పోస్తారు. దీన్నే పటం లేదా పట్నం అంటారు. మన మొదటి పట్నం పోతలి. అందుకు పోత పోయడాన్ని పట్నం అని కూడా వ్యవహరించడాన్ని నిదర్శనంగా చూపవచ్చు. ఇంతకీ అస్మకం అంటే రాయి. అన్ని రాజ్యాల్లోనూ రాళ్ళుంటాయి కదా... మరి ప్రత్యేకించి తెలంగాణనే

అస్మక రాజ్యం అని ఎందుకన్నారంటే... లోహం ఉన్న ప్రత్యేక రాయి ఇక్కడ ఉంది. అది మన ప్రాంత ప్రత్యేకత. ఈ రాజ్యంలో బావరి గోత్రానికి చెందిన బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన అస్మక రాజు గురువు. రాజుకు మార్గదర్శకుడు. అస్మక రాజధాని బోధన్‌లో ఉన్న కోట మూడు తాటిచెట్ల ఎత్తు ఉండేది. దీని ఒక మూల ఇంకా బోధన్‌లో మిగిలి ఉంది.

## భారత ప్రభుత్వ శాలివాహన శకం మనదే!

ఇక ఆ తరువాతి వంశాల్లో శాతవాహన వంశం ముఖ్యమైంది. వారి ద్వారా దక్షిణ భారతదేశంలోనే మొట్ట మొదటి రాజ్యం, మొదటి సామ్రాజ్యం తెలంగాణలో ఏర్పడింది. కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల రాజధానిగా శాతవాహన సామ్రాజ్యం ఏర్పడింది. శాతవాహనులు క్రీస్తు పూర్వం 78 నుంచి క్రీ.శ. 230 వరకు పాలించారు. సుమారుగా 300 ఏళ్ళ పాటు శాతవాహనులు దక్షిణభారతాన్ని పాలించారు. భారత ప్రభుత్వం అధికారికంగా అనుసరించే కాలమానం శాలివాహన (శాతవాహన) శకం, మన శాతవాహనుల పాలన ప్రారంభమైన సంవత్సరం (క్రీ.పూ. 78)తో ప్రారంభమవుతుంది. అలా భారతదేశానికి కాలగణన అందించింది మన తెలంగాణ రాజు శాతవాహనుడు.

## మన అమరావతే అసలైంది, పాతది!

శాతవాహనుల తర్వాత ఇక్ష్వాకులు వందేళ్ళ పాటు పాలించారు. నల్గొండ, గుంటూరు, కృష్ణ, ఖమ్మం జిల్లాల్లో వారి రాజ్యం ఉండేది. అప్పట్లో వారికి నాగార్జున కొండ (విజయపురి) రాజధానిగా ఉండింది. శాతవాహన వంశపు విజయశాతకర్ణి ఈ విజయపురిని కట్టించాడు. ఆ తరువాత విష్ణుకుండి రాజులు అధికారం లోకి వచ్చారు. వారిది పెద్ద సామ్రాజ్యం కాబట్టి వారు ఎక్కడికక్కడ చిన్న చిన్న నగరాలు ఏర్పరిచారు. వారి మొదటి రాజధాని మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్. శాసనాల్లో అమరావతిగా పేర్కొనబడింది. ఇది గుంటూరు జిల్లాకు చెందిన మూడువందల ఏళ్ళ క్రితం నాటి అమరావతి కాదు. ఈ అమరావతి పదహారు వందల ఏళ్ళ క్రితంది. నల్లమల అడవుల్లో ఉంది. శ్రీపర్వతంలో ఉన్న దైవం పాదాల చెంత నుంచి తాము ఎదిగినట్లు ఆ రాజులు చెప్పుకున్నారు. శ్రీపర్వతం అంటే శ్రీశైలం గుట్టల పాద పర్వతాలైన మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల పర్వతాల్లో ఉన్న ఉమామహేశ్వరం – అమ్రాబాద్ ప్రాంతం నుంచి వారు ఎదిగారని చరిత్రకారులు నిర్ధారించారు.

## చంద్రగుప్తుడినీ ఆకట్టుకున్న తెలంగాణ

రెండువేల మూడు వందల ఏళ్ళ క్రితం దేశంలో ప్రఖ్యాతి చెందిన రాజు చంద్రగుప్త మౌర్యుడు. యావత్ భారతదేశం ఆయన నియంత్రణలో ఉండేది. ఆయన జీవిత చరమాంకంలో జైన మతం స్వీకరించి, దక్షిణ భారతదేశానికి వచ్చాడు. అలా వస్తూ వస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణానది ఒడ్డున నిలబడి చూస్తే పరిసరాలు అందంగా కనిపించాయి. ఈనాటి ఆక్టోపస్ వ్యూ పాయింట్ వద్ద ఆగి చంద్రగుప్త పట్టణం కట్టించాడు. అది 5 చ.కి.మీ. విస్తీర్ణంతో ఉంటుంది. కొన్నాళ్ళకు ఆయన కర్నాటక లోని శ్రావణ బెళగొళకు వెళ్ళిపోయాడు. ఆ పట్టణం శిథిలమైపోయింది.

## చట్టబండలైపోతావు....

ఇక్ష్వాకుల తరువాత కాలపు తెలుగు రాజులను క్రీ.శ. 4వ శతాబ్దంలో ఉత్తర భారతానికి చెందిన చక్రవర్తి సముద్రగుప్తుడు ఓడించాడు. అలహాబాద్‌లో ఈ మేరకు శాసనం వేయించాడు. ఆయన కుమారుడి పేరు కూడా చంద్రగుప్తుడు. యుద్ధం చేసేందుకు ఆయన తండ్రి వెంట తెలంగాణకు వచ్చి, మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణానది ఒడ్డునున్న నల్లమల అడవుల్లో స్థానిక చెంచు గిరిజన అమ్మాయిని (చంద్రవతి) ఇష్టపడ్డాడు. కొంత బలవంతం చేశాడు. ఆమె కృష్ణానదిలో దూకి చనిపోయిందని, ఆమె శపిస్తే రాజు కూడా చనిపోయి, కృష్ణా నదిలో ఈనాడు కన్పించే పచ్చల బండగా మారిపోయాడని అంటారు. రాజ్యానికి తండ్రిలాంటి వాడు రాజు... బిడ్డను బలాత్కరించడం తగదు. ఆ పాపానికి పాల్పడినందుకు చట్టుబండలైపోతావని అనడం అలా వచ్చిందే. చంద్రవతి కొండ మల్లెపూలతో శివుడిని పూజించేదట. మొదట రాళ్ళను కాకుండా చెట్లను... మరీ ముఖ్యంగా మద్ది చెట్టు మొదలును పూజించేవారు. మద్దిలేటివాగు, మద్దిమడుగు, మద్దికుంట, మద్దిచెరువు లాంటి ఊర్లపేర్లు ఇప్పటికీ నల్లమల అడవుల్లో ఉన్నాయి.

## విష్ణుకుండిన రాజులు...నాలుగు రాజధానులు

చంద్రగుప్తుడి తరువాత ఇక్కడ బ్రాహ్మణ మతం బలపడింది. మల్లెలు, మద్ది చెట్టు సంస్కృతీకరించబడ్డాయి. మద్ది చెట్టును సంస్కృతంలో అర్జున వృక్షం అంటారు. అలా మల్లెపూలతో పూజింపబడిన మద్ది చెట్టు మొదలుతో చేసిన శివలింగం నుంచి మల్లికార్జున అనేపదం వచ్చింది. శ్రీశైల మల్లికార్జునుడి నేపథ్యం ఇది. శ్రీశైలంలో ఇప్పటికీ వృద్ధ మల్లికార్జునుడి ఆలయంలో మద్ది చెట్టు మొదలు ఉంది. విష్ణుకుండిన

రాజులు పూజించింది మద్ది చెట్టు మొదలునే. ఆ తరువాత వారు హైదరాబాద్ శివారులో ఉన్న కీసరగుట్టకు వచ్చారు. కీసరగుట్టలో వారి కోట, అంతఃపురం, రాజభవనాలు ఉన్నాయి. ఆ వంశానికి చెందిన మాధవవర్మ 108 మంది రాజులను జయించి, ఒక్కో విజయానికి గుర్తుగా ఒక్కోటి చొప్పున కీసర గుట్ట మీద 108 శివలింగాలను ప్రతిష్ఠించాడు. దేశంలో ఇది ఒక రికార్డు. ఇక్కడికి 60 కి.మీ. దూరంలో నల్గొండ జిల్లాలో ఇంద్రపాల నగరం విష్ణుకుండుల మరో రాజధాని. భువనగిరి కోట కూడా మొదట వీరు కట్టించిందే. హైదరాబాద్‌లో కలిసిపోయిన చైతన్యపురిలో వీరి బ్రాహ్మీలిపి శాసనాలు లభ్యమయ్యాయి. ఉత్తరాన మధ్యప్రదేశ్‌లో నర్మద నది ఒడ్డున ఉన్న తేవార్ అనే నగరం నుండి దక్షిణాన కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీశైలం మధ్యనున్న ప్రాంతమంతా వీరి పాలనలో ఉంది. అంతపెద్ద సామ్రాజ్యం మాధవవర్మది.

## చాళుక్యులు పాలమూరు ముద్దుబిడ్డలు...

విష్ణుకుండుల తరువాత చాళుక్యులు తెలంగాణలో రాజ్య పాలన చేశారు. వీరు కూడా మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ ప్రాంతంలోనే పుట్టారు. అక్కడికి ఐదు కి.మీ. దూరంలో నవ నారసింహ దేవాలయం ఉంది. తొమ్మిది గుహల్లో తొమ్మిది నరసింహ విగ్రహాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని హరిమాన్ చెలక అంటారు. హరితి దేవతను వీరు పూజించే వారు. చెలక నుంచి చాళుక్య అనే పేరు వచ్చింది. ఈ వంశీయుల్లో ఒకడైన రెండవ పులకేశి తన తుమ్మెయనూరు (మహబూబ్‌నగర్ జిల్లా) శాసనంలో తాము ఈ ప్రాంతం నుంచే ఎదిగామని పేర్కొన్నారు. వారు కర్నాటకకు వెళ్ళి బాదామి నుంచి మొత్తం దక్కన్‌ను పాలించారు. వీళ్ళ తరువాత రాష్ట్రకూట రాజులు పాలించారు. వీరు మహారాష్ట్రకు చెందినవారు. అధికారులను మహారాష్ట్ర నుంచి రప్పించుకున్నారు. వీరిని రట్టడి అనేవారు. అధికారులను సూచించే ఈ పదం క్రమంగా రెడ్డిగా, కులవాచకంగా మారింది. వీరు క్రీ.శ. 753 నుంచి 973 వరకు పాలించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని మీనాంబరం వద్ద వారు కట్టించిన గుడి ఉంది. వారి పతాకంపై ఒక వైపు చేప, మరో వైపున తాబేలు, మధ్యలో దేవత బొమ్మ ఉంటాయి.

## కాకతీయులు...రాచకొండ రాజులు...

రాష్ట్రకూటుల తరువాత మళ్ళీ చాళుక్యులు అధికారం చేపట్టారు. వీరి రాజధాని ఉత్తర కర్నాటకలోని కళ్యాణి. ఆ తరువాత కాకతీయులు అధికారం లోకి (క్రీ.శ.

1163 –1323) వచ్చారు. ఆ తరువాత తెలంగాణను ఢిల్లీ సుల్తానులు పాలించారు. (క్రీ.శ. 1323 –1336). పదేళ్ళ లోపే ముసునూరి నాయక రాజులు పాలన చేపట్టారు. వారిని రాచకొండ రాజులు ఓడించారు (1368). సుమారు వందేళ్ళ పాటు (1368 – 1475) వారు రాచకొండ నుంచి తెలంగాణను పాలించారు. వారిని బహమనీలు ఓడించారు. వారి వారసులైన కుతుబ్‌షాహీలు గోల్కొండ నుంచి యావత్ ఆంధ్రప్రదేశ్‌ను పాలించారు. ఆ తరువాత నిజామ్‌లు రాజ్యాధికారం చేపట్టారు. 1948 వరకు వారి పాలన సాగింది.

## ప్రజాసంక్షేమమే రాజకీయ వారసత్వం!

వీరందరి నుంచి మనకు వారసత్వంగా వచ్చింది ప్రజలను కన్నబిడ్డల్లా పాలించాలి అనేది. అశోకుడి (క్రీ.పూ. 261) నుంచి ఈ భావన పుట్టుకొచ్చింది. తెలంగాణ రాజులు దీన్ని పాటించారు. కాకతీయుల వంశానికి చెందిన గణపతి దేవ చక్రవర్తి చాలా గొప్పవాడు. ప్రకాశం జిల్లా మోటుపల్లి నగరంలో ఆయన వేయించిన శాసనంలో ప్రజలు తన కన్నబిడ్డల్లాంటి వారని పేర్కొన్నాడు. వారి సంక్షేమం కోసం తాను, సిబ్బంది కృషి చేస్తామని తెలిపారు. ఆయన కుమార్తె రుద్రమదేవి జన్మదినం సందర్భంగా ప్రజలకు ఆనందం చేకూర్చే పనులు చేయాలని మల్కాపురంలో ప్రసూతి ఆసుపత్రి నిర్మించాడు. ఇప్పటికి ఎనిమిది శతాబ్దాల క్రితం ఆయన ఈ పని చేయడం విశేషం. ఆయుర్వేద నిష్ణాతులైన వైద్యులు అందులో పని చేసేవారు. సత్రాలు కూడా కట్టించాడు. వీటి వల్ల సంక్షేమం పట్ల పాలకుల దృష్టి ఎలా ఉండేదో తెలుస్తుంది. అదే గణపతి దేవ మహారాజు సమన్యాయం పాటించాలనీ భావించే వాడు. అప్పట్లో కరీంనగర్ జిల్లాలో దేవనపల్లి, కటిక్యోల పల్లి, నేధవూరు మధ్య చెరువు వివాదం తలెత్తింది. అది రాజు వరకు వెళ్ళింది. కులసంఘాల పెద్దలతో చర్చించి, ముగ్గురు సభ్యుల కమిటీని నియమించి క్షేత్రపరిశీలన చేయించి, తిరిగి న్యాయమూర్తులతో చర్చించి న్యాయం చేశారు. ఒక శాసనంలో ఈ వివరాలన్నీ పొందుపరిచారు. సమన్యాయం, సమధర్మం మనకు ఇలా వచ్చాయి. ఇది మనకు రాజకీయంగా వచ్చిన వారసత్వం.

## సమన్యాయం...విద్యాబోధన

రాజుకు సలహాలు ఇచ్చేందుకు అప్పట్లో పురోహితుడు ఉండేవాడు. సమాజ సంక్షేమమే వారిరువురి లక్ష్యంగా ఉండేది. సామాజిక వారసత్వంగా ఏమి వచ్చింది అని పరిశీలిస్తే... ప్రజలను అశేష ప్రజగా వ్యవహరిస్తూ ప్రజాసంక్షేమ కార్యక్రమాలు

చేపట్టేటప్పుడు వారి అందరి అభిప్రాయం పరిగణనలోకి తీసుకునే వారు రాజులు. కులశ్రేష్ఠి వ్యవస్థ ఉండేది. కులసంఘాలను "సమయాలు" అనేవారు. సమయ శ్రేష్ఠులు తమ సమయపు పిల్లలకు తమ వృత్తి విద్యలో శిక్షణనివ్వడం, పెళ్ళిళ్ళు, పంచాయతీలు నిర్వహించడంతో పాటు దేవాలయాలకు విరాళాలు ఇచ్చేవారు. సంక్షేమ కార్యకలాపాలు చేపట్టేవారు. ప్రతీ సమయం తమలో తమకు ప్రయోజనాలు ఇచ్చిపుచ్చుకునేలా ఉండేవి. దేవాలయాలకు అనుబంధంగా ఘటికాస్థానాలు (ఉన్నత విద్య కేంద్రాలు) ఉండేవి. ఘట్‌కేసర్ లో ఇలాంటి ఘటికాస్థానం ఆధారాలు లభించాయి.

## నన్నయ్య చదువుకున్నది తెలంగాణలోనే!

నన్నయ్య కూడా తెలంగాణలో కరీంనగర్ జిల్లాలోని వేములవాడ దగ్గరి నందగిరి ఘటికాస్థానంలో చదువుకున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్ర ప్రజానీకం ఆదికవిగా చెప్పుకునే నన్నయ్యకు విద్యాబోధన చేసిన ఘనత తెలంగాణది. నన్నయ్య ఈ విషయాన్ని స్వయంగా తన పద్యాల్లో ప్రస్తావించిన "నందవరీక" పదం ఈ నందగిరి ఘటికా స్థానాన్ని సూచిస్తుంది. మేనరికం మన ప్రాంతపు ప్రత్యేకతగా చెప్పవచ్చు.

## కరీంనగర్ సమ్మక్క... వరంగల్‌లో జాతర

సమాజంలో అందరినీ మరీ ముఖ్యంగా మంచి చేసిన వారిని గౌరవించడం మన ప్రత్యేకత. సమ్మక్క, సారక్కలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. నిజానికి వీరిది కరీంనగర్ జిల్లాలలోని నంది మేడారం అయినప్పటికీ, వివిధ కారణాలతో వరంగల్ జిల్లాకు వచ్చి, అక్కడ మేడారం గ్రామం ఏర్పరచుకున్నారు. వారిని ఇప్పుడు దేవతలుగా ఆరాధిస్తుండడానికి కారణం వారు మంచి పనులు చేయడం.సమ్మక్క తన ప్రజల కోసం బుర్రి కుంట తవ్వించింది. స్వయంగా ప్రసూతి వైద్యసేవలు అందించింది. ఆమె సేవలను, మంచిని మర్చిపోకుండా ప్రజలు నేడు ఆమెను పూజిస్తున్నారు.

## ఆనాడే మిషన్ కాకతీయ!

ఇక ఆర్థిక వారసత్వ విషయం. నేటికీ సమాజంలో 60 శాతం మంది వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. నేడు మిషన్ కాకతీయ చేపట్టాం. కాకతీయులు అప్పట్లోనే అది నిర్వహించారు. వారు చెరువుల పున్నమి నిర్వహించి ఎద్దులు, నాగళ్ళు కానుకగా ఇచ్చేవారు. సామంత రాజుల ద్వారా గ్రామాల్లో చెరువులు కట్టించుకోండి అని చెప్పేవారు.

## పురాతన కాలంలోనే అధునాతన సాంకేతికత

కాలువలు కూడా మన వారసత్వంలో భాగమే. ఐదు వందల ఏళ్ళ కిందటే దుర్గం చెరువు నుంచి గోల్కొండ కోటకు నీళ్ళు అందించే కాలువలు ఉండేవి. రాచకొండలో అనపోత నాయకుడు రెండు చెరువులు కట్టించాడు. వాటి నుంచి రాజభవనంలోకి భూగర్భ కాలువలు తవ్వించి, ప్రతి గదిలోకి నీరు వచ్చే ఏర్పాటు చేయించాడు. వర్షాకాలంలో వరద నీరు ఎక్కువగా వస్తే అది జలపాతంగా మారేలా తీర్చిదిద్దారు. 11వ శతాబ్దపు మధ్యప్రదేశ్–భోపాల్ రాజభోజుడు రచించిన పుస్తకం "సమరాంగణ సూత్రధార"లోని అంశాలను ఇందులో పాటించారు. ఇది ఆరున్నర వందల ఏళ్ళ క్రితం నాటి వ్యవస్థ. ఈ తరహా వ్యవస్థలను హైదరాబాద్‌లో ఇప్పటికీ అనుసరించలేక పోతున్నాం. 1908 వరదల తరువాత నిజాం ఏర్పాటు చేసిన భూగర్భ మురుగునీటి వ్యవస్థను వందేళ్ళ తరువాత కూడా పున: నిర్మించుకోలేకపోతున్నాం.

## బొమ్మల నుంచి పుట్టుకొచ్చిన అక్షరాలు

సాంస్కృతిక వారసత్వం విషయానికి వస్తే... మనల్ని ప్రధానంగా ఆనందింపజేసే లలిత కళలు సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం, చిత్రలేఖనం. సాహిత్యానికి సంబంధించి ముందుగా భాష విషయానికి వస్తే... బొమ్మల నుంచి లిపి వచ్చిందని చెప్పవచ్చు. ఖమ్మం జిల్లా పాల్వంచ దగ్గర నల్లముడి అనే గ్రామం ఉంది. దాని శివారు అడవులలో గుహలు ఉన్నాయి. ఒక గుహ పేరు అక్షరాల లొద్ది. వెళ్ళి చూస్తే అవి అక్షరాలు కావు, బొమ్మలు. బొమ్మల నుంచి లిపి పుట్టిందన్న అర్థంలో స్థానిక నాయకుపు గిరిజనులు దాన్ని అక్షరాల లొద్ది అంటున్నారు. ఐదువేల ఏళ్ల క్రితపు చిత్రాలు అక్కడ ఉన్నాయి. బొమ్మల దగ్గరకు వెళ్ళి అరిస్తే ఆ బొమ్మల నుంచి అక్షరాలు పుట్టుకొస్తాయని వారు చెబుతారు. బొమ్మ లిపినే సంస్కృతీకరించి బ్రాహ్మీ లిపి అన్నారు. మన వద్ద కూడా ఆ లిపి ఉంది. కోటిలింగాల, చైతన్యపురి, కొండాపూర్, నల్గొండ జిల్లా ఏలేశ్వరం మొదలైన చోట్ల లభించిన శాసనాలు బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి. మౌర్యుల కంటే ముందు కాలం నాటి బ్రాహ్మీ శాసనం కూడా తెలంగాణలో దొరికినా దాన్ని ఇంకా పురావస్తు శాఖవారు డీకోడ్ లేదు.

## పాండవులు...మనకు పాండహులు!

హైదరాబాద్‌లోని చైతన్యపురిలో ఉన్న శిలా శాసనంలో పాళీ, ప్రాకృత భాషాపదాల ప్రభావం ఉంది. సంస్కృతం, తెలుగు పదాలు కూడా అందులో ఉన్నాయి.

"పాండహులు" అనే తెలుగుపదం ఒక ఉదాహరణ. "హు" ఎలా వచ్చిదంటే... పది + ఆరు = పదారు అవుతుంది గానీ పదహారు అని కూడా అంటారు. అలాగే పాండహులు వచ్చింది. ఇలా ఒకే శాసనంలో నాలుగు భాషల పదాలు ఉన్నాయి. అలాంటి మిశ్రమ సంస్కృతి మనకు వారసత్వంగా వచ్చింది.

## సాహిత్యంలో మనమే ఫస్ట్!

రెండు వేల ఏళ్ళ క్రితం హాలుడు అనే శాతవాహన రాజు ఆస్థానంలోని గుణాఢ్యుడు బృహత్కథను పైశాచీ భాషలో రచించాడు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి కథాసాహిత్యం. అది గిరిజన భాషలో వచ్చింది. ఎన్నో రకాల భాషలు తెలంగాణలో ఉన్నాయి. అచ్చతెనుగును కూడా మనమే మొదట ఆదరించాం. కుతుబ్‌షాహీల కాలంలో పొన్నగంటి తెలగన్న అచ్చ తెలుగులో యయాతి చరిత్రను రచించారు. హాలుడు గాధాసప్తశతి రచించారు. అందులో మూల తెలుగు పదాలున్నాయి. మాధవవర్మ రాజు పదిహేను వందల ఏళ్ళ క్రితమే కవిజనాశ్రయ చంధోవిచ్ఛిత్తి అనే లక్షణ శాస్త్ర గ్రంథం రచించారు. ఇందులో తెలుగు సీస పద్య లక్షణాలున్నాయి. కరీంనగర్ జిల్లా కుర్క్యాలలోని బొమ్మలగుట్టపై మొట్టమొదటి కందపద్యం దొరికింది. నన్నయ కంటే ముందే ఆదికవి మల్లియరేచన (పదో శతాబ్దంలో) రచనలు చేశారు. ఇలా తెలుగుసాహిత్యం తెలంగాణపై పుట్టింది. మొట్టమొదటి కన్నడ సాహిత్యం కూడా తెలంగాణ (కుర్క్యాల)లోనే పుట్టింది. కన్నడ ఆదికవి పంప కూడా ఇక్కడే కన్నడ రచనలు చేశారు. ఆయన సమాధి బోధన్‌లో కోట గడ్డపై నుంది.

కాకతీయుల కాలంలో సాహిత్యం విరివిగా విలసిల్లింది. తెలుగు మహాభారతం రచనలోనూ తెలంగాణదే కీలకభూమిక. దాన్ని రచించిన కవిత్రయంలోని నన్నయ్య ఇక్కడే ... కరీంనగర్ జిల్లాలోని నందగిరిలో చదువుకున్నాడు. ఆయనకు సహకరించిన నారాయణభట్టు ఇక్కడి వాడే. ధర్మపురి, వేములవాడ, బోధన్ ప్రాంతం వాడు. తిక్కన ఓరుగల్లు కాకతీయ గణపతిదేవుడి ఆశ్రయించి తన రాజుకై రక్షణ పొందాడు. రాచకొండ రాజుల కాలంలో భాస్కర రామాయణం, రంగనాథ రామాయాణం, సత్యనారన రామాయణం, మొల్ల రామాయణం... ఇంకా మరెన్నో రామాయణాలు వచ్చాయి. మొల్ల కూడా తెలంగాణకు చెందిందే. ఆమె పూర్తి పేరు ఆతుకూరి మొల్ల. ఆతుకూరు తెలంగాణది అని రామప్ప శాసనంలో ఉంది... రామప్ప ఉన్న చోట ఆతుకూరు ఉండేది అని. అంటే ఆమె ఇక్కడి మూలాలు ఉన్న వ్యక్తి కావచ్చు. అదే కాలంలో వరంగల్ జిల్లా బమ్మెరలో పోతన పుట్టాడు. రాచకొండ సందర్శించి భోగిని

దండకం రచించారు. భాగవత మహాకావ్యం రచించారు. నవవిధ భక్తిని ఆయన సూత్రీకరించారు. వైరం కూడా ఒక భక్తి రూపమేనని పేర్కొన్నారు. కుతుబ్‌షాహీల యుగంలో ఇబ్రహీం కుతుబ్‌షా కాలం (16వ శతాబ్దం) నుండి తెలుగు సాహిత్యానికి గౌరవం పెరిగింది. పొన్నగంటి తెలగన ఈ కాలానికి చెందిన వాడే. ఒక ముస్లింను మల్కిభ రాముడు అని అభివర్ణించడం విశేషం.

## అబ్బో!...డోలు దెబ్బ!

సంగీతం విషయానికి వస్తే మనకు కోలాటం, కొమ్ముబూర లాంటి సాంప్రదాయాలు ఉన్నాయి. ఉమామహేశ్వరంలో ఒక పెద్ద నగారా ఉంది. నాలుగు మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల ఎత్తు ప్రమాణాలతో ఉందది. దాన్ని ఏనుగు చర్మంతో చేశారంటారు. శ్రీశైలంలో, మహేశ్వరంలో, గోల్కొండలలో కూడా అలాంటివి ఉండేవి. కుతుబ్‌షాహీల అమాత్యులైన అక్కన్న మాదన్నల కాలంలో వాటితో మోగిన శబ్దాన్ని శ్రీశైలం నుండి ఉమా మహేశ్వరం, మహేశ్వరం మీదుగా గోల్కొండ కోటకు శబ్దాన్ని చేరవేసేవారు. మనకు పేరిణి నృత్యం ప్రత్యేకమైనది. నృత్తరత్నావళి పుస్తకంలో దీన్ని దేశీ నృత్యంగా పేర్కొన్నారు. ఆనందంతో పాటు యుద్ధస్ఫూర్తి నిచ్చేలా ఇది రూపుదిద్దుకుంది. దీనికి సంబంధించి రామప్ప శిల్పాల్లో పన్నెండు రకాల భంగిమలున్నాయి. పేరిణి శిల్పాలుగా వాటిని వ్యవహరిస్తున్నారు. వాటిపై సినారె కూడా పాటలు రాశారు.

## దేశంలో మన ఆలయాలే అతి ప్రాచీనం

వాస్తు నిర్మాణాల విషయానికి వస్తే, భారతదేశంలో మొట్టమొదటి దేవాలయాలు ఇక్కడే రూపుదిద్దుకున్నా యి. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఇవి ఉన్నాయి. అవి సాగర్‌లో మునిగాయి. బెంగళూరు రహదారి మీద వెళ్తుంటే, ఆలంపూర్ వద్ద గూమకొండ, రంగాపూర్ ఉన్నాయి. అక్కడి ఆలయాలు రెండువేల ఏళ్ళ క్రితం నాటివి. వాటిని ఇటుకలతో నిర్మించారు. పానవట్టం లేకున్నా "చంద్రశిల" మాత్రం ఉంది. అభిషేకం ఆచారం రాకముందే అవి నిర్మితమైనందువల్ల పానవట్టం లేదు. వాస్తు నిర్మాణంలో ప్రధానంగా నాగరశైలి (ఉత్తరభారతదేశం), ద్రావిడ శైలి, వేసర శైలి (చాళుక్య రీతి) అని మూడు రకాలున్నాయి. చాళుక్య రీతినే కాకతీయులు కూడా పాటించారు. ఇది తెలంగాణకు ప్రత్యేకం.

## చైనా గ్రేట్ వాల్ తరువాత మనదే గ్రేట్!

ఇతర కట్టడాల విషయానికి వస్తే, రామగిరి ఖిల్లా కోట ముఖ్యమైంది. దాని పొడవు 15 కి.మీ. తెలంగాణలో అత్యంత పొడవైన కోట పేరు ప్రతాపరుద్ర కోట. నల్లమల అడవుల్లో ఉమామహేశ్వరం వద్ద ప్రారంభమై ఏలేశ్వరం వరకు సాగిన ఈ కోటగోడ పొడవు 240 కి.మీ. చైనాలోని గ్రేట్‌వాల్ తర్వాత ప్రపంచంలో ఇదే పొడవైంది.

మన రాష్ట్రంలో అన్ని రకాల మతాలున్నాయి. 'గాథాసప్తశతి' గౌరీ– పశుపతి ప్రార్థనతో ప్రారంభం అవుతుంది. ఇది రెండు వేల ఏళ్ళ క్రితం నాటిది. అయితే, 2,500 ఏళ్ళ క్రితమే బౌద్ధం మన వద్దకు వచ్చింది. బుద్ధుని శిష్యుడు పయస్ ఇక్కడకు వచ్చాడు. బౌద్ధ స్థూపాలు కట్టించాడు. అవి మన వద్ద ఇప్పటికీ ఉన్నాయి. ఆయన పేరుతో కోటిలింగాల సమీపంలో పయస్‌గాం అనే గ్రామం ఇప్పటికీ ఉంది. శాతవాహనులు మొదట జైన మతాన్ని ఆదరించారు. కోటిలింగాల వద్ద మునుల గుట్ట అని ఉంది. దాని పైన వీరి ఆచార వ్యవహారాల ఆనవాళ్ళు ఉన్నాయి. సల్లేఖన వ్రతం చేసే బెడ్లు / మంచాలు ఏటవాలుగా చెక్కి ఉన్నాయి. హారితి అనే దేవతను చాళుక్యులు పూజించారు. కాకతీయుల కాలంలోనే కాజీపేటలో ఒక దర్గా ఉండేది. నిజాం కాలంలో చర్చిల నిర్మాణానికి అనుమతించారు. అలా తెలంగాణలో లౌకిక వాదం అనుసరించబడింది.

భూగర్భంలో చరిత్రకు సంబంధించిన వస్తు సంపద ఏదైనా దొరికితే అది మ్యూజియంలకు చేరాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కాబట్టి ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. తద్వారా విలువైన సమాచారం, ఆధారాలు అందరం పొందగలుగుతాం. అది మన జాతికి గర్వకారణమవుతుంది.

*– మన తెలంగాణ దినపత్రిక, 21–23 ఏప్రిల్ 2015*

## NEW HISTORICAL PLACES IN TELANGANA
*by Dr. Dyaavanapalli Satyanarayana*

ఈ పుస్తకం...

తెలంగాణ చారిత్రక వైభవాన్ని చాటే పదహారు కొత్త ఆవిష్కరణలతో, చారిత్రక స్థలాలను పర్యాటక వనరులుగా ఆస్వాదించే కోణంలో, గోదావరి తీర ప్రదేశాల చారిత్రక స్థలాల విశేషాలతో తెలంగాణ చారిత్రక వారసత్వంపై విహంగ వీక్షణంతో, పరిశోధకులు, పర్యాటకులు, విద్యార్థులను ఆసక్తికరంగా చదివించే రీతిలో రాయబడింది.

TELANGANA RESOURCE CENTRE

DECCAN ACADEMY "**CHANDRAM**" 490, Street No. 11,
Himayatnagar, Hyderabad-500029.
email: trchyd@gmail.com